UNIVERSAL LIBRARY
OU_204121
UNIVERSAL LIBRARY

OUP--786--13-6-75--10,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 954 L19R   Accession No. T 275

Author [illegible]

Title [illegible]

This book should be returned on or before the date last marked below.

Tales of Rajastan.

Part

BY

CHILAKAMARTI LAKSHMINARASIMHAM.

Author of

Parijatapaharanam, Gayopakhyanam

and Prasannayadavam etc.

SEVENTH EDITION 1,000 COPIES

1917

MANORAMA PRINTING WORKS.
RAJAHMUNDRY.

Copy Right. *Price Rs 0 -14 0.*

Can be had of :— MATHETY SANYASAYYA,
Andhra Book Depot, Rajahmundry.

రాజస్థానకథావళి.

మొదటిభాగము.

ఇది

చిలకమర్తి లక్ష్మీనరసింహముచే

రచియింపఁబడినది.

ఏడవకూర్పు 1000 ప్రతులు.

రాజమహేంద్రవరము.

శ్రీ మనోరమాముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

1917

—o—

వెల రు 0-14-0.

ఉపోద్ఘాతము.

అర్యావర్త మని పూర్వులచేత వ్యవహరింపఁ బడుచువచ్చిన యుత్తరహిందూస్థానమున రాజస్థాన మనుదేశ మొకటి కలదు. దీనినే రాజపుత్రస్థాన మని వాడుదురు; ఇందు రాజపుత్రు లనఁగా క్షత్రియులు విస్తార ముండుటచే దీనికి రాజపుత్రస్థాన మనియు, రాజస్థాన మనియుఁ బేళ్ళు కలిగినవి. ఈదేశముయొక్క వైశాల్యము 1,30,000 చదరపుమైళ్ళు; దీని కుత్తరమున పంజాబు దేశమును, దూర్పునం దాగ్రాయును, దక్షిణమున బొంబాయిరాజధానియుఁ, బడమట సింధు దేశమునందలి యెడారులునుం గలవు. ఒకకోటి యిరువదిలక్షల జనులిందు వసించుచున్నారు. ఈదేశమునకు మధ్యగానున్న యజమీరనునదితప్ప తక్కినభాగము లన్నియు స్వదేశరాజులచేతఁ బాలింపఁబడుచున్నవి. ఆయజమీ రొక్కటియు నింగ్లీషువారి స్వాధీనములో నున్నది. స్వదేశ ప్రభువులచేఁ బరిపాలింపఁబడు సంస్థానములు, అల్వారు, బికనీరు, కృష్ణనగరు, జయపురము, భరత పురము, ఢోలాపురము, కెరాలి, టాంకు, బూంది, కోట, జాలావారు, ప్రతాపఘరు, బస్సువారా, దంగపురము, మీవారు (అనగా నుదయ పురము) సిరోహి, మార్వారు (అనఁగా జోడ్పురము) జసల్మీ రనునవి యిరువది. ఇందు టాంకుసంస్థాన మొక్కటియు మహమ్మదీయ ప్రభువులచేతఁ బరిపాలింపఁ బడుచున్నది. తక్కినవానిలో భరత పురము, జాటువంశస్థుఁడైన రా జేలుచుండెను; తక్కిన పదునెని మిది సంస్థానములును స్వదేశక్షత్రియప్రభువు లేలుచున్నారు. ప్రస్తుత మీరాజ్యము లన్నియు నాంగ్లేయులకు లోఁబడి వారిచేత సంరక్షింపఁ బడుచున్నవి. ఈదేశము వైశాల్యమున మిక్కిలి పెద్దదయ్యుఁ బ్రాముఖ్యతయందు మిగుల తక్కువగా నున్నది. కడుదూరము వ్యాపించు నిసుకతిన్నెలేగాని ఫలవంతము లైన భూములుగాని మం

చిప్రవాహములుగలనదులుగాని యంతగా లేవు. అందుచేతనే జన సంఖ్య మిక్కిలి తక్కువగా నున్నది. ఆరావళీపర్వతము లీశాన్య దిగ్భాగమునుండి నైఋతిమూలవఱకీదేశమున వ్యాపించి యున్నవి. ఈకొండలకుఁ బడమటివైపున చాలభాగ మిసుకయెడారియై యున్న యది. కాని తూర్పునఁ జాలవఱకు భూమి సారవంతమై, ధాన్యము, దూది, చెఱకు, పొగాకు, నల్లమందు పండును. చంబల్ నదియు దాని యుపనది యగు బేనాసును, లూనియను నొక చిన్నయేఱు నిందు ముఖ్యనదులు. నదులు తక్కువగా నుండుటచే జనులకు పానయోగ్య మగునీరు నూతులనుండి లభించుచున్నది. ఉప్పునీటి సరస్సులు విస్తారముగా నుండుటచే వానినుండి ప్రజ లుప్పుచేసి వాడు దురు. ఇండ్లనిమిత్త మిచ్చటికొండలలో మంచిరాళ్ళు దొరకును. పూర్వము షాజహానుచక్రవర్తి తనభార్యకై యాగ్రానగరములోఁ గట్టించిన తాజమహాలను దివ్యభవనమున కీదేశమునందలి మక్రానా తాతిగనులనుండియే రాయి పంపఁబడినది.

పట్టణములు.

ఆరావళీ పర్వతములలో ఆబూ యను శిఖరముపైఁ గట్టఁబడిన యాబూనగర మీదేశమునందలి ముఖ్యనగరములలో నొకటియై యారోగ్యప్రదాయినిగా నున్నయది. ఈ పర్వతశృంగము జైను మతస్థులకు యాత్రాస్థలముగా నున్నది. ఈశిఖరముమీఁద స్ఫటిక శిలానిర్మితములగు దేవాలయము లనేకములు దర్శనీయములై యుండును. వానిలోఁ బ్రధానదేవాలయముఁ గట్టుటకే పదునెని మిదికోట్లరూపాయలు వ్యయముఁ జేయఁబడిన వఁట. మీవారుసంస్థానమున కుదయపురము రాజధాని. ఇది మిక్కిలి సుందర మగు పట్టణము. జాదుపురము మారువారుదేశమునకు రాజధాని; ఇందును రాతికట్టడము లనేకము లున్నయవి. జయపురము హిందూస్థానమునం గలనగరములలో నెల్ల మిక్కిలి మనోహరముగ నుండును.

తక్కిన ప్రతిసంస్థాన మా పేరు గలపట్టణమే రాజధానిగా గలిగి యుండును. ఈ దేశమున వసియించు జనులు రాజపుత్రు లనఁ బడుదురు. వీ రాజానుబాహులు, శౌర్యనిధానులైన జాతివారు. సాము కసరతులు నేర్చి యెక్కుడు చాకచక్యము గలిగి వీరు యుద్ధము పేరు విన్నపుడు పండువుగాఁ దలంచు చుండువారు. ఈరాజపుత్రు లవంటి యభిమానధనులగు సాహసిక శిఖామణులు, ప్రపంచమునం దుండుట యరిది. తమ దేశస్వాతంత్ర్యమును, కుటుంబగౌరవమును కాంతల పాతివ్రత్యమును నిలుపుకొనుటకై తమప్రాణంబులఁ దృణప్రాయముగ ధారవోసిన శూరాగ్రేసరులు ; ఈ రాజపుత్రస్త్రీ లన్ననో తమ మగవారికన్న నెక్కు డభిమానము, శౌర్యము గల వీరమాతలు, వీరపత్నులునయి మానసంరక్షణార్థము దేహముల నగ్నిహోత్రున కాహుతులు చేసిన వీరరసాధిదేవత లని చెప్ప వచ్చును. భర్తకాని కుమారుఁడు కాని కయ్యంబునఁ బరాజయము నొంది శత్రువులకు వెన్నిచ్చి పరుగెత్తుకొని కోటలోఁ దలఁ దాచుకొన వచ్చినప్పుడు రాజపుత్రస్త్రీ వానిని కోటలోనికి రానియ్యక ములుకులవంటి పలుకులచే వాని మనసు నొప్పించి శౌర్యము గలిగించి మరల యుద్ధంబునకుఁ బంపుచు వచ్చె నని యిఁక ముందు వ్రాయఁబోవు కథలలో మీరు చదివి యక్కజపడక పోరు; ఈజాతిలోఁ బుట్టిన బాలుఁ డయినను సమరమునకుఁ బోవుటకుఁ గాని కాంతాజనంబుల వధించి కులగౌరవము ను నిలుపుటకుఁ గాని యవసరమయినపు డగ్నిహోత్రమున దుమికి యాత్మహత్యఁ జేసికొను టకుఁగాని యెన్నఁడు వెనుదీయఁడు; ఈరాజపుత్రులలోఁ గొందఱు సూర్యవంశజులు, కొందఱు చంద్రవంశజులు, కొంద ఱగ్నికులులు ; పరశురాముని చేత క్షత్రియవంశము లిరువదియొక్కమారు నాశనము చేయఁబడినప్పుడు, లోక మరాజకమై ధర్మమార్గంబులు విడిచి వర్తించు చుండఁగా వేదవిదు లగు మును లగ్నియస్త్ర నాశ్రయించి: మరల

క్షత్రియవంశముల సృశింపుమని ప్రార్థింప నాతఁడు వేదియందు వైదికాగ్ని గల్పించి మంత్రబలముచే నగ్నిహోత్రమునుండి క్షత్రియులను మరల సృజించెననియు వారివంశస్థులే యిప్పు డున్న రాజు లందఱనియు నొకకథ గలదు. కొన్ని రాజకుటుంబము లీకథ నొప్పు కొనక తమవంశకర్త సూర్యుఁడో చంద్రుఁడో యని తక్కిరాజులను నిరసనచేయుచుందురు. వీరు పలు తెగలుగా విభజింపఁబడి యున్నారు. ఏతెగలోవా రాతెగకు నాయకుఁ డగువానిని మిగుల మన్నింతురు. నేల దున్నుకొని జీవించు సేద్యగాఁడు సయితము కులగౌరవమునఁ దాను గొప్ప జమీందారుతో సమానుఁడనని గర్వించు చుండును. ఈరాజపుత్రసంఘములలో నొక్కొక్క కుటుంబము నొక్కొక్క భట్టువాఁ డాశ్రయించి యాకుటుంబముల యశస్సు కైవారములు సేయుచు వారివిరోధులను హాస్యరసప్రధానములగు పాటలతోఁ బరిహసించును. ఈభట్టువారు గాక చారణులనుపేర మఱికొందఱు స్తోత్రపాఠకులు గలరు. వీరు జనులకు గురువులుగాను, దేశచరిత్ర ములఁ దెలుపువారుగనుండి జనులచే మిక్కిలి మన్నింపఁబడుచున్నారు. ఈరాజస్థానమున జైనమతస్థులు గూడ విస్తారముగా నున్నారు. ఈదేశస్థులందఱు మాటలాడునది హిందీభాష. వీరరసమునకుఁ బుట్టిన యిల్లగు నీరాజస్థానమునందలి సంస్థానాధిపతు లందఱుఁ దమదేశ స్వాతంత్ర్యమును, తమయార్యమతమును, గోబ్రాహ్మణులను, దేవా లయములను, సంరక్షించుటకయి పలుమారులు మహమ్మదీయ చక్రవర్తులతో యుద్ధములు చేసిచేసి ప్రసిద్ధిఁ గాంచిరి. ఈసంస్థానము లన్నిఁటిలో మీవా రనునది సుప్రసిద్ధమై రాజపుత్రదేశమున కలం కారమై శూరశిఖామణులకు నిలయమై యలరుచుండును. దానిపూర్వ రాజధాని చిత్తూరునగరము. ఢిల్లీచక్రవర్తు లానగరము నాక్రమించి నాశన మొనర్చినపిదప, తత్ప్రభువు లుదయపుర మను పట్టణము వేరొకచోటఁ గట్టుకొని దానిని రాజధానిగాఁ జేసికొనిరి. ఉదయ

పుర సంస్థానాధిపతియే రాజపుత్రులకెల్ల నాయకుఁడు. ఆతనియాజ్ఞ నాజాతివారందఱు శిరసావహింతురు. ఉదయపురాధీశ్వరునకు రాణా యనుబిరుదము కలదు. ఈతనివంశము నిష్కళంక మని ప్రజలు చెప్పుకొందురు. శ్రీమద్రామాయణ కథానాయకుఁడును ధనుర్ధరులలో నెల్ల నగ్రగణ్యుఁడును నగు శ్రీరాముని రెండవకుమారుఁడగు కుశుని సంతతివార మని యీరాజులు చెప్పుకొందురు. ప్రస్తుత మీయుదయ పురరాజవంశము శిశోదయవంశ మని పేరొంది యున్నది. ఈవిధంబు గనే కొందఱురాజులు పాండవమధ్యముఁ డగునర్జునుని ప్రియపుత్రుఁ డభిమన్యుఁడు తమకు మూలపురుషుఁ డనియుఁ, దత్కారణమున చంద్రుఁడు వంశకర్త యనియు సంతసింతురు. జగద్విఖ్యాతకీర్తు లగు నీరాజకులభూషణుల యద్భుతచరిత్రము లాంధ్రభాషలో వ్రాయవలె నని నాకుఁ జిరకాలమునుండి కుతూహల మున్నందున నేనిప్పుడు తచ్చరిత్రములు సంగ్రహముగ వ్రాయఁ బూనుకొన్నాఁడను. ప్రప్రథమమున నుదయపురము రాజధానిగానున్న మీవారు దేశముయొక్కయు, జాడుపురము రాజధానిగానున్న మారువారు యొక్కయు చరిత్రములు దెలుపఁబడును.

రాజస్థానకథావళి.

(మొదటిభాగము.)

బప్పరావుల కథ.

—:(0):—

అనేకసంవత్సరములక్రిందట హిందూదేశమున వల్లభిపురమను పట్టణమును శిలాదిత్యుండను మహారాజొకండు పాలించుచుండెను. అతఁడు చిరకాలము శత్రుదుర్నిరీక్ష్యముగఁ బ్రజారంజకముగ నేలనేలెను. శిలాదిత్యుఁడు సూర్యునికుమారుఁడనియు, నాకారణంబున నతఁడా మహారాజును సంరక్షించుననియు బ్రసిద్ధికలదు. అతనిసేనలతో నెవరు పోరినను వారు తప్పక పరాజయము నొందెడువారు. వల్లభినగరపుఁ గోటలో నొకదివ్యసరస్సు కలదఁట. శిలాదిత్యమహారాజు శత్రువులకు జంకినప్పు డాదివ్యసరస్సునకుఁ బోయి, యొడ్డున నిల్చి చిన్ననాఁడు తన తండ్రి కఱపినమంత్రము నుచ్చరించునఁట. వెంటనే యాసరోవరమధ్యమునుండి సూర్యునిరథములాగు రంగులగుఱ్ఱ మొకటి బయలుదేఱ నారాజు దాని నారోహించి, రణరంగమునకుం జన శత్రుసేనలు వాని యెదుట నిలువలేక పటాపంచలై పాఱుచుండును. ఇట్లుండ కొంతకాలమున కుత్తరదిక్కునుండి యరులమూఁకలువచ్చి వల్లభిపురమును ముట్టడించెను. ఎన్నినాళ్లు మగంటిమిఁజూపి పోరొనర్చినను, వారు శిలాదిత్యునిఁ గెలువఁజాలక నిరాశులైరి. అంతలో చిరకాలమునుండి రాజుపై మనస్సులో క్రోధమునిల్పియున్నయాతనిమంత్రి యొకడర్ధరాత్రమున, శత్రుశిబిరముం బ్రవేశించి వారితో ,,నాకోరినబహుమానమునిత్తురేని శిలాదిత్యునిఁ గెల్చి వల్లభిపురమును బట్టుకొనునుపాయంబు మీకుపదేశించెద'' నని పలికె. ఆపలుకులు విని వారు సంతసించి వానికోరక

తీర్చునటుల వాగ్దానముఁ జేయ, నాతఁడును దనజేనిజ యురహస్యమును బగతురకిట్లెఱింగించెను. ‘‘శిలాదిత్యమహరాజు సూర్యపుత్రుఁడు; ఆతని ప్రభావమువలన కోటలోని యొకదివ్యసరస్సునుండి సూర్యాశ్వ మొకటి బయలు వెడలును. రాజు దానిపై నెక్కి కయ్యమునకుఁ బోవుటంజేసి విజయుఁడగుచున్నాఁడు. ఆసరస్సు మైలవడినయెడల భానుఁడలుగును. ఆతనియలుకచే రాజున కాగుఱ్ఱము లభింపదు. అప్పుడు మీరాతని సులభముగాజయింపవచ్చును.’’ ఇట్లు పలికి వైరులనుమహానందమగ్నులఁజేసి దుష్టబుద్ధి యగువామంత్రి నగరమునకుఁ బోయి యొకగోవును జంపించి దానినెత్తు రాకొలంకునీటిలోఁ గలిపించి కలుషంబుగావించె. కొండొకవడికి వేగులవాఁడొకఁడువచ్చి, దేవా! శత్రువులు కోటపైఁ గవియుటకు మొనలుదీర్చియున్నవారని చెప్ప శాత్రవసేనలతోఁ బోరుమని తనబలంబుల కానతిచ్చి, యాధరణీశ్వరుఁ డెప్పటియట్ల దివ్యసరోవరంబునకుం బోయి తనప్రియహయమును బిలిచెను. కాని తొంటియట్లు నీరొకించుకయుఁ గదలబారదయ్యెను. ఆరాజేంద్రుఁడు తత్కారణ మరసి, తనమంత్రపటిమంబు చెడినదనియు, దనజనకుఁ డగుప్రభాకరునకుఁ దనపై ననుగ్రహంబు తప్పిన దనియు నిశ్చయించి సేనలం బురికొల్పికొని, యాయుధపాణియై మురార్వరసంగ్రామంబొనర్చి దేశసంరక్షణార్థమై ప్రాణములు విడిచి కీర్తిశేషుఁడయ్యెను. శత్రువులు వల్లభిపురంబునుబట్టుకొని కొల్లకొనిరి. అప్పుడు దైవవశముననగరమునందు తేమి నొక్కరితతక్క తక్కినజేనికాంత లందఱుఁజిచ్చునికి భర్తృసహగమనముఁ జేసిరి. ఆమె తనపుట్టినింటికి జని మరల భర్తృసన్నిధికి వచ్చుచుండ దారిలో నొకసేవకుఁ డారాణింగని శిలాదిత్యుఁడు లోకాంతరగతుఁ డగుటయు వల్లభిపురము శత్రునృపులకుఁ జిక్కుటయు నాదిగాఁగల వృత్తాంత మెఱింగించెను. ఆదేవియు గుండె లవియు తద్వార్తవిని, పిడుగడచిన తెఱంగున మూర్ఛిల్లి దరిలేని శోకాబ్ధిలో మునిఁగి వల్లభిపురంబునకుఁ బోవఁ గాళ్ళాడక నిండుచూలాలగుటచే

నెటుబోవఁ దోఁచక దాపుననున్న యొకకొండగుహకు మెల్లమెల్లనఁ జనియె. అందుండ కొన్నిగాళ్ల కామె కొకనందనుం డుదయించె. అనంతర మామెయొకనాఁగ యొకబ్రాహ్మణుని బిలిచి తనకుమారుని వాని కొప్పగించి బ్రాహ్మణకుమారునట్లు వానిం బెంపవలయుననియు సంప్రాప్త యౌవనుడైన పిదప నొక రాజకన్యను వివాహము చేయ వలయుననియు, నొక్కిచెప్పి చిరభర్తృవియోగముచే నవసియున్న తనశరీరము విడిచెను. బ్రాహ్మణుఁడును శిశువు నెత్తుకొని యింటికిఁ జని యాబిడ్డకు గుహలో జన్మించిన కారణమున గొహుఁ డనుపేరు పెట్టి పెనుచు మని తనకూఁతున కొప్పగింప నామె యుఁ దనబిడ్డలతో పాటు వానికి సంరక్షణఁ జేయుచుండెను. పెంపుడు తలిదండ్రులు బిడ్డలపై నెంతయనురాగము జూపుదురో యంతయనురాగము బ్రాహ్మ ణుఁడును వానికూఁతురును వానిపైని జూపి పెంప రాజకుమారుఁడును క్రమక్రమంబునం బెరిగి కడుంగడు నల్లరిబాలుఁ డయ్యె. అను దినంబును బక్షులఁ జంపుచు వనమృగంబుల వేటాడుచు రాజకుమా రులం గలిసి యాడుచు పోరాటంబు సల్పుచు నాతఁడు దుండగీడగు టంజేసి వానిని బ్రాహ్మణకుమారునట్లు బెనుచుట వానికి నలవిగా దయ్యె. ఇట్లుండి పదునొకండేండ్లప్రాయమున నొకనాఁ డానృపకుమా రుఁడు పెంపుడు తల్లిదండ్రుల యిల్లు విడిచి, యడవులఁ గొండల, వసి యించు భిల్లులమూఁకలఁ గలిసి వారలతో నిచ్చవచ్చిన తెఱంగున మెలంగుచు వేటలాడుచు పాటలఁ బాడుచు విహరింపఁజొచ్చె. ఒక నాఁడు గొహుఁడు భిల్లబాలకులం గలిసి వేటలాడుచుండ నక్కుమారు లందఱు తమచుట్టుప్రక్కలనున్న నాగరికులవలె తాముఁగూడ నొక రాజు నేర్పఱచుకొందమని పరిహాసార్థ మనుకొని గొహుని తమప్రభు వుగా నియమించుకొనిరి. వెంటనే యొకపిన్నవాఁడు కత్తితోఁ దన వ్రేలుం జీరికొని జొటజొటకారు క్రొన్నెత్తురు గొహుని నెన్నొసట [illegible] రాచరికముపగానువాని కట్టుచేయుట యాదేశములో నా

దినములయం దాచారమయి యుండెను. భిల్లుల కులవృద్ధు తద్వృత్తాంతము విని సంతసించి తమ యీదూరుగ్రామ మశేషము గొహునకు పుత్రపౌత్రపారంపర్య మేలుమని యర్పించి, యెల్లభిల్లులకు వానిదొరగా నొనర్చెను. నాఁటనుండియు తద్వంశస్థులు గిహాలోటు లని చెప్పఁబడుచున్నారు. ఇట్లు గిహాలోటు లీదూరిపురమును, భిల్లులను, నెనిమిదితరములవఱకుఁ బాలించిరి. అనంతరము భిల్లులు క్రొత్తవంశపు రాజు పరిపాలనకు విసువుజెంది వారి నెట్టుయిన దేశమునుండి పాఱఁదోలఁ దలఁచుచుండిరి. ఒకనాఁ డప్పటిరాజు వేఁటతమకంబున తిరుగుచుండ భిల్లులు వాని నాకస్మికముగఁ దాఁకి వధించిరి. అప్పుడు రాజకుటుంబ మెందేని తలఁ దాఁచుకొనవలసి వచ్చె. పూర్వము గొహుని కాపాడిన బ్రాహ్మణుని కూఁతురుసంతతివారు వంశపారంపర్యముగ గురువులుం బురోహితు లగుటంజేసి తద్వంశజుఁ డగుబ్రాహ్మణుఁ డొకఁడు మృతినొందినరాజకుమారుని మూడేండ్ల ప్రాయము వాని జేరఁదీసి చేరువ నట్టడవిలోనున్న యొక కొండకోటకుం దీసికొని పోవ నొకభిల్లుఁడు వానితండ్రిమీఁది విశ్వాసముచేత రహస్యముగ వాని నందు సంరక్షింపఁ జొచ్చె. అచ్చటఁ గొన్నినాళ్ళు కడచినపిదప పురోహితుఁడు రాజపుత్రున కచట యపాయము వాటిల్లు నని తలఁచి యిప్పటి యుదయపురమున కైదుక్రోసుల దూరమున నున్న నాగేంద్ర మను పుణ్యక్షేత్రమున కాకుఱ్ఱనిఁ జేర్చెను. ఈపట్టణమున మూఁడుశిఖరములు గలయొకకొండమొదట యేకలింగస్వామి యను పేరఁ బరఁగు మహాదేవుని శివుని వానివాహన మగునందిని బ్రాహ్మణు లారాధించెడువారు. అడవుల నేరుల నిండినయీయేకాంతస్థలమున రాజపత్ని తనకుమారుని దాఁచి పెంచుచుండెను. అతనికి నామకరణ మేదియుఁ జేయక తల్లి బప్పా యని పిలుచుచు యూరిపిల్లలతోపాటు పెరుగనిచ్చెను. ఆభాషలో బప్పయనఁ బిల్లవాఁడని యర్థము. ఆయూరి పిల్లలవలె నాకుఱ్ఱఁడు నుదయము మొదలస్తమయమువఱకు పశుల

మందలం గావ నూరిబైటికిఁ బోవుచు, వారివలెనే తాను నాడుచుఁ బాడుచు వారందఱకు యజమానుఁడయి తనయాజ్ఞ వారు శిరసావహించునట్లు ప్రవర్తించెను. బప్పఁడు నానాఁటికిఁ బెఱిగి నెఱజవ్వనంబుఁ బ్రాపించియుండ నొకనాఁ డట్లు తద్దిపండుగకు నాగేంద్ర గ్రామనాయకుని కూఁతురు తోడిపడుచులం గూడి పండుగదినంబున హాయిగ నుయ్యాలలూఁగ నూరుబైట దేవళముచుట్టు నున్నమామిడితోపున కరిగి యచట నుయ్యాల పన్నుటకు త్రాళ్ళు దొరకమి చిన్నబోయి యుండె. దైవవశమున నాసమయంబున బప్పఁ డామామిడితోఁటలో దిరుగుచుండ బాలిక లాతనిం గాంచి తమ కొక యుయ్యాలత్రాఁడు తెచ్చిపెట్టుమని వేఁడ బప్పఁడును దాని కియ్యకొని „సరే మీరు నాతో నొక యాట యాడుటకు నొప్పుకొందురేని మీకు త్రాఁ డిచ్చెదను. మీరు మనసార నూఁగ వచ్చు" నని పలుక గ్రామనాయకునికూఁతు రది యేమియాట యని యడిగెను. మఱేమియు లేదు. మనము పెండ్లియాట యాడుకొంద మని బప్పఁ డుత్తర మిచ్చెను. బాలురును బాలికలును బొమ్మలపెండ్లియాటలు తమపెండ్లియాటలు నాడుకొనుట లోకవిదితమే కదా! ఉయ్యేలత్రాఁ డెక్కడ దొరకకపోవునో యని బాలిక లట్లు చేయుట కియ్యకొనిరి. గ్రామనాయకునికూఁతురు చీరకొంగున రాజపుత్రుఁడు తనశాలువకొంగు ముడివేసి యామెయు నామెతో నున్న మఱి యాఱువందల పడుచులయు చేతులు పట్టుకొని యొకవృక్షమునకుఁ బ్రదక్షిణముఁ జేసి కొండొకతడవునకు పాణిగ్రహణమహోత్సవము నిర్వర్తించెను.

నాగరికత లేనియాపల్లెటూరిపడుచులు తమచుట్టములయిండ్ల జరుగువివాహములలోఁ బ్రధానాంగముగాఁ జరుగుపని యదియే గావున యాపని కప్పుడు సంతసించి తనివిదీర నుయ్యాలలూఁగి, సాయంకాల మిండ్లకుఁ జనియాపెండ్లియాటమాట మఱచి యుండిరి బప్పఁడు తనతోడిబాలకుల నందరఁ జేరఁబిలిచి తానాదినమునఁ గావించిన

చిత్రకథ వా రెవ్వరికిం దెలుపఁగూడ దనియును, గ్రామంబున నెవ్వ డేమాట వినినప్పు డది తన కెఱుఁగఁజేయువలయు ననియు గట్టడిచేసి వాండ్ర నందఱ నొడంబఱచి, వారిచేఁ బ్రమాణములు చేయించుకొని, యంతట నెల్లర వీడ్కొలిపె. బప్పఁడు పశులమందల మేపుచున్న యాకాలమున చింతపువ్వువన్నెయావొకటి స్వభావమునఁ బరమ సాధు వయ్యు నింటికి వచ్చి పాలు చేపక యెగదన్నుచుండుటఁ జేసి కారణము దెలియక యెట్టకేలకు బప్పఁడే దానిపాలు పితికికొనుచుండ వలయు నని నిశ్చయించి వానిదొంగతనము పొంచి యుండి పట్టుకొ మ్మని యూరిపెద్దలు కొందఱిని నియోగించిరి. బప్పఁ డది యెఱిఁగి కడునలిగి యావు వట్టిపొదుగుతో నింటికి వచ్చుమాట నిజమేకాని తా నేపాప మెఱుఁగ ననియుఁ బొదుగుపై నెన్నఁడు జేయి యైన వేయలే దనియుఁ జెప్పి యాగోవుజాడలు దాఁ గనిపెట్టి రహస్యము బట్ట బయలు చేయుటకయి, యత్నించి మందలోనుండి యాపసరము ప్రతి దినము తప్పిపోవుచుండె నని తెలిసికొని యొకనాఁడు సాయంకాలము పుంతలు పొదలు దాఁగి వెనువెంటం జని యొకకొండచరియం జేరెను. అచ్చట నల్లిబిల్లిగ నల్లుకొన్నపొదలనడుమ నొకవేదికపై నమరియున్న మహాశివలింగమునకుఁ దప్పిపోయినయావు తనపొదుగునుండి పాలు చేపి యభిషేకముఁ జేయుచుండెను. చిరకాలమునుండి జపములు తపములు నుపవాసములు చేసి ముక్తినిఁ బడయు నిచ్ఛతో మనస్సు పరబ్రహ్మముతో నైక్యముఁజేయఁ బ్రయత్నించుచు నాసమయమున సమాధిలో నున్నయొకానొకసిద్ధుఁ డావేదిసమీపమున నుండెను. బప్పఁ డామహాత్ముని సమాధినుండి మేలుకొలుప నాతండు తన దివ్యజ్ఞానమహిమమున నెదుటనున్న బాలుఁ డుత్తమరాజకులసంభూతు డనియు, మహాకార్యములు చేయ నవతరించినాఁ డనియు దెలిసికొనియె. బప్పఁ డాసిద్ధునకు సాష్టాంగనమస్కార మొనర్చి తాను నాగేంద్రగ్రామవాసి యగుపశులకాపరి యనియు తప్పిపోయినయొక

యావును వెదకికొనుచు వచ్చె ననియుఁ జెప్పెను. సిద్ధు డావఃఖకులు విని వాని నాదరించి యాగో వనుదినంబు నాకొండ చరియకు వచ్చి పాలు తనకును దేవునకు నొసంగుచుండెనని చెప్పెను. అది మొద లాగోవు మందనుండి తప్పిపోయినపుడెల్ల దాని వెదకుచుబప్పఁడు సిద్ధుని నెలవునకుంబోయి వాసి దర్శించి కడుభక్తి వానిపాదములం గడిగి యెడనెడ పాలు, పండ్లు నాహారములుగ సమర్పించుచు వానికిం బ్రియశిష్యుఁ డయ్యెను. సిద్ధుఁడును బప్పనియెడఁ బ్రసన్నుండై శైవరహస్యముల నుపదేశింప నాతఁడు పరమశివభక్తుఁ డయ్యెను. ఆ ముని బప్పనికుపనయనము జేసి మంత్రోపదేశము చేయ నుంత త్రిమహిమ చేనాతని కొక నాఁడు శివుని భార్య యగు మహిషాసురమర్దని వ్యాఘ్రవాహన మెక్కి రక్తాంబరంబుల ధరి యించి ప్రత్యక్షమై, శత్రునిర్మూలనసాధనంబగు సెలయు, విల్లును సమ్ములపొదియు, నొసంగుటయే గాక మనుష్యకృతముగాక కేవల విశ్వకర్మ నిర్మితమై యిరుప్రక్కల వాఁడిగల యొకమహాఖడ్గమును గూడఁ బ్రసాదించెను. ఆఖడ్గ మతిభార మగుటచే దివ్యపురుషులు మహాశూరులు దక్క సామాన్యులు దానిం దాల్ప నోపరు. దేవి యిట్లాతని ననుగ్రహించుటయు సిద్ధుఁడు బప్పనింజూచి "వత్సా! రేపు నే నీశరీరము విడిచి దివికిం బోవుదును. కావున నీ వరుణోద యము గాకమున్నె వచ్చి నా కట్టకడపటి దీవెనలం బడయుము" మని యానతిచ్చె. రాజకుమారుఁడును తెలువాత తప్పక వచ్చునట్లు నచ్చఁ బలికి మునిని వీడ్కొని పోయెను. కాని పెందలకడ నిద్ర మేల్కొ నంజాలక కొంత ప్రొద్దెక్కిన వెనుకఁ నతఁ డాకొండచరియకు వచ్చి చూచునప్పటికి సిద్ధు డందు లేఁ డయ్యె. ఆమహాపురుషుని కొఱకు బప్పడు పొదలు, పుంతలు, పొలములు వెదకి వేసారి యెందునుం గానక మెట్టకేలకు నాకసముఁ వంకఁ జూచెను. అప్పుడు మహేంద్ర లోకమునుండి వచ్చి కన్నులు మిరుమిట్లు గొలుపు దేదీప్యమాన

ప్రభలుగల దివ్యపురుషులు మణిమయం బగు స్వర్ణవిమానంబునఁ గూర్చుండఁ బెట్టికొని పోవ నంతరాళంబున మహావాయుపథంబునం దిరుగుచు సిద్ధుఁడు పుడమిపై కడుదవ్వులనున్న బప్పనిం జూచి పైకి వచ్చి నాయాశీర్వచనముల నందుకొమ్మని కేకవేసెను. ఆపరమ మునీంద్రు వాక్శుద్ధివలన బప్పఁడు చూచుచుండఁగనే యిరువదిమూళ్ళ పొడు గెదిగె నఁట. అప్పుడు ముని వానిం బిలిచి నోరు తెరువుమని యానతిచ్చి బప్పఁ డట్లు చేయ తుబుక్కున మొగముపై నుమిసెను. రాజకుమారున కది కడు ససహ్యాముగఁ దోఁచుటం జేసి యతఁడు సిద్ధుని యుమ్మి తననోటఁ బడకుండ నించుక యావలకుం దప్పుకొన, నది వానికాలిపైఁ బడియె, సిద్ధుఁ డది గనుంగొని, నీవు నేజెప్పిన చొప్పునఁ జేసితివేని చిరంజీవివై యుందువుగద! కాని మ్మిప్పుడైన నీ కేయాయుధమువలనను భయము గలుగ దని పలికి యంతర్ధాన మయ్యెను. అనంతర మాబప్పఁ డింటికరిగి జరిగిన వృత్తాంత మంతయుఁ దల్లి కెఱింగింప నామెయు, నతిలోకం బగు నయ్యద్భుతంబున కానంద పరవశయై 'నాయనా! నీ వందఱనుకొన్నట్లు పశులకాపరివి కావు; సకల మహీభరణ దక్షుండవగు రాజపుత్త్రుఁడవు; నేను రాజకన్య' నని గుట్టు వెల్లడిచేసి పూర్వవృత్తాంత మెఱింగించెను. బప్పఁడది విని నాఁడు మొదలావులమందలఁ గాఁచుట మాని రాచరికము సంపాదింప దేశముల వెంటఁ దిరుగ నారంభించెను. ఆసమయమున బప్పఁడు నాగేంద్రగ్రామమును విడుచుటయు నాతనికి మిక్కిలి క్షేమకరము. ఏలనన నాతని విషయమై దుర్భరమగు నొక చెడువాడుక వ్యాపించుటం జేసి, యూరెల్ల నట్టుడికిన ట్టుడుక సాగెను. గ్రామనాయకుని కూఁతురు సంప్రాప్త యౌవనయై వివాహయోగ్యయగుటం జేసి దానికిం దగు వరుఁ డొకఁడు లభించెను. వివాహప్రయత్నములన్నియు జరిగి సిద్ధముగనుండ ముహూర్తము నిశ్చయించుటకు వచ్చిన బ్రాహ్మణుఁడు బాలికజాతకమును జూచి గ్రహసంచార

మును బట్టి యామెకు నదివఱకె వివాహ మయినదని చెప్పెను. ఊరి పెద్ద లీమాట విని మితిమీఱిన యలుకచే మండిపడి బాలికను నొక్కి యడుగ నామెయు భయపడుచు వెనుక నెఱపఁబడిన యాట పెండ్లి నెఱిఁగించెను. ఆ తెగవారి శాస్త్రమునుబట్టియు, నాచారమును బట్టియు, గొంగులు ముడివేయుటయుఁ జేతులు పట్టుకొనుటయుఁ జెట్టుచుట్టు తిరుగుటయు, నిజమయిన వివాహమును సూచించుటం జేసి బప్పఁడు గ్రామమునందలి యూరువందల కన్యలకు విధిగా మగఁ డయ్యె నని పెద్దలుక జెందుటకు తగినంత కారణము లేకపోలేదు. తనతోడి పసులకాపరులలో నొకనివలన నీసంగతిని బప్పఁడు విని క్రోధపరవశు లగు మామగార్ల బారినుండి తప్పించుకొని తత్క్షణ మాగ్రామమును విడిచి కొంతదవ్వరిఁగి గొప్ప బయలునేల నొకరాతి పైఁ గట్టఁబడిన చిత్తూరినగరముం బ్రవేశించెను. ఆ కాలమున చిత్తూరునగరము మాళవరాజవంశస్థుఁ డగు బప్పని మేనమామ పాలించుచు, చిరకాలము క్రిందటఁ జూచినతనతోఁ బుట్టువును మేనయల్లుని గారవించెను. ఎవరో యెచ్చటనుండివచ్చెనో యెవ్వరికిం దెలియని యా క్రొత్తచుట్టాలపై రాజునకుం గలయాదరంబును గారవంబునుఁ జూచి రాజాశ్రితులందఱుఁ గడునల్గి తమపట్టణముపై నొకశత్రువు దండెత్తిరా వారందఱు నతనికి సహాయముగాఁ బోరరయిరి. రాజు వారిని సాయ మడుగ మేనమామ చేసినయాదరంబునకెల్ల బప్పఁడు తగినవాఁడైన పక్షమున యతఁ డొక్కఁడే పగతురం దాఁకి జయింపఁగలఁడు. ఇంక మాసహాయ్య మెందుకు? కావలసినయెడల మామడిమాన్యములనైన వదలుకొని మే మెందయినఁ బోవుదుము. కాని, నీపక్షమున బోర మని రాజునకు వారు ప్రత్యుత్తర మిచ్చిరి. బప్పఁడు జంకును గొంకును లేక యొక్కఁడే యుద్ధమునకు సిద్ధ మయ్యెను. ఆతని సాహసమును జూచి సరదారు లందఱుఁ దమతమమనస్పర్థలను విడిచి సిగ్గుపడి యెట్ట కేలకుఁ బప్పనివెంట రణంబునకుం బోయిరి. నాటికలహంబున శత్రు

రాజు బప్పనిచే పరాజయము నొంది యాశూరశిఖామణికి తనకూఁతు నిచ్చి వివాహము చేసెను. సరదారు లందఱు బప్పనిం జేరఁబిలిచి యారాజు దుష్పరిపాలనముచే దమకు విసువుఁ గలిగెననియు, నీ దుచే మామను సింహాసనభ్రష్టుని జేసి యల్లుఁడు గద్దెనెక్కి పాలించిన నుచితముగ నుండు ననియు, నుపదేశించి యట్లుచేయఁ బ్రోత్సాహ పరచిరి. బప్పఁడు నిశ్శంకబిరుదుం డగుటచే సరదారుల సాయమున మేనమామ యని సంశయింపక, తేనిం బారఁద్రోలి రాజ్య మాక్రమించెను. తొల్లి సిద్ధుండు, బప్పని యేకలింగస్వామికి ధర్మకర్తగా నేర్పరచెను. అదిగాక బప్పఁడు హిందూమతప్రభాకరుఁ డనియును సర్వభూమండలాధీశ్వరుఁ డనియు బిరుదులు గ్రహించెను. అతఁడు చిత్తూరుదేశము చండశాసనుఁడై చిరకాలము పాలించి రాజ్యము గడువృద్ధి చేసెను. అతఁ డనేకకన్యలను వివాహ మాడెను. అందు ద్వీపాంతరములనుండి వచ్చిన యొకానొకరాజకన్య తనసారెతో నొక దేవీవిగ్రహమును దెచ్చి కోటలో నుంచెను. లోకమాత యగు నాదేవి బహుసంవత్సరము లాకోటను సంరక్షించెనఁట. కాని యొక పిరికి రాజు మంచిసమయమున కోటను విడిచి పోయెను. ఆద్వీపాంతరరాజ కన్యకవలన బప్పని కుదయించిననందనుఁడు పితురనంతరమున సింహాసన మెక్కెను. బప్పనిజీవిత మంతయు నెట్టియద్భుతకథలతో నిండి యుండెనో, వానిమరణము నట్టికథలతో నిండి యున్నది. అతఁ డతి వృద్ధుఁడైన వెనుక రాజ్యమును, భార్యలను బిడ్డలను విడిచి సేనలం గూర్చుకొని, పశ్చిమదేశముల పయి దండువిడిసి, చూచినతావెల్లఁ జయించుచు, తుట్టతుదకు ఖొరాసానను మ్లేచ్ఛదేశముఁ జేరి, యచ్చట నొకరాజ్యము స్థాపించెను. కాశ్మీర, గాంధార, పారశీకప్రభువులును, కాఫరస్తాను ఇస్పహాను దొరలును, తక్కుంగల పశ్చిమదేశాధీశ్వరులును వానికి లోఁబడి కప్పముఁ గట్టిరఁట. బాల్యమునందుఁబోలె వార్ధకమునందును నతనికి వివాహేచ్ఛ మిక్కుటమగుటఁ జేసి మ్లేచ్ఛ

సామంత రాజపుత్రికలం బలువుర పాణిగ్రహణము జేసికొని యాకన్నెల వలన నూటముప్పదుగురు కుమారులం గనె నని చెప్పుదురు. ఈకొడుకులే నూటముప్పది పటానుతురుకతెగలకు వంశకర్తలై యుండె నని ప్రసిద్ధి గల్లదు. మున్ను చిత్తూరిపై విసుకు పుట్టినయట్లు కొరాసానుపై సయితమాతనికి విసుగు జనింప నతండా దేశమును వైభవమును విడిచి తిరిగి పరమపావనమగు మహామేరుశైలము నెక్కి జితేంద్రియుండయి సన్యసించి జపతపంబుల కాలముపుచ్చి యెట్టకేలకు శతవృద్ధయి శరీరము విడిచెనంట. ఈతండు చచ్చి లోకము విడిచినను, నద్భుతములు, మహిమలు వీనిని విడువవయ్యె. అతని మొదటి ప్రజలగు హిందువులును, తరువాతప్రజ లగుమ్లేచ్ఛులును వానికళేబరవిషయమై వివాదపడిరి. హిందువులు తద్దేహము నగ్నిసంస్కారముం జేయవలయు ననిరి. మ్లేచ్ఛులు నేలం బూడ్చిపెట్టవలయు ననిరి. ఇట్లు కొంత తడవు మ్లేచ్ఛ హిందువులు కార్యనిశ్చయముం జేయలేక వివాదపడుచుండ నప్పుడందులో నొకండు శవముమీందం గప్పినబట్ట నించుక యెత్తెను. అప్పటియద్భుత మే మని వర్ణింపను. ఆస్థానమందు బప్పరావుల శరీరముంగాని దానిజాడంగాని యెక్కింతయు గానంబడకపోవుటయేగాక, శవముసు పండుకొనం బెట్టినచోట భూమిలోనుండి లెక్కలేని తామరపువ్వులు మొలకలెత్తెను. ఈవిధమునం బప్పండద్భుతముగా నస్తమించెను. ఈబప్పరావులే, మీవారుసంస్థానము నేలుశిశోదయ వంశజులగు రాజులకు మూలపురుషుండు. అతని యనంతరమున సింహాసనమునకు వచ్చిన ప్రభువులుం గొందఱు బప్పనివలెనే రావులని బిరుదము వహించిరిగాని, యిటీవలవారు రాణాయను నామము ధరించిరి. బప్పరావులకాలము మొదలు చిత్తూరురాజులచ్చటి శివాలయమునకు ధర్మకర్తలై వారు స్వయముగా నాలయమునకుం బోవునపుడు దేవునకు నర్చకులై యుండెడు నాచారము గలదు.

పద్మిని.

పూర్వకాలమున మీవారు దేశమునకు వైభవమున సాటిలేని చిత్తూరు నగరము రాజధానియై యుండెను. ఆనగరము చుట్టుపట్ల నలుదెసల బయలగు నేల నొకచదరపు గొండపైఁ గట్టఁబడి దుర్గములగు కోటగోడలు, నున్నతములగు దేవాలయములు రమ్యములగు మేడలు, మనోహరములగు పూఁదోటలు, శూరులగు రాజకుమారులు గలిగి రాజసంస్థానమున కలంకారమై యుండెను. ఆకొండమీఁదనే వెలసిన యొకదేవత యానగరమును గాపాడుచుండెనని యానాఁటి వారు నమ్మియుండిరి. పదుమూడవశతాబ్దాంతమున మీవారుదేశమునకు లక్ష్మణసింగను నొకబాలుఁడు రాజయ్యెను. ఆతఁడు రాజ్యభారమును వహించుటకుఁ దగని బాలుఁడగుటచే నాతని పినతండ్రి యగు శూరశిఖామణి భీమసింగు సంరక్షకుఁడై రాజ్యతంత్రమును నిర్వహించుచుండెను. భీమసింగు సింహళద్వీపరాజపుత్రియు నసమానలావణ్యవతియు నగు పద్మినిం బెండ్లియాడెను. ఆదేవి చక్కఁదనమును సౌకుమార్యమును నెఱజవ్వనమునుఁ బట్టి భూలోకమున నిట్టి సౌందర్యవతి లేదని యాకాలపుజనులు చెప్పుకొన దేశమంతట నామెకీర్తి వ్యాపించి యప్పటిఢిల్లీచక్రవర్తియు నధమాధముఁడునగు నల్లాయుద్దీను చెవినిఁ బడెను. ఈచక్రవర్తి పరమదుర్మార్గుఁడు, చిన్నటనుండియుఁ దన్ను పెంచిన పినతండ్రిని జలాయుద్దీను చక్రవర్తిని విశ్వాసఘాతకుఁడై చంపి సింహాసన మెక్కెను. గద్దెయెక్కినది మొద లతఁడు ప్రజలను మంగలములో బెట్టి వేచినట్లు పలువెతల గుడిపెను. ఆచక్రవర్తి తనయాగ్రహమునకుఁ బాత్రులగు మందభాగ్యులనుఁ గన్నులు బొడిపించియు ధనము హరించియుఁ జెఱఁబెట్టించియుఁ జంపించియు నాలుబిడ్డల బిచ్చగాండ్రఁ జేసియు ననేక చిత్రవధల పాలుఁజేసి కలియు

రావణుఁ డయ్యెను. అతఁడు తనపై దండెత్తి వచ్చిన పగఱఁ బారద్రో లుటలోను పరరాజుల దేశముల నాక్రమించుటలోను పితూరీల పేరైన లేకుండ నడచుటలోను సాటిలేని చండశాసనుఁ డగుటచే వానిరాజ్యము సకలైశ్వర్యముల కునికిపట్టయి విలసిల్లెను. ఆతని క్రౌర్యము నిరంకుశమై నేరములు చేసిన వారియెడలనేగాక నిరపరాధులగు వారి యాలుబిడ్డలపై సైతము జూపఁబడుచు వచ్చె. ద్రోహులగు పురుషుల దండించిన రాజు లనేకు లుండిరికాని యేపాప మెఱుఁగని పసిబిడ్డలను బసఁతులను గ్రూరశిక్షల పాల్గావించు నీచు నితనిఁ దక్క మఱొకని నెఱుఁగము ప్రజల హింసించుటలో నతనికి హిందువులు మహమ్మదీయు లను భేదము లేదు. స్వమతస్థు లగు తురకలు సయితము వానిసెలవు లేక యొకరిదర్శన మొకరు చేయ రాదు. విందులకుఁ బోరాదు. పదిమంది చేరి మాటాడరాదు. వేయేల! తనపాలనకు లోఁబడిన యానాఁటిహిందువుల నితఁడు కడుపునిండఁ దిననీయక కంటినిండ నిదురఁ బోనీయక పన్నుల వేసి బాదెల ద్రోసి పీడించుటచేఁ దల గోకికొనుటకైనను వారికి స్థిమితము లేకపోయెనని యొకచరిత్రకారుఁడు వ్రాసి యున్నాఁడు.

అట్టి యీమహాపాతకుఁడు పద్మినీదేవి సౌందర్యాతిశయములను వీనుల విందుగా విని యామెను జేకొనఁగోరి మహాసేనం గూర్చుకొని యడవులు గొండలు నేఱులు దాఁటి మీవారుదేశము జొరఁబడి చిత్తూరునగరపుఁగోట యెదుట నిలిచి పద్మినీదేవిని తనకుం గానుకగ నడిగెను. రాజపుత్రులు నింద్యమగు తనకోరికను నిరాకరించుటచే తను నగరపురాతికోట తనకు దుర్భేద్య మగుటచేతను జక్రవర్తి తన యాట లచ్చట సాగిరావని తెలిసికొని బింకము వదలి సామవాక్యములకుం జొచ్చి పద్మినీదేవి తన కక్కర లేదనియు నామె చక్కఁదనము తాను వినినంత జగన్మోహనముగ నుండునో లేదో యెఱుంగఁ గోరి వచ్చితి ననియుఁ బద్మినీదేవి రూపప్రతిబింబము నొకయద్దము

లోఁ దనకుఁజూపిన తాను రాజపుత్రుల బాధింపక సంతసించి పోవుదు ననియు భీమసింగునకు వర్తమాన మంపెను. తనవగతుఁడు తనవలె మాటదప్పని మనుష్యుఁ డనుకొని భీమసింగు వానికోరికఁ దీర్పుట కియ్యకొనెను. అలాయుద్దీను పరమానంద భరితుఁడై స్వల్పపరివార ముతోఁ జిత్తూరుకోటకుం జని రాచనగరుఁ బ్రవేశించి యచ్చట నొక నిలువుటద్దములోఁ బద్మినీరూప ప్రతిబింబమును జూచి కృతార్థుడై భీమసింగున కెన్నియో సలాములు చేసి కోట విడిచిపోయెను. అం తటి చక్రవర్తి తనయింటికి వచ్చినప్పుడు కొంతదూరము వానిని సాగనంపకపోవుట సదాచారము కాదని యెంచి రాజపుత్రశూరుఁడు కోట విడిచి కొండ దిగి చక్రవర్తివెంట శిబిరమునకుఁ బోయెను. పద్మినీదేవి సొగసులుగులుకు తమ్మికొలను కెలఁకున నొక మేడలో నుండి ప్రాణేశ్వరునిరాక కెదురుచూచుచు నెంతసేపటికి నతఁడు రామి కలవలపడఁ జొచ్చెను. మానధనుఁ డగు భీమసింగు తన్ను సాగనం పుటకుఁ దప్పక వచ్చునని యెఱింగి కఱకుతురక తనశిబిరముచెంత నొక గుట్టచాటున నాయుధహస్తు లగుభటులను దాఁచినందున రాజ పుత్రుఁడు చక్రవర్తివద్ద సెలవుం గైకొని కోటకుం బోవ మఱలిన తోడనే తురకజోదులు వానిపైఁ బడి పట్టుకొని శిబిరమునకుం గొని పోయి యజమానుని యానతిం జెరఁబెట్టిరి. చక్రవర్తియుఁ దనకా వించిన గొప్పపనికి సంతసించుచుఁ 'బద్మినీదేవిని నాకుం గానుకగా సమర్పింపకపోయినపక్షమున భీమసింగు నింక విడుచువాఁడఁ గా' నని ప్రతినఁ జేసెను.

ఇంతలో సేవకులు పరుగుపరుగున వచ్చి యాయశుభవార్త దెలిపి దేవిని రాజబంధువులను దుఃఖమగ్నులం జేసిరి. తత్క్షణమ రాజపుత్రనాయకు లందఱును గర్తవ్యమును నిర్ణయించుటకుం గొలువుఁ దీర్చి భీమసింగువంటి శూరశిఖామణిని గోల్పోయి చిత్తూరు రాజ్యలక్ష్మిని దిక్కుమాలిన దానిగాఁ జేసి రాజకుమారు ననహాయు

జేయుటకంటెఁ బద్మినీదేవి నా దురాత్మునికడకుఁ బనుచుటయె కాలోచిత మని సిద్ధాంతీకరించిరి. పద్మిని, ప్రాణరక్షణమునకన్న మానరక్షణమే యధికముగా నెంచుకొను రాజపుత్రస్త్రీ యయ్యు రాజబంధువులు చేసినతీర్పు నీచ మని నిరాకరింపక యాపత్సమయమున మానభంగము రాకుండఁ గాపాడు నాయుధమును వెంటనుంచుకొని పోవుటకు సిద్ధ మయ్యెను. అంతటఁ జిత్తూరుకోటలోనుండి యేడువందల పల్లకులు స్కంధావారమునకు బయలుదేరెను. పల్లకి కాఱుగురు బోయలు చొప్పున రమారమి నాలుగువేలమంది బోయ లోంకార ధ్వనులచే దిక్కులు పిక్కటిలునట్లు వానిని మోసికొనిపోయి చక్రవర్తిశిబిరమున దింపిరి. పద్మిని మేనమామయగు గోరాసింగును వానియన్నకొడుకు పండ్రెండేండ్ల ప్రాయమువాఁడు బాదూలుసింగును పల్లకులవెంట వచ్చిరి. పద్మినివెంటఁ బల్లకులలోఁ గూర్చుండి వచ్చిన తక్కినవా రెవరిని చక్రవర్తి యెదుటఁ బద్మినీదేవిని సాగనంపుటకై చెలికత్తెలు, చుట్టములు పరిచారికలు లోనగువాండ్రు ప్రేమాతిశయమున వచ్చి రని గోరాసిం గుత్తరముఁ జెప్పెను. రాజపుత్రస్త్రీల ఘోషా చెడకుండఁ జక్రవర్తి గుడారములు వేయించి జాగ్రత్త పెట్టించుటచే బోయలు పల్లకుల నచ్చట దింపిరి. గోరాసింగు చక్రవర్తియొద్దకుఁ బోయి తన మేనకోడలు కడసారి భర్తతో మాటలాడఁ గోరుచున్నది. కావున నట్లుచేయుట కనుమతింప మని ప్రార్థింప నల్లాయుద్దీను సంతోషపరవశుఁడై యందుకు సమ్మతించెను. భీమసింగు గుడారములోపలి కరిగి లోనివారితో నించుక మాటలాడి పద్మిని యెక్కివచ్చిన దన్నపల్లకి నెక్కి మెల్ల మెల్లఁగ నావలికిం దాఁటెను. కుటిలుఁ డగుచక్రవర్తి పద్మినిని స్వీకరించియు భీమసింగును విడువ నిచ్ఛగింపక భీమసింగు తప్పించుకొనిపోవుట గ్రహించి వానిం బట్టుకొ మ్మని విచ్చుకత్తుల జోదులఁ బంపెను. ఆసమయమున మహామ్మదీయుల కద్భుతముగ సింహళరాజకన్య యగు పద్మినీదేవియు

నామెపరిచారికలు వచ్చుటకుమారుగ నేడువందలపల్లకులనుండి యేడు వందలమంది మహావీరు లగురాజపుత్రులు వెలువడి యాయుధ పాణులై నిలిచిరి. పల్లకులుమోసినబోయ లందఱు సైనికులై కత్తులు దూసి యుద్ధసన్నద్ధులైరి. చక్రవర్తిసేన యింతపాటు వచ్చునని యెఱుంగక నిర్లక్ష్యముగ నుండుటంజేసి రాజపుత్రసైనికులు కఱకు తురకలపైఁ బడి సంహరించి సైన్యంబును బరాపంచలు చేసి తురకలు తమరాజునకుఁ గావించినద్రోహమునకుఁ బరాభవమునకుం దగి నట్లు కసిఁ దీర్చుకొనిరి. రాజపుత్రు లసహాయశూరులై పగతురం బొడిచి నురుమాడిరిగాని చక్రవర్తియొద్దకుఁ బోయి వానిం గడతేర్ప నేరక నలుదెసలం గ్రమ్మినమ్లేచ్ఛసైన్యంబుచేఁ గ్రమక్రమంబునం గూల నారంభించిరి. భీమసింగును పట్టుకొనుటకు వెంటనంటి చన్న తురకబంటుల కతఁడు దొరకక పల్లకి దిగి వేగవంత మగునొకగుఱ్ఱము నెక్కి ప్రాణము దక్కించుకొని మీవారురాజ్యమును సంరక్షించుటకు బ్రతికి కోటలోఁ బడెను.

అల్లాయుద్దీను నీవిధముగ వంచించి భీమసింగుప్రాణముఁ బద్మిని మానముఁ గాపాడిన గోరాసింగును దక్కినరాజపుత్రశూరులును స్వదే శమునకయి ప్రాణముల విడిచి యుద్ధభూమిని బడియుండిరి. రణనిహతు లగుశూరులపత్నులు చిచ్చురుకుటకు సిద్ధముగ నుండ నంతలో యుద్ధ మునుండి తప్పించుకొని బాలుం డగుబాదూలుసింగ చ్చటికి వచ్చెను. గోరాసింగుభార్య వానిం జూచి 'నాయనా! కయ్యమున నాప్రాణేశ్వ రుం డెట్లు వర్తించెనో వినఁగోరుచుంటిగాన నేనాయనను గలసికొను టకుఁ బోవకమునుపే నా కెఱిఁగింపు' మని యడిగెను ఆపలుకులు విని బాదూలుసింగు "తల్లీ! అతఁ డెట్లు వర్తించినాఁ డని నేను వర్ణింపఁ గలనా? నీహృదయేశ్వరుండు స్వదేశసంరక్షణమునకై శౌర్యము మెఱయఁ బోరాడి తనక్రొన్నెత్తుటిచే భూదేవి నలంకరించి ప్రాణ ములఁ బరిత్యజించి వీరస్వర్గముఁ జూఱఁగొని యున్నవాఁడు. పగతుర

కి ళేబరంబుల మెత్తనిపాన్పుగఁ గావించుకొని యొక కఱకుతురక మేను తలగడ నమర్చుకొని వీరశయనమునుండి చచ్చియుఁ బగతురకు వెఱపుఁ గొలుపుచున్న వాఁడు సుమీ'' యని విన్నవించెను. ఆమాటలు విని యావీరపత్ని నేనింకఁ దడయరాదు. ఆలస్యమైన నాజీవితేశ్వరుఁ డాగ్రహింపఁ గలఁ డని నిర్భయముగ నిర్విచారముగ నిశ్శంకముగఁ జిచ్చురికి మృతి నొందెను. అప్పుడు మీవారురాజ్యమంతయు దుఃఖ సముద్రనిమగ్న మయ్యెను. రాజపుత్రవీరులలో ననేకులు మృతి నొందినను జక్రవర్తి చిత్తూరుకోటం బట్టుకొనువిషయమున నాస వదలుకొని చిన్నబుచ్చుకొని ఢిల్లీనగరమునకుం బయనమై పోయెను.

చక్రవర్తి కంతటితో బుద్ధి వచ్చియుండునని రాజపుత్రులు తలంచిరిగాని యాపంతగొండి చిత్తూరునందు జరిగినపరాభవము నిప్పువలె వానిహృదయమును దహించుటంజేసి పగ దీర్చుకొనుటకుఁ దగిన సమయమును నిరీక్షించు చుండెను. వెనుకటికయ్యమునాటికి బాలుఁడైనలక్ష్మణసింగు యుక్తవయస్కుఁడై రాజ్యభారము బూని క్రమక్రమంబునఁ బండ్రెండుగురుకొడుకుల తండ్రి యయ్యెను. భీమసింగు పద్మినీదేవినిం గూడి యెప్పటికిని రాజగౌరవము నందుచు దేహదార్ఢ్యము గలిగి తమ్మికొలని చెంత మేడలో సుఖించు చుండెను. అలాయుద్దీను చక్రవర్తియు నేపని చేయుచున్న నేవిషయమై యాలోచించుచున్న నెవరితో మాటలాడుచున్న పద్మినీముఖపద్మమును మఱువక యుత్కంఠముతో నుండెను.

ఇట్లుండి యుండి ప్రజలకు దుర్భరముగఁ బన్నులు గట్టి ధనము చేర్చి మహాసైన్యమును గూర్చుకొని మీవారుపై దండెత్తి చిత్తూరుకోటను మరల ముట్టడింపసాగెను. చక్రవర్తిసాహసమును జూచి రాజపుత్రులు తొలుదొల్త నెగతాళి చేసిరి. రాతిగద్దియపైఁ గూరుచున్న యంగనలవలెఁ బురలక్ష్మి చక్రవర్తికి దుర్భేద్యమైనట్లు కనఁబడెను. కాని తూర్పుద్వారమువద్ద నేల కొంచె మెత్తుగ నుండినందునఁ జక్ర

వర్తి యది కనిపెట్టి యాచో టెత్తు చేయింపఁ దలంచి తట్ట కొకడబ్బు చొప్పున నిచ్చెద నని చెప్పి సైనికులచేత మట్టి మోయించి కోట యెత్తున నొకదిబ్బ గావించి దానిమీఁద గోడలను బగులగొట్టుటకు, కోట సంరక్షించువారిఁ జంపుటకు లోపలివారిఁ గడతేర్చుటకుఁ దగిన యుద్ధసాధనములును యంత్రసాధనములును బెట్టించి పని జేయించెను. కోటలోపల నున్న రాజపుత్రులకు లోకసామాన్య మగుప్రతాపపౌరుషములు కలవుగాని మహమ్మదీయులవద్ద నుండుయంత్రసాధనాదులు లేకపోవుటచేఁ గోట నిలుచుటయుఁ దమప్రాణములు దక్కుటయు నసాధ్యమని తలంచిరి. అంతలో వర్షకాలము ప్రారంభమై రాజపుత్రులబాధలనధికము చేసెను. రాణా యగులక్ష్మణసిం గొకనాఁడు రాత్రి మేల్కని యొకచోట నొక్కఁడు గూర్చుండి మీవారురాజ్యమునకు రాఁదలంచిన మహోపద్రవమునుగూర్చి యోచించుచుండఁగ నొకమూలనుండి „నా కాఁకలి యగుచున్నది నా కాఁకలి యగుచున్న" దని యొకధ్వని వినఁబడెను. ఆశబ్దము విని యతఁడు దదరిపడి దిగ్గున లేచి నలుకెలంకులఁ జూచునప్పటికి వానియెదుట దీపమువెలుఁగున భయంకరాకారము కల యొక పెనుభూతము గనఁబడెను. లక్ష్మణసింగు దానిం గని యామె చిత్తూరునగరమును గాపాడు పురదేవత యని నిశ్చయించి దానితో „రాజపుత్రుల నెత్తురు కావలసినంత త్రావితివి గదా నీకింకేమి కావలయు" నని భయభక్తులతో నడిగెను. అప్పు డాపాడుదయ్యము వానితో „నాకు రాజుల నెత్తురు త్రాపినంగాని తనివి సనదు. ఈనగరమునకు నాసహాయము గావలయునేని మూర్ధాభిషిక్తులగు రాజులు పండ్రెండుగురు నాకు బలి కావలయు" నని యుత్తర మిచ్చి యంతర్ధాన మయ్యెను. రాణాయు మిగిలినరాత్రి యంతయు నిశ్శబ్దముగాఁ గడపి ప్రాతఃకాలమున సేనాధిపతులను బంధువులను రావించి కొలువుదీర్చి రేయి జరిగినచిత్రకథ వారి కెఱింగించెను. కాని వారెవ్వ రాకథ నమ్మరైరి. „నామాటలు నమ్మరేని మీరీ

రాత్రి నామందిరమునకు వచ్చి యేమిజరుగునో చూడుఁడు. ఆదేవత మరల రావచ్చునని నేఁ దలంచెద.' నని రాణా పలుకుటయు రాజబంధువు లారాత్రి వానిమందిరమున కరిగి కనుమూయక చూచుచుండ నడిరేయి వెనుకటియట్లు భూతము కనఁబడ లేదుగాని వినువారి గుండెలు జల్లుమనునట్లు ఈక్రిందిపలుకులు వినఁబడెను ,,నా కాఁకలి యగుచున్నది. నా కాఁకలి యగుచున్నది. దురాత్ములగు మ్లేచ్ఛుల నెత్తు రెంత త్రావినను నాకుఁ దృప్తి లేదు. నాకు రాజులరక్తము గుటగుట ద్రాగవలెనని యున్నది. రాణాకుటుంబమునుండి పండ్రెండుగురు రాజకుమారులు నేఁటి యందొక్కొక్కనికిఁ బట్టాభిషేకముఁ జేసి ఛత్రచామరాది రాజచిహ్నములిచ్చి మూఁడుదినములు మీవారు రాజ్యము వానిచేత నేలించి నాలుగవదినమున మ్లేచ్ఛులమీఁదికి యుద్ధమునకుఁ బంపుఁడు. ఒకనితరువాత నొకని నీవిధముగ బలి యిచ్చిన నేను చిత్తూరునగరమునుండి దేశమున కొకభంగము రాకుండఁ గాపాడెదను.,,

పురదేవత పలికిన యీదారుణవచనములకు నాఁడచ్చటఁ జేరిన రాజపుత్రులలో శంకించినవాఁడు వెఱచినవాఁ డొకఁడయినను లేఁ డయ్యె. రాణాకొడుకులు పండ్రెండుగురు దేశక్షేమకర మగునీపనికిం దమప్రాణముల నిచ్చెద మని నిర్భయముగఁ జెప్పి నేను ముందు బోవుదు నేను ముందు బోవుదు నని తమలోఁదాము వంతులు వేయఁ జొచ్చిరి. తుట్టతుదకు జ్యేష్ఠకుమారుఁడు తండ్రికడుపునఁ దాను దొలుదొల్త నుదయించుటచే ముందుగఁ బోవుటకుఁ దనకు స్వాతంత్ర్యము గలదని వాదింప వానియనుజు లందఱు నందుకు సమ్మతించిరి. గ్రామదేవత చెప్పినట్లతఁ డభిషిక్తుఁడయి మూఁడుప్రొద్దులు రాజ్య మేలి నాలవనాఁడు పగతురఁ దాఁకి వీరస్వర్గము నొందెను. అనంతరము రెండవకుమారుఁ డగు నజేయసింగునకు వంతు వచ్చె. ఇతఁడు తండ్రికిఁ దక్కినకొడుకులకన్న నధికప్రియుఁ డగుటచే దండ్రి ,నాయనా

అందఱు నన్ను బాసి పోవఁ దలఁచుకొన్నను నీవైన నాకడఁ గొంత తడ వుండి నాకూరట గలుగఁజేయు మని దీనముగ వేఁడుకొనఁ గుమారుఁ డట్లు చేయుట కిష్టము లేకయుఁ దండ్రిమాటఁ దీసివేయలేక, క్రమక్రమంబునఁ దక్కినసోదరు లందఱు రణమునఁ దెగువఱకు జనకుని సమీపమున నుండెను. రణమునకుఁ బోవ్రుటకుఁ గుమారునివంతు వచ్చినదని తెలిసికొని రాణా మంత్రుల సామంతుల సేనాధిపతుల రాజబంధువులఁ బిలిపించి కొలువుఁ దీర్చి "శూరులార! హతశేషుఁడై ననాప్రియనందనుఁ డజేయసింగు పోవలసినకాలము వచ్చినది. ఈ నగరరక్షణమునకయి యీబాలునిబదులు పెద్దవాఁడను నేనేప్రాణము లర్పించెదను. దైవాను గ్రహ మున్న యెడలమనమిప్పుడు చేయఁజాలని యీవీరకర్మ మీబాలుఁడు చేయఁగూడదా", అని సభ్యులమనస్సులు నీ రగునట్లు జాలిగదురఁ బలికెను. ఆపలుకులు విని సభాసదు లందఱు నైకకంఠ్యముగ "వలదువలదు మీ రొక్కరు పోవలదు మనమందఱముఁ గలిసియే పోవుదము. ఇప్పుడే యుద్ధసన్నద్ధులమై వీరకంకణములఁ గట్టికొని పసపుబట్టలు ధరించి ఖడ్గపాణులమై మీవెంటవచ్చి చిత్తూరుపురరక్షణమునకు మాయసువుల విడిచెద", మని శౌర్య ముట్టిపడ నుత్సాహవచనములఁ బలికిరి.

అంతట రాణా వారితో నిట్లనియె. సరే! మీ రట్లే చేయవచ్చునుగాని మనయంతఃపురస్త్రీలు పాపమునకు వెనుదీయని పచ్చితురకలపాలుగాకుండునట్టి యే ర్పాటులుమనముసేయవలయును. పిమ్మట మనము నిశ్చలమనస్కులమై పగతురఁ దాఁకవచ్చును., అనుటయు నందఱు నది యవశ్యకర్తవ్యమని తత్ప్రయత్నములఁ జేయఁదొడఁగిరి. ఆకోటలో నాపత్కాలమున దాఁగొనుటకు నిడివియు సన్నదనమును గలనేలగదులు సొరంగములు గుహలు గొన్ని కలవు. సేవకు లాస్థలములలో కట్టెలతో చితులం బేర్చి చమురుబిందెల నచట సిద్ధపఱిచిరి. అంతయు నాయత్త మగుటయు నంతఃపురకాంతాజనంబులు రాణి

మొదలు దాసివఱ కందఱుఁ బసపుబట్టలు గట్టి సమస్తభూషణములు ధరించి పెండ్లికిఁ బోవుతెఱంగున సంతోషముతో నొకయుత్సవము జరిగినట్లు గుహలలోనికిం బోయి మల్లెపూవాన్పుల నెక్కినట్లు చితుల పై దుమికి శరీరము లగ్నిహోత్రున కాహుతులు చేసిరి. తనకారణమున మీవారురాజ్యమున కంత దురవస్థ సంభవించెనుగదా యనిచింతిలుచుఁ బద్మినీదేవియుఁ దక్కినకాంతలతోడ నిప్పులగుండమువద్దకుఁ బోయి సాటిలేని తనచక్కనిమే నగ్నిహోత్రున కాహుతిఁ జేసెను. పిమ్మట మగవాండ్ర వంతు వచ్చినందున వారందఱు పసపుబట్టలను గట్టుకొని మృత్యుకన్యను వరించు పెండ్లికుమారులవలె సమరరంగమునకుఁ బయన మైరి. ఆజోదులను మొనగాఁడై నడపింప నజేయసింగు సిద్ధమయ్యె. కాని రాణా వాని నట్టిప్రయత్నమునుండి మరల్చి "నాతండ్రీ! నాకంఠమునఁ బ్రాణము లుండ నావంశ మంతమయ్యె ననుమాట నాచెవిని బడనీయక నీ వెందైనం జని నీప్రాణములం దక్కించుకొ' మ్మని శూరులగు రాజపుత్రులఁ గొందఱ సాయ మిచ్చి కొడుకు నావలకుం బంపెను. అజేయసింగు జనకుని యదృష్టవశముననో రాజకుమారుల నందఱఁ దనపొట్టం బెట్టుకొన్నపురదేవతాప్రసాదంబుననో శత్రువులకంటఁ బడకుండ నవ్వలకుం బోయి సురక్షితమగుప్రదేశమును జేరెను. కొందఱు నిరపాయముగ దాఁటె ననుమాట వినినతోడనే రాణా కోటతలుపులం దీయించి సైన్యంబును బగతురపైఁ బురికొల్పుటయు నాసేన దిగబారు సెలయేటిచందంబున వడివడి వచ్చి మ్లేచ్ఛసైన్యంబు దాఁకె. రాజపుత్రయోధులు నెత్తురులు ద్రావ వచ్చుబెబ్బులట్లు కదనరంగముఁ బ్రవేశించి వీరావేశముచే నొడలెఱుంగక నడచినచోటెల్ల పీనుఁగపెంటలు గావించుచు వేటాడుతునియలుగఁ దురకల నఱకుచు వీరవిహారంబు సల్పిరి. రాజపుత్రులకు శౌర్య మెంత యున్నను వారిసంఖ్య యనధిక మగుటచేతను శౌర్యహీనులగుతురకలసంఖ్య మితిమీరి యుండుటచేతను

గొట్టకొనకు విజయము మ్లేచ్ఛులకే లభించెను. రాజపుత్రసేనలు పేరైన లేకుండ నశించినపిదపఁ జక్రవర్తి జయజయధ్వానములతోఁ గోటఁ బ్రవేశించెను.

అతఁడు ప్రవేశించి చూచునప్పటికి మహాలక్ష్మి విహరించు మందిరంబులు నిర్మానుష్యములై మృత్యుదేవత కొలువుఁజేయు హజారములై యుండెను. పరిజనంబుల కోలాహలంబులఁ బ్రతిధ్వను లిచ్చు చదుకములు నిశ్శబ్దములై భయంకరములై యుండెను. వీధులు విపణితలంబులు గుళ్ళుగోపురములు మఠములు మందిరములు వెలవెలబారుచుఁ గఠినచిత్తులైనతురకలకుసైతము వెఱపు గొలుపఁ జొచ్చెను. చక్రవర్తి యిట్లు పాడువడియున్న తావులు జూచుచు నంతఃపురమునకుఁ బోయి హృదయేశ్వరియైనపద్మినికొఱకు వెదకు లాడి యామె యెందుం గానక తనలో 'పురుషులందఱు యుద్ధమునం జచ్చిరి సరే. ఇది యేమిచిత్రము మాడుది యొక్కతెయైనం గానఁబడదు. ఆడువాండ్రందఱు నేమైరి చెపుమా?' యని విచారించుకొనుచు నలు దెసలు పరికించి చూడ నొకవైపుననుండి కమరుకంపుతోఁగూడిన నల్లనిపొగ బయలుదేఱి వచ్చుచుండెను. దానింబట్టి శుద్ధాంతకాంతా జనంబులు చిచ్చురికి వచ్చి యుందురనియు వారితోఁ బద్మినియు నశించి యుండుననియు నిశ్చయించుకొని యంతటిప్రాణములఁ దీసి నను తనమనోరథసిద్ధి గాకపోయెగదాయని బిట్టువగచి నిప్పులగుండము లున్నయానేలగదులం జూడఁగోరెను. అల్లాయుద్దీనుసేవకులలుండెలు తీసినబంటులేయైనను వారిలో నతిధైర్యవంతులుసైత నానేలగదుల తలుపులం దెఱవ సాహసింపరైరి.

నాఁటికి నేఁటికి నాస్థలంబుల కెవ్వరుఁ బోవఁజాలరు. ఒకమా రొకమనుష్యుఁడుమాత్ర మాచీఁకటిసొరంగముల ద్వారముల దాఁటి యావలకుం జని మరల నేదో భగవత్కటాక్షమునఁ బ్రాణములతో బయటికి రాఁగలిగెనని చెప్పుదురు. అచ్చటియగ్నిహోత్రము లార

నిపై యెడతెగక మండుచుండు ననియు నాద్వారముముందర నొక పెనుతాచుం బాము చుట్టలు చుట్టుకొని పండుకొని యెవరయిన నచ్చటికి వచ్చినప్పుడు నిప్పులు విసముం గ్రక్కుచు వచ్చెననియు జనులు కొంతకాలము చెప్పుకొనిరి.

రాజపుత్రు లది మొదలు రణరంగమున నెంతెంత శూరులైన శత్రులనైన నెదుర్కొన సాహసించిరిగాని యానేలగదులం జూచుటకు జనవొల్లరైరి. మీవారు దేశస్థు లగురాజపుత్రు లీనాఁడును గొప్ప యొట్టు పెట్టుకొనవలసినప్పుడు 'చిత్తూరు నాశనము చేసినట్టే' యను చుందురు. ఆనగరము మునుమ్మారు మహమ్మదీయులచేత ధ్వంసము చేయఁబడి యిష్ట దేవతలవల్లఁ బరిత్యజింపఁబడిమీవారురాజకుటుంబము చేత విడువఁబడి యున్నందున నిప్పుడు పూర్వవైభము దొలంగి నామావశేషమై కథావశేషమై చూచువారలకు వినువారలకు దాని చరితము దుఃఖకారణ మగును.

రాణా హమీరు.

:(o):

అల్లాయుద్దీను చిత్తూరుపై దాడి త్తెరమునుపు రాణా లక్ష్మణ సింగుయొక్క పెద్దకుమారుఁడు హరిసిం గొకనాఁ డండ్వాయడవికి సపరి వారముగా వేఁటకుఁ జని గుహలో నున్న యొక యడవిపందిని లేపి తఱుముగా నది దొరకక పఱచిపఱచి చివరకొకజొన్నచేనిలోఁ దూరి దాఁగెను. రాజకుమారుఁడును వానిబంట్లును చేనిచుట్టు కాచుకొని యుండి పంది నెవరయిన చేనిలోనుండి బయటకుఁ దఱిమిన బాగుం డునని తలంచిరి. ఆచేనిలోఁ బిట్టలఁదోలుటకై కట్టఁబడిన మంచెపై నూసిన గుడ్డలు కట్టుకొని దృఢశరీరముతో నున్నయొక పడుచుకన్య తప్ప చూపుమేరదూరములో వారి కెవ్వరుఁ గనఁబడరైరి. వేట కాండ్రప్రయత్నముం జూచి యాబాలిక యామృగమును మీవయి

పునకుఁ దఱునుగునా యని రాజకుమారు నడిగెను. ఆమె యేమిచే యునో యాచమత్కారమును జూడవలె నని యతఁడు సరే యట్లు చేయుమనెను. వెంటనే యాయువిద జొన్నకఱ్ఱ నొకదానిని బెరికి చివర పదునుగాఁ జెక్కి మంచెపైపునకుఁ బోయి యొక్కనిమిస ములో నాపందిని బొడిచి చంపి రాజకుమారుఁడుఁ బరివారము నద్భుతపడునట్లు దాని కళేబరమును బరబర యీడ్చి తెచ్చి వారి ముందుఁ బడవైచెను. రాజకుమారుఁడు వేఁటాడఁదలఁచిన జంతువును మఱియొకరు చంపినచో వారిప్రాణములు నిలుచుట యరిది. అయి నను హరసింగు మాత్ర మా పడుచుపై కోపపడక సాహసమునకు మెచ్చుకొనెను. ఆబాలిక మరలఁ బొలమునకుఁ బోగా వేఁటకాండ్రు దాఁపుననున్న చిన్నయేటియొడ్డునకుఁ బోయి యన్నముఁ దిని సల్లాప ములాడుచుఁ గూర్చుండిరి. అంతలో నొక మట్టియుండ విసవిసవచ్చి రాజపుత్రునిగుఱ్ఱపుకాలికిఁ దగిలెను. గుఱ్ఱముకాలు కుంటుబడెను. అందఱును కోపవిస్మయములతో నలుదెసలఁ జూడ వెనుకటి బాలిక మంచెపై నిలుచుండి వడిసెలతో రివ్వన రాళ్ళు రువ్వుచు చేనిపై వ్రాలు పిట్టలం దోలుచు వారికన్నుల కగపడెను. ఆమె తన కావిం చిన తప్పెఱింగి వడివడి రాజనందనుని యొద్దకుఁ బఱతెంచి తన్ను క్షమింపు మని ప్రార్థించెను. అతఁడును బాలికపైఁ గోపింపక మంచి మాటలం బలికి యామెం బనిచెను.

ఆదినమున వేఁట ముగించి రాజపుత్రుఁడు పరివారసమే తుఁడై మంచెరమున కరుగుచుండ నాబాలిక నెత్తిమీఁద పాలకుండ తోను నిరుప్రక్కల మెడకు త్రాడుగట్టిన యొక్కొక మేకపిల్లతోను నడచుచు వారివైపునకు వచ్చుచుండెను. ఆమెను జూచిన తోడనే యాపరివారములో నొకఁడు కొంటెతనమునకు నామెపాలకుండను జారవిడుచునో మేకపిల్లను వదలునో చూడ నభిలషించి యామెను బెదరగొట్టుటకై తనగుఱ్ఱమును యామెవైపునకు దుమికించెను.

ఆబాలిక వాని టక్కరితనమును ముందే గ్రహించి జాగ్రత
పడి యించుకయు జడియక చల్లగ నొక మేకపిల్లను గుఱ్ఱపుకాళ్ళ
కడ్డముగ వదలెను. గుఱ్ఱము బెదరి తత్తరపడి యాశూరశిఖామణిని
నేలఁ బడవైచెను. ఆవఱుచు చెక్కుచెదరక పాలొకచుక్క యైనఁ
దొనగకుండ చేతిలోనితొట్లు వదలకుండ నేమియు నెఱుఁగనట్లు తన
దారిం బోయెను. రాజకుమారుఁ డీవినోదమును గనిపెట్టి చూచి
బాలికను బిలిచి నీ వెవ్వరిదాన వని యడిగెను. "నేను చందన
వంశజుఁ డగు నొకరాజపుత్రుని కుమార్తెను. మాయిల్లిక్కడకు
సమీపమే" యని బదులుచెప్ప 'రేపు మీతండ్రిని నాయొద్ద కొక
సారి రమ్మని చెప్పు' మని పలికి యతఁడు త్వరితముగా నింటికిఁ
బోయెను.

మఱునాఁ డుదయమున నాబాలికతండ్రి రాజపుత్రునియొద్దకు
వచ్చి తాను నిరుపేద యయ్యు నందఱు నాశ్చర్యపడునట్లు వానితో
సమానముగఁ గూర్చుండి సమానునితో మాటలాడునట్లు సంభాషిం
చెను. అప్పుడు హరసింగు నీకూఁతును నాకిచ్చి పెండ్లి చేయు మని
యడుగ నావృద్ధుఁడు తనకూఁతుని రాజులకిచ్చు యుద్దేశము లేదని
ఖండితముగఁ జెప్పెను. హరసింగు సజ్జనుఁ డగుటచే వానిఁ జెరబె
ట్టించి యామెను బలవంతముగా గ్రహించుటకుఁ జెల్లుబడి యుండియు
నట్టిపని చేయుట కిష్టపడఁ డయ్యె. కాని యాముసలివాఁడు గృహంబు
నకుఁ బోయి తన్నామె మెచ్చుకొనునని తలఁచి జరిగినవృత్తాంత
మంతయు భార్యకుఁ దెలుప నామె కోపించి యెంత తెలివిమాలిన
పనిఁ జేసితిరి? సిరి రా మోకాలొడ్డుదురా? ఇప్పుడైనను రాజపు
త్రునియొద్దకుఁ బోయి చేసిన తప్పుల క్షమింపు మని ప్రార్థించి
కూఁతును వానికాళ్ళపైఁ బడవేయు మని మందలింప మఱునాఁ
డతఁడు మరల చిత్తూరునకుఁ బోయి రాజనందనుని గాంచి తప్పు
క్షమింపు మని ప్రార్థించి కూఁతును వానికిచ్చి వివాహము జేసెను.

వారిరువురకుఁ గలిగినకొడుకే హమీరుసింగు.

చిత్తూరుపురరక్షణమునకు హరసింగు ప్రాణత్యాగము చేసిన నాటికి హమీరు మిక్కిలి బాలుఁడు. అజేయసింగును చిత్తూరుకోట నుండి దాటించి యావలకుఁ బంపునపుడు మేవాగురాజ్యమునకుఁ దన ముద్దులమనుమఁడైన హమీరును యువరాజుగఁ జేసి సింహాసన మెక్కింపుమని లక్ష్మణసింగు కడసారపు కోరికగ నజేయసింగును గోరెను. హమీరు తగి యున్నయెడల నట్లు చేయుదు నని యజే యసింగు వాగ్దానముఁ జేసెను. అల్లాయుద్దీనునకు వెరచి చిత్తూరు నందలి స్త్రీలందఱుఁ జిచ్చురికి పురుషులందఱు శౌర్యము మెరయ యుద్ధముచేసి మృతినొందిన యాదుర్దినమున హతశేషులై కొందఱు జను లజేయసింగుతోఁ గలిసి పారిపోయి కొండలలో కెయిల్వారలో దాఁగి యుండిరి. అల్లాయుద్దీను దేశము తయు దోచుకొని నాశనము చేయుచున్నను వీరుమాత్రము వానికి దొరకక సురక్షితులై యుండిరి. పద్మినీదేవి వసియించు మందిరము తప్ప చిత్తూరులో తక్కిన మేడల మిద్దెలన్నిఁటి నల్లాయుద్దీను పాడుచేసి తాను పోవునపు డానగరమునకు మాల్దేవను హిందువును పాలకుఁడుగా నేర్పఱచి మేవారుదేశమునందలి యనేకపట్టణములనుగూడ నాశనముఁ జేసి మరల ఢిల్లీకిఁ జనియెను.

కెయిల్వారాలో హమీరు తనపినతండ్రికుమారులతోఁ గలిసి విలువిద్య నేర్చుకొనుచుండెను విలువిద్య కఱచుట కట్టియడవులే కదా తగినచోటులు, ఆకుమారులు ముప్ప రచిరకాలములోనే పగతు దాఁకుటకు యెట్లో పొంచి వైరి బడగొట్టుట యెట్లో పఱచుచున్న పగవానిని సిలుగులఁ బెట్టుట యెట్లో నేర్చిరి. అల్లాయుద్దీను దేశము నందుంచి పోయిన సైనికులతోడను రాజ్యాపహీనులై యడవుల జరియించు రాణాకు లొంగుట కిష్టములేక స్వేచ్ఛగాఁ దిరుగు కొండ దొరలతోడను దోపుడుకాండ్రతోడను దుర్మార్గులతోడను పలు

మారు వారు పోరాడుచు వచ్చిరి. అట్టివారిలో బ్రధానుఁడు మూంజ జాతీయుఁ డగు నొకశూరుఁడు. ఆమూంజుఁ డొకనాఁడు కెయిల్వారా మీఁదికి దండెత్తివచ్చి రాణా నెదిరించి వానిని తలపై బల్లెముతోఁ బొడిచెను.

అజేయసింగు గాయమున కంత లక్ష్యముఁ జేయలేదుగాని తీవ్రమైన యాపరాభవ కళంకమును మూంజుని నెత్తుటితోఁ గడిగి వేయవలయునని నిశ్చయించి తనకొడుకులం బిలిచి మీరు నా కపకారము చేసిన మూంజునిపైఁ జని పగఁ దీర్చుకొనఁగలరా యని యడుగ వారు వీరపురుషోచిత మైనయుత్తర మొసంగ లేకపోయిరి. అప్పు డతఁడు హామీరునకుఁ దనకోర్కె నెఱిఁగింప బాలకుమారసింహుఁడు పినతండ్రితో “నే నిదె పోవుచున్నాను నేను పగతుని జయింతు నేని నన్ను మీరు వేగమే చూడఁగలరు. అపజయ మొందుదు నేని మీరు నన్నిఁక నెన్నఁడు జూడ” రని ప్రతిజ్ఞఁ జేసి వెడలెను.

అనంతరము కొన్నిదినములకు కెయిల్వారాజనులందఱు సంతసించునట్లు హామీరు విజయుఁడై వచ్చి పినతండ్రికి నమస్కరించి ‘దేవరవారి శత్రుశిర స్సిదిగో’ యని మూంజునితల వానిపాదముల పైఁ బడవైచెను. అజేయసింగు సంతోషమున బాలునిగాఁగిలించుకొని ‘నాయనా! నీవే మీవారుదేశమునకు రాజు వగుదువని నీనొసటను వ్రాసి యున్నది.’ అని మూంజుని నెత్తుటిలోఁ దనవ్రేలు ముంచి కుమారునిఫాలమున నెత్తుటిబొట్టు పెట్టి తత్క్షణమే వాని యువరాజుగఁ జేసెను.

అజేయుని కొడుకులవలన నించుకయు బాధ కలుగదయ్యె. ఏల యన నొకఁడు స్వల్పకాలముననే మృతినొందెను. రెండవవాఁడు రాజ్య సంపాదనమునకై దేశాంతరముల కరిగి మరల రాఁడయ్యె. కొండలు నడవులు దప్ప మీవారుదేశమున మంచిభాగము లన్నియు నప్పుడు ఢిల్లీ చక్రవర్తిస్వాధీనమున నున్నందున మీవారు రాణాగా

నెవ్వరున్న నొకటియే యని యెంచి రెండవయుతఁ డట్లుచేసె. తరువాత మూఁడువందల యేండ్లకు భాంస్లేకుటుంబమునఁ బుట్టి తురకరాజుల యేలుబడిచే సిలుగులఁ బడుచుండిన మహారాష్ట్ర దేశంబునకు స్వాతంత్ర్యము కలుగఁజేసి తురకరాజులకుఁ బక్కలో బల్లెమై ఢిల్లీ పాదుషా యగు నౌరంగజేబునకు లోఁబడక వానిని బహుబాధల బెట్టిన దేశోపకారి యగు శివాజీ యీతనివంశస్థుఁడే.

అజేయుని యనంతరమున హమీరు రాణా యను ఢిల్లీ చక్రవర్తి సైనికులతో క్రమక్రమమైన యుద్ధము చేయుటకయి పూని తన్ను రాజుగా నంగీకరించి తనరక్షణ మపేక్షించిన వారందఱు కుటుంబములతో వచ్చి కెయిల్వారాలో కాఁపుర ముండవలసినదని యానతిచ్చెను. అట్లు వారువచ్చి చేరినపిదప నారాజకుమారుఁడు వారి సాయమునఁ జక్రవర్తికిలోఁబడియున్న భూములలో దండువిడిసి దారుల నరికట్టి మ్లేచ్ఛసైనికులకు గర్భనిర్భేదకముగ విహరించెను. అప్పుడు రాణా హమీరుపేరు సింహస్వప్నమువలె నుండుటచే తురకసైనికులు వాని యెదుటఁ బడలేక కోటలలో డాఁగిరి. అతని నొకవేళ తఱుముకొని పోదలంచినను కొండదారుల నతఁ డెఱిగినట్లు శత్రువు లెఱుఁగక పోవుటచేతను చుట్టుపట్ల ప్రజలందఱు వానియం దిష్టముగ నుండుట చేతను వైరులప్రయత్నములు నిష్ఫలము లయ్యె.

ఇట్లతఁడు వీరవిహారంబు సలుపుచుండ చక్రవర్తిచేఁ జిత్తూరు పాలించుటకు నియమింపఁబడిన మాలదేవు తనకుమార్తెను హమీరున కిచ్చి వివాహము చేయుటకయి వానిని రమ్మని వర్తమానమంపెను. అతనియనుచరు లేదో ద్రోహము జరుగునని పోవలదని ప్రార్థించిరి; కాని హమీరు వారిపలుకులు విని నవ్వి 'పాపానేలక్ష్మి' యనుమాట నెఱుఁగరా? ఎట్లయినఁ జిత్తూరు మరలఁబట్టుకొనవలయు; నగర మేస్థితిలో నున్నదో తెలిసికొనుట కిదియే మంచిసమయము కాన పోవక మాననని కొందఱుమిత్రులం గలిసి యశ్వారూఢుఁడయి

యాకన్నియను జేపట్టి తనతాతతండ్రులు పాలించునగరమునకు జనియె.

మాలదేవుని మందిరమునసమీపమున కతఁడు పోయినతోడనే వాని మనస్సు శంకింప నారంభించెను. పట్టణమందుగాని రాచనగరు నందుగాని వివాహసంబంధ మయినశోభ యించుకయు గానరాదయ్యె. వేయేల? పెండ్లిప్రయత్న మున్నట్లే తోఁచదయ్యె. ఆస్థితిని జూచి వానియనుచరులు తప్పక ద్రోహము జరుగునని నిశ్చయించిరి, కాని హమీరు వారిని వారించి నిర్భయముగ నిశ్శంకముగ గుఱ్ఱము డిగి లోపలి హజారమునకుఁ జనియె. అక్కడ మాలదేవు బంధుగణ సమేతుఁడయి యెదురుగా వచ్చి పెండ్లికొడుకును గారవించెను. పెండ్లి కొడుకువా రనుకొన్నట్లు ద్రోహ మేదియుఁ గనఁబడదు, కాని యది పెండ్లివారియిల్లువలె నుండదయ్యె. అంతట మాలదేవు వధువును బిలిపించి యామె నప్పుడే యక్కడనే యొకబ్రాహ్మణునిచేత హమీరు నకు వివాహముఁ జేయించెను. పెండ్లికుమార్తె మేలిముసుంగుకొంగు నకు పెండ్లికుమారునిశాలువ చెఱఁగు ముడివేసెడి తంత్ర మొకటి తప్ప మఱి యేతంత్రముగాని మంత్రముగాని కన్యాప్రదానముగాని ఫలప్రదానముగాని జరుగదయ్యె.

దంపతు లిరువురు రాత్రి గలిసికొన్నప్పుడు ప్రపంచమునం దే పురుషునకును భార్యగ నుండఁదగని యేవికృతవిగ్రహముగల కురూ పినో తనకుం గట్టిపెట్టి యుండరుగదా యని యనుమానించి హమీరు మునుముందు దామె మేలిముసుఁగెత్తి మొగముం జూచెను. ఆముసుంగు మఱుంగున హమీరు నిరుపమానలావణ్యముఁ గలిగి శాంతరస మొలుకు వదనారవిందమును గనుంగొనెను కాని యామె యతిదుఃఖ తయై చిన్నఁబోయి మగని మొగముఁ జూచుటకే సిగ్గుపడుచున్నదాని వలె కనంబడియె. ఆతెఱఁగున నున్నభార్యను జూచి హమీరు 'యే మిది మన కీవిధముగ నిర్మంత్రవిధిగా నిరుల్లాసముగా వివాహము జరుగఁ గారణ మేమి? నీవిట్లు బిట్టువగవనేల?' యని యడిగెను. అన

వుడు నాపడంతి మెల్లగ నాతని కిట్లనియె. ‘‘స్వామీ! దీనికారణ మిది మిమ్ము మావాండ్రు నిష్కారణముగా వంచించినారు. మీచెట్టబట్టిన యీసేవకురాలు వితంతువుగాని కన్యగాదు. నేను పసిపాపనై యున్న నాఁడు మాతండ్రి నాకు వివాహము చేసె. పిదప కొన్నిదినములకే నాభర్తః యుద్ధమున మృతుఁ డయ్యె. ఆయన మొగమైన నాకుజ్ఞాపకము లేదు.’’ ఆపలుకులు విని హమీరు తాను నిశ్చయముగ వంచింపఁ బడితినని యెఱింగి గాఢవిచార సంతప్తుఁ డయ్యె. హిందూదేశమున వితంతువును వివాహ మాడునతఁడు మిక్కిలి నీచుడుగ నెంచబడుటచే నతఁడు శోకాకులచిత్తు డయ్యె. శుభకార్యములు జరుగునప్పు డెదుట నైనఁ బడఁగూడని వితంతువును పరువుగల సుక్షత్రియుఁడు పెండ్లి యాడుటకన్న హైన్యమింక లోకంబున లేదని తలఁచి యతఁడు నాటితో తనయభిమానము కులగౌరవము పెంపు నశించెనని బెంగపెట్టుకొని యేదియుఁ దోఁచక పాన్పుపైఁ బవ్వళించి విచారింపఁజొచ్చె. ఆసమయమున నశఁడా బాలికను కోపావేశమున వధించిన నామె నోరెత్తక యుండియుండును. ఏలయన దుర్భరపరాభవముఁ దెచ్చు నావివాహమును వరుఁడెంత సిగ్గుపడుచుండునో వధువు నంతియు సిగ్గుపడుచుండును. తనజోలికి రాక తన నేమియు నిందింపక తనలోఁ దాను దుస్సహమగు పరివేదన మందుచున్న రాజనందను జూచి యాబాలిక యిట్లనియె. ‘‘స్వామీ! సేవకురాలను క్షమింపుఁడు. ఇందు నానేర మేదియు లేదు. మీకింత యవమానము గలిగించిన మీపగతుర పగదీర్చుకొను నుపాయము నేను జెప్పెదను. మీపితృపితామహార్జితమగు చిత్తూరు నగరమును మీరు మరల స్వాధీనముఁ జేసికొనవచ్చును.’’ అప్పుడు రాణా శాంతము వహించి యామె చెప్పెడు నుపాయమేదియో వినఁ గోర నామె మరల నిట్లనియె. ‘‘మాతండ్రిని మీరు కట్నములు కానుకలు నగలు భూములు నడుగక తనమంత్రియైన జాల్యుఁడను వాని నరణముగ నిమ్మని యడుగుఁడు. అతఁడు మీకోరికఁ ద్రోసిపుచ్చఁడు.

జాలుఁడు మనకార్యము నవలీలగా సాధించును. అనవుడు హామీరు రామెయుపాయమునకు సంతసించి విచారమును విడిచి వితంతువైనను దనభార్య జ్ఞానతనమును శౌర్యమును గలిగి రాణిగా నుండఁదగిన దని నిశ్చయించి మరునాఁ డుదయమున మామయగు మాలదేవునొద్దకుఁ బోయి కోపమును విషాదమును లేకయే మంత్రియగు జాలుని దమకు సరణముగ నిమ్మని యడిగి శలవు పుచ్చుకొని భార్యతోడను క్రొత్త మంత్రితోడను కైలువారాపట్టణముం జేరెను.

అనంతర మొకసంవత్సరమునకు రాణాకీభార్యవలన నొకకుమారుఁ డుదయించెను. రాణాయు రాణియు జాలుఁడును గలిసి యెవ్వియో పన్నుగడలం బన్నుచు దినములు గడపుచుండిరి. ఇట్లుండ పెండ్లియయిన రెండేండ్లతరువాత చిత్తూరున కొకయాచారి వచ్చి హామీరుసింగుభార్య తనచిన్నకుమారు నెత్తుకొని వచ్చి కులదేవతలకు మ్రొక్కించి పోవలయునని కోరుచున్న దని చెప్పెను అప్పుడు మాలదేవు యుద్ధయాత్ర వెడలి పరదేశమున నుండెను. అతని జ్యేష్ఠకుమారుఁడు తన తోఁబుట్టువు రాఁక కనుమతించి యామె వచ్చినప్పుడు సగౌరవముగా నామె నంతఃపురమునఁ బ్రవేశపెట్టెను. ఆజాణయు మెరికలవంటి సైనికులతోడను మంత్రియగు జాలునితోడను కోటలోఁ బ్రవేశించి మాయోపాయము లెన్నియో కను నేర్పున బన్ని ప్రార్థింపఁ దగినవారిఁ బ్రార్థించి, లంచములు కావలసినవారికి లంచము లిచ్చి బెదరింపఁ దగినవారిని బెదరించి, పొగడ్తలకుబ్బువారిని పొగడి తండ్రి సైనికులనెల్ల వశముచేసికొని తనభర్తను రావించి వాని ననాయాసముగ లోపలఁ బ్రవేశపెట్టించి బంగారుపు సూర్యబింబముగల రాణాహామీరుయొక్క ధ్వజము కోటబురుజుపై నెత్తించెను. పిమ్మటఁ గొన్నిదినములకు మాల్దేవు యుద్ధమునుండి రాఁగా కూఁతురు నల్లుఁడును వానిం గోటఁ జేరనియ్యక తమ పది యాక్రమించినట్లు తెలియఁ జేయుటకయి ఫిరంగిగుండ్లఁ బ్రయోగించిరి. రాణా తన రాజధానిని

మరల నాక్రమించెను మీవారు దేశమునం దంతట జనులు చెప్పు
కొనసాగిరి.

అందుచేఁ బ్రజానురాగముగల వాని సేనలోఁ వేనవేలు చేర సైన్యము ప్రబలముయ్యెను. ఆసేనం గూర్చుకొని యతఁడు శత్రుసంహారమున కయి సమకట్టనొకని వెనుక నొకరుగ రాజులెల్లరు లోఁబడిరి. మాలదేవునితనయులలో నొకఁడు హమీరాని స్వీరణమున వధియింపఁబడియె. రెండవవాఁడు వానికి లోఁబడి సేనాపతియై కొంత దేశమును జయించి యతని కొప్పగించెను. చిత్తూరునందున్న చక్రవర్తి సైనికులు రాణాయెదుట నిలువఁ జాలరైరి. స్వదేశపురాజు లదివఱకే వానికి లోఁబడి యుండిరి. చిత్తూరునగరమునకు మీవారు దేశమునకు మరల యెప్పటి మహోన్నతదశ వచ్చెను. ఈనడుమ నల్లాయుద్దీను చక్రవర్తి మృతినొందుటచే ఢిల్లీరాజ్య మనేకసంక్షోభములకు లోనయి తనయవస్థలలోఁ దా నుండుటచే స్వతంత్రించిన విదేశముల వంకఁ జూడలేకపోయెను. అందుచే మీవారురాజ్యము హమీరు పాలనముక్రింద వృద్ధిఁ జెంది కడు బలపడియెను.

హమీరు చిత్తూరుసింహాసనమున సుప్రతిష్ఠితుఁ డయిన పిదప తురకలు తొల్లి చేసిన చెరుపంతయుఁ జూచి దుఃఖించి మరల బాగుచేయఁబూనెను. అల్లాయుద్దీను తాను గొనిపోఁ గలనంత గొనిపోయి తీసికొనిపోలేని దానిని పాడుచేసి రాణాలధనాగారమునందలి ధనమంతయుఁ గొల్లఁగొనెను. హమీరు చేయిదాఁటిపోయిన యమూల్యాభరణములకు ధనమునకు నంతగా విచారింపలేదుగాని కోటలో నడుగు పెట్టినది మొదలు పూర్వార్జితమగు నొకవస్తువునకై చింతిల్లఁ జొచ్చెను. అదియేదియనఁ మున్ను జగన్మాతయగు భవాని వంశకర్తయగుబప్పరావునకుఁ బ్రసాదించినదియు విశ్వకర్మ నిర్మితమైనదియు రెండంచుల వాడిగలదియు నగు మహాఖడ్గము. అదియెచ్చటనున్నదో యెవ్వరెఱుఁగకున్నను లోకమాత యాఖడ్గము మాత్రము గోపింప

కుల పాలుసేయ దని యతఁడు నమ్మెను. అది చిత్తూరు ముట్టడిలో నెట్లో యదృశ్య మయ్యెననియుఁ బద్మినివలెనే నదియు శాశ్వతముగా నశించె ననియు జనులు చెప్పుకొనిరి. అయినను తనయం దనుగ్రహించి తనకు మరల రాజ్యమునొసంగిన దేవత లాఖడ్గము మరల నియ్యకపోరని నమ్మి సకలదేవతలను ముఖ్యముగా నగరసమీపమున వ్యాఘ్రగిరి మీఁద వెలసిన చారుణీదేవిని నతఁడు మిక్కిలి ప్రార్థించెను. అంతట చారుణీదేవి వానికిఁ బ్రత్యక్షమై యాఖడ్గ మంతఃపురమున కడుగున నున్న నేలకొట్లలో నున్నది తీసుకొమ్మని చెప్పెను.

చిత్తూరు రాజపత్నులు రాజపుత్రికలు చిచ్చురికి చచ్చిననాఁడు మొదలింతవఱకు మనుష్యమాత్రుఁ డెవ్వఁడు సాహసించి యాసొరంగములఁ బ్రవేశింపలేదు. చచ్చినవారి యాత్మ లచ్చట గ్రుమ్మరు ననియు ద్వారమున నొకమహాసర్పము బుసకొట్టుచు నిలిచి యెవ్వని దరిఁజేరనీయ దనియు బ్రజలు భయంకరములగు కథలం జెప్పుకొనుచు వచ్చిరి; కాని నూనూఁగుమీసములైన రాకుమారుఁడే హమీరు మహా సాహసములు చేసిన శూరుఁ డగుటచే నీమాటలకు వెరువక దయ్యము లుండనీ దేవతలుండనీ పాములుండనీ యేముండనీ లోపలకుఁబోయి ఖడ్గమును దెచ్చుకొనుట కతఁడు నిశ్చయించెను.

అట్లు కృతనిశ్చయుఁడై యాశూరశిఖామణి సూర్యరశ్మి యెన్నఁ డెఱుఁగని యామహాంధకార గుహాలలోఁ బ్రవేశించి మెరక పల్లము లెఱుఁగక చేతితో గోడలఁదడుముకొనుచు తనమీఁద మందలు మందలుగా వ్రాలుచున్నవి గబ్బిలములో దయ్యములో యెఱుఁగజాలక తాను త్రొక్కిపోవుచున్నవి తన తల్లియెముకలో తక్కిన రాజాంగనలయెముకలో యని తలంచుకొని జాలి నొందుచు పోయి పోయి తుదకు విశాలమగు నొక మహాభాగముఁ బ్రవేశించి యచ్చట నొక వెల్తురు జిమ్ము మంటయు పొగయు జూచి దాని సమీపించెను

సమీపించి చూచునప్పటి కామంట చుట్టు సగము సర్పదేహము సగము మనుష్యదేహము గలిగి వికృతవేషములతో నున్నకొన్ని స్త్రీ విగ్రహములఁ జూచెను. అందొకటి పండ్లికిలించుచు నీవెవ్వడవు? ఇక్కడ నీకేమిపని యున్నది. మాయుత్సవమున కేభంగము కావిం చెదవని వాని నడిగెను. అతఁడును నిప్పుపై నున్న యొక డేగిసా చుట్టు గూర్చున్న యాదయ్యముల యొద్దకుఁ బోయి ,మీపండుగ నేఁ, జెరుప రాలేదు. విశ్వకర్మనిర్మితమగు నాఖడ్గమును నాకిచ్చిన నాదారిని నేఁబోయెద! నని చెప్పెను. ఆవాగనడుమనుండి చూడ చూడ తలలు విరియఁబోసికొనియున్న యాదయ్యముల కొకిబికి మొగములు మఱింత భయంకరములై వికృతములై కానంబడియె. అప్పుడవి యతనితో మాటలాడక డేగిసామూత తీయుమని సన్నఁజేయ నతఁడు వెరువక యట్లుచేసి లోనున్నదానిం జూచెను. అతఁ డేమి చూచెనో యెవ్వ రెఱుఁగరు. అందొక చింపిరి దయ్యము వికవికనవ్వి డేగిసాలో నుడుకుచున్న పదార్థము కొంతఁదీసి యొక మూకుడులో బెట్టి తినుమని వానికిచ్చెను. అతఁడును సందేహింపక మారుమాటాడక యిచ్చిన దానిని భక్షించెను.

అప్పుడవి వానిని మెచ్చి యొకమూలనుండి రెండంచులఖడ్గమును దెచ్చి వాని కిచ్చి పంపెను. హమీరును కృతకృత్యుఁడై యెప్పటి య ట్లంధకారబంధురమగు గుహను జాగరూకతతో దాఁటి బయట బడి విశ్వకర్మనిర్మితమగు ఖడ్గమును చేత ధరించి తనవారి కన్నులకు విందుచేసి యాఖడ్గముతో శత్రువులఁ దెగటార్చి మీవారురాజ్యము చిరకాలము పాలించెను.

చందుని కథ.

—:(0):—

పదునాల్గవశతాబ్దముయొక్క యంతమునందు మీవారు దేశమునకు లఘుఁడను నతఁడు రాజయ్యెను. అతఁడు దనకుఁ బూర్వులైన హమీరు హమీరునికుమారుఁడు నడచినదారిని నడచి తొల్లి మీవారు రాజులు దుర్బలులైన కాలమున వారివద్దనుంచి ఢిల్లీచక్రివర్తియుఁ దక్కిన రాజపుత్రులు నన్యాయముగఁ దీసికొనిన దేశములను మరల గ్రహించి దిట్టరి యయ్యెను. అంతియఁగాక యతఁడు పెదనూరనుపట్టణమును గట్టించెను. పూర్వు లెఱుఁగనితగరపు గనులను వెండిగనులను గనుఁగొని త్రవ్వించెను. అతనికిద్దఱుకుమారులుండిరి.

అందు జ్యేష్ఠుఁడగు చందుఁడు శూరుఁడు, గౌరవనీయుఁడునై ప్రతిజ్ఞలు నిలుపుకొనుటలో నతినిష్ఠురుఁడై విద్యావంతుఁడై బుద్ధిశాలియై యుండెను. కనిష్ఠుఁడగు రఘుదేవుఁడు చక్కఁదనమునకు శాంతస్వభావమునకును బేరుపొంది ప్రజానురాగమును బడసి యుండెను. ఒకనాఁడు రాణాయగు లఘుమహారాజుకొలువై యుండఁగా నొకరాయబారి వచ్చి వారిపాదములపై నొక కొబ్బరికాయను బడవైచెను. రాజస్థానమునందుఁ దమకూఁతు నెవనికైన వివాహార్థము యర్పింపఁ దలఁచినవారు పెండ్లికొడుకు వారియొద్ద కొక టెంకాయనుబంపుట కాలమునం దాచారము. మార్వారు దేశపురాజగు రణమల్లు తనకూఁతురగు హంసయను నామెను చందునకు వివాహము సేయదలంచినాఁడని చెప్పవచ్చి యారాయబారి ముందుగ దేశాచారము నడపెను. కాయ తన కాళ్ళపైఁ బడవేయుటచే నారాజు తనకే కూఁతురు నీయఁ దలంచుకొన్నాఁడనుకొని యారాణా పక్కున నవ్వి మీసము వడివేయుచు రాయబారితో నిట్లనియె.

,,ఆకాయ తీసికొని నాకుమారుఁడగు చందున కిమ్మని తల

యంతయు నరసిన నేనేమి! పడుచుకన్యను వివాహమాడుట యేమి? ఎవ్వరైన నవ్వరా?"

అనంతర మారాయబారి చందున కావార్త విన్నవించి నప్పుడు తండ్రి మోటతనంబు చేసినాఁ డనుకొని కోపలజ్జాభరితుఁడై "ఏమీ తండ్రికి ధర్మపత్నిగా నుద్దేశింపఁ బడినకన్యను నేను వివాహమాడుదునా? వారు నానిమిత్తమే కన్యనుద్దేశించిరేని టెంకాయ నాకాళ్ళమీఁదనే మొదట పడవేయరా? కావునఁ దత్ప్రశంస నావద్దఁ దలపెట్టక కాయ మరల మార్వారుదేశమునకుఁ బంపఁదగు" నని స్వభావసిద్ధ మగు ధైర్యముతోఁ బలికెను. అప్పుడు రాణా కొడుకునుం బిలిపించి "నాయనా నామాట వినుము. మనము మిత్రుఁడైన మార్వారు రాజును మన మవమానింపవచ్చునా? రాజపుత్రులు పరాభవమును సహింతురా? ఈయక్కసు మనసునం బెట్టుకొని వారు మనపైఁ బగదీర్చుకొనఁ జూడరా? బాహుబల సంపన్నులగు నతని కొడుకు లూరకుందురా?" యని మందలింప చందుఁ డామాటలు విని "నా కదంతయుఁ దెలియదు. జగము తలక్రిం దయినను సరే! ఆమె నాకు తల్లిగాని వేరుగాదు. ఆమాటలు తలఁచుకొనుట మహాపాపము నన్ను కదప వ" ద్దని తండ్రికి చెప్పెను. అప్పుడు రాణా మండిపడి తనయునితో నిట్లనియెను. నీవింత మూర్ఖుఁడవేని నేనే యాకన్యను వివాహ మాడెదనులే కాని యీసంగతి జ్ఞాపకముంచుకొనుము. ఆమెవలన నాకుఁ గలిగిన కుమారుఁడే రాజ్యప్రతిష్ఠుడగును

తండ్రి కోపోద్దీపితుఁడైనను జంకక చందుఁడు "సరే! మీ యిచ్చవచ్చిన తెఱఁగున జేసికొన వచ్చును. హంసాదేవి కుదయించిన నందనులలో నెవనికి రాజ్య మిచ్చినను నాకు సమ్మతమే ఆమెను వివాహమాడి యధర్మకార్యము చేయుటకంటె రాజ్యము వదలుకొనుటయే యుచిత" మని ప్రత్యుత్తర మిచ్చెను.

అనంతరము రాణా హంసాదేవిని వివాహమాడుట కంగీకరించి మార్వారునుండి యామెను చిత్తూరునకు రప్పించి యచ్చటనే యథావిధిగఁ బెండ్లియాడెను. కొన్నిదినముల కాదంపతులకు ముకుళుఁడను కుమారుఁడు కలిగెను. ముకుళుఁడు పసితనమున నున్నపుడే లఘుమహారాజు వానిని విడిచిపోవలసి వచ్చెను. హిందువుల పుణ్యక్షేత్రమగు గయను మహమ్మదీయులు పట్టుకొని నాశనము చేయఁబోవుదురని యారాణా విని తాను కత్తిగట్టి వారితోఁ బోరవలయు నని నిశ్చయించుకొని తురకలబారికిం దప్పి మరల తాను యాఁబిడ్డలను బ్రజలను దేశమును జూడ వీలగునో లేదో యని సందేహించి చందునిం బిలిపించి తన పయన మెఱింగించి బాలుఁడగు ముకుళునకు రాజ్యములో నెంతభాగ మిచ్చిన బాగుండు నని యడిగెను. చేసిన ప్రతిజ్ఞల నశిథారావ్రతముగ నడపునట్టి చందుఁడు తండ్రి కిట్లనియె. ముకుళుఁడు మేవారు దేశమునకు రాజగు గాక! అతఁడు గద్దె యెక్కినతోడనే నేను వానికివిధేయుఁడనై ప్రియభృత్యులలో మొదటివాఁడనై యుందును. తండ్రిచేసిన ప్రతిన నిలిపి తా నాడినమాటఁ దప్పక నడచు కుమారుని జూచి రాణా మహానంద భరితుఁడై నిర్విచారముగ గయకుఁ బోయి రణరంగమున నిలిచి మహమ్మదీయులతోఁ బోరి లెక్కకు మీరినవారి నేవలం గెలువలేక తురకల మతము నియుక్తమై ప్రాణములు విసర్జించి వీరస్వర్గ మలంకరించెను.

రాణా పరలోకగతుఁడైనవార్త మేవారులోఁ దెలిసిన తోడనే చందుఁడు ముకుళుని రాజుగా నభిషేకించి వానికిం [illegible]డుగ దాను రాజ్యము సేయఁబూని తమ్ముని సింహాసనమున కీవల తనపీఠము వేయించుకొని సకలవ్యవహారములయందు రాజునకుం దోడ్పడుచు విధేయుఁడై యుండి జనానురాగము గలుగునట్లు చక్కఁగఁ బ్రజాపాలనము చేయుచుండెను. చందునియం దందఱ కిష్టము నుండెను; కాని యేకారణముచేతనో హంసాదేవికిమాత్ర మిష్టము లేకపోయెను.

అతనియెడ గ్రమక్రమముగఁ బ్రజానురాగ మతిశయించుటచే హంస యోర్వలేనిదై భయమంది తనలో నీవేళ చండుఁ డల్పుఁడై నా కుమారునకు భృత్యుఁడైనను ముందుముందు నాకుమారునే యితఁడు భృత్యునిఁ జేయఁ గలఁడు. ఈ యొదిగియుండుట యెల్ల రాజ్యసంపాదనమునకై చేసెడు నటనగాని నిజము కాదు. ఇప్పుడు పేరునకు రాజైన యితఁడు ముందుముందు నిజముగా రాజే యగు" నని తలపోయఁ జొచ్చెను. ఈతలంపు లామెలో నడగియుండక క్రమక్రమంబున వెలికి వచ్చుటం జేసి చండునకుఁ దెలిసెను. దైవముఖముఁ జూచి తాను సత్యముగా నడచుకొనుచున్నను దనయందామె కట్టి యనుమానము గలిగినందుకు విచారించి యిఁక నెన్నిచెప్పిన నామె తన్ను నమ్మదని నిశ్చయించి తన యధికార మంతయు వదలుకొని సవతితల్లియొద్ద సెలవు పుచ్చుకొని చండుఁడు చిత్తూరునగరముఁ బాసి తనకు నమ్మిన బంటులై తన్నెడబాయంజాలని రెండువందలమందిని వేఁటగాండ్రను వెంటబెట్టుకొని దూరదేశములకుం బోయెను.

చండుఁడు పోయినతోడనే హంసాదేవి హృదయశల్యమును బాసినట్లు సంతసించి మారువారునుండి తన చుట్టములం బక్కములం బిలిపించె. వాండ్రును గొడ్డునేలఁగల మారువారును విడిచి రత్నగర్భయగు చిత్తూరునకుఁ బోవుటకు మహానందభరితు లైరి. ఆమె తండ్రియగు రణమల్లు చిత్తూరునకు వచ్చి యాపట్టణము సర్వసంపన్నముగా నుండుటచే దానిం బాయఁదలఁపఁడయ్యె. రాణీసోదరులు దమ [illegible] కుటుంబములతో వచ్చి చిత్తూరున [illegible]ఁపుర ముండి కాలక్రమమున నధికార మంతయు వహించిరి. వారిమాటయే యాదేశమున శాసన మయ్యెను. వారియాజ్ఞ నిరంకుశ మయ్యెను. వేయేల? వారే రాజులైరి. తరములనుండి మీవారు సంస్థానము గనిపెట్టుకొనియున్న యుద్యోగస్థు లందఱు మెల్లమెల్లఁ దప్పుకొనవలసివచ్చె. ప్రజలు సేవకులు జరుగుచున్న దుర్ణయములజూచి తమలో తారు సణుగుకొను

చుఁ గోరచూపులఁ జూచుటయె కాని నోరెత్తి పలుకరైరి. ముక్కు పచ్చలారని యొక రాచకుఱ్ఱని నిమిత్తము చండశాసనులగు రాణిబంధుగుల నెదిర్చి యెవ్వఁడు ధనమును బ్రాణమును బోఁగొట్టుకొనఁ గలఁడు? పౌరుషశాలులగు ప్రజ లీతెఱఁగున నసహాయులై యుండగాఁ నంతిపురమందలి యొకయాఁడుది యీ దౌర్జన్యముల సహింపక తెగువఁ జేసెను. అది ముకుళునకుఁ బాలిచ్చి పెంచిన దాది. రాజస్థానమునందు దాదులు తమ ప్రాణములనేని ధార వోసి రాజకుమారుల రక్షించినకథ లనేకములు గలవు ముకుళుని దాదియు నట్టిదియె.

ఒకనాఁడు రణమల్లుఁడు కొలువుకూటములో రాణాకూరుచుండెడి సింహాసనముపైఁ గూర్చుండితనమనుమనిఁదనకాళ్ళవద్దఁ గూర్చుండఁబెట్టుకొనియాడించుచుండె. అంతలో బాలుఁడు మెల్లమెల్లగదిగజారి నేల గంతులు వేయనాగెను. అప్పుడేనియు రణమల్లు గద్దె దిగక తీవితో గూర్చునియుండుటంజేసి సభవారికిని సభవారికంటె నెక్కుడు దాదికిని మనసు మండెను. తోడనే దాది పట్టరాని బిట్టలుకతో నంతిపురిఁ బ్రవేశించి రాణియొద్దకుఁబోయి నిలిచి జరుగుచున్న దౌర్జన్యమును విన్నవించి యెక్కడనుండియో పొట్టకూటికి జేరిన లాతివారు రాజకుమారునిఁ దృణీకరించి గద్దెయెక్కి కూర్చుండియుండగా సహించియూరకొనుట యుచితముగాదని నొక్కి చెప్పెను. రాణి తనతప్పుఁ దెలిసికొన్నయారాత్రియే తనతండ్రిని జీవాట్లుపెట్టెను. వృద్ధుఁడగు రణమల్లుఁడుపనికిమాలిన యాఁడుదానిపలుకులకు జంక గూడదని నిశ్చయించుకొని యెదు రామెపైఁ గోపపడి „నేనును నాకొడుకులు చేసెడు పనుల కొప్పుకొని నీవు నోరుమూసికొని పడియుండుము. లేనిచో నీకుమారుని సింహాసనమునకేగాక ప్రాణములకుఁ గూడ నపాయము రాగల” దని ప్రత్యుత్తర మిచ్చెను. ఆపలుకులు విని రాణి తనకును దనకుమారునకును నేమి కీడుమూడునో యని భయపడఁజొచ్చెను.

ఆమె భయము మఱింత యధికమగునట్లులు రాణాయొక్క-

రెండవకుమారుఁడగు రఘుదేవుఁడు తనతండ్రి సేవకులచేతనే వధింపబడెనని యొక్క ఘోరవార్త యామెకుం దెలిసెను. అతఁడు మిక్కిలి యోగ్యుఁడగుటచే రాణియె గాక రాజస్థానమునందలి జను లందఱు బాలగోపాలము వాని యకాలదుర్మరణమునకు విచారించిరి. అతని యందలి భక్తిశ్రద్ధలను సూచించుటకై మీవారు దేశస్త్రీలు వానిప్రతిమను దమయిండ్ల నిలుపుకొని దానికి మ్రొక్కి పూజించుచు నేఁటి నుత్సవములఁ జేయుచువచ్చిరి. సజ్జనుఁడగు రఘుదేవుని గడతేర్చిన రణమల్లుని బంటులే తన కుమారునిఁగూడ దెగటార్తురని రాణి మిక్కిలి భయమునందుచు వచ్చెను. అట్టులుండ మీవారురాజకుటుంబములోఁ బుట్టి రాణికిం జెలికత్తె యగునొక జవరాలును జూచి రణమల్లుఁడు తన కామెనిచ్చి పెండ్లి చేయుమని కూఁతురును బలవంతపెట్టి దాసినో వెలయాలినో తీసికొనిపోయినట్లు దానిం జేకొనెను. దినదినము నధిక మగుచున్న తండ్రిదుండగముల సహింపలేక రాణి యెట్టకేలకు దిటము తెచ్చుకొని యాసమయమునఁ దనయక్కఱ గడపగలశూరుఁడు చండుఁడే యని నిశ్చయించి సత్వరము వచ్చి తననుదనకుమారుని రాజ్యమును రక్షింపుమని వానికి వర్తమాన మంపెను.

ఇది జరిగిన కొన్నిదినములకు వెనుక చండుని వెంటఁ బోయిన వేఁటకాండ్రు కొందఱు మఱలఁ జిత్తూరునకువచ్చిరి. ఏలవచ్చిరని వారిని కొంద ఱడుగఁగా దాము చండునితో నొంటిగఁ జిరకాల ముండలేక విసికి యాలుబిడ్డలఁ జూడవచ్చితి మని వారు చెప్పిరి. వారి నెవ్వరు ననుమానింపక కోటఁజొరనిచ్చి యెప్పటియట్ల పనులఁ జేయనిచ్చిరి. ఆసేవకులు వచ్చినది మొదలు రాణి మిక్కిలి దైవభక్తి గలదై దేవతలకు నుత్సవములు జాతరలు చేయించుచు చుట్టుప్రక్కలనున్న పల్లెల జనంబులకు నిరతాన్నదానప్రదానము చేయింపసాగెను. ఆయుత్సవములు జూచుటకు బాలుఁ డగురాణా తనదాదియుఁ బురోహితుఁడును వెంటరా గుఱ్ఱమునెక్కి తఱుచుగఁ బోవసాగెను. ఈకార్యము

గర్విత లగువాని మేనమామల కనుమానము గలిగింపదయ్యె. నల్ల మందుముద్దలు మింగుటచే మతిలేకయో పడుచుపెండ్లాము వలపులఁ దగులుటచే నోడ లెఱుఁగకయో వానితాత యావిషయము దలపెట్ట డయ్యె. ఇట్లు దినములు జరుగుచుండఁ జిత్తూరున కేడుమైళ్ళదూర మున దక్షిణముగానున్న గోసుంద యనుగ్రామమున దీపావళిపండుగ నాఁడు రాణి హంసాదేవి లక్ష్మీపూజ చేయించి గొప్పయుత్సవము గావించి దానింజూచుట కెప్పటియట్ల తనకుమారుని బంపెను. రాచ నగరును నిరుపేదవాని గుడిసెయు దీపములతో వెలుఁగుచున్న యా మహానందసమయమున చిన్నరాణాయొక్క సేవకులు కొందఱు మిక్కిలి హృదయసంతాప మొంది యేమియుం దోఁచక చిత్తూరుపురప్రాంత మున మొగములు వ్రేలవైచి నిట్టటు తిరుగుచుండిరి.

"ఏమి చెపుమా యతఁడు రాఁకపోవుటకుఁ గారణము! అతఁడు చెప్పినట్లు రాణాను గ్రామములవెంటఁ ద్రిప్పితిమి. దీపావళిపండుగ నాఁడు గోసుందగ్రామమున నతఁడు సెలవిచ్చిన ట్లుత్సవముఁ జేసితిమి. ఈరాత్రి వత్తునని యతఁడు ప్రమాణము చేసెనే! ఏలరాకపోవలె? ఆమాట మఱచియుండెనా? లేక శత్రువులచే నిరోధింపఁబడెనా? చందుఁడు రాని పక్షమున మావారుగతి యింతే."

అని తలపోయుచు నాబంటులు చిన్నరాణాను వెంటఁబెట్టుకొని తూర్పుద్వారమువద్ద పూర్వ మలాయుద్దీను వేయించిన దిబ్బఁ జేరు నప్పటికి వారి చెవులకు గుఱ్ఱపుదౌడు చప్పుడు వినఁబడెను. అది యే మగునని నిలిచిచూడ నలువదిమంది యాయుధపాణు లగుజోదులు వచ్చుచుండిరి. అందు మొనగాఁడు మాసినగుడ్డలు నసమానమైన యాయుధములు ధరించివచ్చి యొకసంజ్ఞఁ జేసి తనరాఁక రాణా కెఱిఁ గించెను. ఎవ రావచ్చుచున్న దని కోటకావలివాండ్రు వానిం బలుక రించిరి. మే ముత్సవముఁ జూచుటకు గోసుందకు రాఁగా రాణావారిం గొలిచి వెంటఁబోవలసిన దని రాణిసెలవగుటచే వచ్చితి మని వారుత్తర

మిచ్చిరి. ఆకావలివాండ్రకు దృష్టిపడని యతఁ డనేకద్వారములు గడచి తుట్టతుదకు రామద్వారము పేరుగల లోపలిగుమ్మమువద్దకుఁ బోఁగా నక్కడివాండ్రు వాని నడ్డగించి వానివెనుక నింక నొకపెద్ద సేన వచ్చుటం జేసియు లోపలకుఁ జొరనీయరైరి. అప్పు డుపాయములతో బనులుసాగవని యొరలోనుండి కత్తి నూడఁబెటికి ద్వారరక్షకుల శిరంబుల కొబ్బరిపుచ్చెలట్లుగ నఱకె. వెంటనే తొల్లిఁటి వేఁటకాండ్రందఱు వానికి సాయమై నిలిచిరి. చందుఁడు వచ్చెవచ్చె నని కోట యంతయుఁ బ్రతిధ్వను లెగయునట్లు కేకలు వెడలెను. రాణిసోదరులు నిశ్చేష్టులై యూరకుండిరి. చందుఁడు నిరపాయముగ సైన్యసమేతుఁడై కోటలోఁ బ్రవేశించె.

చందున కందఱు గనఁబడిరి; కాని ముసలిరాజు గనఁబడఁ డయ్యె. అతఁడు నల్లమందు మింగి యామత్తుచే స్పృహఁ దప్ప నొక మూలగదిలో గడ్డిపరుపు వేసిన మంచముపైఁ బండుకొనెను. ఆభర్త చెంత రాణి చెలికత్తెయగు రాజపుత్రాంగన నిలువంబడియుండె. ఆమె కెవ్వరైన సన్న చేసిరో లేక యావలజరుగు కోలాహలము చేతనో యామె వాని తలపాగ నూడఁదీసి వానిమేనిచుట్టుం ద్రిప్పి గట్టిగా మంచమునకు బిగించికట్టి తా నవ్వలకు దాఁటెను. చందునిబంట్ల సింహనాదములు చచ్చెడువారి యార్తధ్వనులు కత్తులరాపిడిచప్పుడులు నగరమంతయు వినఁబడుచున్నను నల్లమందుతాతకు మెలఁకువ గలిగింపఁ జాలవయ్యె. ఎట్టకేల కతఁడు మెలఁకువఁ దెచ్చుకొని యమకింకరులవలె నెదుట నిలిచిన శత్రువుల మొగములఁ జూచె. అప్పుడు వచ్చియు రాని తెలివితో నాతఁడు కట్టువడిన సంగతి నెఱుఁగక లేవ నుంకించి లేవఁజాలక క్రొత్త పెండ్లాము చేసినమోస మెఱిఁగి చింతించి హాం మ్మని మంచముపాళమున లేచి యాయుధముకొఱకు వెదకుకొనుచుండఁగా చందుని సేవకులు వానిం దుదముట్టించిరి.

ఇట్లు చిత్తూరు క్రొత్తప్రభువుల బారినుండి విముక్తిఁ జెందెను

రణమల్లుయొక్క పెద్దకుమారుఁడు జోడా యను నతఁడుతక్క తక్కిన మార్వారు దేశస్థు లందఱు హతులైరి. జోడా 120 మంది బంట్లతో చందుని బారింబడక తప్పించుకొని ప్రాణములు దక్కించుకొని తన స్వస్థానమును మార్వారు దేశమునకు రాజధానియునగు మండూరుపట్టణమునకు పయనమై పోయెను. చండశాసనుఁ డగు చండుఁడు వెన్నంటి తరుముటచే నచ్చట నిలువలేక యతఁడు హర్బశంకరుఁ డను నొక మిత్రునియింటికి పారిపోయెను. విజయుఁ డగు చందుఁడు మీవారు దేశమును, క్రొత్తగా నాక్రమించిన మార్వారు దేశమును తమ్మునిపేర బాలించు చుండెను.

ఈహర్బశంకరుఁడు మీవారు మార్వారు సరిహద్దులో నున్న యొక యడవిలోఁ గాపురమున్న క్షత్రియుఁడు. అతఁడు పరమభక్తుఁడు, మహాశూరుఁడు, ఆపద్బాంధవుఁడు, శరణాగతరక్షకుఁడు. అడిగిన వారికి లేదనకుండ నిచ్చునటుల దానకంకణము గట్టుకొన్నవాఁడు. కాకులనుగొట్టి గ్రద్దలకు వేయున ట్లతఁ డప్పుడప్పుడు చుట్టుప్రక్కల గ్రామములు దోఁచుకొనివచ్చి బీదలకు బ్రాహ్మణులకు సంతర్పణలు చేయుచుండును. తన చిన్నసేనతో జోడా హర్బశంకరుని యింటికిఁ బోయిన దినము పండుగ యగుటచే నచ్చట విశేషముగా నన్నప్రదానము జరుగుచుండెను గనుక తమ కేవెలితియుఁ గలుగదని యతఁడనుకొనెను. కాని శంకరుఁడు వారు వచ్చునప్పటి కొక్క మెతుకైన మిగులకుండున ట్లన్నప్రదానము చేసెను. ఆకలి దప్పికలచేతను మార్గాయాసముచేతను బడిలి యాకొ్రత్తగా వచ్చిన నూట యిరువది మంది యతిథులకు నేమిపెట్టుదును నాకీదిన మెట్లు పగవు దక్కునని శంకరుఁడు విచారించి యొకయుపాయము గనిపెట్టెను. అప్పు డప్పుడు రంగులువేయుటకును గఱువు కాలమున బీదలుదినుటకునుపయోగించు నొక కుక్క యతని కప్పుడు జ్ఞప్తికి వచ్చెను. ఆచెట్లు తెప్పించి మెత్తగా నలగదంపించి పిండియుబెల్లమునుగలిపించి వండించి వారికిఁ

బెట్టించెను. వారందఱు మిక్కిలియాఁకలిగొని యుండుటచే నదియేదో కొత్తపిండివంట యనుకొని తమకముతో భక్షించిరి. ఆ మొక్కలు రంగువేయుటకుఁ దరుచుగ నుపయోగింపబడుటచే భోజనాంతరమున నతిథుల గడ్డములు మీసములు కెంపెక్కి మెట్టుఁబడియుండుటచే వారొండొరులు మొగంబులు జూచుకొన నారంభించిరి. అప్పుడు శంకరుఁడు వారియొద్దకుఁ బోయి తనపై వారికనుమానము కలుగకుండునట్లు వారితో నిట్లనియె. "చూచితిరా యీశ్వరమాయ? మీకష్టకాల మిట్లే మారిపోయి సుఖకాల మగునని తెలియఁజేయుటకు భగవంతుఁడు మీమీసముల కీమార్పు కలుగఁ జేసెను" అని యతండు చెప్ప వానియందలి భక్తిచే వారామాటలు నమ్మి యటనుండిపోయి సమయము వచ్చువఱకు మందూరు చుట్టుపట్ల నడవులలోఁ దిరుగుచుండిరి. అంతట ముకుళుఁడు యుక్తవయస్కుఁడై రాజ్యభారము వహించెను. చందుఁడును వానికొడుకులును మందూరు రాణాకు బదులుగ నేలుచుండిరి. రాణీ హంసాదేవి తనకుమారుఁడు రాజ్యభారముఁ బూని నిరపాయస్థితి నున్నందున దిక్కుమాలిన యడవులం దిరుగుచున్న తనసోదరున కేదేని యుపకారముఁ జేయ నిశ్చయించుకొని వాసి రాజ్యము వానికిమ్మని కొడుకును బ్రతిమాలుకొనెను. ముకుళుఁడు సరే యని చందునితో నాలోచించుటకు వానిం దనవద్దకు రమ్మని వర్తమానఁ మంపె. ఇరువురుకొడుకులను సపరివారముగ మందూరినం దుంచి చందుఁడు పెద్దకుమారుఁడగు ముంజునితో గలిసి రాణావద్దకుఁ బయనమై పోయెను.

వాని పయనముమాట చారులవల్ల నెఱిఁగి జోడా హార్బశంకరుఁడు మొదలగుకొందఱుజోదులం గూర్చుకొని మందూరునకుఁ బోయి చందునికొడుకుల వధించి పట్టణ మాక్రమించెను. చందుఁడు మార్గమధ్యమున నామాట విని కోటఁ గాపాడుమని ముంజుని వెనుకకంపె; కాని సపరివారముగ సోదరు లదివఱకె మృతినొందుటంజేసి త్రా

నొంటిగ నేమియుఁ జేయలేక ముజుఁకు మరలివచ్చుచుండ జోడా వానిని వెన్నంటి తరిమి త్రోవలోఁ దెగటార్చి ప్రాఁతపగఁ దీర్చు కొనియె. చండుఁడు తనకుమారుల మరణవార్తవిని తాను మొదూరు పట్టుకొని జోధాను సంహరించుటకు సమర్థుఁడయ్యుఁ గయ్యమునకుఁ గాలుదువ్వక తనకొడుకులు రణరంగమున వీరపురుషోచితమైనమర ణము నందిరా రని సంతసించి జోడా తండ్రిని సోదరులను తాను మున్నుజంపినందుకుఁ దనకుమారుల నిప్పు డతఁడు వధించి యుండు నని సరిపెట్టుకొని రాజపుత్రులొకరితో నొకరు పోరాడుట తగనిపనియని హితోపదేశము చేసి ముకుళునితో చెప్పి వానిరాజ్యము వానికిప్పించి మారువారు రాజ్యములోని యొక్క-తాలూకామాత్రము చిత్తూరు రాజ్యమునఁ గలిపించి యెల్లల నేర్పఱచి తా నెప్పటియట్ల తమ్మునిం గొలిచి బ్రతుకుచుండెను.

నాఁడు మొదలు మీవా రు రాజకుటుంబమును మారువారు రాజకుటుంబమును తమతమ ప్రాఁతపగలు మఱచిపోయి వియ్యము నెయ్యము హెచ్చ సుఖమున జీవించు చుండిరి. తరువాతఁ జిత్తూరు నగరముపై నొకసారి శత్రువు లెవరో దండెత్తిరా జోడా తన సేనలం గూర్చుకొని మేనల్లునకు సాయ మయ్యెను. చండునివంటినీతిమంతులు దేశాభిమానులు ననేకులు మనదేశమునఁ బుట్టి మార్గప్రదర్శకు లయ్యెదరుగాక !

రాణా కుంభుఁడు.

:(o):

రాణాముకుళుని దర్బారులో నున్నదొరలలోఁ గాఁచుఁడు మేరుఁడు నను నిరువురుసోదరు లుండిరి. వారు ముకుళుని తాతయగు ఖేటసింగునకుఁ గుమారు లగుటచే నతనికి సవతిపినతండ్రులైరి. కాచ

మేరులతల్లి ఖేటసింగునకు నగ్నిసాక్షిగా వివాహమైన ధర్మపత్ని గాక యుంపుడుకత్తెయై పేద యగువడ్లబత్తునికూఁతు రగుటచే వారు సంస్థానమందుఁ జందుని తరువాత గౌరవనీయు లయ్యుఁ గొంచెము తక్కువగఁ జూడఁబడుచుండిరి. ఆయన్నదమ్ము లిరువురు తమవడ్లబత్తుల చుట్టరికపుమాట యెవరుఁ దలపెట్టినను మహాకోపోద్దీపితులగుచు వచ్చిరి. ఈసంగతి రాజుకొలువున నున్నవారి కందఱకు విశదము.

మహారాణా యగుముకుళుఁ డొకనాఁడు కొందఱు బంటిపోటు దొంగల దఱిమికొట్టుచు విశ్రాంతికై యొకమామిడితోఁపులో దొరలందఱుఁ గొలువఁ గూరుచుండెను. అదివఱకెన్నఁ డతఁడు చూచి యెఱుఁగని యొకచెట్టక్కడ కనంబడుటచే ముకుళుఁడు దానిపేరేమని దగ్గర నున్నయొకదొర నడిగెను. ఆదొర తనకును గాచమేరులకును మనస్పర్ధ లుండుటచే వారి నవమానము చేయుటకై యామ్రానిపేరుఁ దా నెఱుఁగనట్లు నటించి వారి నడుగుమని రాజుతో మెల్లఁగఁ జెప్పెను. రాణా యందలికిటుకు నెఱుఁగక పినతండ్రుల బిలిచి యావృక్షముపే రడిగెను. ఆయన్నదమ్ము లిద్దరు వెంటనే తాము వడ్లబత్తుని సంతతి యగుటచేఁ జెట్లయొక్క పేళ్ళు నామములుఁ దమకుఁ జక్కఁగఁ దెలియు ననునర్థముతో రా జాప్రశ్న తమ్మవమానించుటకయి యడిగె నని మహాకోపోద్దీపితులై యప్పటి కూరకుండి సాయంకాలము రాణా జపము చేసికొనుచున్నపుడు కత్తుల దూసి వానిపైఁ బడి తుత్తునియలుగా నఱికి చిత్తూరుకోటం బట్టుకొనుటకు నప్పుడ గుఱ్ఱముల నెక్కి పోయిరి. కోట కావలివాండ్రు జాగరూకత గలవా రగుటచే వారి ననుమానించి తలుపులం దెరువరైరి.

ముకుళుని దుర్మరణవార్త తెలిసినతోడనే ప్రజలు హాహాకారములు చేసిరి. ముకుళుఁడు చిరకాలము రాజ్య మేలకున్న నేలినన్నినాళ్లు న్యాయముగాఁ బ్రజాపాలనము చేయుచుఁ బగతురఁ బారఁ

దోలుటలోను స్వరాష్ట్రమును బలపఱుచుకొనుటలోను మిక్కిలి సమర్థుఁ డయ్యెను. అతనికొడుకు కుంభుఁడు తండ్రి మరణమునాఁటికి బాలుఁడయ్యు బుద్ధిమంతుఁ డగుటచే దూరపుటాలోచన చేసి తన తండ్రికిఁ బ్రాఁతపగతుఁడును మేనమామయు నగుజోడాను తనసహాయార్థము రమ్మని వర్తమాన మంపెను. జోడాయు వెనుకవైరము మఱచి దయాళుఁడై కుంభునికి సహాయమునిమిత్తము కొంతసేన నిచ్చి తనకుమారుని బంపెను. అతఁడును చిత్తూరురాణాయుఁ గలిసి రాజద్రోహు లగునన్నదమ్ముల నిరువురను స్థిమితముగ నొక్కచోట నిలువనీయక యొకతావుననుండి యొకతావునకుఁ దఱిమి కొట్ట నెట్టకేలకు కాచమేరులు వారిబారి కోడి ప్రాణభీతిచే రాటకోట యను నొక కొండకోటం బ్రవేశించిరి. ఈదుర్గము నట్టడవులలోఁ గొండలపై నుండుటచే దుర్గమ మనియు మీవారుప్రభువును మార్వారుప్రభువును దానిం బట్టుకొనఁజాల రనియు నిశ్చయించి కాచమేరులు దానం బ్రవేశించి మరమ్మతు చేసి బలపఱచిరి.

కాచమేర్లుల జాడలు దెలియుటకై మీవారు, మార్వారు ప్రభువు లొకనాఁ డడవులలోఁ దిరుగుచుండ నొకమనుష్యుఁడు వచ్చి వారిపాదములపైఁ బడి న్యాయము దయచేయుఁడు మహాప్రభూ యని ప్రార్థించెను. నీవృత్తాంత మేమి యని వా రడుగ నతఁ డిట్లనియె. "స్వామీ! నేను రాజపుత్రుఁడను చోహాణవంశస్థుఁడను. నాపేరు సుజా; నాకు చక్కనిచుక్క యగునొకకూఁతురు గలదు. ఈకొండలం దిరుగుచు నొకమారు కాచమేరులు నాముద్దుకూఁతును జూచి దాని నెత్తుకొని రాటకోటకుం బారిపోయిరి. నాదుర్గతినిగూర్చి నేను రాణావారితో మొరపెట్టుకొనుట కిప్పుడే పోవుచుండఁగా నాయదృష్టవశమున మార్గమధ్యమున మీరే యగపడిరి. రాటకోట లోకు లనుకొనునంత దుర్భేద్యము గాదు. దాని యాయువుపట్లు నే నెఱుఁగుదును. ఈనడుమ కోటమరమ్మతులు జరిగినప్పుడు నే నొకకూలివాని

వేషము వేసికొని పనిచేసినట్లు చేసి దానిగుట్టెఱిఁగితిని. తక్కినచోట్ల కోట దుర్భేద్యమే కాని యొక్కమూల వీలుగ నున్నది. ఏకష్టము పడి యైన నొక్కసారి మనము కోటమీఁది కెక్కఁగలిగితిమా యింక కోట మనస్వాధీనమె. ఏలయందురేని కావలివాండ్రు కోట దుర్భేద్య మనుతలంపున నశ్రద్ధతో నున్నారు."

ఈకథ చెప్పునప్పు డతఁడు ప్రజలమొగముఁ జూడలేక తలపై ముసుఁగు వేసికొనెను. మీవారు మార్వారుప్రభువులు గుఱ్ఱములపైఁ గూరుచుండియే వానిపలుకులు విని "సరే! యాకొండమీఁదికి దారి జూపగలవా?" యని యడిగిరి. చిత్తము స్వామీ యని యతఁ డను మతించుటయు మెంటిపులవంటిబంట్లను కొందఱఁ గూర్చుకొని మార్వారు రాజకుమారుఁడు వానివెంటఁ జనియెను. మొదట సుజాయుఁ బిదప మార్వారుప్రభువును జీఁకటిచాటునఁ బర్వతశిఖరమున కెగఁబ్రాఁకిరి. ఆరాత్రి యాకాశమంతయుఁ గారుక్రమ్మినమబ్బులతో నిండియుండు టచేఁ జిమ్మచీఁకటి యెల్లెడలవ్యాపించె. ఆకసము చిల్లిపడినట్లు వాన ద్రిమ్మరింపఁ జొచ్చె. బ్రహ్మాండములు పటపట పగులునట్లురుములు మొఱయసాగె. కన్నులు మిరుమిట్లు గొలుపునట్లు తళుకు తళుకు మని మెఱపులు మెఱయఁ జొచ్చె. సకలఘాతుకజంతువులకు శరణ్యమైన యాకొండపై నారాత్రియందా దారశిఖాచయములు కన్నుకన్ను గనఁ బడనిచీఁకటిలో ముందేమి యున్నదో యెఱుఁగక వ్రేలు మోపుటకు తావు దొరకిన నందు నిలుచుచుఁ జేతి కేది దొరకిన దాని నూఁతగా బట్టుకొనుచు మెఱుపు కనఁబడినపుడెల్ల దారిఁ జూచుకొనుచు నిరుకు సందుల గొందులఁబడి నడువసాగిరి. చీమ చిటుక్కుమన్న నొకబొమ్మ రాయి గదలిన యట్టిచిన్నయలుకు డైనఁ బగతురఁ దమజాడఁ దెలిసి కొని కార్యవిఘ్నముచేయుదు రన్నభయమున నొండొరులతో మాట లాడుకొనక ధైర్యమునిమిత్తె మొండొరులఁ బ్రోత్సాహముఁ జేసికొనక జారిపడినం బరస్పరసహాయము మఱుగక యావీరు లాపర్వతశిఖరముల

మీఁద నడచు చుండిరి. కొంతదవ్వరిగి సుజా యెత్తగు నొకరాతిపై నడుగు పెట్టఁబోవుచుండఁ జింతనిప్పులవంటి గుడ్లు గలిగి మెఱకొఱకై చూచుచున్న యొకయాఁడుపులి గానఁబడియె. అచ్చమగు తనకులంబు నకు మచ్చ గలిగెనని మనంబున మిక్కిలి పరితపించుటచే యాసుజా పులియైనను సరే భూతమైనను సరే బ్రతికినను సరే చచ్చినను సరే భయముపడక వెనుకంజ యిడక యచ్చటనే నిలువఁబడి మాటలాడ వలనుపడమి యపాయమును సూచించుటకై రాజకుమారునిహస్తము స్పృశించెను. రాజనందనుఁ డాసన్న మెఱిఁగి యపాయ మానన్న మయ్యెనని నలుదెసలు పరికించి నెత్తురుముద్దలవంటి కన్నులు గలిగి తమపై నుంకించి దుముకఁబోవుచున్న బెబ్బులిం గాంచి కత్తిదూసి పొడిచి యొక్కయేటున దాని నంత మొందించె. ఆదెబ్బతో నది కొండపైనుండి దొర్లి క్రిందపడియె. కాచునికూఁతు రప్పుడే మేలుకువ నొంది యేదో చప్పు డగుచున్న దని తండ్రిని లేపి శత్రువులేమో చూడు నాయనాయని పలికెను. ఆపలుకులు విని కాచుఁడు భయము లేదు. పండుకొనుము. మనశత్రువులు చాలదూరమున నున్నారు. అది యురుములచప్పుడుగాని మఱియొకటిగాదు. దైవమును దలఁచు కొనుచు నిర్భయముగా నిద్రింపు మని తానును గుఱ్ఱుపట్టి నిద్రించె.

అంతటఁ గొంతసేపటికి శత్రువులు కోటలోఁ బ్రవేశించినా రని యందఱకు స్పష్టముగాఁ దెలిసెను. కోటలోనిసైనికు లందఱు చప్పుచప్పున నాయుధములకొఱకై పరుగులెత్తిరి. కాని వారిశ్రమ యంతయు వృథ యయ్యె. మార్వారురాజకుమారుఁడు మేరుని గద తేర్చె. సుజా కాచుని దెగటార్చి తనయక్కను దీర్చుకొనియె. ఇవ్విధంబున నొక్కముహూర్తమందే రాజద్రోహంబును స్త్రీమానద్రోహంబును జేసినదురాత్ములు తమదోసంబులకు దగినశిక్షలం బొందిరి. ఇట్లు తండ్రిం జంపినదురాత్ముల నంత మొందించి కుంభుండు సింహాసనమున సుప్రతిష్ఠుఁడై నేలం బాలింప నారంభించెను.

ఆకాలమున ఢిల్లీరాజ్యము పూర్వవైభవము నంతను బాసి నామావశిష్టమై యుండెను. తొల్లి చక్రవర్తులకు లోఁబడినరాజ్యము లన్నియుఁ గ్రమక్రమంబున ఢిల్లీకిఁ గప్పము చెల్లించుట మాని స్వతంత్రము లయ్యె. ఈవిధముగా స్వాతంత్ర్యముఁ బడసినరాజ్యములలో మాళవదేశ మొకటి. అది పూర్వము హిందూరాజులపాలనము నుండియు నాసమయంబున మహమ్మదను పేరు గలయొకమహావీరుని పాలనంబున నుండెను. అతఁడు మహాబలవర్ధితుండై ఢిల్లీపైఁ దిరస్కారభావముఁ జూపుటయేగాక యనేకదేశముల జయించి చిట్టచివరకు రాజస్థానముమీఁద దండెత్తుటకు యత్నించెను. కుంభుఁ డాసమాచారము ముందుగానే విని లక్షగుఱ్ఱముల దళమును పదునాలుగు వందల యేనుఁగులను గూర్చుకొని మహాసేనతో మాళవదేశముపై దండు విడిసె. అప్పుడు కుంభునకును మహమ్మదునకును దారుణ యుద్ధము జరిగెను. దైవానుగ్రహముచే నాకయ్యమునందు మహమ్మదీయులకు సంపూర్ణపరాజయమును హిందువులకు పరిపూర్ణజయంబును గలుగుటయేగాక మాళవదేశాధిపతి యగుమహమ్మదు కుంభునిచేఁజిక్కి చిత్తూరునకు ఖైదీగాఁ దీసికొనిపోఁబడెను. అచ్చట నతఁ డాఱుమాసములు చెరలో నున్నపిదప కుంభుఁడు వానిం గరుణించి వానివద్దనుంచి ధనమునుగాని కానుకలుగాని రాజ్యమునుగాని గ్రహింపకయే తానే వానికనేకబహుమానము లిచ్చి వానిని విడిచిపుచ్చెను. మహమ్మదు తన కిరీటమునుమాత్రము చిత్తూరుకోటలో విడిచి పోయెను. మహారాణాకుంభుఁడు తనయెడలఁ జూపిన నిర్హేతుకకృపారసమును దలఁచి మహమ్మదు వానియెడ జాల కృతజ్ఞుఁడై వానితో గలసి సాటి తురక యగుఢిల్లీచక్రవర్తిమీఁదికి యుద్ధమునకుఁబోయి యిరువురుం గలసి మరల దల యెత్తకుండ వానిని నోడించిరి.

మాళవదేశాధిపతి గర్వమడంచిన పిదప కుంభుఁడు తనవిజయమాచంద్రతారార్కముగ భూమిలో నిలుచునట్లు చిత్తూరునం దొక

జయ స్తంభమును గట్టించెను. అది చిత్తూరురాజ్యలక్ష్మియొక్క తొంటివైభవమును తెలియఁజేయుచు నిప్పటికి నిలిచియున్నది. దానిం జూడనివారు దాని గొప్పతన మూహింపఁ జాలరు. చూచినవారు వర్ణింపఁజాలరు. అది కట్టుటకే పదిసంవత్సరములు పట్టెను. దాని పొడవు నూటయిరువది రెండడుగులు. అది నలుదెసలకు నాలుగుపలకలు గలిగి యున్నది. దానికి తొమ్మిది యంతస్థులు గలవు. ప్రతి యంతస్థునం దొక్కొక్క నల్లరాతిపలకమీఁదఁ జిత్తూరురాజవంశచరిత్రము వ్రాయఁబడియున్నది. అంతియగాక దేవతలయు రాక్షసులయు నప్సరస్త్రీలయు వీరపురుషులయు విగ్రహములు చిత్రచిత్రములుగ విన్నాణమేర్పడ చెక్కఁబడియున్నవి. దానిసొగ సంతయు నిచట వర్ణించుటకు వీలుగాదు.

ఈజయ స్తంభమునే గాక యమ్మహావీరుఁడు చిత్తూరునగరమునందు శ్రీకృష్ణునకును బ్రహ్మకును వేరువేరుగ నాలయములును ఆరావళీపర్వతములయందలి యాబూశిఖరముమీఁద మఱియొక కోటను గట్టించెను.

అతఁడు మిక్కిలి దేవతాభక్తుఁడేగాని తనరాజ్యసంరక్షణమునకుఁ గేవలము దేవతలనే నమ్మియుండక మనుష్యప్రయత్నముగూడ నమ్మి ప్రాతకోటలను బాగుచేయించి క్రొత్తకోటలఁ గొన్ని కట్టించి దేశము శత్రుదుర్నిరీక్ష్యముగఁ జేసెను. ఈకోటలలో 'కుంభల్ మియర్' అనునది ముఖ్యమైనది. కుంభల్ మియర్ అనగా కుంభుని కొండ యని యర్థము. ఈకొండకోటలోఁ గూరుచుండియే కుంభమహారాజు తన యిష్టదైవమగు శ్రీకృష్ణునిమీఁద బద్యములు కృతులు చెప్పుచు వచ్చెను. మహారాణా కుంభుఁడును వాని పట్టపుదేవి యగు మీరాభాయియు హిందీభాషలో మిగుల లలితమగు కవిత్వము జెప్పఁగల ప్రోడలు. నత్కులప్రసూనత చక్కఁదనము సత్ప్రవర్తనముగల రాజపత్నులనేకు లుందురు; కాని సాహిత్యము సంగీతము దైవభక్తి గలవా రుండుట యరిది.

మీరాభాయి హిందీభాషలో ననేకపద్యములు కృతులు భగవత్పరముగాఁ జెప్పెను. చెప్పుటతోఁ దనివిసనక చిత్తూరునం దొక కృష్ణాలయమును గట్టించి యచ్చటి కనుదినమును బోయి తాను జెప్పిన కృతులు పద్యములు చదివి స్వామిని స్తుతియించి తాను మహారాజపట్టపుదేవి నను మాట మఱచి సామాన్యస్త్రీవలె భగవంతునియెదుట నాడి పాడిపచ్చినవా రందఱి కన్నులకు వీనులకు విందు సేయుచుండును. సహజముగఁ గంఠమాధుర్యముగల స్త్రీ సంగీతశాస్త్రమునందసమాన ప్రజ్ఞ గలదై భక్తిరస ముట్టిపడునట్లు పాడునపుడు వినువారి మనస్సులు కఱఁగి నీరై పోవా? అందుచేత మీరాభాయిపాట విన్నవారందఱు కృష్ణునియందుఁ బరమభక్తులైరి. ఆమె జగమంతయు శ్రీకృష్ణ పరబ్రహ్మస్వరూపమే యని సంసారపుగోడవలు వదలుకొని స్వామిగుణముల వర్ణించి కవనము చెప్పుటయు పాడుటయు నాడుటయుఁ దక్క తక్కిన పనులజోలికిఁ బోదయ్యె. పురజను లామె గానమును వినుటకుఁ బ్రతిదినము వేనవేలు కృష్ణాలయమునకుఁ బోవుచు వచ్చిరి. ఆమెకీర్తి క్రమక్రమంబుగ నుత్తరహిందూస్థానమంతయు వ్యాపించుటంజేసి దూరదేశమునుండియు ననేక జనులు వచ్చి యామె గానమును విని భక్తికి సంతోషించి పోవుచువచ్చిరి. ఆనాఁటి ఢిల్లీ చక్రవర్తి యామె యసమానప్రజ్ఞలను విని తన చెవులు ధన్యములుగఁ జేసికొనవలయు నని నిశ్చయించుకొని మహారాజు పట్టపుదేవి కరకుతురక మెదుట నిలిచి పాడదనుకొని గోసాయివేషము వేసికొని యొక్క సేవకునితో బయలుదేరి చిత్తూరునకు వచ్చి సాయంకాలమున హిందువులతోఁ గలిసి కృష్ణాలయముఁ బ్రవేశించెను.

ప్రవేశించి జగన్మోహనమగు నామెరూపమును మనసును కరగించు పాటయుఁ గని విని ఢిల్లీశ్వరుఁడు పరవశుఁడయి యామెయకు

గులకు మ్రొక్కి తనజేబులోనున్న యమూల్యమగు రత్నహారముఁ దీసి యామె కిచ్చెను. ఇది యెక్కడిదని యామె యడుగ నతఁడు స్నానము చేయుచుండ నాకిది యమునానదిలో దొరకిన దని చెప్పి యవ్వలకుం బోయెను. ఆదేవియు నతఁడు చక్రవర్తి యని యెఱుఁగక నిజముగ గోసాయి యనుకొని యాహారము స్వామి కర్పించెను.

రాణాకుంభుఁ డాహారమును జూచి యది చక్రవర్తివద్దనేగాని గోసాయీలవద్ద నుండునది గాదని నమ్మి రత్నాలవర్తకులకుఁ జూప వారు దానిం బరీక్షించి యది ఢిల్లీచక్రవర్తిదని యానవాలుపట్టి చెప్పిరి. కుంభుఁడు భార్యపై ననుమానపడి భార్యం జంపుమని మంత్రుల కానతిచ్చె. ఆమె మహాపతివ్రత యని యెఱుఁగుటచే నామె నెవ్వరుఁ జంపనైరి. అనంతరము భర్త కిష్టము లేనప్పుడు తాను బ్రతుకఁ గూడ దని నిశ్చయించుకొని యాదేవి యర్ధరాత్రమున నెవ్వరికిఁ దెలియకుండ కోట వదలి యావలకుంబోయి యొకనదిలోఁబడెను. అప్పుడు భగవంతుఁడు కృష్ణుఁడే వచ్చి యామెను జావకుండఁ గాపాడెనఁట! పిదప నామె బృందావనమున కరిగి భక్తురాలై తన జీవిత శేషము నచ్చటనే గడపెను. ఉత్తరహిందూస్థానమున మీరాభాయి చేసిన కృతులు నాబాలగోపాలముగ నిప్పటికిని బాడుచు నామె పేరు శిరసావహింతురు.

అనంతరము కుంభుని చుట్టములగు మార్వారు రాజకుమారులలో నొకనికి జాల్వారుదేశపు రాజకూఁతు నిచ్చి వివాహము చేయుటకుఁ బెద్దలు నిశ్చయించిరి. కుంభుఁ డావార్తవిని యాకన్యను తానే పెండ్లి చేసికొనఁగోరి ప్రీతచుట్టరిక మయినను దలంపక యపకీర్తికి జంకక యాకన్యను బలాత్కారముగా నెత్తుకొనివచ్చి యామె కిష్టము లేకున్నను వివాహము చేసికొనెను. ఈయవివేకకార్య మతని ననేక కష్టములపాలు చేసెను. అదివఱకుఁ గొంతకాలమునుండి గలిసియున్న ఘూవారు మార్వారు రాజకుటుంబములకు మరలఁ బ్రబలవైరము

గలిగెను. కొత్తపెండ్లాము మనసున వగనిపై నిష్టము లేదు.

ఆమె మొదట మార్వారురాజకుమారుని వలచుటచే నెల్లప్పుడు నతనినే ధ్యానించుచు చిత్తూరునకు వచ్చి తనను దీసికొని పొమ్మని వానికి సందేశముల నంపుచు తనహృదయమున మదనానల మిల్లు మండుచున్నదని తెలియఁజేయుటకుఁ దనమేడపై నొకపెద్దదీపమును రాత్రులు పెట్టించుచు వచ్చెను. మావారు రాజకుమారుఁడు నామెయందే వలపు నిలుపుటచే నామెకొఱకే పరితపించుచు నొకమారు చిత్తూరునకుఁ బోయి కోటలోఁ బ్రవేశించి యామెను దీసికొనిపోవుటకు యత్నించెనుగాని యాతనియత్నము కొనసాగదయ్యె.

కుంభుఁడు కొలువునకు వచ్చినపుడెల్ల ముందుగాఁ దనచేతికత్తి మువ్మారు తనచుట్టు ద్రిప్పుకొని యేరికి వినఁబడకుండ కొన్నిమాటలు తనలోఁదాను గొణుఁగుకొనిపిమ్మటఁగూర్చుండును. ఇదియంతకుమున్ను చాలకాలమునుండి వానికి యభ్యాసము. కుంభుని జ్యేష్ఠపుత్రుఁడును యువరాజు నగురాయమల్లుఁడు తనతండ్రిచేయునట్టి యాపని కేమియర్థమో తెలియక తన సందియము తనలోఁ నణఁచుకొనఁజాలక సందేహానివృత్తిఁ జేసికొనఁదలఁచి దాని యర్థ మేమని తండ్రి నడిగెను. తండ్రి దానికి యర్థమును జెప్పలేదు సరిగదా మీఁదుమిక్కిలితనదేశమునుండి తత్క్షణమె వెడలిపొమ్మని కొడుకున కాజ్ఞాపించెను. రాయమల్లుఁడు విదేశములం దిరుగుచుండ రాణా చిన్నకొడుకులలో నొకఁ డొక చారునకు లంచమిచ్చి వానిచేఁ దండ్రిని జంపించి తన యన్నగారి కావార్త దెలియకమునుపే తానే గద్దెయెక్కెను. ఆపితృద్రోహి తనపదవి స్థిరముగాఁ జేసికొనుటకు జుట్టుప్రక్కల రాజులకు లంచము లిచ్చి వారిమైత్రిఁ గావించి యొక్కటో దేశము నైదేండ్లు పాలించె. అంతలో రాయమల్లుఁడు మహాసేనఁ గూర్చుకొని తమ్మునిపై నెత్తివచ్చి వాని నోడిసిపుచ్చి పారఁదోలి తాను సింహాసన మెక్కెను. తండ్రిం గడతేర్చిన శూరశిఖామణి స్వరాష్ట్రమున

నిలువ నీడగానక యప్పటి ఢిల్లీ చక్రవర్తి యగు బహలాల్ లోడి వద్దకు బోయి వాని నాశ్రయించి తన యన్నవారినుండి తన్ను రక్షించి రాజ్యప్రతిష్ఠితుని జేయుమని బ్రతిమాలి యట్లు చేసినచో మీవారు దేశము ఢిల్లీకి లోఁబడునట్లు చేయునట్లును విశేషించి సూర్యవంశ ప్రదీపకుఁడగు తాను తనకూఁతును జక్రవర్తి కిచ్చి నిశ్శంకముగా వివాహము చేయునట్లును వాగ్దానము చేసెను. చక్రవర్తి వాని చెలిమి కిచ్చగించి సాయము చేయుదుమని యభయహస్తమిచ్చి వానిని సబహుమానముగ నావలకుఁ బంపె. ఆనాఁడు గొప్పవాన కురియు చుండెను. పితృద్రోహి యగుటయేగాక కులద్రోహియు దేశద్రోహి యునై గౌరవంబునకు బుట్టినయిల్లగు చిత్తూరురాజవంశమున జన్మిం చిన కన్యను గోవును గోసికొని తిను పచ్చితురక కిచ్చి వివాహము సేయఁదలంచిన యీదురాత్ముఁడు బ్రతుకఁగూడదని తలంచి భగవం తుఁడు వాని జంపఁ బంపిన యాయుధమో యనున ట్లొక పెద్దపిడుగు వచ్చి గున్నము దిగఁగానే వాని నడఁచె. పడియున్న యజమానుని కడకు సేవకులువచ్చి చూచునప్పటికి నంతయు మాడినమేనుతో బూడిద గయ్యె యుండె. మహారాణా కుంభుని యనంతరమున రాజ్యమునకు వచ్చిన యీదుష్టునకుఁ బ్రజలు 'హంత' యనుపేరు పెట్టిరి. హంత యనఁగాఁ జంపినవాఁడని యర్థము. అంతియకాని వాని నిజమయిన నామ మెవ్వరికిఁ దెలియదు. ఈనృశంసుఁడు విరుగడయి పోయినదే మంచిదని సంతోషించి ప్రజలందఱు రాయమల్లుని తమకు రాణాగా నంగీకరించి వానిఁ గొలుచుచు సుఖించిరి.

పృథివిరాజు సాహసములు.

———:(౧):———

మీవారు దేశపు రాణాయగు రాయమల్లునకు సంగుఁడు పృథివిరాజు జయమల్లుఁడు నను ముప్వురుకొడుకు లుండిరి. అందు పృథివిరాజు నిరుపమాన సాహసుఁడు మహాతేజశ్శాలి. అతఁడు పదునాలుగేండ్లు వయసు గలిగినది మొదలు ప్రతికక్షు లెందఱు వచ్చినను లెక్కసేయక యాయుధసహాయుఁడై యనేక వీరకర్మముల నొనర్చుచుండెను. మీవారు నందేగాక చుట్టుప్రక్కల దేశములందుఁగూడ పృథివిరాజు ధైర్యసాహసములకు పెట్టినదిపేరు. అందుచేత నతని యకాలమరణమునకుఁ దరువాత కొన్నివందల యేండ్లవఱకు జనులాతని వీరవిహారముల నెంతో చిత్రముగఁ జెప్పుకొనుచు వచ్చిరి.

పృథివిరాజు తనబలము తా నెఱిఁగినవాఁ డగుటచే దనకు తరతరములనుండి శత్రువులయిన మహమ్మదీయులతోఁ జిత్తూరులోని శూరులం గూర్చుకొని యుద్ధముసేయుట పండువుగాఁ దలంచుకొనెను. తనయన్న సంగుఁడు తనకన్న శాంతుఁడును వివేకియు నైనను అతఁడు సింహాసనమెక్కఁడనియుఁ దాను సింహాసనమెక్కి చిత్తూరు నేలునట్లు బ్రహ్మ వ్రాసినాఁ డనియు నతండు పలుమాఱు చెప్పుచుండును. ఒకనాఁడు పృథివిరాజు పినతండ్రియగు సురేశమల్లుఁడును సోదరులు నుండగ పైనజెప్పినట్లు పలికెను. ఆమాటలు విని సంగుఁడు తమ్మునితో నిట్లనియె.

"తమ్ముఁడా! దేవతలయభీష్టమే చెల్లనిమ్ము. విధినిర్మాణమట్లున్నయెడల నేను జ్యేష్ఠుఁడ నయినను రాజ్యమును నీనిమిత్తమయి విడిచిపెట్టెదను. అయినను మనయూరుబైట వ్యాఘ్రగిరిమీఁదనున్న చారుణీదేవియొక్క యర్చకురాలియొద్దకుఁ బోయి తండ్రియనంతరమున మాలో నెవ్వఁడు రాజగునని మన మడుగుదము." అందుకు

సోదరు లంగీకరించి సురేశమల్లునితో వ్యాఘ్రగిరికిం బోయిరి. అర్ధరాత్రి సమ్మనవారి యర్చకురా లచ్చట లేనందున నామె వచ్చువఱకు వారందు నిలువ నిశ్చయించిరి. పృథివిరాజును జయమల్లుఁడు నాయర్చకురాలి మంచముమీఁదఁ గూర్చుండిరి. సంగుఁడు నేలఁబరచిన యొక సివంగిచర్మముపైఁ గూర్చుండెను. సురేశమల్లుఁడు వానిప్రక్కనే మోకాలు సివంగిచర్మమునకుఁ దగులునట్లు నేలఁగూర్చుండెను. అంత గొంతసేపటికి నర్చకురాలు వచ్చుటయు ముందుగా పృథివిరాజు లేచి తమవచ్చిన పని నామె కెఱిఁగించెను. ఎఱిఁగించుటయు నామె సంగునివంకఁ దిరిగి యిట్లనియె.

"సివంగి చర్మమే పూర్వము రాజులకు సింహాసనము. దానిని నీవిప్పు డధిష్ఠించితివి గనుక ముందు మీవారిసింహాసనమును నీవ యధిష్ఠింపఁ గలవు" అని పిదప సురేశమల్లునివంకఁ దిరిగి యనేకసంవత్సరములు బహుశ్రమల ననుభవించిన వెనుక నీకును దేశమును ప్రభుత్వమును లభింపఁగలవు. అవి యెట్లనిన నింకఁ గొంతకాలమునకు పితృవిహీనుఁడగు నొకరాజకుమారుని బగతుర బారింబడకుండఁ దగ్గ సంరక్షించుచుండుము. ఆమె కతంబున నీకు రాజరికము లభించు నని మొగమాటము విడిచి పలికెను.

అపలుకులు విని పృథివిరాజు మండిపడి పట్టరాని బిట్టలుకయు నీర్ష్యయుఁ దన్నుంబురికొల్పఁ గత్తిఁ దూసి సంగుని జంపుటకై వాని మీఁద దుమికెను. అంతలో సురేశమల్లుఁ డడ్డువడి సంగుని రక్షింప వారలకు మహాకలహము సంభవించె. ఆయర్చకురాలును మిక్కిలి భయపడి తన నెక్కడ చంపుదురో యని గుహవిడిచి పారిపోయెను. ఆమెచిన్నగుహ రాజపుత్రుల హుంకార భీషణములతోను ఖడ్గసంఘట్టనములతోను ప్రతిధ్వనుల నిచ్చెను.

ఆదినమున వ్యాఘ్రగిరికి సమీపమున నొకపల్లెమువద్ద రహతూరు వంశస్థుఁడగు నొక రాజపుత్రుఁడు గుఱ్ఱముపై జీను వేసికొని యెక్కడికో పయనమగుటకు సిద్ధముగ నుండెను. అప్పుడు వాని యొద్దకు నొక పురుషుఁడు తన గుఱ్ఱమును మిక్కిలి వేగముగాఁ బరు

గొత్తించుచు వచ్చెను. అతని శరీరమున నైదు కత్తిపోటు లుండెను. వాని గుఱ్ఱము మిక్కిలి యలసట పడి నోట నురుగులు గ్రక్కుచుండెను. రక్తమున స్నానము చేసినట్లు వాని దేహ మంతయు నెఱ్ఱబడి యుండెను. బాణము తగులుటచే నొకకన్ను పోయి యుండెను. రహతూరు వంశస్థుఁడు నీవెవ్వఁడ వని వాని నడుగ నాతఁడు „నేను రాయమల్లు కుమారుఁడగు సంగుఁడను నన్ను నాసోదరులు చంపనెంచి’’ రని చెప్ప రహతూరుఁడు వానికభయమిచ్చి చేయూతయిచ్చి గుఱ్ఱముపైనుండి దింపి సేదఁదేర్చు నప్పటికి వారియెదుట గుఱ్ఱపుదళము వచ్చుచున్న జాడ దెలుపుదు మ్మగుపడెను. అది చూచి సంగుఁడు „అదె నాతమ్ముఁడు జయమల్లుఁడు నన్నుం దెగటార్చుటకు వచ్చుచున్నాఁడు. పృథివిరాజు సురేశమల్లుఁడు నొండొరులం దాఁకి పోరి యలసటఁ జెంది కదలలేక యచ్చటనే యుండి’’ రని పలికెను. రహతూరు వంశస్థుఁ డామాటలు విని „భయములేదు. ఈమఠములోనికి వారురాకుండ నేను నిలిచెదను. ఇంతలో నీవు నిరపాయముగఁ బారి పొమ్మని ధైర్యముఁ జెప్పి వాని నావలకుఁ బంచె. అంతఁ గొంతసేపటికి జయమల్లుఁడు వచ్చి రహతూరు వంశజునిఁ జూచి “సంగుని మాకప్పగింపవలసిన’’ దని యడుగ నతఁడు సంగుఁడు నన్ను శరణుఁ జొచ్చెగావున నతని నప్పగింపనని నిర్భయముగాఁ బలికెను. అప్పుడు జయమల్లుఁడు „అట్లయిన మేమే వానినిఁ బట్టుకొనెద’’ మని మఠముం బ్రవేశింపఁబోవ రహతూరుఁడు కోపాయత్తుఁడై కత్తిదూసి జయమల్లుని వానిసేనను లోనం జొరనీయక నిరోధించె. అంతట కొండొకసేపువఱకు సందడికయ్యంబు జరుగ శరణాగత బిరుదమును బూనిన రహతూరుఁడు ప్రాణములు విడిచెను. అతఁడు గూలిన వెనుక జయమల్లుఁడు మొదలగు వారు మఠముం జొచ్చి యందు సంగుని గానక యతఁడు మఱల తప్పించుకొని పారిపోయె నని విషాదము నొంది చనిరి.

ఈవార్త రాయమల్లునకుఁ దెలిసినతోడనే యతఁడు పృథివి రాజును మందలించి జీవాట్లుపెట్టి యిట్లనియె. "నా గారపు కొడుకగు సంగుని నాకు దక్కనీయక దుండగీడ వైతివి. పాపము వాఁడు నీకు వెఱచియేగదా నిలువనీడలేక యడవులఁ గొండలఁ గ్రుమ్మరుచున్నవాఁడు. నీమొగముఁ జూడరాదు. నావద్దనుండి లేచిపొమ్ము. పోయి నీ వెప్పుడు పోరాటములె కోరుచుందువు గావున యెందేని పోరులు సలుపుచు బ్రతుకుము.

అభిమాన ధనుఁ డగు పృథివిరాజు తండ్రిపలుకులు విని కోపముఁ జెంది తనగాయములు కుదిరిన వెనుక తండ్రివద్ద సెలవు గైకొని యొక గుఱ్ఱము నెక్కి యైదుగురు సేవకులను వెంటఁ గొని తన యాయుధముల సంగ్రహించుకొని తాను గొప్పకార్యములఁ జేసి ప్రసిద్ధుఁ డైనప్పుడు గాని మరలఁ దండ్రియింటికి రాఁగూడ దని నిశ్చయించుకొని యిల్లు విడిచి విదేశములపాలై పోయెను.

రాజస్థానమున గద్వారను చిన్నదేశము కలదు. దానినిఁ బూర్వము మీనవంశజు లగు రాజు లేలుచుండిరి. చిత్తూరురాజు లా దేశమును మీనకులజులవద్దనుండి జయించి పుచ్చుకొని తమపాలనలో నుంచిరి. రాయమల్లుని సోదరుఁడు మీవారుపాలించిన కాలముల గద్వారుసంస్థానము మీవారునకు లోఁబడక స్వాతంత్ర్యము నొందెను. రాయమల్లు మఱల దానిని లోబఱచుకొనలేకపోయెను. పృథివిరా జిల్లువిడిచి క్రమక్రమముగా నాదేశమును జేరెను. అతఁడు పోవునప్పటి కాదేశమునం దంతట బందిపోటుదొంగలు నిరంకుశవర్తనులయి పట్టపగలు దోఁపుడులు చేయుచు చెలరేఁగి యుండిరి. మీనవంశజుఁ డొకఁ డాదేశమునకుఁ దానుఁ బ్రభువునని చెప్పుకొనుచుండును; కాని యతని యధికారము పేరునకు మాత్రమే. రాయమల్లుఁ డాదేశమున నతని యధికారము స్థాపింపలేకపోవుటయే గాక దొంగల దౌర్జన్యమును సహింపలేక పోయెను. పృథివిరా జాదేశమును జయించి

మఱలఁ దనతండ్రి కర్పింపవలయు నని నిశ్చయించుకొని యేదేని యుపాయము దొరకకపోవునా యని ముఖ్యపట్టణమునకుఁ బోయెను. ఇంతలో నతనివద్దనున్న ద్రవ్యమంతయు వ్యయ మయ్యెను. అతని యనుచరు లతనికన్న నిరుపేదలై యుండిరి. తన యనుచరులకుం దనకు నొకపూఁట బసయు నన్నమును సమకూర్చుకొనుటకుఁ దన వ్రేల నున్న వజ్రపు టుంగరము గొదువబెట్టుటఁ దప్ప గత్యంతరము కానఁ బడదయ్యె. అతఁ డాయుంగరమును దీసికొనిపోయి ఓజుఁ డనునొక వర్తకునికిఁ జూపి దానిమీఁద కొంతసొమ్ము నడిగెను. దైవవశమున నావర్తకుఁడు మును పాయుంగరమును పృథివిరాజున కమ్మిన యతఁడే యయ్యెను. ఆవణిజుఁ డాయుంగరమును, రాజకుమారుని గుర్తుపట్టి తద్వృత్తాంతము వినఁగోర పృథివిరాజు తనసంకల్పమును మర్మము విడిచి యతనితోఁ జెప్పెను. అది విని వర్తకుఁడు సంతసించి యుపాయముచే గద్వారుదేశము ననాయాసముగ గెలువవచ్చు నని యతనికి ధైర్యము చెప్పి వానికిం బ్రోద్బల మొసంగెను.

అనంతరము పృథివిరాజు నేర్పరియగు నోజుని యాలోచనము విని మారువేసము వేసికొని యూరుపేరు దెలియనియట్లు తన యనుచరులతోఁ గూడి యచ్చట మీనవంశపు రాజునొద్ద కొలువుకుఁ గుదిరి వానికి మిక్కిలి విధేయుఁడై భక్తిశ్రద్ధలతోఁ బరిచర్య సేయుచుండె. ఇట్లుండ నొకనాఁడు పండుగ రాఁగా మీనరాజు నమ్మికగల తనబంట్ల కందఱకు సెలవిచ్చెను. పృథివిరాజును వానివలన సెలవుఁ గైకొని తన యనుచరులనుమాత్రము కోటలో రాజువద్ద నిలిపి తాను పండుగసౌఖ్య మనుభవింపక యూరిబైట చెట్లచాటున దాఁగుకొనెను. అంతలోఁ గోటలోఁ బృథివిరాజుచే విడువఁబడిన సేవకు లైదుగురు పరివారశూన్యుఁడై యొంటిగనున్న మీనరాజుపయిం బడి వానిం దుదముట్టింపఁ దలంప నతఁడు ప్రాణభీతుఁడై గుఱ్ఱముపై నెక్కి కోటవెలువడి యూరుబైట కొండలలోఁ బలఁ దాఁగుకొనుటకుఁ

పారిపోవుచుండెను. అతఁడు వచ్చు దారిలోనే చెట్లచాటున దాఁగి యున్న పృథివిరాజు తనపన్నినకుట్ర నిర్విఘ్నముగ నెఱవేఱినందుకు సంతసించి పఱుగెత్తుచున్న మీనరాజును బట్టుకొని బల్లెముతోఁ బొడిచి వాని కష్టము నంతము నొందించెను. పిమ్మట మీనరాజు పరిజనులు కొంత యాగడము సేయ పృథివిరాజును వానియనుచరులును వారినోడించి పట్టణము పరశురామప్రీతిఁ గావించి దేశమును స్వాధీనముఁ జేసికొనిరి. పృథివిరాజు తాను సర్వస్వతంత్రుఁడయ్యు నాదేశమునకు రాజగుట కిష్టము లేక యోజుని దానికిఁ బాలకునిగాఁ నియమించి తనతండ్రి పేరనే పాలింపుమని వానికిఁ జెప్పి తనకక్కడ కాలు నిలువకపోవుటచే ననేక సాహసకార్యము నింక నొనర్చి ప్రఖ్యాతిం గాంచవలయునని గద్వారు విడిచి యనుచరసమేతుఁడై యన్యదేశములకుఁ బోవ నిశ్చయించుకొనెను.

ఆకాలమున మీవారురాజ్యమునందలి బదనూరు పట్టణములలో రాజ్యభ్రష్టుఁడైన యొకరాజపుత్రప్రభు వుండెను. అతని రాజధాని తోడా యనుపట్టణము. అతఁడొకతురకరాజువలన జయింపఁబడి యూరువిడిచి తల దాఁచుకొనుటకు బదనూరునకువచ్చి మరలఁ దనరాజ్యమును దాను సంపాదించుకొనుటకనేకపర్యాయములు సేవకులఁ బంపి విఫలప్రయత్నుండై యూరకుండెను. ఆరాజునకు తారాభాయి యనునొక చక్కని కూఁతురు గలదు. ఆబాలిక సూర్యరశ్మి రాని యంతఃపురములఁ గూపస్థమండూకమువలెఁ బడియుండుటకిష్టము లేక ఘోషావిడిచి విల్లువంచుటయుఁ గత్తిదూయుటయు గుఱ్ఱపు సవారు చేయుటయు ఫౌజులం గూర్చుకొని కయ్యములు నడపుటయు నేర్చి తండ్రినిమరలరాజ్యప్రతిష్ఠితునిఁ జేయ నిచ్చగించె. ఆవన్నెలాడి చక్కఁదనమును సాహసమును విని జయమల్లుఁడు తన కాకన్నియ నిమ్మని తండ్రికి సందేశ మంపెను. ఆమెతండ్రి యామాట కుత్తరమును దానియ్యక యాపని కూఁతురుమీఁదనే పెట్టఁగా నామె

నాతండ్రి కేవలము మరల రాజ్యము సంపాదించి యిచ్చునో యతఁడే నాపాణిగ్రహణము సేయుగాక" యని యుత్తర మిచ్చెను. జయమల్లుఁ డట్లు చేయుదు నని ప్రమాణముచేసి నమ్మిక పొడమునట్లు సంచరించి తారాదేవినిం జూడఁగోర నామెతండ్రి దాని కంగీకరించె. వా రుభయులు పరస్పరసందర్శనము చేయువేళ జయమల్లుఁ డామె చక్కఁదనమును జూచి పరవశత్వముఁ జెంది మతిభ్రష్టుఁ డౌటచేతనో లేక రాజపుత్రు లందఱు మైకమునిమిత్తము ద్రావు నల్లమందు మద్దతు మితిమీరఁ ద్రావుటచేతనో యామె గౌరవమునకుఁ దనగౌరవమునకుఁ దగనట్లు వర్తించి యాబాలిక నవమానించె. వెంటనే యభిమాననిధియగు నామెతండ్రి ఖడ్గపాణియై వచ్చి జయమల్లుని నిలుచున్నవానిని నిలుచున్నయట్లు ఖండించివైచె.

జయమల్లుని మరణవార్తలు రాయమల్లుమహారాజునకుఁ దెలిసినప్పుడు వాని కొలువునందున్న రాజపుత్రు లనేకులు క్రోధోద్దీపితులై తారాదేవితండ్రినిం దెగటార్చి పగదీర్చుకొనక తప్పదని రాణాతో విన్నవించిరి. రాణా వారిని వారించి యిట్లనియె. రాజ్యమును గోల్పోయి నిలువ నీడలేక మనయండనుండి యెట్టెటో కాలక్షేపము సేయుచున్న యారాజున కింత యవమానము చేసినవాఁడు నాకొడుకైనను జావవలసినవాఁడే, మానరక్షణమునకై యీసాహసమొనర్చిన యారాజుశౌర్యమునకు మెచ్చి బదనూరుభూముల నతనికి బహుమానములుగ నిచ్చుచున్నాను.

అంతం గొన్నినాళ్ళకు పృథివిరాజు తనసోదరుని మరణమును తారాదేవి యొనర్చిన ప్రతిజ్ఞయు విని సత్వరంబుగ బదనూరునకువచ్చి తన్ను వివాహమాడు మని యామె నడిగెను. తనతండ్రిని రాజ్యప్రతిష్ఠితునిఁ జేయువానినేగాని వివాహమాడ నని యామె మొప్పటియట్లఁ బలుకుటయుఁ బృథివిరా జట్లుచేయుదునని శపథముచేయ వానిసాహసములయందు నమ్మిక గలిగి తారాదేవినిచ్చి యామె తండ్రి యతనికి

వివాహము చేసెను. వధూవరు లిరువురును తోడాపట్టణమును బట్టు
కొనుటకు సమయము వెదకుచుండిరి. అంతలో తురకల మొహరము
పండుగ వచ్చెను.

తురకరాజు వాని సైనికులు చుట్టములు నానందపరవశులై
యుత్సవముం జూచుచుండిరి. పండుగ కడపటిదినము నీళ్ళంబడిన
వెనుక పీరులను శవాకారముగఁ గట్టి తురకలు నాలుగువీధుల మొగ
లో బెట్టి వారియాచారప్రకారము దుఃఖించుచుండిరి. జను లనేకులు
గుంపులుగూడి యావినోదమును జూచుచుండిరి. అప్పుడు గంభీరా
కారములును చిత్రవేషములుం గలిగినమువ్వురు మనుష్యు లాగుంపులో
గానఁబడిరి. తురకరాజు తన మేడమీఁద నుండి యాయుత్సవమును
జూచుచు క్రొత్తమనుష్యులపై దృష్టినిలిపి వారెవ్వరని ప్రక్కవారి
నడిగెను. ఆమాటలు వానినోటనుండి కడదేరకమునుపె రివ్వు
రివ్వున నొకబాణ మాగుంపులో నుండి వెడలి నిలుచున్న యారా
జును గుభాలున నేలంబడవైచి శవముగఁ జేసెను. అంతట నగరమం
తయుఁ గళవళము పుట్టెను, ఉత్సవముఁ జూడవచ్చినవారు నిర్విణ్ణులై
పరుగెత్తిరి. మ్లేచ్ఛసైనికులు యుద్ధాయత్తులైరి. ఆక్రొత్తమనుష్యులు
మువ్వురు పృథివిరాజు తారాదేవి వారిసేవకుఁడు దక్క మరొకరు
గారు. వారువచ్చిన పని నిర్వర్తింపఁబడినదిగదాయని యూరుబైటకుం
బోవుచుండిరి. అప్పుడు కొందఱు మ్లేచ్ఛసైనికులు ధైర్యము దెచ్చు
కొని వారిని దఱుమ నారంభించిరి. ఆమువ్వురు వారిని లెక్కసేయక
చనుచుండ నగరద్వారమువద్ద కొండవంటియొక యేనుఁగు వారికడ్డము
వచ్చె. తోడనే తారాదేవి ఒఱలోనుండి ఖడ్గము నూడబెరికి ఝళి
పించి తొండమును నఱికి యేనుఁగును పీనుఁగును గావించె.

అనంతర మామువ్వురు నూరుబైట సిద్ధముగానున్న తమసై
న్యముం గలసికొని యనాయకమై యరాజకమైన మ్లేచ్ఛసైన్యము
పయింబడి దానిం జెల్లాచెదరుగా జేసిరి. కాలి కొలఁది పరుగెత్తిన

వారు తక్కఁ దక్కిన మ్లేచ్ఛులు హతులైరి. తారాదేవియొక్క మనోరథము సంపూర్ణముగ సఫలమయ్యె. తోడానగర మామెతండ్రి స్వాధీనమాయెె. సాటి తురకరాజునకు జరిగిన పరాభవమును విని యజమీరును బాలించుచున్న మ్లేచ్ఛప్రభువు పృథివిరాజును దండింప వలయునని నిశ్చయించుకొనెను. ఆవార్త విని పృథివిరాజు వాఁడు తనమీఁదికివచ్చువఱకుఁ గనిపెట్టుకొని యుండక తానే వానిమీఁదికి ముందుగ యుద్ధమునకు సిద్ధమయి సైన్యముం గూర్చుకొని తనజాడ వారెఱుంగకుండ నడిరేయి పయనముఁ జేసి యుదయ మగునప్పటి కాయూరుఁ జేరి వారిదళంబుల నోడించి కోట నొక్కపూఁటలోఁ బట్టుకొనియె.

రాయమల్లుఁడు తనకుమారుని మహాసాహసములు విని యానందభరితుఁడై వానిం దనసన్నిధికి రమ్మని వర్తమాన మంపె. జయమల్లుఁడు కులమునకు పరాభవము దెచ్చి దుర్మరణము నొందుటయు సంగునిజాడ యొక్కింతయుఁ దెలియరాకుండుటయుఁ దలంచి రాయమల్లుఁడు పృథివిరాజొక్కఁడే తనకుం గొడుకని యెంచి చిత్తూరునకు రావించి వానిని సబహుమానముగా నాదరించె. పృథివిరాజును తండ్రికి విధేయుఁడై యుండఁదలంచెను, కాని వానికిఁ జిత్తూరునగరమున శూరకర్మలుమాని సోమరియై భోగపరాయణుఁడై యుండుట కిష్టము లేకపోవుటచే తనయిచ్ఛవచ్చిన తెఱంగున వీరవిహారము సలుపుటకు మీవారుదేశమున పడమటిభాగమున నున్న కమల్మియర్ కోటలోఁ గాఁపురము చేయఁదలంచి యచ్చటికిఁ బోయెను. ఆకోట యిప్పుడు మిక్కిలి పాడుపడియున్నను మిగిలినభాగములం జూచువారికి దాని తొంటిగొప్పతనము తెలియకపోదు. దృఢమయిన రాతిగోడలు మహోన్నతము లయినగోపురములు గుమ్మటములు మంచిమంచి మేడలు గలిగి యాకాలమున నది సకలసౌఖ్యనిధానమై శత్రుదుర్భేద్య మయి యుండెను. పృథివిరాజందు భార్యాసమేతుఁడై వసియించి దుష్టుల

దండించుచు దొంగల నడఁచుచు హాయిగ నుండె. రాజపుత్రులనేకు లామహావీరునిఁ గొలుచుటకు వచ్చి యాతనికై చిచ్చురుకున్న నురుకుటకు సిద్ధముగ నుండిరి. ఇట్లుండి పృథివిరాజొకనాఁడు తండ్రిని దర్శించుటకు చిత్తూరునకు వచ్చెను. అప్పుడు రాయమల్లుఁడు మాళవ రాజుయొక్క సేవకునితో మిక్కిలి చనువిచ్చి తనగౌరవమునకు దగ నట్లు వానితో మాటలాడఁజొచ్చె. ఆసంభాషణము విని పృథివిరాజు సేవకుఁడు చనినవెనుక తండ్రినిఁ బిలిచి యట్టినీచుల కంత చను విచ్చి మాటలాడుట రాణావంటివాని కనుచిత మనియు నాఁడుజరిగిన సంభాషణము తన కేకాక రాజబంధువుల కందఱకు నలుక పుట్టించిన దనియు నట్టిచనువు లింక నియ్యగూడ దనియు జెప్పెను. రాయమల్లుఁ డామాటలు విని కుమారునితో "నాయనా! నీవు మహాసాహసుఁడవు రాజులంబట్టి బంధింపఁగలవు. నాకంత ప్రయోజకత్వము లేదు. నేను చుట్టుప్రక్కరాజులతో మంచిమాట చేసికొని యెట్లో నారాజ్యము గాపాడుకొను చున్నాఁడ" నని ప్రత్యుత్తర మిచ్చెను.

పృథివిరా జది విని తండ్రికి మాటలతో నుత్తర మియ్యక వెంటనే యుచ్చోటు వాసి తన నెలవునకుం బోయి యొక సేనం గూర్చుకొని మాళవదేశముపై దండువిడిసె. మాళవరాజు వానిదౌర్జన్యమునకు సైపక మహాసేనాసమేతుఁడై వేశ్యాంగనల యాటపాటలు, హెగ్గడల హెచ్చరికలు, వందిమాగధుల కైవారములు సెలంగ మహేంద్రవైభవముతోఁ గయ్యమునకు బయలుదేరెను. ఈమహాసేన యొకనాటిరేయి యొకచో విడిసియుండి సంగీతసాహిత్యములతో మహాకోలాహలము చేయుచుండ రాజు గుడారమునకు సమీపమున పెద్దకలకలము పుట్టెను. అది యేమగు నని కొందఱు చూచునప్పటికి శూరశిఖామణులు కొందఱాయుధపాణులై గుఱ్ఱముల నెక్కి శిబిరముం జొచ్చి నిర్భయముగా రాజున్నకడ కరుగుచుండిరి. ఆకస్మికముగా శత్రువులు పయింబడుటచే మాళవసైనికులు నిశ్చేష్టులై పగతురను

నిలువరింప నేరరైరి. అప్పుడు పృథివిరాజు సింగపుంగొదమవ్రాలె మాళవరాజున్న గుడారములోనికి దుమికియామహారాజుం జెరబట్టవాని సైనికులు రిచ్చవడి చూచుచుండ వానిం గొనిపోయెను. అంతఁ గొంత వడికి మాళవసైనికులు ఱిచ్చవాటునుండి తేలుకాంచి యాయుధముల సంగ్రహించి తమరాజును విడిపించుటకు పృథివిరాజు వెన్నంటి తఱుమఁ జొచ్చిరి. ఆసైనికులు తనకుఁ గూతవేటుదూరంబునకు వచ్చినప్పుడు పృథివిరాజు వారిని వారించి సమీపమునకు రావల దనియు సాహసించి రాజును విడిపించుటకు వచ్చి రేని రాజు నప్పుడె పొడిచి చంపెద ననియు రాక నిలిచినపక్షమున రాజున కేయపాయమును సేయ ననియు మాళవరాజును తనజనకుని పాదములపయిం బడవైచి మఱి వానిని విడిచిపుత్తుననియు వారికి సందేశ మంపెను. ఆమాటలు విని మాళవ సైనికులు వెనుకకుం జనిరి.

పృథివిరాజు మాళవేంద్రుని దీసికొని చిత్తూరునకుఁ బోవునప్పటికి రాయమల్లుఁడు కొలువుఁదీర్చి యుండె. వీరరసావతారుఁ డగు కొడుకును బిక్కమొగముతో నున్నమాళవపతినిఁ జూచి రాయమల్లుఁడు మాళవపతి నదివర కెన్నఁడు జూచియుండమి నతఁ డెవ్వ రని కొడుకుం దఱచితఱచి యడిగెను. కొడుకు తండ్రితో "నీతఁ డెవ్వఁడో నేను చెప్పను. తొల్లి మిక్కిలి చనువుతో మీతో మాటలాడిన యాసేవకునిం బిలపింపుఁడు. అతఁడే చెప్పగలఁ" డని పలికెను. రాణా యాసేవకునిం బిలిపించి యతఁ డెవ్వఁ డని యడుగ నాతఁడు మహేంద్రవైభవుఁ డగు తనయేలిక యంత నీచదశలో నుండుట గనుంగొని ఱిచ్చవడి నోట మాటరాక యెట్టకేల కతఁడు మాళవేంద్రుఁ డని రాణాతో విన్నవించెను. రాణాయును వాని సామాన్యునట్లాదరింపక రాజునకు దగుగౌరవముతో నాదరించి చిత్తూరులోఁ గొన్నిదినములుంచి వానివద్దనుండి కప్పము గ్రహించి లోఁబఱచుకొని సబహుమానముగ విడిచిపుచ్చె. పృథివిరాజు తండ్రికి తనప్రతాపముఁ జూప

గలిగెగదా యని సంతసించి మఱల కమలమియరుకోటకుం జనియె
ఇట్టిశూరకర్మల పృథివిరా జవలీలగా ననాయాసముగఁ జేయుచుండును
గాని వానికై పెద్దప్రయత్నముఁ జేయ నక్కఱలేదు.

పృథివిరాజు కమలమీయరుకోటకుఁ బోయి కొన్నిదినము
లుండునప్పటికి వాని పినతండ్రి యగుసురేశమల్లుఁడు రాణాపై తిరు
గబాటు చేసి యుద్ధమునకు సిద్ధమయ్యెను. పూర్వము చారుణీదేవి
యర్చకురాలు తనకు ప్రభుత్వము రాజ్యము వచ్చునని చెప్పినమాట
మనసులో నుంచుకొని సురేశమల్లుఁ డది యెంతకాలమునకు సఫలము
కాదయ్యెనని వగచి 'సాహసేలక్ష్మి' యనుమాట నమ్మి భుజబలము
చేత రాజ్యము సంపాదింపఁదలఁచి తనసోదరుఁడును మహారాణాయు
నగురాయమల్లునిమీఁద గత్తికట్టెను. రాణాకు మున్ను మిక్కిలి నమ్మ
కము గలవాఁడును దగ్గరచుట్టము నగు సారంగదేవుఁ డనురాజ
పుత్రుఁడు రాజద్రోహియై సురేశమల్లునితోఁ జేరెను. వారిఱువురుం
గలిసి మీవారుదేశముం జొచ్చి గ్రామంబుల దోఁచుకొని గృహంబుల
పరశురామప్రీతి గావించి కొంత దేశము నాక్రమించిరి. రాయమల్లుఁడు
తనసైన్యములం గూర్చుకొని వారిపై నడచి యెదుర్కొని సంకుల
సమరము గావించి తాను నొక్కసామాన్యభుజోదువలె ఘోరి యిరువది
రెండుగాయములఁ దిని యేమియుం జేయలేక యుండెను. అప్పుడు
రాయమల్లుని సైన్యము పగతురచేత నిర్మూలింపఁబడుటకు సిద్ధముగ
నుండెను. అంతలో పృథివిరాజు వచ్చి తండ్రిసేన నిర్మూలింపఁబడ
కుండఁ గాపాడెను; కాని శత్రువులను పరాజయము నొందింపలేదు.

ఉభయుల సేనలు నొండొంటికి తీసిపోక వెనుకంజ యిడక చావు
నకు వెరువక రాత్రులాయుధములమీఁదనే బవ్వళించుచు నెప్పుడు
తెల్లవారు నెప్పుడు పోరుసేయఁ గలుగునని యువ్విళులూరుచు దినము
లం బుచ్చుచుండిరి. అట్లుండ నొకనాఁడు రాత్రి సురేశమల్లుఁడు
మంచముపైఁ బండుకొని వ్రణవైద్యుఁ డగునొకమంగలివానిచే

గాయములఁ గట్టించుకొను చుండెను. అప్పుడు పృథివిరాజు మెల్ల మెల్లగ శిబిరముం జొచ్చి సైనికులచేఁ జిక్కకుండ పినతండ్రి గుడారమునకు వచ్చి వానికెట్టెదుట నిలిచెను. వానిం జూచి సురేశమల్లుఁడు భయవిస్మయములతో బలిమిని లేచెను. లేచునప్పటి కదివఱకు కుట్టినగాయములన్నియుఁ బటాలున బగిలి నెత్తురులం గ్రక్కఁజొచ్చె. పృథివిరాజు వానిసంభ్రమము వారించి భయములేదని సేమ మడిగెను. సురేశమల్లుఁడును "నాయనా! సుఖముగానున్నాను. నీరాకచే మఱింత సుఖము గలిగినది సుమీ" యని కుమారునకుఁ బ్రత్యుత్తర మిచ్చెను. పిదప పృథివిరాజు 'నేను మిక్కిలి యాఁకలిగొనియున్నాను నిన్నెప్పుడు చూతునో యెట్లుచూతునో యని బెంగగొని మాతండ్రి నైనం దర్శింపక యన్నమైనం దినక నీతావునకు వచ్చితిని. నాకించుక యన్నము బెట్టింపు' మని పినతండ్రిని బ్రార్థించె. సురేశమల్లుఁడు నన్నము తెప్పింప పగలెల్ల నొకరిప్రాణముల నొకరు దీసికొనుటకై ప్రయత్నము చేసిన యారాచకొడుకు లిరువురు నారాత్రి జట్టరికము నెయ్యము మెరయ కలసి మెలసి భుజించిరి. అనంతరము పృథివిరాజు పినతండ్రితో "రేపు మనకయ్యమును ముగింపవలయు"నని పలుక "నాయనా! వెందలకడ రమ్ము పొ"మ్మని సురేశమల్లుఁడు బదులు చెప్పి వానిం బుచ్చె.

మరునాఁ డుదయమున యుద్ధ మారంభ మయ్యెను. ఆకయ్యమున నెప్పటియట్లు పృథివిరాజే జయమునందె. సారంగదేవుఁడును సురేశమల్లుఁడును యుద్ధభూమి విడిచి పలాయితులైరి. పృథివిరాజు వారిం దరుముకొనిపోవ నెడనెడ చిన్నచిన్నిపోరాటంబులు జరుగుచుండె. వానిలోనయిత మెప్పుడు పృథివిరాజే విజయమునందుచు వచ్చె. ప్రళయాంతకునిఁబోలు రాచకుమారునిదాడి కోడి సురేశమల్లెట్టకేల కొకయడవిం జొచ్చి యందు నట్టనడుమ దుర్భేద్య మగు నొకప్రదేశము నెలవుగాఁ జేసికొని పగతురకు తమజాడలు తెలియ

వనుకొని యచ్చట నుండిరి. అట్లుండ నొకనాఁడు రేయి నిశ్శబ్దమైన యడవిలో కత్తులరాపిడిచప్పుడు వినంబడియె. అది విని సురేశమల్లుఁడు 'మా యన్నకొడుకు వచ్చినట్లుతోఁచుచున్న'దని యింక నేమో చెప్పఁ బోవుచుండఁగనే పృథివిరాజు సపరివారముగ వానిముందరకు దుమికి ఖడ్గముతోఁ బినతండ్రి నొక్కయేటు వేయుటయు సారంగదేవుఁడు వాని కడ్డమువచ్చి "సురేశమల్లుఁడు గాయములచేఁ బీడితుఁడై కదల లేక యున్నవాఁడు. తొల్లి యిరువదిదెబ్బలకైనను సరకుసేయని యీ శూరుఁ డిప్పు డొకగుద్దునకైన నోపలేఁడు గావున నవధ్యుఁ" డని పలికె. అప్పుడు సురేశమల్లుఁడు 'నేను పోయెదనని నాయన్నకొడుకు చేతిలోనేగదా' యని పృథివిరాజువంక దిరిగి 'కుమారా! కర్మము మానుము. నీవు నన్ను జంపినది యొకలెక్కలోనిది గాదు. నాకుఁ గుమారులు కలరు వారు రాజపుత్రు లగుటచే వారికి సాయసంపత్తులు గలుగును; కాని మేము నిన్నేచంపుట సంభవించినయెడల చిత్తూరుగతి యేమగునో? నిన్నుఁజంపి నేనెల్లకాలము లోకనింద పాలు గావలసివచ్చు' నని వీరపురుషోచితముగఁ బలికెను. దయనీయము లగు పినతండ్రిపలుకులు విని పృథివిరాజు హృదయము గరుగఁ గత్తు లొరలలో నుంచుఁడని తనసైనికుల కానతిచ్చెను. పిమ్మట పినతండ్రి యుం గొడుకును నొండొరుల బిగ్గఁగౌఁగిలించుకొనిరి. తోడనే యిరు బలములు తమతమ ప్రాఁతపగలు కొండొకతడవు మరచి మరల కలసిమెలసి కూరుచుండి యిష్టగోష్ఠిం బ్రవర్తిల్లిరి.

అనంతరము పృథివిరాజు పినతండ్రిని జూచి "అయ్యా! నేను వచ్చునప్పటికి మీ రేమి చేయుచుండి,, రని యడిగెను. చేయుట కేమి యున్నది. ఉన్నమట్టుకు దిని యుబుసుపోక పిచ్చపాడి చెప్పుకొనుచుంటి మని సురేశమల్లుఁ డుత్తర మిచ్చెను. "కాని నీజాడ లరయుటకయి నేను విశ్వప్రయత్నము చేయుచుండుట నీ వెఱిఁగియు నింత యజాగ్రత్తతో నేలయుంటి" వని మరల గుమారుఁ డడుగఁ బినతండ్రి

యిట్లనియె. "నాయనా! నేనేమి చేయఁగలను? నీవు నన్నొక్కడ కాలూఁది నిలువకుండఁ దఱుముచుంటివి. నేనెచ్చట నైనతలదాఁచుకో వలయునుగదా! అందుచే నిచ్చట నుంటి" నని సురేశమల్లుఁడు ప్రత్యుత్తర మిచ్చె. ఆరాత్రి యట్లుగడపి మఱునాఁడుదయమున పృథివిరాజు పినతండ్రిని జూచి యచ్చటకు సమీపమున నున్న భవానీదేవాలయమునకుఁ దనతో వచ్చి యాదేవికి బలి సమర్పింపు మని యడిగెను. సురేశమల్లుఁడు లోకానుభవ మెఱింగినవాఁ డగుటచే పృథివిరాజు దన కీనెపమున నేదేని యపాయము సేయునని యనుమానించియో యుంకుమున్ను కొన్నినెలలనుండి తెఱపిలేక పోరులుసలుపుచు గాయములచేఁ బీడితుఁడై కదలజాలకయో పృథివిరాజును జూచి క్రిందటి రాతిరి తగిలినగట్టిదెబ్బకే తాను కదలఁజాల కున్నవాఁడ నని వంకపెట్టి తనబదులు సారంగదేవునిం గొంపొమ్మని యొత్తి పలికెను.

ఎవరు వచ్చినను మంచిదే యని పృథివిరాజు సారంగదేవుని దనవెంట నాలయంబునకుం గొంపోయి యచ్చట వానిం జంప నుంకించుటయు నావీరుఁడును పృథివిరాజునకు లొంగక కొంతసేపు పోరొనర్చి తుదకు వానిచేత హతుఁడయ్యె. తొల్లి మీవారురాజులలో మొట్టమొదటి వానికి నప్రతిహతమగు ఖడ్గముఁ బ్రసాదించిన యామహాదేవికిఁ బృథివిరాజు భక్తిమెఱయ సారంగదేవునితల బలిగా సమర్పించి తండ్రికిఁగల ప్రాఁతపగ దీర్చికొని సంతుష్టాంతరంగుఁ డయ్యె.

సారంగదేవుని దుర్మరణవార్తఁ విని సురేశమల్లుఁ డేదియో నెపము పెట్టి యన్నకొడుకుతో జనకపోవుట చాలమేలయ్యె నని సంతసించి గుఱ్ఱము నెక్కి ప్రాణభయంబున నచ్చోటు విడిచి సపరివారముగ నొండొక యెడకుఁ బోవఁదలంచి మున్ను తాను జయించి యాక్రమించిన భూములకుం జనియె. ఆభూములలో నిరపాయముగఁ దాను నన్నినాళ్ళనుండి పగతురబారి కోడి తా నందు నిలువ లేనప్పుడు

తనభూములు రాణాకు దక్కనిచ్చుట కిష్టము లేక సురేశమల్లుఁడు రాజుకన్న బలవంతులు బ్రాహ్మణులేకదా యని నమ్మి వారికి దాన మిచ్చిన మాన్యములు రాజు మరల గ్రహించుటకు భయపడు నని యాభూములను వారికి దాన మిచ్చి తా నెందేనిఁ జనియె. రాణా సురేశమల్లుఁడు చేసిన యాపనికిఁ గోపోద్దీపితుఁడయ్యు బ్రాహ్మణ క్షేత్రములను మరల గ్రహించినచో దానును దన వంశస్థులును నఱువదివేల యేండ్లు నరకకూపకుల బాధపడవలయు నని నమ్మి యాబాధలు పడుట కిష్టము లేక బ్రాహ్మణుల జోలికి పోవక యొక దండము పెట్టి యూరకుండెను.

అనంతరము సురేశమల్లుఁడు మీవారు శాశ్వతముగ విడిచి దక్షిణాభిముఖుఁడై చని యడవుల కొండలఁ గ్రుమ్మరుచుండ నొక్కనాఁ డొక యాఁడుమేక తనపిల్లను తోడేలు కబళింపకుండ సంరక్షించు చుండఁగాఁ జూచి తొల్లిచారణీదేవి యెర్పుకురాలు తనకు జెప్పిన భవిష్యద్వృత్తాంతంబు జ్ఞప్తికిం దెచ్చుకొని యాసమయ మిప్పుడు వచ్చిన దని యామేఁకను బిల్లను తోడేలుబారినుండి కాపాడి యాప్రాంతములందె చరియించుచు మెల్లమెల్లగ నచ్చటి యాటవికుల లోబరచుకొని చుట్టుప్రక్కల దేశ మాక్రమించుకొని దేవల యను గ్రామముఁ దనకు నివాసముగఁ జేసికొని యందొక కోట గట్టి రాజై తన జీవిత శేష మచ్చటనే గడపెను. దైవయోగమున సురేశమల్లుఁడు తాను చిత్తూరునకు దొంగ యైనను యచ్చటం బుట్టిపెరిగిన వాఁడగుటచే నాపట్టణమందును మీవారుదేశమునందును ప్రేమము విడువఁజాలక తా నాపురముం దభిమానము గలవాఁ డగుటయేగాక యెల్లయపుడు చిత్తూరునే మాతృస్థానముగ నెంచుకొనవలసిన దని తనకొడుకుల కవసానకాలమున జెప్పిపోయె. ఆమాటలయందు వాని కొడుకులు విశ్వాసముంచుటచేతనే చిత్తూరున కగ్బరుచక్రవర్తి వలన మహాపాయము వాటిల్ల రాణా యప్రయోజకుఁడై చావునకు వెఱచి

యిల్లు దూరినప్పుడు సురేశమల్లుని తనయులలో నొకండు చిత్తూరు నిమిత్తము తనప్రాణములు ధారవోసె.

ఇట్లు పినతండ్రిని స్వదేశమునుండి పారదోలి యనంతరము పృథివిరాజుతనయన్నయగు సంగుఁడప్పటికిని జీవించియున్నవాఁడనియు వానికి వివాహ ప్రయత్నములు జరుగుచున్నవనియు విని తొల్లి చారుణీదేవి యర్చకురాలు చెప్పినమాట తలంచి సంగుఁడు జీవించి యుండినచోఁ దనకు రాజయోగముఁ బట్టదని వానిని వెదకి వెదకి జంపుటకు బయనమైపోవ నిశ్చయించుకొనియె. అంతలో వానిసోదరి వచ్చి దీనమగు తనవృత్తాంతముఁ జెప్పి సోదరుని పయన మాపెను.

రాయమల్లుఁడు తనకూఁతును సిరోహిదేశపు రాజున కిచ్చి వివాహము చేసెను. ఆకన్యక చక్కఁదనంబునకును సౌజన్యతకును పాతివ్రత్యమునకును బేరువడసిన యోగ్యురాలైనను మగఁ డామెను నిరంతరమును దగిన యాదరణము సేయక నీచముగా జూచుచుండెను. ఆరాజు నల్లమందు మద్దత్తు మితిమీరునప్పుడు దాని యొడ లెఱుంగక భార్యను కొప్పుపట్టి పాన్పుమీఁదనుండి లాగి రాత్రియంతయు గటికి నేలం బండుకొన జేయుచుండెను. అభిజాత్యముగల రాజకన్యక కంత కంటె నెక్కుడవమానము లేదు. కావున యాబాలిక తనదైన్యమును బాపుమని సోదరునకు విజ్ఞాపనము నంపుకొనియె. పృథివిరాజు సోదరీవత్సలుండై సంగునిమీఁదికి బోవలసిన పయనము మాని సిరోహి పట్టణమునకు బయనమైపోయి యానగరముఁ జేరి యర్ధరాత్రమున నెవ్వ రెఱుంగకుండ కోటగోడలందాఁటి యంతఃపురము బ్రవేశించి సందుకొన్నగదిలో నిలిచె. అప్పుడు సిరోహిరాజు నల్లమందుమత్తుచే మేనుమఱచి మంచముపైఁ బవ్వళించి యుండె. వానిభార్యయు భర్తచేత నవమానింపఁబడి వట్టినేలం బండుకొని యుండె.

పృథివిరాజు తన గారాపుఁ జెలియలి దురవస్థ గన్నులారఁ గనుంగొని కోపావేశంబున పరవశత్వంబు జెంది పరాభవానలమును

జల్లార్పగోరి నిద్రించుచున్న మరఁది మీఁదికి ఖడ్గము నెత్తెను. తన యన్న మగనిం దెగటార్చుటకు నుంకించుట జూచి యాబాలిక మహా పతివ్రత యగుటచే నట్టి క్రూరకార్యమునకు నిష్టపడక సోదరుని వారించి భర్తప్రాణముల రక్షించెను. ఈకళవళములో సిరోహిరాజు మేలుకాంచి యమదూతవలె నెదుట నిలిచిన బావంజూచి భయముచే వడఁకుచుండ పృథివిరాజు వాని నుద్దేశించి యిట్లనియె. 'నీవు మా చెలియలికిఁ గావించిన పరాభవమునకుఁ దగిన ప్రాయశ్చిత్తంబుజెప్పెద వినుము. నీ వామె పాదములంబడి వేఁడుకొని యామె చెప్పుల నీ తలం దాల్చితివా నిన్ను రక్షించెద. లేనిచో నొక్కవ్రేటున నిన్నుఁ గడతేర్చెద,' నని గంభీరనాదముతోఁ బలుక నానల్లమందు పిఱికి చేయు నదేమియు లేక ప్రాణభయంబున నాపని కొడంబడి యట్లు చేసె.

తన చెప్పినచొప్పున నతఁడు కావించినతోడనే పృథివిరాజు మరదిం గౌఁగిలించుకొని వానిపై నెనరు కలిగి యాదరింప వారిరువురు కలసిమెలసి సౌహార్దమున నుండిరి; కాని రాచకొమరునకు భార్యచెప్పులు నెత్తినిదాల్చుటకన్న నెక్కుడవమానము లేదు. కనుక సిరోహిరాజుహృదయమున నీ పరాభవాగ్ని రవులుచుండె. పందయగుటచే నప్పుడేమియుఁ జేయలేక యతఁడు సమయమునకయి నిరీక్షించుచుండె. పృథివిరాజు రాచనగరు దొంగతనముగాఁ బ్రవేశించినను రాజుగారికి స్నేహపాత్రుఁడై విందుల నారగించుచు మహానందమున కొన్నిదినము లచ్చటపుచ్చి తన కమల్మీరుకోటకు బోవ బయనమై మరఁదిని వీడుకొనియె. సిరోహి మంచి మంచి మిఠాయిలకు బ్రసిద్ధికెక్కిన దగుటచే రాజు మార్గమధ్యమున దినుటకని పృథివిరాజునకు గొన్ని భక్ష్యముల నొసంగె.

పృథివిరాజు తనపై తనతండ్రిపైఁ గత్తికట్టిన పినతండ్రి శిబిరమునకు బోయి నిర్భయముగ నిశ్శంకముగ సన్నుమతిన సాహసికుఁ డగుటచేఁ దన బావయిచ్చిన భక్ష్యములనుగూడ మనంబున నేయును

మానంబు నిలుపక పుచ్చుకొని మార్గమధ్యమున వానిని భక్షించెను. భక్షించి కొంత దవ్వరుగునప్పటికి వానిగుండెలు బరువెక్కెను. నోట మాట రాదయ్యెను గుఱ్ఱముపైఁ గూరుచుండలేక పోయెను. అతఁ డప్పటికి దనకోటకు కొంతదూరములోనున్న మామాదేవి యాలయమువద్దకు వచ్చె. అక్కడనుండి యొకయడుగైన గదలలేక యతఁడు కడసారి తనప్రియురాలిని గనుంగొనఁగోరి తారాదేవి నచ్చటికి రమ్మని వర్తమాన మంపెను; కాని యాదేవి వచ్చులోపలనె తనకు బ్రియనిదానంబైనయాకోటపై దృష్టినిలిపి చూచుచు సిరోహిరాజు చేసిన విషప్రయోగముకతంబున ప్రాణంబుల విడిచె.

అనంతరము తారాదేవి యచ్చటకు వచ్చి భర్తకళేబరమును గాంచి విలపించి వీరపుత్రికయు వీరపత్నియు నగుటం జేసి పతివ్రతల మార్గ మనుసరింపనిశ్చయించి భర్తకు జితిపజేపించి నిర్విచారముగ స్వయంవరమునకరుగు కన్యకవోలె చిచ్చురికి తన భర్తతో గూడ పరమపద మొందెను. ఇప్పటి కాదంపతులు గతించి రమారమి నాలుగువందల సంవత్సరము లైనను మామాదేవిగుడివద్ద నేటికిని తద్దంపతులు తమదేహములు నగ్నిహోత్రున కాహుతిచేసిన స్థలము గనఁబడుచుండునఁట. పృథివిరాజు తనచేసిన యుద్ధములన్నిఁటియందు జయము కపటోపాయములచే నొందినను మొత్తముమీఁద నతఁ డధికసాహసుం డనియు రణమున వెనుకంజ యిడని వాఁడనియు పిఱికి కండలేనివాఁ డనియు జెప్పవచ్చును.

అన్నను జంపి తాను చిత్తూరు సింహాసన మెక్కఁ దలఁచుట యీతనియం దొక గొప్పలోపమే యనవచ్చును. ఈతఁడు గాక రాజపుత్రులలో మిక్కిలి ప్రసిద్ధికెక్కిన పృథివిరా జింకొకఁడు కలఁడు. అతఁడు చోహాణవంశస్థుఁడు. ఢిల్లీచక్రవర్తి. అతఁడే మహమ్మదుగోరి యను మ్లేచ్ఛరాజును మొట్టమొదట జయించి మరల నామ్లేచ్ఛుఁడు కన్యాకుబ్జభూపాలుఁ డగుజయచంద్రుని గలిసి యెత్తివచ్చినప్పుడు

వారిరువురచే నోడింపఁబడి రణముఖంబున ప్రాణములు విడిచిన శూర శిఖామణి. చిత్తూరు రాజకుమారుఁడగు నీ పృథివి రాజును ఢిల్లీచక్రవర్తి యగు నాపృథివిరాజని చదువరులు భ్రమచెందఁదగదు. కాలాంతరమందాపృథివిరాజు చరిత్రముగూడ ప్రకటింపఁబడును.

రాణా సంగుఁడు.

పదునారవ శతాబ్ద ప్రారంభమునందు మీవారు సంస్థానమునం దొక మారుమూల నొక గ్రామమున బీదకాఁపు కుటుంబ మొకటి యుండెను. ఒక చిన్న మేఁకలమంద నాలుగు కాళ్ళపశువులు కట్టుకొను ముతకగుడ్డలు మొదలగునవి తక్క వారి కితర సొత్తేమియు లేదు. ప్రపంచమునం దెంతటి దరిద్రులున్నను వారికన్న దరిద్రులు కొందఱు కనఁబడుచునేయుందురు. ఆకుటుంబయజమాని యొకనాఁడు పొలమునుండి వచ్చుచుండ దారిలో చినుగుగుడ్డలు కట్టుకొని యన్నము లేక మలమలమాడుచున్న యొక క్రొత్తమనుష్యుఁడు వాని కగుపడెను. పశువులఁ గాచుట కెవనినైన నొక సేవకునిఁ బెట్టుకొనుట కదివరకే యోచించుచుండుటచే నతఁడీక్రొత్తవాని నాపనియందు నియోగించెను. ఆకాఁపువాని భార్య యీసేవకుని దెచ్చుట కిష్టపడక కొంచెము సణుగుకొని యిట్లనియె. "బ్రాహ్మణులకు బిచ్చగాండ్రకునన్నము పెట్టుట పుణ్యముగాని తక్కినవాండ్రకు దానముచేసిన నేమిలాభము. దేశములో దుర్మార్గులనేకులు పనిపాటలుమాని తిరుగుచుందురు. ఈమహానుభావుఁ డెంతటివాఁడో మన మే మెఱుగుదుము? అదిగాక పశువులను మేపుటమాత్ర మంత పైపై నున్నదా? ఆపని యందఱు జేయఁగలరా? చిన్నప్పటినుండియు యలవాటుపడిన కుఱ్ఱవాండ్రకే లొంగునుగాని పశువులు క్రొత్తవానిని దరికిఁ జేరనిచ్చునా? ఈమనుష్యుని వలన మనపని యగునని తోఁచదు."

భార్య పలుకులు కొనిమిటి మొదట సరకుచేయలేదు. కాని పిమ్మట(గొన్నినాళ్ళకవియే నిశ్చయము లయ్యెను. ఏలయన సరిగా నడువనైన లేనికుఱ్ఱవాండ్రు కట్టిపుచ్చుకొని యదలించినంత మాత్రమున గడగడ వడ(కి దారిని(బోయి దారిని వచ్చుమోటపశువు లాక్రొత్త కాపరిని లక్ష్యముసేయక విజృంభించి తిరుగ(జొచ్చెను. యజమాను(డాసేవకుని తెలివితేటలు గనిపెట్టి యత(డందుకు పనికిరా(డని యాపనినుండి తప్పించి యింటిపనులు సేయుమని వానిని నియోగించెను. అతని దురదృష్ట మేమోకాని యాత(డింటిపనులకుం బనికిరా(డయ్యె ఒకనా(డు యజమానునిభార్య రొట్టెలు కాల్చుచు తానేదో మఱియొక పనిమీ(ద లోనికిం బోయి రవి మాడిపోకుండా జూచుచుండుమని సేవకున కానతిచ్చెను. సేవకు(డు సరేయనియామాట మరచిపోయి పరధ్యానముగా నుండునప్పటి కంతలో రొట్టెలుమాడి బొగ్గులయ్యెను ఆపూట భోజనము బుద్ధితేని సోమరిపోతు మూలమున నిష్కారణముగ(జెడిపోయెఁ గదాయనియజమానుని భార్యయేగాక యింటిలోనున్న వారందఱు వానిపై మండిపడి "రొట్టెలు కమ్మగా వే(గినప్పుడు పొట్టబద్దలగునట్లు తినుటకు నీవు నోరు తెరవ(గలవు గాని యవి మాడిపోవుచున్నవేమో చూచుటకు(గన్నులు తెరవలేవు. నీవు మాకక్కరలేదు. నీయిష్టమువచ్చిన చోటికి(బొ"మ్మని చెప్పిరి.

ఆమందభాగ్యు(డామాటలు పడి బదులుచెప్పక యాయిల్లు విడిచి మెల్లఁగ నవతలకు నడచెను. పశువుల కాపరిగను వంటలవాడుగను పనికిరాకున్న నత(డు తెలివితేటలు లేనివా(డు కా(డు. అతని శరీరము సుందరమయ్యు దృఢమైయు చాకచక్యము కలదియు కష్టమున కోర్చునదియునై యుండెను. రాజపుత్రదేశమందు(బుట్టినవా(డెవ్వ(డు చేత నాయుధములేక సంచరింప(డు. ఈపురుషు(డు నిరాయుధుండగుటయేగాక నిర్భాగ్యు(డై దారిద్ర్యమునకు వెళ్ళ(బోయుచుండెను.

ధగ ధగ లాడు నతనిశరీరచ్ఛాయనుబట్టి యతఁడు కాపువాఁ డను కొనుటకు వీలు లేదు.

రాయమల్లుఁడు జ్యేష్ఠుఁడుగాఁ దగుసంగుఁడు వాఁడట్లొం మఠమువద్ద నొకరాజపుత్రవీరుని సహాయమున నెట్టెటో ప్రాణములు దక్కించుకొని యావలకు దాఁటి మహారాజ కుమారునికొఱ కెవ్వఁడును పశువుల కాపరులయిండ్లు వెదకరని నమ్మి గొల్లవాండ్రతో గలిసి మెలసి కాలక్షేపముఁ జేయుచుండెను. తాను నమ్మిన గొల్లలే తన్ను లేవఁగొట్టినప్పుడు పట్టుట కాయుధము తినుట కన్నము తలఁ దాఁచుకొనుటకు పంచ కష్టసుఖములు జెప్పుకొనుటకు మిత్రుఁడు లేని విదేశములో నిఁక నెట్లు బ్రతుకుదునా యని సంగుఁడు విచారింపఁ జొచ్చెను. అట్లు విచారించుచు నతఁ డేమియుఁ దోఁచక నడవులఁ దిరుగుచుండ నొకనాఁడు కొందఱు గుఱ్ఱపు రౌతులు వాని కగపడి వెంటనే గుఱ్ఱములనుండి దిగి వినయమున వానిపాదములపైఁ బడి నమస్కరించిరి. శరీరమునకు గాయపుమచ్చలు కొంతకురూపు దెచ్చినను ఆవిశాలలోచనములు ఆచక్కఁదనము నొకమాఱు చూచినవా రెవ్వ రతనిని మరచిపోరు. అందుచేతనే కనఁబడిన రాజపుత్రవీరు లాతఁడు తమకు ముందు రాజగునని గ్రహించి సంగుని గౌరవించి "అయ్యా! మీరు బ్రతికియున్న వార్త పృథివిరాజు విన్నపక్షమున మీ కపాయము గలుగును గనుక మేము మీరహస్యమును వెలిపుచ్చము; కాని మేము మిమ్ము విడువక సేవించుచుందుము. ఈ ప్రాంతములకు సింహస్వప్నముగా నున్న శ్రీనగరరాజుయొక్క కొలువులో మేమున్నాము. మీరుకూడ నారాజును కొలుతురేని మీకుఁ గావలసిన యాయుధములు గుఱ్ఱము నిప్పించెదము." అని వారు పలుకుటయు దాను బాగుపడుట కింతకన్న మంచిసమయము దొరకదని నిశ్చయించి సంగుఁడు శ్రీనగరరాజు కొలువు నంగీకరించి

రాజపుత్రవీరులు విశ్వాసము గలిగి తన్ను సేవింప దినమ్ము లొకతర
బడిగాఁ బుచ్చుచుండెను.

ఒకనాఁడు శ్రీనగరరాజు పరివారసమేతుఁడై ప్రయాణమున
నలసి సొలసి మట్టమధ్యాహ్నమున నెండ కోర్వలేక యొకపెద్ద
మఱ్ఱిచెట్టుక్రింద పండుకొనెను. సంగునకు వాటయందు నేర్పు కుదుర
నందున దక్కినవా రందఱు వండుకొనుచుండ నతఁడు వంట మాని
యాచెట్టుక్రింద చల్లగఁ బండుకొనెను. అన్నము వండి వాని మిత్రులు
దెచ్చునప్పటికి సంగుఁడు కత్తి తలక్రిందఁ బెట్టుకొని గాఢముగ నిదు
రించెను. ఆమఱ్ఱిచెట్టు తొఱ్ఱలోనుండి యొక మహాసర్పము వచ్చి
సంగునితలవద్ద నిలిచి పడగవిప్పి వానితల కెండ సోఁకకుండ గొడుగు
పట్టినట్లాడుచుండెను. ఆపాము పడగమీఁద చిత్రవర్ణములు గల
యొక పక్షి యవ్యక్తమధురముగాఁ గూయుచుండెను. ఆసమయ
మున నొక వెట్టిగొల్లఁ డాదారినిఁబోవుచు నిది యేమివింత చెప్పుమా
యని నోరు తెఱచి రెప్పవేయక చూచుచుండెను. తక్కిన రాజ
పుత్రులు వానిదగ్గఱకు రాఁగానే సంగుఁడు మేల్కని కన్నులు దెర
చెను. ఆగొల్లబోయఁడు నేలపైఁబడి సంగునకు సాష్టాంగనమస్కార
మొనర్చి భయసంభ్రమములతో “భళి భళీ! ఈబాబు గొప్పరాజు
కాఁగలఁడు. ఇంతప్రభువు లోకములో లేఁడు.

ఆమాటలు విని సంగుఁడు తన రహస్యము వెల్లడిచేయుట
కిష్టములేక తాను వట్టినిరుపేద ననియుఁ దన కట్టియోగము పట్టదనియు
వాదించెను. గొల్లబోయఁడు వాని పలుకులు చెవిఁబెట్టక తనకు
పాములయొక్కయు పక్షులయొక్కయు భాషలు తెలియుననియు నవి
రెండు నిద్రఁబోవువానికి మహారాజ భోగముపట్టనున్నదని చెప్పుకొన్న
వనియు దృఢముగాఁ బలికెను. సంగుఁ డప్పటికిని గొల్లవానిమాటలు
కల్లయని నిరసించెను; కాని శ్రీనగరరాజు తనకు బంటై పనిచేయు
చున్నరాజకుమారుఁడు నిజముగా బంటులాగుండక పోవుటచే నతఁ

డెవ్వరో ప్రచ్ఛన్నవేషుఁ డని నమ్మి వాని జన్మవృత్తాంతాదికము నెఱిఁగింపు మని బలవంతపెట్టి యెఱిఁగించినచోఁ దనకూఁతు నిచ్చి వివాహము చేసి రాజ్యము రావలసియున్న సాయము చేసి యిప్పించెద నని వాగ్దానముఁ జేసెను.

అప్పటికి సంగుని తమ్ముఁడు జయమల్లుఁడు నీచ మగుమరణమును బొందెను; కాని పృథివిరాజు మాత్రము మహోన్నతదశలో నుండెను. సంగుఁడు మొదటినుండియు దురదృష్టవంతుఁడే యగుటచే శ్రీనగరరాజు వానినిఁ జేరదీయుట కూఁతునిచ్చి పెండ్లి చేయుట సాయము చేయఁ దలంచుట మొదలగు వార్తలు కర్ణాకర్ణికగ పృథివిరాజునకుఁ దెలిసినందున నతఁడు తన యన్నగారిని బెద్దపులినిఁ దరిమినట్లుఁ దరిమి చంపఁ దలఁచె. అంతలో దైవయోగమున సంగుని పున్నెము బాగుండబట్టి పృథివిరాజు తన చెల్లెలి యాపదఁ గడువఁ బెట్టుటకుఁ బోయి తనకు మిక్కిలి ప్రియమయిన కమలమియరుకోటకు దిరిగి రాక యె దారుణమరణము నొందెనని వెనుకటి రాజు చరిత్రలోఁ జెప్పఁబడి యున్నది. పృథివిరాజు గతించిన కొన్నిదినములకె తండ్రి యగు రాయమల్లుఁడు మహాదుఃఖభారముచేత గ్రుంగిపోయిన యామేను విడిచి పరమపదమును బొందెను. రాయమల్లుఁడు మేవాడు దేశమున కంత యెక్కువ యభివృద్ధిని దేలేకపోయినను మునుపున్నదానిఁ జెడగొట్టకుండఁ గాపాడెను. రాయమల్లుఁడు కృపాళువై గౌరవనీయుఁడై రాజపుత్రులయం దుండఁగూడని శాంతరసమునకు స్థానమైయుండెను; కాని కొడుకులను వంచుకొనలేకపోయెను.

పితృ రనంతరమున సంగుఁడు వచ్చి సింహాసన మెక్కి చారుణీదేవి యర్చకురాలిమాటయు గొల్లబోయనిమాటయు నిశ్చయములుగా జేసి రణసింహుఁ డను పేరు వహించెను; రాజస్థానమునందె గాక యితరదేశములందును గట్టిరాజు గద్దె యెక్కెనని వెల్లడి యయ్యెను. మార్వారు, అంబరు, అజమీరు, బూంది, గ్వాలియరు, కాల్పి మొద

లగు రాజపుత్రసంస్థానములు సంగునియాజ్ఞను శిరసావహించుచు వచ్చెను. మాళవదేశము మొదలు ఆబూయను పర్వతశిఖరమువఱకు నతఁడేకఛత్రాధిపత్యము వహించెను. రాజ్యమారంభించిన వెనుక నాతఁడు పదునెనిమిది చిన్నచిన్న యుద్ధములు ఢిల్లీచక్రవర్తితోను మాళవరాజుతోను జేసి గెలుపు చేకొనుచు వచ్చెను. ఢిల్లీచక్రవర్తిని యొకమారు గాక యనేకమారులు గెలిచెను. మీవారు రాజ్యము యొక్క సరిహద్దు లన్నిప్రక్కలను పెరిగెను. ఉత్తరపు టెల్ల బయానా యను కోటవద్దనున్న పసుపుటేరు వఱకు వ్యాపించెను. సంగుఁడు మీవారురాణాలలో నెల్ల నగ్రగణ్యుఁ డగుట కొక కథ కలదు.

ఒకమారు దేవతలలో నొకఁడు మనుష్యావతార మెత్తి తన పూర్వశత్రువగు నొక మనుష్యునిమీఁద పగదీర్చుకొనుటకు భూమి మీఁదకు వచ్చి తిరుగుచు చిత్తూరునకు వచ్చెనఁట. సంగుఁడు వానిని చూడఁగనే యతఁడు మహాపురుషుఁడని గ్రహించి యాదరించి గౌర వించెనఁట. ఆదివ్యుఁడు సెలవుపుచ్చుకొని పోవునప్పుడు పటుత్వముగల యొక రక్షరేఖ నొకసంచిలోఁ బెట్టి సంగున కిచ్చి దానిని మెడలో గట్టుకొమ్మనియు నది మెడలో నున్నంతకాలము వానికి జయము గలుగుననియు నదిపోరబాటునగాని దైవవశమునఁగాని వీపుమీఁదకుఁ దిరిగినపక్షమున వానికి చెడ్డదినములు వచ్చినవని నమ్మవలసినదనియు దృఢముగాఁ జెప్పెనఁట. తనమాట నిశ్చయమని ఋజువు చేసికొను టకు దివ్యపురుషుఁడు సంగునకు నెమిలియీఁకనిచ్చి "దీనిని దీసికొని పోయి మీనగరమునందుఁ మృతినొందినవారి నందఱి దీనితో స్పృశి యింపుము. వా రందఱు మరల బ్రతుకుదు" రని పలికెను. అమాట చొప్పున రాణా చిత్తూరునకువచ్చి కనఁబడిన ప్రతిశవమును కానెమలి యీఁకను దగిలింప నామృతకళేబరము ప్రాణవంతమై లేచి నిలుచుచు వచ్చె. అంతట దేవునిమాటలు నిజమనినమ్మి సంగుఁ డాదివ్యపురు

షుని పేర తనయూర నొక యాలయము గట్టించెను. ఆయాలయము సంగుఁడు పోయిన వెనుక చాలకాలమువఱ కుండెను.

దివ్యపురుషుఁ డిచ్చిన రక్షరేఖ రాజపుత్రులమీఁదను మహమ్మదీయులమీఁదను పలుమారు ప్రయోగింపఁబడి యజమానునకు జయముకలిగించుచు వచ్చెను: కాని స్వల్పకాలములోనే మహావీరాధివీరుఁడై మేటిమగల గండడగించి శూరమండలము గడగడ వడకించిన రాజసింహమునకుఁ దనకు వెరపు గలిగింపఁగల సాహసుఁ డొకఁడు బయలుదేరుచున్నాఁ డని సంగుఁ డించుకయు నెఱుఁగఁడయ్యె. అప్పుడు సుల్తాను యిబ్రహీం మనునతఁడు ఢిల్లీచక్రవర్తిగా నుండెను వాని క్రూరత్వము దౌర్జన్యము గర్వము మితిమీరియుండుటచే మంత్రి సామంతాదులు వానితో వేగలేక వానిని విడిచిపోయిరి. దేశమందంతట పితూరీలు బయలుదేరెను. చక్రవర్తి యొకదానిని క్రౌర్యముతో నడప మఱియొకటి తలయెత్తుచుండెను. ఇట్లుండ చక్రవర్తి పినతండ్రి ఢిల్లీమీఁద దండెత్తుమని బేబరును ప్రేరేపించుటకు కాబూలు నగరమునకుఁ బోయెను.

ఈబేబరు మొగలాయివంశస్థుఁ డగు మహమ్మదీయుఁడు. ఈతని పూర్వులు చంగిసుఖాను టామరులేను మొదలగువా రింతకుమున్ను హిందూస్థానముపై దండెత్తి తురకల కందఱకు దారిచూపిరి. బేబరు చిరకాలమునుండి హిందూదేశముపై నెపుడుదండెత్తుదునా యని యూటలూరుచు మంచి యదనుకై వెదకుచుండెను. అదివఱ కతఁ డొకసారి పాంచాలదేశముపై దండెత్తెను. ఆదండయాత్రలో నతనికి రాజ్యలాభ మంతగా లేకపోయినను వాని సైనికులు పర్వతమయమగు తమ గొడ్డుదేశముల నెన్నఁ డెఱుఁగని మహాభోగముల రత్నగర్భమగు హిందూదేశమున ననుభవించుటఁ జేసి యీదేశమును వదలి పోఁజాలక దండెత్తుమని తమ యజమానుని బురికొల్పిరి. యజమానుని యొక్కయు సైనికులయొక్కయుఁగోరికలకనుగుణముగా ఢిల్లీచక్రవర్తి

బందుగుఁడు గూడవచ్చి పిలుచుట సంభవించెను. అందుచేత బేబరు దిట్టమయిన సేనం గూర్చుకొని పర్వతములలోనుండి బయటఁబడి పంజాబు దేశమును గడచి తన్నెదిరింపవచ్చిన సేనల నొకదాని వెనుక నొకటి జయించి క్రమక్రమమున ఢిల్లీమీఁదికి వచ్చెను. అట్లు వచ్చివచ్చి పాని పట్టుగ్రామమునను లక్షసైన్యముతో యుద్ధమునకు సిద్ధముగానున్న ఢిల్లీ యిబ్రహీంలోడీని గాంచెను. ఇబ్రహీం రణరంగమున మృతినొంది చక్రవర్తి యని యానవాలుపట్టుటకు వీలు లేనిస్థితిలో పడియుండెను. బేబరుచక్రవర్తి యగుటచే మసీదులో ప్రార్థనలతని పేర నే జరిగెను.

మహాసేనానిమేతుఁ డగు ఢిల్లీచక్రవర్తి కాబూలు ప్రభువగు చిన్నదొరచేత నోడింపఁబడుట హిందువులకు సంతోషకరము గాదయ్యె. ఏలయన నిద్దఱు గోమాంసముఁదిను పచ్చితురకలె. ఇద్దఱు హిందువుల దేవాలయముల నాశనము చేయు ఘాతుకులె. వారిరువురిలో నెవరుగెల్చిన వానిని దరిమికొట్టుభారము రణసింహుఁ డగు మీవాగు రాణా దని జనులు చెప్పుకొనిరి.

అందుచేత రణమల్లుఁడును తేజోరాశియు నగు సంగమహారాజు బేబరుపైఁ గత్తిగట్టి కయ్యమునకు వెడలెను. ఆరాజసింహునకు సాయమై యెనుబదివేలగుఱ్ఱపుదళము, నుత్తమవంశజులగు నేడుగురు మహారాజులు, రావు బిరుదముగల తొమ్మండుగురు సామంతులు, రావలులు రావుత్తులను బిరుదులుగల నాయకులు నూటపదునలుగురు నడుచుచున్న కొండలవంటి యేనుఁగు లైదువందలును వచ్చి సంగర రంగమున నిలిచె. ఈసేనం గూర్చుకొని సంగుఁడు మొట్టమొదట బయానా యనునూరికి బోయి యచ్చటి కోటను ముట్టడించెను. ఆ ముట్టడి జరుగుచున్న కాలమున నే సంగుఁ డొకనాఁ డచ్చటిపనుపునీటి యేటిలో స్నానము సేయుచుండ గంఠమునందలి రక్షరేఖ వెనుక ప్రక్కకుం దిరిగి వీపుపై వ్రేలఁబడియె. అప్పుడు దన మరణ మాసన్నమైన దని యతఁడు దెలిసికొని తగుప్రయత్నముఁ జేయుచున్నప్పటి కంత

లో బేబరు బయానాకోటను విడిపింపు మని పదునైదువందలసైనికుల నంపెను. కాని యాసైనికులలోఁ గొందఱుమాత్రమే బ్రతికివచ్చి రాజపుత్రవీరుఁడు సామాన్యుఁడు కాఁడనియు జీతములకొఱకే యుద్ధములు సేయు ఢిల్లీసైనికులకును రాజపుత్రసైనికులకును జాలభేదము కలదనియుఁ జెప్పిరి. మీవారు రాజ్యమున కుత్తరపుసరిహద్దుగానుండవలయునని సంగుఁడు కాణ్వాహ యను గ్రామమున గొప్పమేడ గట్టించెను.

ఆమేడయెదుటనే బేబరు శిబిరము వేయించెను. ఫిరంగులబండ్లను సరకులబండ్లతో గలిపి గోనెసంచులతో గట్టి సేనలో మొదటివరుస నమర్చి వానివెనుక సేననునిలిపెను. ఆబండ్లు చాలనిచోట్ల కాఁపుదల నిమిత్తము గోతులు త్రవ్వించెను. వాని ఫిరంగులలో జముఫిరంగి యనుపేర నొకఫిరంగి యుండెను. దానిని ఉస్తాదా యను సేనానాయకుఁడొకఁడే మిక్కిలి నేర్పుతో నుపయోగించుచుండు నఁట. అతనిశక్తి యేమోకాని యొక్కమా రాతఁ డాఫిరంగిని దినమునకు బదియాఱు సార్లైనను బ్రయోగింపఁ గలిగి యుండె నఁట. ఆయుద్ధ ముభయకక్షులవారికిఁ గడుబాధకరముగ నుండెను; కాని పైనుండి చూచిన వారికి మిక్కిలి వినోదముగ నుండెను. ఉభయులు నొకరి కొకరు తీసిపోవువారు కారు. జన్మమంతయు యుద్ధములయందె గడపి దేశసంరక్షణమునిమిత్తము రక్తము ధారపోసి యుద్ధములలో నొకకన్ను నొకచేయు యొకకాలు పోగొట్టుకొని యెనుబది గాయములచేత తూట్లుపడియున్న శరీరము గలిగి శూరశిఖామణి యనుపేరు గాంచిన సంగుఁ డొకప్రక్క నుండెను. పెద్దపులిమీసములు మెలిపెట్టుటకైన సింగపుజూలు నూడఁబెరుకుటకైన వెనుకదీయనివారును గయ్యముల యందు మడమ దిరుగనివారును బ్రతికియుండిన మహాకీర్తిని మృతి నొందిన వీరస్వర్గమును జూరగొనుటకు సిద్ధముగ నున్నవారు నగు రాజపుత్రవీరు లనేకు లామహారాజు వెనుక బాసటయై నిలిచిరి. వా

రందఱుం దరతరములనుండి పూర్వులు చేసినశూరకర్మములం దలంచి గర్వోద్దీపితులై యుండిరి. ఆరాజకుమార రత్నములు క్రొత్తపెండ్లి కూఁతులను వరించునట్లు మృత్యుదేవతలను గూడ వరించు విద్యను నేర్చికొని వీరపురుషునకు నంతఃపురమున హంసతూలికాతల్పము శాశ్వతమయినపాన్పు కాదనియుఁ దమయాయుధములచేఁ దెగిన పగతుర కళేబరములతో నిండిన యుద్ధభూమియే శాశ్వతమయిన పాన్పనియు నమ్మిన మహాశూరులు.

ఇఁక రెండవపక్క నున్నవాఁడో పదునొకండేండ్ల ప్రాయముననే రాజ్యమున కభిషిక్తుఁడైనవాఁడు. పరరాజుల పీడవలన పితృపితామహార్జితమయిన రాజ్యమును గోల్పడి దేశద్రిమ్మరియై చిరకాలము గడపినవాఁడు. అదివఱకు సమర్కందునగరమున నతఁడు రెండు సారులు సింహాసన మెక్కి రెండుసారులు దానిని వదలుకోవలసినవాఁడయ్యు నెప్పటికైన దాని మఱల సంపాదించి మఱి చావవలయు నని తలంచుచుండువాఁడు. సంగునివలెనే యిల్లువాకిలి లేక గొడ్లఁగాసికొనియు కొండలవెంబడి తిరిగియుఁ గొంతకాలము పుచ్చి యెట్టకేలకు 'కాబూలు' నగరమును బట్టుకొని దానికిం బ్రభువై యంతకన్న మంచిదేశమును స్వాధీనముచేసికొనుటకై యదను వెదకుచున్నవాఁడు. ఈయుద్ధమునాఁటికైన నతఁడు నడివయస్సును దాఁటినవాఁడు గాక మంచి శరీరదార్ఢ్యముఁ గలిగి శత్రుదుర్నిరీక్ష్యుఁడై వెలయుచుండెను. బలముగల మనుష్యులనిద్దఱను చెరియొకచంకఁ బెట్టుకొని కోట గోడలపైఁ బరుగెత్తుటకును వానికి సామర్థ్యముఁ గలదు. అతఁడెప్పుడు గుఱ్ఱపుజీనుమీఁదనే కాఁపురము చేసినవాఁడని చెప్పవచ్చును. మార్గమధ్యమున నడ్డమువచ్చిన ప్రతినదిని నతఁడు నిండువరదలోనైన ననాయాసముగా నీదుకొనిపోవునేగాని దోనెలనైన నెక్కువాఁడు కాఁడు. అంతటి శూరాగ్రేసరుఁడయ్యు బేబరు పారశీకభాషలో మృదువయిన కవిత్వము చెప్పఁగల రసికుఁడు. అతనికి స్వమతాభి

మాన మెక్కుడుగ నున్నదికాని యాయభిమానావేశముచేత శత్రురాజులయందు మంచిగుణము లేవైన నున్న వానిని మఱచిపోవక వానిని మెచ్చుకొనుచు నతఁడు వ్రాసిన గ్రంథములలో నెక్కుడౌదార్యమును జూపుచు వచ్చెను.

రాణాసంగున కింతకంటె సుగుణవంతుఁడు నింతకంటె పౌరుషశాలియు నగుశత్రువుం డెన్నఁడు దొరికి యుండలేదు. రెండుతెగలవారి కది మంచియుద్ధమే. రాజపుత్రులందఱు తమదేవాలయముల నెల్ల నేలమట్టముగఁజేసి దేవతావిగ్రహములఁ బగులఁగొట్టి పాడుచేసిన మ్లేచ్ఛులను తమకులదేవత యగుభవానిమాత తప్పక యడచి తమకు జయమును గలిగించు నని నమ్మి ధైర్యముగ నుండిరి మొగలాయీలు విగ్రహారాధనము చేయుపాపాత్ము లగుహిందువుల సంహరించుటకుఁ దోడ్పడు మని అల్లాను ప్రార్థించిరి. ఈరాజపుత్ర మొగలాయి ప్రభువులు తక్కినగుణములలో సమానులైనట్లె కైపునకు నల్లమందు మద్దతుబిల్చుటలోఁగూడ సమానులే. పదునైదుదినములవఱకు రెండుసైన్యములు యుద్ధ మారంభింపక నొకదాని నొకటి చూచుకొనుచు నేది ముందుగాఁ గయ్యమునకు దిగిన నేమిప్రమాద మగునో యని శంకించుచు నూరకొనిరి. బేబరుసైనికులు కొంతవఱకు నిరుత్సాహులయి యుండిరి. ఏలయన వారు తమయాలుబిడ్డలను గృహములను బాసి చిరకాల మగుటచే నిండ్లపై దృష్టులు బార మిడిమిడి యెండలు గాయు హిందూదేశపుబయళ్ళను విడిచి తమకొండగేహముల కెప్పుడు పోవుదుమా యని బెంగఁగొని స్వదేశమునకుఁ దోడ్కొని పొమ్మని బేబరును బలవంతపెట్టిరి. వెనుక బేబరు పంపిన పదునైదువందల సైనికులలో హతశేషులు వచ్చి సంగుని సైనికులపేరు విన్న గడగడ వడఁకునట్లు తక్కినవారిని భయపెట్టిరి. తురక శిబిరము నంటివచ్చిన జ్యోతిష్కు లెప్పుడు చెప్పినను నీచదశ నేగాని యుచ్ఛదశను జెప్పరైరి. అంగారకుఁ డప్పుడు పడమట నున్నందున వాని కెదుట దిక్కున

నుండి యుద్ధము చేయువారికి తప్పక యపజయము కలుగునని వారు నొక్కి పలికిరి.

ఆరెండువారములలోను రాణాకును ఢిల్లీచక్రవర్తికిని సంధి మాటలు జరిగినవని రాజపుత్రచరిత్రకారులు కొందఱు వ్రాసిరి. బేబరు తాను విదేశములలో పంచాగ్ని మధ్యమువంటి శత్రుమండల మధ్యమున నొంటిగ నుండుట యెఱుంగును. ఈయుద్ధములో తన కపజయము సంభవించెనా పగతురు నలుపురు నాలుగుమూలలనుండి వచ్చి తన్ను చుట్టుకొందురనియు నప్పుడు తాను కష్టపడి సంపాదించిన ఢిల్లీ రాజ్యము చేయి దాటిపోవుటయేగాక స్వస్థానమైన కాబూలునైన చేరుట సంభవింపదనియుఁ గూడ నతఁ డెఱుఁగును. రాణాసంగుఁడు చాకచక్యము గలవాఁడు వివేకియునై మీవారురాజ్యమునిమిత్తము స్వసౌఖ్యమును గణియింపక పాటుపడుచున్నవాఁడని యతఁడు విని యుండెను. అందుచే రాజపుత్రచరిత్రకారులు చెప్పినట్లుభయులు సంధిప్రయత్నములు చేసి యుందురనియే మనము నమ్మవచ్చును. ఆయొడంబడికలో బేబరు కోరిన పద్ధతు లన్నియు రాణా కవమానకరములు గానివియు నతఁడు తప్పక యంగీకరింపదగినవియు నై యుండెను.

పద్ధతులివి 1. పసుపునీటియేరు మీవారురాజ్యమున కుత్తరపు టెల్లగా నుండవలయును. 2. బేబరు ఢిల్లీరాజ్యము నాక్రమించినందుకు రాణావారికేఁటేఁట కొంతకప్పము నిచ్చుచుండవలయును. కాని యిట్లు సంధినిగురించి మాటలు జరుగుచుండ సంగుఁడు బేబరు వద్దకుఁ బంపిన రాయబారి తురకలవద్ద లంచము గ్రహించి నీచుఁడై తనయజమానుని ట్లు బయలుపెట్టెనని రాజపుత్రులలో నొకవాదుకలదు. ఆరాజద్రోహి తారావంశస్థుఁడగు శిలాదేవుఁ డనువాఁడు. బేబరు పలుమారు తాను జేసినతప్పులను గూర్చి నిజమయిన పశ్చాత్తాపమును బడుచు వచ్చెను. దాని కుదాహరణముగ నొక చిన్నకథ గలదు.

అతఁడదినఱకు మద్యపానము విశేషముగాఁ జేసెను వాఁడుక కలదు. అది పాపమనియు నాకారణంబున భగవంతునకుఁ దనపై నాగ్రహంబు వొడముననియుఁ దెలిసికొని యతఁ డాదినము మొదలు సారాయములను ద్రాఁగనని గొప్పయొట్టు పెట్టుకొని యంతకాలమును సారాద్రాఁగెడు వెండి బంగారుగిన్నెలు పళ్ళెములు ముక్కముక్కలుగా బగులఁ గొట్టి యాముక్కలను పకీరులకు బీదలకు పంచిపెట్టెను. అంతతో తనివిసనక యతఁడు కూనలతో నున్న సారా నంతయు నేలఁ బొరఁబోయించి యాదినమున దనకు జయము లభించిన పక్షమున మహమ్మదీయులవద్దనుండి తాను గ్రహించుచున్న దస్తావేజుపన్ను కొట్టివేయుదునని ప్రమాణము చేసెను. మాటలతో బోవక కార్యముఁ జేసి చూపిన తనచక్రవర్తియొక్క మార్గము ననుసరించి సేనాపతులు సామంతులు ఉమ్మరావులు అమీరులు మొదలగువారు మున్నూరుమంది యొక్కదినము లోపుగ త్రాఁగమని శపథము చేసి త్రాగుబోతుతనమును మాని పవిత్రులయిరి. ఇట్లు జరిగినపిదప బేబరు విచారగ్రస్థుడయిన సైనికులను సేనాపతులను బిలిచి వారికి మతావేశము గలిగించి కర్తవ్యమునకుఁ బురికొల్పవలయు నని తలంచి యిట్లని విజ్ఞాపనము చేసెను.

ఓవీరులారా! ఈ ప్రపంచమునఁ బుట్టినవాఁడు గిట్టక మానఁడు. ఎప్పుడో యొకప్పు డీలోకమును విడువక తప్పదు. బ్రతికియుండి పరాభవములు పొందుటకంటె చచ్చి గౌరవమందుట మేలు నేను చచ్చినను సరే మంచిపేరుతో చనిపోయితినా చాలును. భగవంతుఁడు దయామయుఁడు. మన మిందు గడతేరితిమా మతముకొఱకు మృతినొందిన శూరులమగుదుము. గెలిచితిమా దేవునిమెప్పించినవార మగుదుము. కాబట్టి మనము మరణమునకు జంక మనియు యుద్ధభూమినుండి వెనుకంజ యిడమనియు నొకకూరు ప్రమాణములు చేయుదము.”

ఆపలుకులు విన్నవారికందఱకు పౌరుష ముక్కొక్కించెను. సైనికులకంఱుఁ దమ వేదమగు ఖురాను జేతఁ బట్టుకొని యుద్ధమున గెలువవలయు లేక చావవలయు నని ప్రమాణములు చేసిరి. ఒడలిలో నూపిరిలేనివాఁడు సయితము మతావేశముచేత పరవశత్వమునొంది ప్రాణములపై నభిమానము వదలుకొని ముక్కలకలను దేరిన పగతురం బొడుచుటకు సిద్ధముగ నుండెను. అంతట శత్రువులపయిం బడుటకు నారేర్పాటు జేసికొన్నందున మొదలుతీరిన వెనుక బేబరు గుఱ్ఱము నెక్కి సైనికుల కుత్సాహము గలిగించుచు సేనాపతులకు నడచుకొన వలసిన పద్ధతులను గఱపుచుఁ గొంతసేపు దిరిగెను.

1527 వ సంవత్సరము మార్చి 27 వ తేది శనివారమునాడు రాజస్థానముయొక్క భాగ్య మెట్లున్నదో నిర్ణయించెడు యుద్ధము జరిగెను. రక్తరేఖ మతియొక లాగ్గైపోయినను మొట్టమొదట జయ మెప్పటియట్లు రాణాసంగునికే యగునని యెల్లరు భావించిరి. బేబరు చక్రవర్తియొక్కసైన్య మదివఱ కెన్నఁడు రాజపుత్రవీరుల పోటు చవిచూచి యెఱుఁగదు. నల్లమందుమత్తుతో కన్నులెఱ్ఱఁబడ రాజపుత్రయోధులు శత్రువులపయింబడి కత్తులను బల్లెములను రక్తములో ముంచియెత్తుచు వీరవిహారము చేయనారంభింప, దిట్టతనమునకు ప్రసిద్ధికెక్కిన కఱకుతుఱక లేమియుం జేయలేక యూరకొనవలసి వచ్చెను. పూర్వ మెన్నెన్ని యుద్ధములలో వైరుల యపరిపాటుల నడఁచిన బేబరుయొక్క జయఫిరంగియైన రాజపుత్రుల నించుకయుదు పులో నుంచజాలదయ్యె. ఆసమయము నెఱిఁగి బేబరు మంచియుపాయము నాలోచించి తనసేనలోఁ గొంతభాగమును గుండ్రముగా దిరిగివచ్చి రాజపుత్రుల జుట్టుకొమ్మనని యానతిచ్చి ఫిరంగులను ఘుందునకు జరిపించి మూలబలమునకు తుపాకులిచ్చి ముందునడిపించి బాణవర్షమును గురిపింప నారంభించెను. అప్పుడు రాజపుత్రసైన్యములో నొకభాగమున కధిపతియైన శిలాదేవుఁ డనునతఁడు రాజద్రోహ

ము సేయఁదలంచి గుండె రాయిఁ జేసికొని తన సేనతో బయలు దేరి వచ్చి శత్రుపక్షమునఁ జేరెను.

పగతుర సేన వచ్చి యాకస్మికముగ వెనుక దాఁకుటచేతను స్వజనము మోసపుచ్చుటచేతను, తురకలు పట్టినపట్టు విడువకపోవుట చేతను రాజపుత్రసేన యెట్టకేలకు కట్టుచెడి తిరిగి పారిపోవలసివచ్చెను. మహమ్మదీయులు రాజపుత్రసేన నొకమూలకుం దరిమి ఫిరంగులు బారుచేసి కొట్టఁజొచ్చిరి. అందుచే రాదాఁపుగా వందలు హతులయిరి. కొంద ఱట్టెట్టో దెబ్బలు తప్పించుకొని పాఱిపోఁగలిగిరి. వారిలో రాణా యొకఁడు ఆ రణమునఁ దగిలినగాయముల చేత తానా కుంటి యగుటచే రణరంగమునుండి పారిపోవుట కతని కిష్టము లేకున్నను సేవకులే యతనిని మోసికొనిపోయి యపాయమునుండి దాఁటించిరి. కాని యనేకులు యుద్ధభూమినుండి విడువక ప్రాణములు విడిచిరి. అట్టి వారిలో చంద్రావతువంశస్థుఁ డగురాజపుత్రవీరుఁ డొకఁడు మహా శూరు లగు మూఁడువందలమంది చుట్టములతో మృతినొంది రాణా వారికి తొల్లి రాజ్యము సేయునప్పు డాలోచనలు చెప్పుటలో నెట్లు ప్రథమగణ్యుఁ డయ్యెనో వారినిమిత్తము ప్రాణములు విడుచుటలో నట్లె ప్రథమగణ్యుఁ డయ్యెను. అతనికి సాయమై మార్వారురాజ కుమారుఁడు మఱి యిరువదిమంది రాజకుమారులతోఁ గూడి నేలం బడియుండె. ఈయుద్ధము జరిగినచాపునకు సమీపమునందే బేబరు రణనిహతు లయినరాజపుత్రశూరులపుఱ్ఱెలతో నొకజయస్తంభమును గట్టించెను.

ఇట్లుసంపూర్ణ పరాజయము నొంది కూరుచున్న చోటనుండి కదలలేని కుంటియయ్యు రాణాసంగుఁడు శౌర్య గాంభీర్యములయందు సింహమువలె మెలఁగ జొచ్చెను. తలుపు వేసికొని చిత్తూరుకోటలో దాఁగికొనుట కతనికిష్టములేక కోటతలుపు లెప్పుడు తెఱచి యుండ లసిన దని యానతిచ్చి తానెప్పటికైన శత్రువులను జయించి జయ

12

ధ్వనులతోఁ గోటలోఁ బ్రవేశింతు నని చెప్పుచువచ్చె. ఈ పరాజయమువలన గలిగినపరాభవమును పోగొట్టుకొనువఱకు యుద్ధభూమిలో నొకగుడారము వేసికొని యదియే యిల్లుగా నతఁ డుండెనఁట. అదివఱకు యుద్ధములో మృతినొందిన రాజపుత్రశూరులయొక్క భార్యలు సేనలం బోఁగుచేసి ఢిల్లీచక్రవర్తిమీఁదికిఁ జను మని రాణాకు సమర్పించిరి గాని పరాజయమునొందిన యొక్క సంవత్సరములోనే యతఁడు పరలోకగతుఁ డగుటచే నాసేనలం గూర్చుకొని తురకలతో పోరు నంతటిభాగ్య మతనికిఁ బట్టదయ్యె.

సంగుఁడు విషము దిని చచ్చె నని కొంద ఱందురు; కాని యది నిజము కాదు. చిన్నతనమునుండియు నిల్లువిడిచి తిరిగి యతఁడు పడిన కష్టములను మహాయుద్ధములయందు దగిలిన యెనుబదిగాయములను విశేషించి 'కణ్వాహా' దగ్గర జరిగినయుద్ధమును విషముకంటె నెక్కుడు తీక్ష్ణములై వాని కకాలమరణమును గలిగించెను. మేవారు రాజ్యమును పాలించిన రాణాలలో సంగుఁడు మహాప్రతాపశాలి. అందుచేత నతఁడు యందఱికన్న గొప్పవాఁడని యప్పుడప్పుడు కొంద ఱనుచుందురు. అతనివెనుక సింహాసనమునకు వచ్చిన వానివంశస్థులు సంగునివలె దృఢచిత్తులై చరించినచో చిత్తూరునకు దీనదశ రాక యుండును.

సంగుని చరిత్రము సమగ్రముగాఁ జెప్పఁబడినది గావున నింక నతని వైరియగు బేబరు చరిత్రము నించుక చెప్పవలసి యున్నది. ఇతఁడు మొగలాయివంశస్థుఁడు ఈతని పూర్వుఁడగు చంగిసుఖానుఁడు ఆశియా, యూరోపుఖండముల రెంటను దండెత్తి మిడుతలదండువంటి తురకసేనలతో నింపి రక్తప్రవాహములు ప్రవహింపఁజేసి యానాటి మానవజాతి నంతను గడగడ వడఁకించిన చండశాసనుఁడు. అతఁడు పదమూఁడవశతాబ్దముయొక్క ప్రారంభమున హిందూదేశముపై దండెత్తి సింధునదికిఁ బడమట నున్నభూముల నాక్రమించి యెందుచేతనో

మన దేశమున నిలువక స్వస్థానమునకుఁ బోయె. వానితరువాత వాని వంశస్థుఁడును వానికంటెను క్రూరుఁడు నగు తామరలేను 1399 వ సంవత్సరమున హిందూదేశముపై దండెత్తి వచ్చెను. ఈతనికా లొకటి కుంటిగ నుండెను. సహజముగ దుర్బలుఁడయ్యు నితఁడు మెచ్చఁదగిన మనోబలముచే మొగలాయిలకెల్ల ప్రభువై తార్తారు దేశమున నున్న సమర్కందునగరమున సింహాసన మెక్కి యనేకదేశ ముల జయించెను. బేబరు తామరలేనున కాఱవతరమువాఁడు. ఇతఁడు తనవంశస్థులవలె ప్రతాపవంతుఁడె కాని వారివలె నిష్కారణముగా మానవజాతిని నిర్మూలించునట్టి క్రూరుఁడు కాఁడు. ఇతనితలిదండ్రులు చిన్నతనమునందె మృతినొందుటం జేసి బాల్యమునందె సింహాసనస్థుఁ డై పలుమారు రాజ్యభ్రష్టుఁడై యనేకస్థలములయందు క్రొత్తరాజ్య ములు స్థాపించి యెట్టకేలకు హిందూస్థానముపై దండువిడిసి ఢిల్లీ చక్రవర్తి యయ్యెను. ఇతఁడు ప్రతాపవంతుఁ డగుటయేగాక పార శీకభాషలో మంచి కవనముగూడ జెప్పఁగల సమర్థుఁడు. ఇతఁడు హిం దూదేశమును జయించినాఁ డన్నమాటయే గాని జయించినపిదప పట్టుమని పదికాలములపాటు దేశము నేలలేదు. అతఁడు 1526 సంవ త్సరమున చక్రవర్తియై 1530 సంవత్సరమున మృతినొందెను. ఆనా లుగుసంవత్సరములైనను మనస్థిమితము లేక యుద్ధములోనే గడపవ లసివచ్చెను. ఇతని మరణమునుగూర్చి యొకచిత్రకథగలదు. అతని పెద్దకుమారునకు జబ్బుచేసి ప్రాణముమీఁదికి వచ్చెనఁట. కుమారు నియందు బేబరుకు మితిమీరిన ప్రేమయుండుటచే దనకొడుకును రోగ విముక్తునిజేసి తనకాజబ్బు తెప్పింపుమని భగవంతుని ప్రార్థించె నట. అతఁడు ప్రార్థించినట్లుగానే క్రమక్రమముగా హుమాయూ నున కారోగ్యము గలుగుటయు బేబరు జబ్బుపడి మృతినొందుటయు సంభవించెను. ఢిల్లీపాలించిన మొగలాయిచక్రవర్తుల కితఁడె మూలపురుషుఁడు.

చిత్తూరు రెండవముట్టడి.

———:(o):———

కణ్వాహాయుద్ధ మైనతరువాత పాడుపడినస్థలములు బాగుచేసి కొనుటకును మరల పూటుపడుటకును రాజస్థానమునకుఁ గొంత విశ్రాంతి కలిగినది. ఎవఁడో యొకవీరుఁడు మృతినొందని కుటుంబము గాని గృహముకాని లేకపోవుటచే రాజస్థానమంతట శోకదేవత విహారము చేయుచున్నట్లు కనఁబడెను. ఆదారుణయుద్ధ మైనతరువాత గలిగిన విశ్రాంతిచే రాజపుత్రస్త్రీలు తమ మగవారలకు జరిగిన పరాభవపు మచ్చను దుడిచివేయఁగల శూరులగు కుమారులను గని పెంచుచుండిరి.

రాణాసంగుఁడు పోయిన రెండుసంవత్సరములకే బేబరుచక్రవర్తియుఁ గాలధర్మము నొందుటచేఁ గ్రొత్తగా జయించిన భూములన్నిటిని గలియఁ గట్టుకొని సంరక్షించుకొనుభారము వాని కుమారుఁడగు హుమాయూనుపైఁ బడెను. హుమాయూను ధైర్యశాలియు నౌదార్యవంతుఁడు నై స్వగౌరవముఁ గాపాడుకొనువిషయమున రాజపుత్రు లెంత తీవరముగా నుందురో యంత తీవ్రముగ నుండి దయాళువై సర్వజనులచేతఁ బ్రేమింపఁబడుచు వచ్చెను. రాచరికమున కుండవలసిన కాఠిన్యము మనోధైర్యము చిత్తనైర్మల్యము మొదలగు గుణములు లేకపోవుటయేగాక తొల్లి వానితండ్రి కభ్యాసములైన నల్లమందు మద్దతు మొదలగునవి వాని కలవడెను. అందుచే నతఁడు స్థిరబుద్ధి లేనివాఁడై బేబరువలె నలుదెసలం జెదిరియున్న రాజ్యమును గూడగట్టుకొని పాలింప లేకపోయెను.

అదియటుండ రాణాసంగుని జ్యేష్ఠపుత్రుఁడు రత్నసింగు రాజపుత్రకులజులవద్ద నుండు శౌర్యగాంభీర్యాది సమస్తలక్షణములు గలిగి తండ్రి పరోక్షమున రాజ్యమునకు వచ్చెను. గద్దె యెక్కినతోడనే

యతఁడు కోటకావలివాండ్రిం బిలిచి "తొల్లి మాతండ్రియగు రాణా సంగుఁడు తెరచియుంచు మనిన తలుపులు తెరచియేయుంచవలయును; కాని మరల మూయవద్దు. వాని నాలాగుననే యుండనిండు. ఢిల్లి మండూరు పట్టణముల చిత్తూరునగరద్వారములగు గాక" యని నొక్కిచెప్పెను. కాని యతఁడనేకకష్టము లనుభవింపవలసివచ్చెను. ఆకష్టములలోఁ గొన్ని స్వయముగ దెచ్చుకొన్నవియుఁ గొన్ని వాని యనుచరుల బుద్ధిహీనతచేతను ద్రోహబుద్ధిచేతను దెచ్చినవియునై యుండె. మొట్టమొదట నతఁడు నిగ్రహింపవలసిన ప్రబలశత్రువు వాని సవతితల్లి యగుజవాహీరుభాయి. ఆమె నూరువారురాజుల యాఁడు బడుచు. తనకుఁదోచినంతమేగాని యొరులు చెప్పినట్లు వినకపోవుటయు దురాశచే నెప్పుడు కుట్రలజేయుటయు నామెచేయు ప్రధానకార్యము లైయుండెను. భర్తయగు రాణాసంగుఁడు మృతినొందినతోడనే జవాహీరుభాయి సవతికొడుకును రాజ్యభ్రష్టునిఁ జేయఁదలంచి తనకుమారుఁడు విక్రమజిత్తును చిత్తూరుసింహాసనమునందు నిలుపు మనియు నట్లుచేసినపక్షమున మున్ను మాళవదేశపు రాజగు మహమ్మదు చిత్తూరులో విడిచిపోయిన కిరీటమును రంతంబారు అను కొండకోటను బహుమానములుగ నిత్తుననియు బేబరుచక్రవర్తికి రహస్యముగ వర్తమాన మంపెను. బేబరు పనితొందరలోనుండి తెల్పిలేక యామెకు బ్రత్యుత్తరమునైన నొసంగకపోవుటచే నామె సంకల్ప మంతరించెను.

ఇది యటుండ రత్నసింగు అంబరుదేశపురాజు కూఁతును వివాహ మాడఁదలఁచి తనకత్తి యక్కడకుఁ బంపి యామెను పెండ్లి చేసికొనెను. వివాహమాడియు నెంతకాలమునకు నామెను దనవద్దకు దీసికొనిరాకపోవుటచే బూందీసంస్థానాధిపతియగు సురాజమల్లుఁడా బాలికను వివాహమాడి తన యంతఃపురమునకుఁ దీసికొని పోయెను. ఈకార్యముచేత సురాజమల్లునకును రత్నసింగునకును మనసులలోఁ

గ్రోధాగ్నులు పొడమి రవులుచుండెను. అట్లుండ రత్నసింగొకసారి వసంతకాలమున నొక యడవిలో వేటాడుటకు వచ్చిన సురాజమల్లును నిష్కారణముగఁ బొడిచి యాతనిచేత మరల నొకపోటు తిని పగతుని చంపిన సంతోషము లేకుండ తానును జచ్చెను. రత్నసింగు స్వయంకృతాపరాధమునఁ జెడుటచే జవాహీరుభాయియొక్క చిరమనోరథము ప్రయత్నమక్కరలేకయే సిద్ధించెను. విక్రమజిత్తు చిత్తూరు సింహాసన మెక్కెను. విక్రమజి త్తిట్టివాఁడని నిర్ణయించి వ్రాయుటకు వీలులేదు. రాజస్థానచరిత్రకారులు వానియొద్ద సద్గుణము లేవియు లేవని వ్రాసిరి. బంధువులయెడను సామంతులయెడను నిరాదరణము చూపుటయేగాక యతఁడు నీచులతో సహవాసము చేయుచు రాణా సంగుని కొడుకైనందుకుఁ బ్రజలవలనఁ బొందవలసిన గౌరవమును బొందక నిరసింపఁబడుచు వచ్చె. రాజ్యవ్యవహారములను జూడక వస్తాదులను పందెగాండ్రను గలిసి యతఁడు కాలమంతయు నేల వ్యర్థముచేసెనో తెలియదు. ఇట్లు దుస్సహవాసములు చేసి పాడగుచున్నను విక్రమజిత్తు సహజముగ తెలివిగలవాఁడని యీక్రింది కథ వలనఁ దెలియవచ్చును. ఆతని కాలము వఱకు రాజపుత్రవీరులు గుఱ్ఱములనెక్కి కత్తులు బల్లెములు పూని యుద్ధములు చేయుచుండిరి. రాజపుత్రుల శత్రువులు తుపాకులను ఫిరంగులను బూని యుద్ధము సేయుచు వచ్చిరి. అందుచేత రాజపుత్రులు తఱుచుగ నోడిపోవుటయు మహమ్మదీయులు గెల్చుటయు సంభవించెను.

విక్రమజిత్తు బుద్ధిశాలి యగుటచే రాజపుత్రు లెంతశూరులైనను నిప్పులఁజిమ్ము ఫిరంగులు మొదలగు నాయుధములు లేక వట్టి కత్తులు కటారులు బూని గుఱ్ఱములపై నెక్కి యుద్ధము చేసినంతమాత్రమున గెలువఁజాలరని నమ్మి ప్రాతపద్ధతిని విడిచి క్రొత్తపద్ధతిప్రకారము నూతనాయుధములను బూనవలసినదని తనవారి నందఱినిఁ బురికొల్పెను. క్రొత్తపద్ధతి యనఁగా రాజపుత్రశూరులు యుద్ధరం

గమున కొండలు గుఱ్ఱములు దిగి ఫిరంగులు కాల్చుటయు మఱికొం దఱు నేలనేయుండి కాల్బలమై తుపాకులతో యుద్ధముచేయుటయు నని తెలిసికొనవలయును. విక్రమజిత్తు చెప్పినమాటలు రాజపుత్రులకు మిక్కిలి గౌరవభంగమని దోఁచుటఁజేసి వారందఱు బుఱ్ఱపోయినను గుఱ్ఱములు దిగి కత్తివిడిచి యుద్ధముచేయమని వాదించిరి. అట్టి మోటయుద్ధమువలనఁ గలుగు నష్టమును తుపాకియుద్ధమువలనఁగలుగు లాభమును జూపి రాజు వారి నెంత వేఁడుకొన్నను వినక వారు "గుఱ్ఱములమీఁద నుండియే శత్రువుల ఫిరంగులఁ బాలుపడి ప్రాణములనైనను విడుతుము; కాని నేల దిగి తుపాకి చేతఁబట్టుకొని పరువు ప్రతిష్టలు జంపుకొనము సుమీ" యని ప్రత్యుత్తర మిచ్చిరి. అట్టి వారితో వాదించుట నిరుపయోగ మని గ్రహించి రాణా వారియెడల నాస వదలుకొని జీతములనిచ్చి కొందఱు సిపాయిల నేర్పఱచి వారికి నూతనపద్ధతిప్రకారము యుద్ధముచేయుట నేర్పించెను.

ఈపనివలన రాజపుత్రులకు మనసులలో రాణాపై క్రోధము నిలిచెను. దానికిఁ దోడు విక్రమజిత్తు క్రొత్తసిపాయిలకు బహుమానములిచ్చి వారిని గౌరవించి వారితో గలిసిమెలిసి యుండుటచే రాజపుత్రులు తమ క్రోధమును లోలోపల నణచుకొనఁజాలక పైకి వెడలి రాణాతోఁ గలహమునకు డీకొనిరి. రాజ్యమున ప్రతిష్ఠలమందు ప్రజలు రాణాయొక్క యధికారముఁ దిరస్కరించి రాజశాసనముల నతిక్రమించి యుద్యోగస్థులను బరిహసించి యథేచ్ఛముగఁ దిరుగఁ జొచ్చిరి కొండలలోనుండు మన్నెగాండ్రు గుంపులు గుంపులుగఁ జిత్తూరు నగరమువఱకు వచ్చి రాణాకన్నులయెదుటనుండియే ప్రక్క పల్లియల దోఁచుకొని పశులమందలను దోలుకొనిపోవఁజొచ్చిరి విక్రమజిత్తు కొండదొంగలను దరిమి కొట్టిరండని తన గుఱ్ఱపుదళముల కాజ్ఞాపింప రౌతులందఱు నవ్వుచు "జీతబత్తెములిచ్చి నిల్పిన క్రొత్తకాల్బలమును బంపుఁడు. మే మేమి చేయఁగల" మని పలికిరి.

చిత్తూరురాజ్య మట్టిదుస్థితిలో నుండుటచే శత్రువులు తమతమ ప్రాఁతపగలు దీర్చుకొనుట కదియే సందని విజృంభించిరి. గుజరాతు దేశప్రభువగు మహమ్మదుషా యనుతురక కొంతకాలము క్రిందట బేబరుచేత జయింపఁబడి ఢిల్లీరాజ్యముతోఁ గల్పఁబడిన మాళవదేశము నాక్రమించుకొనెను. అప్పటికి బేబరు చనిపోవుటయుఁ బరమసాధు వగు హుమాయూను సోదరులచేతను బంధువులచేతను పలుచిక్కులం బడి మనస్స్థిమితము లేక యుండుటయు బహదూరుషాకు మాళ్వాను బుచ్చుకొనుటకు మంచివీలు కలిగించెను.

ఇట్లు బహదూరుషా ప్రక్కలో బల్లెమై మునుపు మాళవ దేశపుప్రభువు లగుతురకల నిద్దఱిని చిత్తూరురాజులు ఖయిదీలుగా దీసికొనిపోయి వానిలో నొకనికిరీట మపహరించి యవమానించిన ప్రాఁతవృత్తాంతమును జ్ఞప్తికిఁ దెచ్చుకొని నాటితురకలకు జరిగిన దారుణపరాభవమునకుఁ దగినప్రతీకారముఁ జేయుటకు సమయమును వెదకుచు నెట్టకేలకు విక్రమజిత్తొకసారి బూందీనగరమునకుఁ బోయి యున్నప్పుడు పెద్దసేనం గూర్చుకొని చిత్తూరుపై దండు విడిసెను.

విక్రమజిత్తు సహజముగ తొందరగలవాఁ డగుటచేఁ దన ప్రతికక్షులు తనసేనకన్న నధికసంఖ్య గలవారై యున్నను సరకుగొనక మహమ్మదీయసైన్యములం దాఁక నిశ్చయించుకొనెను. విక్రమజిత్తు తత్సమయమున నేమి సేయుటకుం దోఁచక మనోవేదన నందవలసి వచ్చె. కూలికి వచ్చినసిపాయిలు శత్రువుల గొప్పసేనం జూచి భయపడి పోరుటకు సాహసింప రైరి. రాజపుత్రసైనికులం బోరు మని రాణా యడుగ తమ్మవమానించి జీతగాండ్రఁ బిలిపించిన రాజుపక్షమున నిలిచి పోర నొల్లరైరి. అట్లు పోరకపోవుటయేగాక యారాజపుత్రులు యుద్ధభూమిని విడిచిపోయి రాణాసంగునకు నొక బూందీ రాజపుత్రికవలనఁ బుట్టిన యొకచిన్నకుమారుని రాణాగా జేయఁ దలంచి కోట శత్రువులబారిఁ బడకుండఁ గాపాడుటకుఁ జిత్తూరు బంపించిరి

ఈనగరమును గాపాడుట కామీఁవారు రాజపుత్రులను రాజస్థానమందున్న రాజు లందఱు సాయపడిరి. కన్వాహాయుద్ధమున దమవా రనేకులు నిహతు లయినను, హతశేషు లగు చాందావతువంశస్థులు చిత్తూరు సంరక్షణమునకు మరల సిద్ధపడిరి. ఆబూపర్వతమువద్ద నుండి యాప్రాంతముల నేలుచుండిన రావు వచ్చి మీఁవారునకుం దోడు నూపెను. అట్లె మఱి యిరువురు రాజులును దమ ప్రాతపగల మరచి యీయుద్ధమునవచ్చి మీఁవారునకు బాసటయై నిలిచిరి. వెనుకటిరాణా యగు రత్నసింగు బూందీసంస్థానప్రభు వగు వెనుకటిరావును వేటాఁడు వేళ జంపెను. అతని వెనుక సింహాసనమునకు వచ్చిన యర్జునరావు మనసులో నామాట నుంచుకొనక మెరియలవంటి తనసైనికుల నైదు వందలమందిని దోడ్కొని చిత్తూరునకు వచ్చెను. పృథివిరాజునకును వాని పినతండ్రి యగుసురేశమల్లునకును నెంతెంత మహాయుద్ధములు జరిగినవో పృథివిరాజు సాహసములఁ జదివినవారంద తెలుఁగుదురు. ఆసురేశమల్లునికొడుకు భాగ్జీ యనునతఁడు గతించినకార్యముల దలపక తనతండ్రిని చిత్తూరురాణాలు దేశమునుండి వెడలఁగొట్టిరని క్రోధమున్నైన నిలుపక దేవలకోటనుండి కొంతబలముం దోడ్కొని వచ్చెను. ఈపైన పేర్కొనఁబడిన శూరులేగాక మఱి యనేకప్రభువులు కత్తిఁగట్టుకొని వచ్చి చిత్తూరును సంరక్షించుచున్నయాదేవతయాపత్కాలమున రాజవంశస్థులను గాపాడక పోదని నమ్మి యుత్సాహముతో రణోన్ముఖులైరి కాని ప్రపంచములో నున్నశౌర్యమంతయు ముద్దచేసి యొకచోటికిఁ జేర్చినను బహదూరుషా యొక్క ఫిరంగులముందట నెందుకుం గొఱకాదు

ఆతురకరాజు తన గొప్పఫిరంగులను కోటబురుజుల సమీపమునకు లాగించుకొనిపోయి వానిసేవలోఁ బనిఁ జేయుచున్న పోర్చుగీసువారిచేతఁ గడునిపుణముగఁ బనిజేయింపఁ జొచ్చెను. ఒకమూలనుండి దారుణము లగుఫిరంగిగుండ్లు కోటలోనున్నమనుష్యులమీఁద

బడి నాశనము చేయుచుండ రెండవమూలనుండి మఱికొన్ని గుండ్లు వచ్చి కోటగోడలను గుభాలు గుభాలు మని పడఁగొట్టఁ జొచ్చెను. పూర్వ మలాయుద్దీను ముట్టడించినప్పుడువలెనే యిప్పుడును దక్షిణ దిక్కున నున్నకోటభాగము బలహీనమై యుండెను. ఆవైపు బురుజు మీఁద బూందీప్రభు వగునర్జునరావు తన యైదువందలమంది సైనికులతో నిలిచెను. తురకసేనలో నున్న పోర్చుగీసుదొర యాబురుజుల కెదురుగా నేల సొరంగము త్రవ్వి యందు తుపాకిమందు కూరి దాని నంటించెను. ఆగని బ్రహ్మాండము గడగడ వడఁకునంతటి ధ్వనితోఁ బగిలి దక్షిణదిక్కున నున్నకోటగోడను నలువదియైదుమూళ్ల పొడుగున గుభాలున కూల్చెను. అతిధైర్యముతో నాభాగమును గాపాడుచున్న యర్జునరావును వాని జోదులును పేలిపోయి యానవాలైన లేకుండ నశించిరి. ఈరంధ్రమునుండి మహమ్మదీయులు కోటలోఁ బ్రవేశింపఁ జూచుచుండ వీరరసావతారు లగుచందావతువంశస్థు లక్కడకు వచ్చి శత్రువులు లోనఁ బ్రవేశింపకుండఁ బోరిరి. ఎక్కడనుండియైన మఱి కొంతసేన దోడు వచ్చినఁగాని చిత్తూరుకోట నిలువదని యందఱు గ్రహించిరి. అప్పుడు ముఖ్యసేనానాయకు లందఱు గూడి సభఁ జేసి యాయాపద గడవఁబెట్టుట కుపాయము వెదుకఁ జొచ్చిరి. వారికి మొట్టమొదట యాలోచన జెప్పినది విక్రమజిత్తు తల్లి యగు జవాహీరుభాయి. ఆమె మగఁడు పోయినస్వల్పకాలములోనే తన సవతికొడుకును రాజ్యభ్రష్టునిఁ జేసి తనకుమారుని రాజుని జేయుమని తురక చక్రవర్తిని బ్రతిమాలినందుకు నిటీవలఁ జాల పశ్చాత్తాపము నొంది యాసమయమున తనకుమారుని లాభమునుగాని తనలాభమునుగాని జూచుకొనక మేవారుయొక్క చిత్తూరుయొక్కయు గౌరవమును గాపాడుకొనుటకు సమస్తవిధములఁ బాటుపడి తాను యుద్ధమునకుఁ బోవుదు నని సేనానాయకులతోఁ జెప్పి వారి నొప్పించి తనముందర మును తనకొప్పు విడిచి కవచము దొడుగుకొని యాయుధముల

ధరించి కొంతసేన నడపించుకొని పోయి యొడలు దాచుకొనక కార్యము చేసి స్వర్గస్థురాలయ్యెను.

ఈజవాహీరుభాయి గాక రాణాసంగునకు మఱియొక భార్య యుండెను. ఆమెపేరు కర్ణావతి విక్రమజిత్తును రాజుగా నంగీకరింపక యీమోకొడుకగు నుదయసింగునే రాజుగాఁ జేయఁ దలంచి రాజపుత్రవీరులు నాభాగములనుండి వచ్చి చిత్తూరులోఁ బ్రాణములు విడుచుచుండిరి. వీరస్వర్గమును జూరగొన్నయర్జునరా పీదేవి సోదరుఁడే. మరణమునకు జంకని శూరుని గర్భమునఁబుట్టిశూరాగ్రేసరుఁడగు రాణాసంగుని చెట్టఁబట్టిన యీదేవియు భయ మెట్టిదో యెఱుఁగని సాహసికురాలై తనప్రాణములు విడువఁదలంచెను; కాని చిన్నకుమారుని ప్రాణములు సంరక్షించుట కర్తవ్య మని యూరకొనెను వీరందఱు కోటసంరక్షణమునకై యుపాయములు వెదకుచుండ కుమారరక్షణమునకై యామె యుపాయములు వెదకి తుదకొకటి కనిపెట్టెను.

రాజపుత్రులలో నొక చిత్రమైన యాచారముఁ గలదు. రాజపుత్రస్త్రీ తన కేదేని యాపద వచ్చినప్పుడా యాపద దీర్పఁగల సమర్థుఁ డని తనకుఁదోఁచిన పురుషుని శరణువేడి వానికి రత్నఖచితమైన కంకణమునుగాని పట్టుతోరమునుగాని పంపుచుండును. ఆపురుషుఁడు రాజపుత్రుఁడు గావచ్చును లేక తురకగావచ్చును. ఆస్త్రీ వాని నెఱింగియుండ నక్కఱలేదు. వానిపేరు విని శరణు వేఁడవచ్చును. ఆపురుషుఁ డాస్త్రీనిఁ జూడవలసిన యావశ్యకమును లేదు. ఆస్త్రీ పంపిన బహుమానము నాపురుషుఁడు ముంజేతికిం గట్టుకొని యామెను రక్షించుటకుఁ గంకణము కట్టుకొన్న శూరుఁడై యానాఁడు మొదలామెకు నెప్పుఁడు సోదరుఁడై యామెయేదికోరిన నది చేయునట్లు ప్రమాణము చేయును. ఒకవేళ నాస్త్రీ యీపురుషునకుఁ బ్రాణహాని కలుగు పనులు చేయుమన్న నతఁడు చేసి తీరవలయును.

ఆపత్సమయమునం దున్న స్త్రీ లీవిధముగఁ గంకణమును బంపుట తమ కెంతో గౌరవమని మహమ్మదీయచక్రవర్తులు హిందూరాజులుం గూడఁ దలంచిరి.

కర్ణావతి యీయాచారము నడపి తనకుమారుని సంరక్షించు కొనవలయునని సంకల్పించి యంతఃపురమున మెత్తని పట్టుదారము లతోఁ గడువిన్నాణముగ నొక పట్టుతోరము నల్లి నమ్మికగల యొక బంటును బిలిచి యిట్లనియె. "శత్రుసేనల బారిఁ బడకుండ తప్పించు కొని యెట్లయిన హుమాయూను చక్రవర్తి వద్దకుఁ బోయి యీతోర మును వానికిచ్చి యీతోరమువలన మీవారురాణియగు కర్ణావతికి నతఁ డిప్పుడు సోదరుఁ డయ్యెం గావున యాపద గడువంబెట్టవలయు నని చెప్పుము." ఆతోరముఁ దీసికొని యాబంటు నిరంతరప్రయాణం బుల ఢిల్లీపురమునకుఁ జేరి యాసమయంబున నక్కడ చక్రవర్తి లేమింజేసి యాశాభంగ మొంది యాగ్రానగరమున బేబరు వేయిం చిన గులాబిపూలతోటలో నతఁడు విహారమును జేయుచుండు నని నిశ్చయించి కాలీడ్చుకొనుచు నచ్చటికిఁబోయి యచ్చటను వానిం గానక నిర్విణ్ణహృదయుఁడై హుమాయూ నాసమయమున పితూరీల నడఁచుచు రాజద్రోహుల శిక్షించుచు బంగాళాదేశమం దున్నవాఁ డని విని చిత్తూ రెక్కడ శత్రువుల పాలై పోవునో యను భయము తన కాళ్ళకింతిం తనరాని సత్తువ గలిగింప నెట్టకేల కచ్చటకుం బోయి హుమాయూనుని సందర్శించి యాదేవి యిచ్చిన పారితోషిక మత నికి సమర్పించెను. సమర్పించుటయు హుమాయూను మహానందభ రితుఁడై దానిం గ్రహించి యాతోరము ముంజేతికిఁ గట్టుకొని రాజ పుత్రస్త్రీరక్షణకుఁ దీక్షవహించి "కర్ణావతి కేమికావలయును. ఆమె యేమడిగిన నది యిచ్చెద. చెప్పు" మని యడిగెను. "స్వామీ! ఆమె కేమియు నక్కఱలేదు. ఆమె మీతోబుట్టు వగుటచే చిన్న వాఁడగు మీ మేనల్లుని రక్షింపుఁడు. ఇదియే యామె కోరిక."

యని యా సేవకుఁడు ప్రత్యుత్తర మిచ్చెను ఆపలుకులు విని వల్లె యని హుమాయూను బంగాళమునం దింకను దాను చేయవలసిన పని యున్నను దానిం గట్టిపెట్టి విపత్సముద్రమునం దున్న స్త్రీని సముద్ధరించుట ప్రథమకర్తవ్యమని నిశ్చయించి మహాసేనాసమేతుఁడై రాజస్థానమునకుఁ బోవఁ బయన మయ్యెను.

అప్పటికి బహదూరుషా యింకనుఁ జిత్తూరుకోటలోఁ బ్రవేశింప లేదు. హుమాయూ నించుక త్వరపడినపక్షమున పట్టణము పరులచేతం బడక యుండును. కాని యెందుచేతనో పట్టణసమీపమునకు వచ్చియు బహదూరుషా పయిం బడక కాలహరణము చేసి యుదాసీనుఁ డయ్యెను. మహమ్మదీయ మత ద్వేషు లగు హిందువులను గెలుచుచున్న సాటితురకమీఁద గత్తికట్టి పోరుట తనవంటితురక కనుచితమనియు మతవిరుద్ధ మనియుఁ దలంచి హుమాయూనుఁ డట్లుపేక్షించె నని కొందఱు చెప్పుదురు. రాజపుత్రులకుఁ బ్రత్యక్షముగ సహాయము సేయకున్నను ఢిల్లీచక్రవర్తి యిట్టియకార్యములు చేసినందుకు బహుదూరుషాను మిక్కిలిచీవాట్లు పెట్టి యధిక్షేపించె నందురు.

కోటలోనున్న రాజపుత్రులు లోపలి బలము క్రమక్రమముగ క్షీణమగుటయు పయిసహాయము రాకుండుటయుఁ జూచి చిత్తూరున కంత్యకాల మాసన్నమయిన దని గ్రహించి సర్వము సిద్ధము చేసికొనిరి. బాలుఁ డగు నుదయసింగును విశ్వాసముగల యొక సేవకున కప్పగించి పగతురచేతఁ జిక్కకుండ నావలకుఁ దాఁటించి తొల్లి లక్ష్మణసింగునకుఁ గలిగిన దేవతాసాక్షాత్కారమును జ్ఞప్తికిఁ దెచ్చుకొని తమకు రా జుండవలయునని రాజపుత్రసేనాపతు లెవ్వని రాజుం జేయుద మని యోచింపుచుండ దేవలకోటనుండి వచ్చినసురేశ మల్లుని కుమారుఁడు భాగ్జి యనునతఁడు ముందఱికివచ్చి నేను చిత్తూరురాజులకు రక్తస్పర్శగల జ్ఞాతివర్గములోనివాఁడను. నేను నాయకుఁడనై మిమ్ము నడపెద. నన్ను రాజుం జేయుఁడని కోరగా నప్పుడు యథా

విధిగా పట్టాభిషేకము చేయుటకు వీలులేక వారందఱు వానిని రాణాగా నేర్పఱచిరి. కోటగోడ లొక్కట్టొక్కటిగా నేలం గూలఁ జొచ్చెను. చిత్తూరు నలుమొగంబులును శత్రువులు చుట్టుముట్టిరి. ఒక్కగడియలో కఱకుతురకలు బెబ్బులులవలె వచ్చి కోటలోఁ బడు టకు సిద్ధముగ నుండిరి. అప్పుడు స్త్రీలు ప్రత్యేకముగా చితుల నేర్పఱచుకొని యందుఁ బడి చచ్చుటకు వీలు లేదు. అందుచే పుల్ల కొలఁది యెండుపుల్ల లొక్కచోట కాడుగా పరిచి దానిపై బారువుల కొలఁది తుపాకిమందు పోయించి రాణీ కర్ణావతి పదమూఁడు వేల రాజపుత్రస్త్రీలతోఁ గూడి యాకాడుం బ్రవేశించి చిచ్చువెట్టుకొని యగ్నిహోత్రునకే కాహుతి సమర్పించెను. మిగిలినస్త్రీలు కొందఱు విసముదినియుఁ గొందఱు ఖడ్గములతోఁ బొడుచుకొనియు కర్ణావతి మార్గము ననుసరించిరి.

ఇట్లు నిశ్శేషముగ నంతఃపురకాంత లందఱుఁ గులాచారమును నడపి గౌరవంబును నిలుపుకొన్న పిదప హతశేషు లగురాజపుత్రవీ రులు నిర్విచారముగ రక్తాంబరములు ధరించి యాయుధపాణులై మృత్యుదేవతం దృణీకరించి కోటతలుపులం దీయించి ముట్టడివేయు మ్లేచ్ఛసైన్యముపయిం బడిరి. ఆదినము ముప్పదిరెండువేల రాజపు త్రులు దేశాభిమానమునిమిత్తము ప్రాణములు విడిచిరి. రాజస్థాన మునం దున్నశూరు లంద ఱానాఁడు పంచత్వము నొందిరి.

అనంతరము బహదూరుషా చచ్చినవారితోడను చచ్చుచు న్నవారితోడను నిండియున్న చిత్తూరుకోటలో పదునైదుదినముల వఱకు కొలువుఁ దీర్చియుండెను. అట్లుండ హుమాయూను దండెత్తి వచ్చుచున్నవాఁ డనువార్త విని దానికిం దగినప్రయత్నములఁ జేయ నారంభించెను. బహదూరుషాయొక్క సేనలో పోర్చుగీసువారు కొంద ఱుండి ఫిరంగులను మిక్కిలి నైపుణితోఁ బ్రయోగించి కోట లోఁ బరుచుకొనిరి. అందుచే నతనికి పోర్చుగీసువారిమీఁదను వారిఫిరంగుల

మీఁదను గడువిశ్వాస ముదయింప నతఁడు వా రెంత చెప్పిన నంత సేయుచుండెను. ఆపోర్చుగీసువారి సహాయమున హుమాయూను రాక నడ్డగింపగల శిబిర మొకదానిని నిర్మించి దడులు గట్టించి కందకములఁ ద్రవ్వి యాశిబిరము దుర్భేద్యముగఁ జేసిరి. దానిబలముఁ జూచుకొని బహదూరుషా యింక తాను సురక్షితుఁడ ననుకొని నిర్భయముగ నందుఁ గూర్చుండెను.

ఆవ్యూహము పన్నిన నేర్పరులు మిక్కిలి బుద్ధిమంతులే యగుదురు. కాని శత్రువులు లోపలికి వచ్చుట యెంత కష్టమో లోపలి వారు బైటికిఁ బోవుటయు నంతియే కష్ట మనుమాట వారు మరచిరి. వ్యూహము పన్నినయతఁడు పరాజయము గలిగినప్పుడు సేన పారి పోవుటకుఁ దగినవీ లుండునట్లు పన్నవలయును. పోర్చుగీసువారు బహదూరుషా సేన కట్టివీలును కలుగఁజేయరైరి. హుమాయూను సేనలు నాలుగుదెసలం జుట్టుముట్టి యెక్కడచూచిన దామెయై కనఁబడు చుండెను. తన సేనకు తిండిసరకు లంతకంతకు తరిగిపోవుటయు వానిని దెప్పించుకొనుటకు మరల వీలు లేకపోవుటయు సేన యావలకుం బారి పోవుటకు దుస్సాధ్య మగుటయు శత్రుసేనను జయించుట స్వప్నవార్త యగుటయు నెఱిఁగి బహదూరుషా తనయవస్థకుఁ దానే సిగ్గుపడి యైదుగురుబంట్లను సాయము దీసికొని మారువేసము వేసికొని యర్థ రాత్రమున నావలఁబడి ప్రాణములు దక్కించుకొని సేవకర్మము సేనదని యూరకొనెను. సేన మేలుకొని ప్రభువును గానక వానకుఁ గఱిగిపోయిన యుప్పులాగున నదృశ్య మయ్యెను. బహదూరుషా కష్ట పడి జయించిన చిత్తూరుకోట హుమాయూనునిస్వాధీన మయ్యెను.

బహదూరుషా తఱుమఁబడి యొక నెలవుననుండి యొక నెలవునకు బసువులెత్తుచుఁ గొంత కాలమున కెచ్చటఁ గానఁబడఁడయ్యె. హుమా యూను సమయమునకు వచ్చి చిత్తూరునగరమును గాపాడలేకపోయి నను బహదూరుషాయొక్క మంత్రుల తెలివితక్కువప్రయత్నమువలన

విక్రమాంతకీర్తియు నగుపృథివిరాజున కొకకుమారుఁడు గలఁడు. వాని పేరు వనవీరుఁడు. హిందీభాషలో వానిని బన్బీరుఁ డందురు. అతనిని చిత్తూరురాజ్యసంరక్షకునిగా నేర్పఱచు టుచిత మని వారు నిశ్చయించిరి. అతఁడు బలసంపన్నుఁడును సింహవిక్రముఁడు నగుపృథివి రాజునకుఁ గుమారుఁడు నగును గాని దాసిపుత్రుఁ డగుటచేత వానివి వారు రాణాగాఁ జేసికొనఁజాలక కొన్నిసంవత్సరములపాటు చిత్తూరు రాజ్యమున కతఁడు సంరక్షకుఁడు గా నుండి దానిని గ్రమస్థితిలోనికిఁ దెచ్చినపక్షమున నింతలో నుదయసింగు యుక్తవయస్కుఁడై పరిపాలనకుఁ దగినవాఁ డగునో కాఁడో తెలిసికొనుటకు వీలు గలుగు నని నిశ్చయించిరి.

వనవీరుఁడు తొలుదొల్త సందేహించి సూర్యవంశప్రదీపకులు మహాసాహసులు నగు చిత్తూరురాజులు పాలించిన రాజ్యమును తన వంటిహీనకులజుఁడు పాలింపఁదగదనియుఁ గావునతన కదిష్టము లేదనియు వారిం బ్రార్థించెను. కాని రాజపుత్రవీరు ల దఱుఁ జిత్తూరురాజ్యము యొక్క దురవస్థను వర్ణించిచెప్పి రాజ్యలక్ష్మి నట్టిదురవస్థనుండి తప్పింపఁగల సమర్థు డతఁడుతక్క వేరొకఁడు లేఁడని నొక్కిపలికి బ్రతిమాలుటచే వారిమాటం ద్రోసిపుచ్చలేక యెట్టకేల కతఁ డంగీకరించెను.

కార్యగతు లిట్లుండ విక్రమజిత్తుని సవతితమ్ముఁ డగు నుదయసింగు పసిబాలుఁడగుటచే రాజపుత్రప్రభువులు చేయు కుట్రలెఱుఁగక యాఁకలి యగునప్పుడు భుజించుటయు వేడుక గలిగినప్పు డాడుకొనుటయు నిద్రవచ్చినప్పుడు పవ్వళించుటయు వ్యాపారములుగ నంతిపురమున బెరుగు చుండెను. తల్లిదండ్రులు చిన్నతనమందే గతించుటచే పన్న యను నొకదాసి వానికిఁ దల్లియై పెనుచుచుండెను. అది తల్లిగా తనయీడువాఁడగు దాసికొడుకు తనకుం జెలికాఁడుగా నుదయసింగు క్రమక్రమముగా నభివృద్ధి పొందుచుండెను.

ఒకనాఁడు సాయంకాల మెప్పటియ ట్లంతఃపుర సేవకుండగు మంగలిఁ డుదయసింగునకు నన్నము దెచ్చి పెట్టి యారగింపఁ జేసెను. రాజపుత్రగృహములలో మంగలివాండ్రు తక్కిన పతిలకుఁ దోడుగ వంటలుగూడ చేయుదురు. ఉదయసింగు భోజనముచేసి యొకపాన్పుపై నిద్రపోయెను. వానిమంచముప్రక్కనే దాసీపుత్త్రుఁడును పండుకొని నిద్రించెను. పన్నయుఁ దన కన్నకుమారునికన్న నెక్కుడు ప్రేమం బెనుచుకొనుచున్న రాజకుమారుని గాపాడుకొనుచు నించుక మేలుకొని యుండె. అట్లుండ నాకస్మికముగ నంతఃపురములనుండి గోలయు రోదనము డనవచ్చె. పన్న తొందరపడి యదియేమో తెలిసికొనుటకు లేచి చెవియొగ్గి వినఁజొచ్చెను. సాధారణముగ నంతఃపురములో దప్పు చేసినబానిసలను శిక్షించునప్పుడును నందకత్తెయలగు సవతు లొండొరులతో కలహించునప్పుడును నార్తనాదములు వినఁబడుటకలదు కాని యానాటిధ్వను లట్టివిగా నుండవయ్యె. ప్రచండదారుణమై గర్భనిర్భేదకమై వినఁబడిన యారోదనము మరణసంబంధమైనదిగా గ్రహించి పన్న యేదో యపాయము వాటిల్లెనని తలంచి తాను తనజాగ్రత్త మీఁదనుండెను.

అంతలో వంటలవాఁడగు మంగలి పరుగుపరుగున వగర్చుకొనుచువచ్చి యాకళవళమునకుఁ గారణ మేమని పన్న యడుగ నిట్లనియె. "నీ వెఱుగనేయెఱుఁగవా? ఈమూల నుండుటచే నీకేదియు దెలియలేదు గాబోలు! మనదొరలందఱు విక్రమజిత్తును సింహాసనభ్రష్టునిజేసి వనవీరుని చిత్తూరునకు సంరక్షకుఁడుగా నేర్పఱచిరి. ఆవనవీరుఁడు రాజ్యము స్వాధీనము చేసికొని విక్రమజిత్తును వధించినాఁడు. ఆరాజు నిమిత్తము వానిభార్యలు చుట్టములు నేడ్చుచున్నారు ఈరోదనమది."

ఆపలుకులువిని పన్న నిశ్చేష్టయై యేమియుఁదోచక పండుఁకొనియున్న రాజపుత్త్రునిఁజూచి తనలో "విక్రమజిత్తును జంపినవా

విక్రాంతకీర్తియు నగుపృథివిరాజున కొకకుమారుఁడు గలఁడు. వాని పేరు వనవీరుఁడు. హిందీభాషలో వానిని బన్బీరుఁ డందురు. అతనిని చిత్తూరురాజ్యసంరక్షకునిగా నేర్పఱచు టుచిత మని వారు నిశ్చయించిరి. అతఁడు బలసంపన్నుఁడును సింహవిక్రముఁడు నగుపృథివిరాజునకుఁ గుమారుఁడు నగును గాని దాసిపుత్త్రుఁ డగుటచేత వానిని వారు రాణాగాఁ జేసికొనఁజాలక కొన్నిసంవత్సరములపాటు చిత్తూరురాజ్యమున కతఁడు సంరక్షకుఁడుగా నుండి దానిని గ్రమస్థితిలోనికిఁ దెచ్చినపక్షమున నింతలో నుదయసింగు యుక్తవయస్కుఁ డై పరిపాలనకుఁ దగినవాఁ డగునో కాఁడో తెలిసికొనుటకు వీలు గలుగు నని నిశ్చయించిరి.

వనవీరుఁడు తొలుదొల్త సందేహించి సూర్యవంశప్రదీపకులు మహాసాహసులు నగు చిత్తూరురాజులు పాలించిన రాజ్యమును తన వంటిహీనకులజుఁడు పాలింపఁదగదనియుఁ గావునఁ దన కదిష్టములేదనియు వారిం బ్రార్థించెను. కాని రాజపుత్త్రవీరులు దనకుఁ జిత్తూరురాజ్యము యొక్క దురవస్థను వర్ణించిచెప్పి రాజ్యలక్ష్మి నట్టిదురవస్థనుండి తప్పింపఁగల సమర్థుఁ డతఁడుతక్క వేరొకఁడు లేఁడని నొక్కిపలికి బ్రతిమాలుటచే వారిమాటం ద్రోసిపుచ్చలేక యెట్టకేల కతఁ డంగీకరించెను.

కార్యగతు లిట్లుండ విక్రమజిత్తుని సవతితమ్ముఁడగు నుదయసింగు పసిబాలుఁడగుటచే రాజపుత్త్రప్రభువులు చేయు కుట్రలెఱుఁగక యాఁకలి యగునప్పుడు భుజించుటయు వేడుక గలిగినప్పు డాడుకొనుటయు నిద్రవచ్చినప్పుడు పవ్వళించుటయు వ్యాపారములుగ నంతిపురమున బెఱుగు చుండెను. తల్లిదండ్రులు చిన్నతనమందే గతించుటచే పన్న యను నొకదాసి వానికిఁ దల్లియై పెనుచుచుండె. అది తల్లిగా తనయీడువాఁడగు దాసికొడుకు తనకుం జెలికాఁడుగా నుదయసింగు క్రమక్రమముగా నభివృద్ధి పొందుచుండె.

ఒకనాఁడు సాయంకాల మెప్పటియ ట్లంతఃపుర సేవకుండగు మంగలిఁ డుదయసింగునకు నన్నముదెచ్చి పెట్టి యారగింపఁ జేసెను. రాజపుత్రగృహములలో మంగలివాండ్రు తక్కిన పతిలకుఁ దోడుగ వంటలుగూడ చేయుదురు. ఉదయసింగు భోజనముచేసియొకపాన్పుపై నిద్రపోయెను. వానిమంచముప్రక్కనే దాసీపుత్రుఁడును పండుకొని నిద్రించెను. పున్నయుఁ దన కన్నకుమారునికన్న నెక్కుడు ప్రేమం బెనుచుకొనుచున్న రాజకుమారుని గాపాడుకొనుచు నించుక మేలుకొని యుండె. అట్లుండ నాకస్మికముగ నంతఃపురములనుండి గోలయు రోదనము డనవచ్చె. పున్న తొందరపడి యదియేమో తెలిసికొనుటకు లేచి చెవియొగ్గి వినఁజొచ్చెను. సాధారణముగ నంతఃపురములో దప్పు చేసిన దాసిసలను శిక్షించునప్పుడును నందకత్తెయలగు సవతు లొండొరులతో కలహించునప్పుడును నాతకానాదములు వినఁబడుటకలదు కాని యానాటిధ్వను లట్టివిగా నుండవయ్యె. క్రందణదారుణమై గర్భనిర్భేదకమైవినఁబడిన యారోదనము మరణసంబంధమైనదిగా గ్రహించి పున్న యేదో యపాయము వాటిల్లెనని తలంచి తాను తనజాగ్రత్త మీఁదనుండెను.

అంతలో వంటలవాఁడగు మంగలి పరుగుపరుగున వగర్చుకొనుచువచ్చి యాకశవశమునకుఁ గారణ మేమనుసి పున్న యడుగ నిట్లనియె. ‹‹నీ వెఱుగనేయెఱుఁగవా? ఈమూల నుండుటచే నీకేదియు దెలియులేదు గాబోలు! మనదొరలందఱు విక్రమజిత్తును సింహాసనభ్రష్టునిజేసి వనవీరుని చిత్తూరునకు సంరక్షకుఁడుగా నేర్పఱచిరి. ఆవనవీరుఁడు రాజ్యము స్వాధీనము చేసికొని విక్రమజిత్తును వధించినాఁడు. ఆరాజు నిమిత్తము వానిభార్యలు చుట్టములు నేడ్చుచున్నారు ఈరోదనమది.''

ఆపలుకులువిని పున్న నిశ్చేష్టయై యేమియుఁదోచక పండుఁకొనియున్న రాజపుత్రునిజూచి తనలో ‹‹విక్రమజిత్తును దంపినవా

ఉదయసింగును బ్రతుకనిచ్చునా? రాచపురుగేది మిగిలినను వనవీరునకు క్షేమకరము గాదుగదా" యనుకొని చప్పుచప్పున రాజపుత్రుని మేననున్న విలువగల బట్టలు నగలు నొలిచివైచి వానినొక పండ్లగంపలో పండుకొనఁబెట్టి మీఁద కొన్ని యాకులను పండ్లను గప్పి యది యొరులకంటఁబడకుండ జాగరూకతతోఁ దీసికొనిపొమ్మని మంగలి వాని కప్పగించి "నీవీక్షణమే యిచ్చటినుండి పోయి నదిలో నిసుక తిప్పమీఁద నీగంపపెట్టుకొని కూర్చుండుము. నేనుం ద్వరలో వచ్చి మిమ్ముం గలిసికొనియెద" నని చెప్పి వానిని సాగఁదోలెను.

మంగలి యాగంపెత్తుకొని కావలివాండ్ర యెదుటనుండియే యనేక కవాటములు దాఁటిదాఁటి కోటవెలుపలికిం జనియెను. రాజభటులు వానింజూచియు రాజులు తినఁగా మిగిలిన కూరలు నన్నము మంగలి తన యాలుబిడ్డల నిమిత్తము పట్టుకొనిపోవుట నిత్యము జరుగుచుండుటచే నాదినమునుగూడ నట్లె మంగలి గొనిపోవుచుండఁ బోలునని గంప బరీక్షించి చూడకయే వానిని విడిచివచ్చిరి. పున్న యిఁకను గొంతపని చేయవలసినది. రాజపుత్రుని మీఁదనుండి తీసిన విలువబట్టలు తనకొడుకునకుఁ దొడుగవలసి యుండెను.

ఆబట్టలు నిద్రించియున్న తనకొడుకునకు విసవిసఁదొడిగి రాఁబోవు దురవస్థ కెదురుచూచుచు నామెకూర్చుండెను. అంతట యచిరకాలములోనే యామెకు మనుష్యుని యడుగుల చప్పుడు వినఁబడియె. వనవీరుఁడు తలుపులు దీసికొని ఖడ్గపాణియై యామె యెట్టయెదుట నిలిచి "అమ్మా! నీయధీనమునందున్న రాజకుమారుఁడేడీ? ఉదయసింగును నాకుఁ జూపుమని గంభీరధ్వనితోఁ బలికెను. కన్నకడుపగుటచే యాదాసిహృదయము నీరై పోయినందున నేమియుం బలుకఁజాలక యొక్కనిముసమూరకుండి పిమ్మట ధైర్యముఁ దెచ్చికొని యతఁడే రాజకుమారుఁడని చేతితో నిదురించుచున్న తనకొడుకుం జూపెను. క్రూరకర్ముఁడగు వనవీరుఁడు ఖడ్గముతో వానితల రెండు

ముక్కలుగ లరికెను. నిదురించుచున్న దాసిపుత్రుఁడు నిదురించుచుం డగనే కన్నతల్లికన్నులుముందట యొక్క కేకవేసి ప్రాణములు విడి చెను. వనవీరుఁడును రాజ్యము నిష్కంటకమైనదని నమ్మి తాను రాణానైతినని సంతసించి సంతుష్టితో నంతఃపురము విడిచిపోయెను.

రాజకుమారుఁడు బ్రతికియుండిన పక్షమునఁ దనవంటి దీనుల ననేకుల నన్నవస్త్రములిచ్చి పోషింపఁగలడని యెంచి దాసియగు పున్న తనజుం జిత్తూరు రాజకుటుంబమువారు చేసిన మేలు మరువక కృతజ్ఞతగలిగి రాజపుత్రుని ప్రాణములు గాపాడుటకై తనకుమారుని ప్రాణముల నర్పించి యుత్తమచరిత్రగలదై యెల్లరచేతం గొనియాడ బడుచున్నది. రాజకుమారునకు దహనక్రియలు వాని కీర్తికిదగినంత గొప్పగా జరుపఁ బడెను. అవి ముగియువఱకు పున్న కన్నీరు సంతత ధారగాఁ గారునట్లేడ్చి యనంతరమున క్రొత్తరాణావద్దకు దక్కినరాజు బంధువుల వద్దను సెలవుగైకొని రాచనగరుఁబాసి యావలకుం బోయెను. పోయి పురమువెలుపల నేటిలో నిసుకతిప్పమీఁద గంపతో దనరాక కెదురుచూచుచున్న మంగలిం గనుగొనియెను. నల్లమందు పెద్దమోతాదు ప్రయోగించుట చేతనో మఱి యేకారణముచేతనో యుదయసింగు గంపలోనుండి యింతవఱకును మేలుకొనలేదు. మూరు మూల త్రోవలంబడి నొరులకంటఁ బడకుండ నడచి యాపున్న మెల్ల మెల్లగ దేవలనగరముఁ జేరెను. ఆనగరమును జిత్తూరురాజ్యము నిమిత్తము తనప్రాణములు విడిచిన బాగ్జియను శూరశిఖామణి కుమా రుఁడు పాలించుచుండెను. ఆతనివలన రాజపుత్రునకు సంరక్షణము జరుగునని దాసి పుట్టెడాస పెట్టుకొని యరిగెను. ఆరాజును రాజ కుమారుని దాసిని సత్కరించి యాదరించెను. కాని చండశాసనుఁడు వనవీరునకు జడిసి తనరాజ్యమునం దారాజకుమారుని నిలిపినపక్షమున దేవలకోట చిత్తూరునకు సమీపమున నుండుటచే నావార్త వేగుల వాండ్రవలనఁగాని మఱియొకరివలనఁగాని వనవీరునకుఁ దెలియకపో

దనియుఁ దెలిసినచో నతఁడు తనకెగ్గుసేయుననియుఁ జెప్పి వారిం దన రాజ్యమున నుండనీయక వేఱొకతావునకుం బంచె దాదియు, మంగలియు మఱల గంపనెత్తుకొని పయనమై యిట్టటుఁ దిరిగి దవజరుపుర మను గ్రామము చేరిరి.

ఆయూరిరాజు నుదయసింగునకు దగ్గరచుట్టమే కాని తాను బలవంతుఁడను కాననియు బాలకునకు శరణమిచ్చినట్లుఁ దెలిసినచో వనవీరుఁడు తనప్రాణముల దక్కనీయఁడనియుఁ గావున దాను సహాయము చేయఁజాలననియుఁ జెప్పి యతఁడు వారి నక్కడ నిలువనీయక పయనముచేసి వేరొక తావునకుఁ బంపెను.

ఇట్లిరువురుచేత నిరాకరింపఁబడియుఁ బన్న మనోధైర్యము విడువదయ్యె. మున్ను పృథివిరాజు కొంతకాలము వసియించిన కమలమియరుకోటలో నాకాలమున జైనమతస్థుఁ డగునొకవర్తకుఁడు కొంతసేనం గూర్చుకొని వాసము జేయుచుండెను శూరుల మని వీరుల మని చెప్పుకొనుచు సమయమగునప్పుడు రాజపుత్రునకు శరణమొసంగ లేని యాక్షత్రియుల నాశయించుటకన్న మతాంతరుఁ డగునీకోమటి నాశ్రయించుటయే యుక్తమని తలంచి పన్న బాలుని, మంగలిని వెంటఁబెట్టుకొని కమలమియరుకోటకుఁ బయన మయ్యె.

ఆపన్న తానెంత రాజపుత్రస్త్రీయైనను ఉక్కునరములునిండు పౌరుషముఁ గలమగవానికన్న తా నెంత ధైర్యముగల దైనను నోరు లెఱుఁగకుండ నామహారణ్యమధ్యమున నాకొండలమీఁద కనుమలం గడచి శిఖరంబుల నెక్కి దిగి సెలయేళ్ళ దాఁటి ఘాతుకమృగంబుల బారినుండి తప్పి యెట్లు కమలమియరుకోటఁ జేరినదాయని యాచిక్కు మార్గముల నెఱిఁగినవారంద రాశ్చర్యపడకపోరు. ఆమె యసహాయు యై యావనమధ్యమునఁ బోవునప్పుడు ఘాతుకమృగంబుకన్న నెక్కుఁడు ఘాతుకు లగుభిల్లులు మొదలగు నడవిమనుష్యులుసహిత మామె కథను విని జాలిపడి యామెకుం దోడుపడిరి.

పూర్వకాలమున బప్పరావులకు భిల్లుఁ డొకఁడు మొగమున టీకా వేసి యనగా నెత్తురిచిహ్నము వేసి నజాతికతఁడు రాజని చెప్పి వానికి లోఁబడియెను. అట్లే యాభిల్లులందఱు నుదయసింగు తమకు రాజని యంగీకరించి వానికిం దోడ్పడుదుమని వాగ్దానము చేసిరి. కమలమియరుకోటలో జైనమతస్థుఁ డగుకోమటి యసాసా యనునతఁ డొకనాఁడు తల్లియుఁ దానును కూరుచుండి మాటలాడు చుండఁగా తననిమిత్త మొకయాఁడుది వచ్చి వేచియున్న దని విని యామెను లోపలికి రమ్మని యానతిచ్చెను. అప్పుడు మేలిముసుంగు వేసికొని యున్నయొకరాజపుత్రస్త్రీ వానియెట్టయెదుట నిలిచెను. నావల్ల నీ కేమికావలయు నని యసాసా యడుగ నామె తనప్రక్క నున్న రాజకుమారు నెత్తుకొని "యితఁడు నీరాజు ఈ బాలకుని రక్షింపు మని యాబిడ్డను వానిపాదములపైఁ బడవైచెను. అసాసా కొన్ని ప్రశ్న లడిగి యున్నవలన బాలకునివృత్తాంత మంతయు నెఱిఁగి యేమి చేయుటకుఁ దోఁచక కళవళపడఁజొచ్చెను. స్వామిభక్తినిబట్టి చూచి నను మతమునుబట్టి చూచినను గౌరవమును జూచినను బాలకుని రక్షించితీరవలయు నని యతనికిఁ దోఁచెను. కాని దుర్జనుఁ డగు వన వీరునితోఁ గయ్యముపడుకుఁ గాలుద్రవ్వుట కిష్టము లేదు. జైనమతస్థు నకు రాజపుత్రునకున్నంత సమరోత్సాహము లేదు. అదిగాక రాఁ దలంచినయవస్థ తనస్వవిషయము కాకపోవుటచే నసాసా యుద్ధమునకు మొదలే సమ్మతింపడయ్యె. అందుచేత నతఁడు సందేహించుచు దీర్ఘాలోచనము చేయుచు ననేకకష్టములు పడిపడి వచ్చినపున్నకేసి చూచుచు తనకు రాఁగలయిక్కట్టులనెల్లఁ జెప్పుచుఁ గాలయాపనము చేయుచుండ నంతలో నతనితల్లి కుమారుని పిలిచి 'నాయనా! యేల సందేహించి భయపడెదవు? స్వామిభక్తిగలవారు కష్టముల గణి యింపరుగదా. ఇతఁడు నీరాజగు సంగునికుమారుఁడు. మనయదృష్టము బాగున్నచో మనకే జయము కలుగఁగూడదా' యని పలికి వాని

కుత్సాహము గలిగించెను. అసాసాతల్లి పలుకులచే రోషముం దెచ్చుకొని వారి కభయ మిచ్చెను. కాని మహాసాహసికురా లగునాస్త్రీ యింత కంటె నెక్కువకష్ట మగుపని యొకటి చేయవలసియుండెను. ఉదయ సింగు నాఁడు మొదలుకొని యసాసాయొక్క మేనల్లుఁ డని చెప్పుటకు వారు నిశ్చయించిరి. అసాసా కోమటి యగుటచేత నతనివద్ద రాజ పుత్రస్త్రీ పరిచారికగా నుండిన లోకు లనుమానింతురు. ఆ కారణ ముగా తనకొడుకునైనం జంపుకొని వానినే నమ్ముకొని యున్నయా దాది యాబిడ్డను విడిచి పోవలసివచ్చెను. బాలకుని విడువలేక విడువ లేక పున్న యెట్టెటో విడిచికన్నులు వాచిపోవున ట్లేడ్చి యెక్కడ నైనం బాలుఁడు బాగున్న చాలునని యథేచ్ఛం జనియెను.

ఆకొండలలో నుదయసింగు పెరుగుచుండ బందుగులందఱు నతఁడు వనవీరునిచేతిలో మృతినొందినాఁ డని యొక్కయేడు వేడ్చి యూరకొనిరి. వనవీరుఁడును రాజకుటుంబములో వారినందఱం గడ తేర్చి తనపదవి దిట్టపరచుకొని తాను దాసిపుత్రుఁడనుమాట మరచి రాజపుత్రప్రభువుల యనుగ్రహముచేతఁ దన కింత మహైశ్వర్యము పట్టిన దని తలంపక తా నాగర్భశ్రీమంతుఁడే యనుకొని గర్వించి తిరుగఁజొచ్చెను. అతని రాజ్యసంరక్షకునిగా నేర్పఱచిన రాజపుత్ర ప్రభువు లందఱుం దముచేసిన లోపమునకు పశ్చాత్తాపము నొంది రాజపుత్రవంశమెల్ల నిర్మూలికపఁబడిన దనుకొని చేయునది లేక యెట్టెటో యేడుసంవత్సరములు వానిపాలనను లోఁబడి యుండిరి.

అటులుండ నొకమారొకపండుగకు కమలమియరుకోట కనేక బంధువులు వచ్చి యసాసాచేత సత్కరింపఁబడి విందులనారగించిరి. వచ్చినరాజపుత్రుల కందఱకు లోపలమందిరమునను తనవర్ణమువా రగువర్తకులకు మఱియొకమందిరమునను నతఁడు వడ్డనలఁ జేయిం చెను. భోజనములవేళ నసాసా మేనల్లుఁడు రాజపుత్రుల బంతిలోనికి బోయి యచ్చట నొకకంచములో పెరుగన్నము తిన నారంభించెను.

ఆబాలుఁడు కోమటి యనుకొని వానిని పంక్తిబాహ్యుఁడుగా నెంచి యీవలకుం బొమ్మని రాజపుత్రులు కొందఱు బ్రతిమాలిరి. కొందఱు వేఁడుకొనిరి. కొందఱు బెదరించిరి. బాలుఁడు వేడికోలు వినిపించు కొనఁడయ్యె. బెదరింపులకు బెదరఁడయ్యె. అసాసా యీబండబాలు నేమియు నేయలేక యూరకొనియె నని కొందఱు తలఁచిరి. అందులో నొకరిద్దఱు బుద్ధిమంతులు బాలునియొద్ద కోమటిగుణము లేవియు లేక పోవుటచే నతనికి నసాసాకు నేమియు సంబంధము లేదని నిశ్చయించిరి.

అనంతరము కొంతకాలము జరుగ నొకనాఁడు కమలమియరు మార్గమున నొకరాజపుత్రుఁడు మార్గవశమునఁ బోవుచుఁ దనరాక నసాసాకుఁ దెలియఁబరచెను. వానిని సగౌరవముగాఁ దోడితెచ్చుట కసాసా తనమేనల్లుని పంపెను. రాజచిహ్నములు ధీరలక్షణములు గలయీబాలునిముఖవైఖరిఁ జూచి యీవచ్చినయతఁ డాశ్చర్యపడి యతఁ డసాసకు చుట్టము గాఁ డని నమ్మి వానివృత్తాంతము దెలుపుమని యసాసాను నొక్కి యడిగెను. అసాసాయుఁ దగినపని చేయవలసినకాలము వచ్చిన దని గ్రహించి యీబాలుఁడు తనమేనల్లుఁడు కాఁ డనియు సంగుని మూడవపుత్రుఁ డగునుదయసింగనియుఁ జెప్పి నిజము నొప్పుకొనియెను. ఈవచ్చినరాజపుత్రవీరుఁడు తొల్లి రాణాహమీరును వితంతువయిన తనకూఁతు నిచ్చి వివాహము చేసి వంచించిన మాల్‌దేవుని వంశస్థుఁడు. సోనిగుర్రయనుసంస్థానమునకు ప్రభువు.

ఈకొండకోటలో సంగునికుమారుఁ డగునుదయసింగు వసించుచున్నవాఁ డన్నవార్త-లె దేశమంతట కొలఁదికాలములో నలముకొనెను. ఆమాట నిజమో యబద్ధమో తెలిసికొని రాజపుత్రుని కన్నులార చూచుకొనుటకై మీవారునుండియుఁ దక్కిన సంస్థానములనుండియు రాజపుత్రప్రభువులు విరామము లేక కమలమియరునకు రాఁదొడగిరి. ఇటు లుండ చందావతుకులస్థుఁ డగురాజపుత్రప్రభువు వనవీరునివలన

పరాభవము నొంది వానిని విడిచి కమలమియరుకోటకు వచ్చి రాజ పుత్రుని కలిసికొనెను. వాని పరాభవకారణ మిది. పూర్వమునుండి మీవారు రాణా రాజబంధువులను విందులకు పిలిచినప్పుడు తనకెవ్వరి మీఁద నత్యంతగౌరవము గలదో వానిని గౌరవించుటకు తనకంచము లోనుండి కొంచె మెంగిలియన్నము వానికిఁ బంపుట యాచార మయి యుండెను. ఈయాచారము రాణా సరిగా నడుపనప్పుడు రాజ పుత్రవీరు లనేకపర్యాయములు రాణాపైఁ గోపించుచు వచ్చిరి.

ఒకమారొక రాజపుత్రవీరుఁడు తనకు రాణాపంపవలసిన యన్నము మఱియొకనికి పంపుటచే గోపించి విందారగింపకయే లేచి పోయెను. వనవీరుఁడు తనస్థితిని మఱచి తాను నిజముగా రాణాయే యనుకొని యాయాచారమును నడుపఁజూచి తనయెంగిలి యన్నము మీవారు ప్రభువులగు కొందఱికి పంపఁగా వారాయుచ్ఛిష్టమును గుడువక యూరకొనిరి. అభిమానధనుఁడగు చందావతు వంశజుని గౌరవించుటకు మఱియొకమా రెంగిలి యన్నమును పంప నతఁడు కోపోద్దీపితుఁడై యాకంచముపాత్రను నిరాకరించి మీరుమిక్కిలి యిట్లని వానికి వర్తమాన మంపెను. "బప్పరావుల వంశస్థుని యుచ్ఛిష్టము దినుటయే మాకు గౌరవము కాని దాసీపుత్రుని యెంగిలి కూడ తినుట మాకు గౌరవముకా" దని చందావతువంశస్థుఁడు చివాలునలేచి తనయూరికిఁబోయి వనవీరునకు లోఁబడక వానిని రాజ్యభ్రష్టుని జేయుటకై యోచించుచు సంగునికుమారుఁడు కమల మియరుకోటలో నున్నవాఁడని విని మహానందభరితుఁడై యచటికిఁ జనియె. ఆమహావీరునితోఁగూడ ననేకరాజపుత్రు లాకోటకుంజని కొలువుదీర్చి కర్తవ్యము విచారింపఁ దొడంగిరి. అప్పుడు పున్న వెనుకటిమంగలిం దోడ్కొనివచ్చి యాకొలువుకూటమున నిల్చి రాజ పుత్రుని పూర్వవృత్తాంత మంతయు వానికిం బూసగ్రుచ్చినట్లు చెప్పి వనవీరుఁడు విక్రమజిత్తును వధించిన నాటిరాత్రి చంపఁబడినబాలుఁడు

తనకుమారుఁడుగాని రాజపుత్రుఁడు కాడనియుఁ గడుపుదీపిదైనను మానుకొని తాను రాజపుత్రుని రక్షించితిననియు నతఁడు సంగుని కుమారుఁడగు నుదయసింగనియు గోమటి మేనల్లుఁడు కాఁడనియుఁ బ్రమాణముచేసి వానికి నమ్మకము పుట్టునట్లు పలికెను. అక్కడకు వచ్చిన రాజపుత్రప్రభువులలో నప్పుడు చోహాణవంశస్థుఁడగు వీరుడుం డెను. అతఁడు చిత్తూరురాణాలకు దగ్గరచుట్టము కులవృద్ధు. అసాసా యాసభవారి యెదుటకువచ్చి యాబాలుఁడు తన మేనల్లుఁడు కాఁడని చెప్పి వానిని చోహాణవంశస్థుడగు రాజపుత్రులకుఁ జేతిలోఁ జేయివేసి యప్పగించి తనభారము తొలఁగినదని సంతసించెను.

అప్పుడా వృద్ధరాజు బాలుని కౌఁగిలించుకొని యతఁడు తన యేలినవాఁడని వానితోఁగలిసి వానియెంగిలియన్నము భుజించెను. అప్పు డుదయసింగు మొగమున లత్తుకటీకా యనఁగా రాజచిహ్న ముంచఁబడెను. వెంటనే యచట జేరిన రాజపుత్రప్రభువులందఱు నతఁడు తమరాజని వానిపాదములకు సాగిలఁబడి మ్రొక్కిరి.

ఉదయసింగునకు సహాయముచేయు మిత్రులు వందలకొలఁది వచ్చి వానికిఁగావలసిన సాధనసామగ్రులన్నియు సమర్పించిరి. అట్లు వచ్చినవారిలో మొట్టమొదటివాఁడు ముందుగా నీబాలుని వృత్తాంతము బయలుపెట్టిన సోనిగుఱ్ఱ సంస్థానప్రభువు. అతఁడు రాణాతోఁగలయు టయేగాక తనకూఁతును వానికిచ్చి వివాహము చేయఁదలఁచెను. శోనిగుఱ్ఱప్రభువువంటి బలవంతునితో సంబంధ బాంధవ్యము లుండుట మంచిదని యుదయసింగుయొక్క ముఖ్యబంధువులు దానికంగీకరించిరి కాని యీసోనిగుఱ్ఱప్రభువుయొక్క వృద్ధప్రపితామహుఁడగు మాల దేవుఁడు తన వితంతుపుత్రికను రాణాహమీరునకు మోసమున వివాహము చేసినప్పుడు హమీరు మహాకోపోద్దీపితుఁడై తన సంతతివా రెవ్వరు మాలదేవుని సంతతివారితో వియ్యమందఁ గూడదని శాశించెను. ఆమాట కొందఱు రాజపుత్రవృద్ధులు జ్ఞప్తికిఁ దెచ్చుకొని యుద

యసింగు సోనిగుఱ్ఱప్రభువు కూఁతును బెండ్లి యాడఁగూడదని పట్టు పట్టిరి. అయిన నుదయసింగుని బంధుమిత్రులు కలిసి యోచించి సోని గుఱ్ఱప్రభువుతో వియ్యమొందుట వలన గలిగెడు ననేకలాభముల నుగ్గడించి హామీరుని శాసనము రెండువందల యేండ్లనాఁటిదనియు దేశకాలపాత్రములనుబట్టి తామది మార్చుకొన వచ్చుననియు నప్పటి స్థితిని జూచిన పక్షమున రాణాహామీరే తన ప్రతిన మార్చుకొను ననియు నొక్కి చెప్పి యాపట్టుపట్టినవారి నొడంబరచి వివాహము చేసిరి.

ఉదయసింగున కన్నియు శుభశూచకములే యయ్యెను. ఆదిన ములలోనే వనవీరుఁడు తనకూఁతునకు వివాహము చేసి యామెకు నైదువందల గుఱ్ఱములను బదివేల యెద్దులపై వేసి యమూల్యవస్తువు లను సారె పంపెను. ఉదయసింగుని మిత్రులు కొందఱా సారె నడ్డముగొట్టి యాసరకులను దోఁచుకొని ఉదయసింగు వివాహము నిమిత్త ముపయోగించిరి. ఇరువురుతప్ప పేరుప్రతిష్ఠలుగల రాజపు త్రులందఱు వివాహమునకు వచ్చిరి. వివాహమహోత్సవములు మహావైభవముతో జరిగినపిదపఁ బెండ్లికిరాని యాయిరువురు దొర లకు బుద్ధిచెప్పుటకై తక్కినరాజపుత్రులు వారిపై దండు వెడలిరి. ఆయిరువురిలో నొకఁడు రణరంగమున వధియింపఁబడెను. రెండవ వాఁడు తెలివిగలిగి యుదయసింగునకు లోఁబడియె. వనవీరుఁడు ఇరు వురు రాజపుత్రులకు సహాయము చేయఁదలఁచి తనసేనలం గూర్చు కొనిపోయెను. కాని మంచిసమయమున వానిసైనికులే వాని విడిచి పగవారితో గలిసినందున నతఁడు నిర్విణ్ణుఁడై పారిపోయి చిత్తూరు కోటలో దాఁగెను.

రాజపుత్రు లెన్నిఫిరంగులు తెచ్చి యెన్నియేండ్లు కోటముట్ట డించినను వనవీరుఁడు నిశ్చయముగాఁ గోటలో సురక్షితుఁడై యుండ వచ్చును; కాని వనవీరుని మంత్రిపైకి తనస్వామి కిష్టుఁడుగనున్నను

లోలోపల నుదయసింగున కే కడుగూర్చును. ఒకమారు చిత్తూరుకోటలోనున్న వనవీరుని సైనికులకు భోజనసామగ్రులు కావలసియుండినందున వేయిబండ్లమీఁద సరకులు వచ్చుచున్నవని మంత్రి వనవీరునితోఁ జెప్పి తలుపులు పూర్తిగా దీయించెను. వేయిబండ్లును కోటలోఁ బ్రవేశించిన పిదప బండ్లలోనుండి సరకులకుమారు వేయిమంది రాజపుత్రవీరులు వడివడి దిగి కావలివాండ్ర నందఱఁ దెగటార్చిరి.

ఉదయసింగు విజయుఁడై భేరీ భాంకరణములతోఁ గోటలోఁ బ్రవేశించెను. వనవీరుఁడు వెనుక విక్రమజిత్తును నుదయసింగును జేసినట్లు వాని నప్పుడు రాజపుత్రప్రభువులు చేసినచో బాగుండును, కాని తామే వానిఁ జిత్తూరు సంరక్షకునిఁగా నేర్పఱచినందున తామే వానిం జంపుట యనుచితమని కరుణించి వానిం గడతేర్చక సకుటుంబ సపరివారముగ కోటవిడిచి యావలకుం బొమ్మని వానిని విడిచిరి. వనవీరుఁడును రాజ్యభ్రష్టుఁడై బంధువిరోధియై నిర్భాగ్యుఁడై యసహాయుఁడై తనవస్తువులను దాను తీసికొని కోటవిడిచి దక్షిణహిందూస్థానమునకుం బోయి యచ్చట నొక చిన్నసంస్థానమున కధిపతియై కాలము సుఖముగఁ గడపెను. ఉదయసింగు చిత్తూరు రాణా యయ్యెను. పున్న యనఁగా హిందీభాషలో వజ్రమని యర్థము. ఆశబ్దమునకు నిజముగా పున్న దగినది యగుటచే నామెకీర్తి యాచంద్రార్కము లోకమున నిలుచుఁగాక !

చిత్తూరు మూడవముట్టడి.

చిత్తూరు దేశములోని సమస్తజనులకుఁ గన్నులు చల్లఁబడునట్లుదయసింగు రాజ్యపాలన మారంభించెను. అతఁడు చిత్తూరునకు

వచ్చిన సంవత్సరమే చిత్తూరుకోటను పూర్ణముగఁ బాడుచేసిన యొక మహాశత్రువు జన్మించెను ఆశత్రువుఁడు ప్రసిద్ధికెక్కిన అక్బరు చక్రవర్తియే.

ఉదయసింగు కొండకోటలోఁ గోమటియింటఁ బెరుగుచున్నప్పుడు ఢిల్లీలో మార్పులనేకములు జరిగినవి. హుమాయూను చక్రవర్తి పరమసాధువగుటచేఁ దనమీఁద పితూరీలు చేసి జనులను తనపైఁ దండెత్తివచ్చి తన్నుఁ జాలచిక్కులు పెట్టుచువచ్చిన తమ్ములను క్షమియించి కనికరించి యెప్పటియట్లు గౌరవమున జూడఁదొడఁగెను. యుద్ధములో నతఁ డెంత శౌర్యవంతుఁడై యొడలు మఱచి పోరుసేయునో తదితరకాలములయం దతఁ డంత భోగపరాయణుఁడై నిశ్చింతతోఁ గాలము పుచ్చును. వేయేల? వాని దయాస్వభావమును, వాని సోమరితనమును తుట్టతుదకు వానిని సింహాసనభ్రష్టుఁ జేసినవి. అతఁడు కష్టపడి చెమటయూడ్చి మాళవదేశమును జయించెను. కాని లొంగినదానిని పూర్తిగ లోఁబఱచుకొనక సంతోషపరవశుఁడై బంధుమిత్రులతో విందులనారగించుటతోను మహాభోగములతోను గాలము వెళ్ళబుచ్చెను.

ఇట్లుండ 'షర్ఖాను' అను పఠాణీజాతిలోఁ జేరిన యొకతుఱక బంగాళమునందు చక్రవర్తి యధికారమునకు తిరుగుబాటు చేసి యొకసేనం గూర్చుకొని దానిం జయించి తాను నవా బగుటకుఁ దలఁచుచుండెను. వెనుక హుమాయూను బంగాళాదేశమును జయించుచుండఁగాఁ జిత్తూరునుండి కర్ణావతీదేవి వానిని రమ్మని వర్తమానమంపుటయు నతఁడు బంగాళము సరిగ లోఁబఱచుకొనకయే కర్ణావతి కుమారుని రక్షించుటకుఁ ద్వరపడి చిత్తూరునకు బోవుటయుఁ జదువరులందఱెఱుంగుదురు. షర్ఖానుఁడు రేఁగినవాఁడని వినినతోడనే హుమాయూను సేనాసమేతుఁడై వాని నడఁచుటకు బంగాళమునకుఁ బోయెను. అతఁ డక్కడకుఁ బోయినతోడనే తొల్లి వానిచే

దెబ్బలుతిని రాజ్యమును విడిచి యునామకుండై యెందో యడఁగి యున్న బహదూరుషా మరలఁ దలయెత్తి గుజరాతు మాళవదేశముల నాక్రమించుకొనెను. హుమాయూను కనఁబడినతోడనే షర్ఖానుఁ కొంచెము వెనుకదీసెను. చక్రవర్తియు బంగాళమునఁ బ్రవేశించి పగతుండు పారిపోయెనుగదా యని గర్వించి యెప్పటియట్లు భోగాసక్తుండై కేళీవినోదములతోఁ గాలము బుచ్చుచుండెను. వాని జాడ యెఱిఁగి షర్ఖానుఁడు దారులరికట్టి చక్రవర్తికి ఢిల్లికి నుత్తర ప్రత్యుత్తరములు జరుగకుండ నాటంకము గలిగించెను. హుమాయూనునితమ్ము లప్పు డయినను వానికి సాయము చేయరయిరి. అందొకఁడు హుమాయూనుసేనకు భోజనపదార్థములు పంపుదునని వెళ్ళి యాగ్రానగరమున దానే చక్రవర్తినని లోకులకుఁ జాటఁ బంచెను. రెండవసోదరుఁడు గద్దెయెక్కిన యాతమ్మునిని నావలకుఁ బారఁ దోలెను; కాని గట్టిపగతుఁడగు షర్ఖాను విషయమున నేమియుం జేయుఁ డయ్యె. అందుచే హుమాయూను తన పగతునితో సంధిచేసికొన వలసివచ్చెను. అంతట సంధిమాటలు జరుగుచుండఁగా ప్రాఁతపగలు మరచిపోయి హుమాయూనుని సైనికులు శత్రుసైనికులతో మన సిచ్చి మాటలాడుచుండఁగా నాకస్మికముగా నొక్కనాఁడు షర్ఖానుఁడు తనసైనికులం దీసికొని చక్రవర్తి సేనపయిం బడి నిద్రపోవు చున్నసిపాయిలను నందఱను గటికివాఁడు మేఁకలం గోసి చంపినట్లు చంపెను. అప్పుడు హుమాయూను ప్రాణములు దక్కుటయే దుర్ఘటమయ్యెను.

పరాజయమునందిన యాచక్రవర్తి తాను తప్పించుకొని పారిపోవుట కేయుపాయమును గానక గంగానదిలో దుమికి యీదిపోవుటకుఁ బ్రయత్నించి మిక్కిలి శ్రమపడుచుండఁగా నీళ్లకావటివాఁడొకఁడువచ్చి మేఁకతోలుతోఁ గుట్టినయొకసంచి తెప్పగాచేసి దానిపై హుమాయూనుని గూర్చుండఁబెట్టి యెట్టకో నావలకు దాఁటిం

చెను. ఆపలఁబసి యతఁడొక సంవత్సరము మందిసైన్యమును పోగు చేసి రాజపుత్రవీరులకు నిలయమని పూర్వము పేరుపడిన కన్యాకుబ్జ నగరమువద్ద షర్ఖానుని గలిసికొని యుద్ధము చేసెను. అతఁడప్పుడు తెచ్చిన సైన్యము వెనుక వాని తండ్రి యగు బేబరు తీసికొనివచ్చిన సేనవంటిది కాదు. ఆసేనలో లెక్కకు లక్షమంది బంట్లుండిరి. కాని వారందఱు చావు పేరు చెప్పిన నడలి పారిపోవువారే. అందుచే కొందఱు యుద్ధప్రారంభముకన్న మున్నే యాచోటు విడిచిరి. కొందఱుశత్రువుల మొదటిఫిరంగిచప్పుడు వినినతోడనే గుండెలు చెదరి చెల్లాచెదరై సిగ్గులేక కాలికొలఁది పరుగెత్తిరి. హుమాయూను మరల ప్రాణములతో దాఁటిపోయి కొలఁదిపరివారముతో నొకతావునుండి మరియొకతావునకుఁ బోవుచు నుండుట కిల్లులేక భగవంతునిపై భారము వేసి తిరుగుచుండెను.

ఎంతమెత్తని మనసుగలవాఁడైనను హుమాయూనునివద్ద తండ్రికడనున్న పట్టుదలయుఁ బ్రజ్ఞయు గొంతవఱ కున్నట్లు గనఁబడుచున్నది. ఏలయన నతఁడు తనకుఁ గలిగిన దుఃఖముచే నుత్సాహభంగమునందక నాపదలు గడచుచు క్రొత్తస్నేహితుల సంపాదించుకొనుచు దారపుత్రాది వియోగదుఃఖము ననుభవించుచు పదునైదు సంవత్సరములు గడపెను. మొట్టమొదట కొంతకాల మతఁడతిదారుణములగు దుఃఖముల ననుభవించుచు నెప్పటికప్పుడు తలఁగొట్టుకొనిపోవునట్టి యాపదలను గడచుచు సింధుదేశమునందు రాజపుత్రస్థానమునందుఁ గల యెడారులలోఁ దిరిగెను. ఆయవస్థను గనిపెట్టి రాజపుత్రప్రభువులు చక్రవర్తికి తమ యోపినకొలఁది ధనమును సైన్యము నిచ్చి సాయముచేసి వానిని సింహాసనప్రతిష్ఠితునిఁ జేసిన పక్షమున మొగలాయివంశస్థులు సూర్య చంద్రవంశస్థులు నెల్లకాలము కృతజ్ఞులై యుందురు; కాని యట్లు జరుగలేదు. హుమాయూను సహాయము చేయుమని జసల్మీరుసంస్థానప్రభువు నడుగ తన కత

నితో స్నేహముచేసికొనుట కిష్టములేదని ప్రత్యుత్తరము చెప్పెను. అనంతరము చక్రవర్తి మార్వారసంస్థానప్రభువగు రావుమాల్దేవును దోడుపడుమని యడుగ నతఁడు సహాయముఁ జేయకపోవుటయే గాక మీఁదుమిక్కిలి హుమాయూనుఁబట్టి చెరసాలలో బెట్టింపఁ బ్రయత్నించెను. ఆచక్రవర్తి రాజ్యభ్రష్టుఁడై తిరుగుచున్న కాలముననే యొక మహమ్మదీయయోగికూఁతురు హామిడా యనునామె వానిని మోహించి తినుట కన్నము నిలుచుటకు నీడలేని యారాజును వివాహము చేసికొనియెను. మంచియవస్థలోనున్నపు డెందఱుభార్యలైన రావచ్చును. దురవస్థలోనున్నపుడు మరల రాజ్యప్రాప్తియగుననియైన లేనపుడు తనంతఁ దనేవచ్చి తనతోఁ గలిసి తన కష్టములనే యనుభవించుటకుఁ దన్ను వివాహమాడిన యాకాంతను వెంటఁబెట్టుకొని హుమాయూను ప్రాణభీతిఁ బరుగెత్త నారంభించెను.

ఆబాలిక కష్టదినములు వెంటనే బయలుపడెను. దేశమునం దెచ్చటఁ దలఁ దాఁచుకొనుటకు వీలులేక యాదంపతులు స్వసంరక్షణనిమిత్తము సింధుదేశపు టెడారిం బ్రవేశించిరి. ఈయెడారి నీళ్ళులేని సముద్రమువలె యంతము లేనిదై యుండెను. ఇందు ప్రచండ వాయువు లప్పుడప్పుడు వీచుచుండును. ఆగాడ్పులు విసరునపు డిసుక నేలనుండి నూరడుగుల యెత్తువఱకుఁ బెద్దకెరటములాగున లేచి బాటసారులను మట్టిలో గప్పిచంపివేయును. అక్కడక్కడ నెన్నో యామడల కొకచోట నొకనూయి యుండును. అది రమారమి యెనుబది నిలువులలోతు గలిగియుండును. అందుచే నాయెడారిలో నీరుదొరకనే దొరకదు. ఇట్లు దుర్గమమగుటచేతనే యీయెడారి మరణభూమి యని పేరు [illegible]గినది. ఎంతో జాగ్రత్తతోఁ బోయినవారికే యనేక యాపదలు సంభవించుచుండును. ఇట్టి భయంకరప్రదేశమును, క్రొత్తభార్యను, కొలదిపరిజనమును వెంటఁబెట్టుకొని హుమాయూను ప్రవేశించెను. నడచినకొలఁది మధ్యమధ్య వారికి యెండమావులగపడి భ్రమపెట్టి మోసముచేయుచు వచ్చినవి.

వారిప్రయాణములు వారిగుఱ్ఱముల బలమునే యాధారము చేసికొనియుండెను. అవి కదలలేకపోయిన వారిప్రయాణములు తుద ముట్టినవని చెప్పవచ్చును. మార్గమధ్యమున పడగొట్టి యెవఁడైన పడిపోయెనా వానిగతి యంతే. కాని తక్కినవారు వానికొఱకు కాఁగుటకు వీలులేదు. ఒకనాటి యర్ధరాత్రమున హుమాయూను గుఱ్ఱము నెక్కి స్వల్పసేనాపరివార సమేతుఁడై కుటుంబము తోఁగూడ నమరకోటయను నగరమును జేరుటకుఁ బయనమై పోవుచుండెను, అప్పు డాయన యెక్కినగుఱ్ఱము మార్గాయాసమునఁబడి చచ్చెను. చక్రవర్తి తనకుం దోడై వచ్చుచున్న 'టార్డీబేగ్' అనువాని యొద్దకుఁబోయి దృఢముగా నడచుచున్న యాతని గుఱ్ఱమును తనకిమ్మని యడిగెను. చక్రవర్తి యాదినములలో మిక్కిలి యల్పుఁడగుటచే 'టార్డీబేగ్' వానిమాట లెక్కసేయక నిర్దయాత్ముఁడై నే నియ్యను పొమ్మని బదులు చెప్పెను.

మాల్దేవుయొక్క సైనికులు హుమాయూనుం బట్టుకొనవలె నని వెనువెంటఁ దరుముకొనివచ్చుచుండిరి. కాబట్టి యెక్కుటకు గుఱ్ఱమైనను లేని యాచక్రవర్తి వెంటనే యపాయము తప్పించుకొనుటకొక యొంటె నెక్కెను. అతనియవస్థఁజూచి జాలినొంది పరిజనులలో నొకఁడు నీడంకోలాయను వాఁడు గుఱ్ఱముమీఁదనుంచి తనతల్లిని దింపి యాగుఱ్ఱమును జక్రవర్తి కిచ్చి చక్రవర్తియెక్కిన యొంటె మీఁద యామె నెక్కించి యామెప్రక్కనే పాదచారియై తానునడచెను. వారుపోయెడుదారి జలశూన్యమగు గొప్ప యడవియగుటచే దాహమునకు నీరుదొరకక కొందఱు మృతులైరి. కొందఱు పిచ్చివాండ్రయి కేకలువేయ నారంభించిరి. ఆక్రందనధ్వనులతోడను హాహాకారములతోడను నింగి నిండిపోయెను ఈకష్టములకుదోడు పగవారు దాఁపునకు వచ్చిరను వర్తమానము దెలిసెను. యుద్ధము చేయఁగలవారి నందఱిని పయనము మానిపించి తనవద్దనుంచి స్త్రీలను

సామగ్రిలను సాగిపొమ్మని పంచెను. శత్రువు లెంతసేపటికి రానందున చక్రవర్తి తనకుటుంబ మెట్లున్నదో చూచుటకు ముందువెళ్ళెను. ఆకారుచీఁకటిలో హుమాయూను సైనికులలోఁ గొందఱు దారితప్పి శత్రువులకంటఁ బడిరి. అప్పుడు రాజపుత్రులకు మొగలాయిలకు నొకచిన్నయుద్ధము జరిగెను. మొగలాయీలు ప్రాణములపై నాసవిడిచి ఘోరముగఁ బోరి రాజపుత్రసేనాపతిఁ జంపి సేనం బారదోలి వారియొంటెలను గుఱ్ఱములను సామగ్రులను దోఁచుకొనిరి.

ఎన్నిదొరకినను మూఁడుదినములవఱకు నీటిచుక్కయైన వారికి దొరకదయ్యె. నాలుగవనాఁడు వారికిఁ గన్నులపండువుగ నొకబావి గనఁబడెను. అది యెంతలోతున్నదో చెప్పఁజాలముగాని మోటఁ గట్టి నీళ్లు తోడునపుడు బొక్కెన పైకి వచ్చిన దని మోటయెద్దులను తోలువానికి తెలియఁజేయుటకై మాట వినఁబడక పెద్దభేరీ వాయించవలసి వచ్చెను. ఇట్లతిప్రయత్నముచే వచ్చినయానీటినిమిత్త మదివఱకే నోళ్లు తెఱచుకొని యున్నయాజనులలోఁ గొందఱు దాహాతురులై నిలువలేక తిన్నగా బొక్కెన నూతియంచువఱకు రాకమునుపే దాని పయిం బడి నీరు త్రాగఁబోవ వెంటనే యాత్రాడు తెగి బొక్కెన నూతిలో బడెను. బొక్కెనతోఁగూడ కొందఱుమనుష్యు లానూతిలో బడి మృతినొందిరి. కొందఱు మితిమీరిన దాహబాధ తాఁగలేక నాలుకలు దెఱచుకొని వగర్చుచు వేడియిసుకపైఁ బడి పొరలసాగిరి. మఱికొంద ఱాబాధ కోర్వలేక నూతిలో గుభాలున నుఱికి తక్కిన వారికంటె త్వరగా ప్రాణములు విడిచి సుఖపడిరి. మరునాఁడు వారు మరల నొక నీటిపట్టు జేరిరిగాని వారిదురవస్థ వెనుకటిదినముకంటె తక్కువ కాలేదు.

అదివఱకు చాలదినములనుండి నీరు ద్రాగి యెఱుఁగకపోవుటచే నొంటెలు నీరు పోసినతోడనే మితిమీఱఁ ద్రావి యెక్కసముచే నెన్నియో తత్క్షణమే మృతినొందెను. ఆయొంటెలవలెనే మనుష్యు

లును గొందఱు నీరుఁద్రావిన కొంతసేపటికి గుండెల బరువువలన బాధ పడి చనిపోయిరి. ఎట్టకేలకు హుమాయూను కొందఱుపరిజనులతో చచ్చిచెడి యమరకోటఁ జేరెను. అమరకోట మృత్యుదేవతకోటలలో నొకటియని చెప్పఁదగి యున్నను అక్కడికోట యిటుకగోడలు రాతిబురుజులు చుట్టుగుడిసెలు గలిగి దర్శనీయముగ లేకున్నను నిరాధారు లగునాజనులకు నయనోత్సవము గావించెను. ఆయూరి కుత్తరమున మంచినీళ్ళకాలువ యొకటి యుండెను. హుమాయూను పరిజనులందఱుఁ దమ కాదినము పండగదినమట్లు భావించి కరువుదీర నీరుఁద్రావి సుఖించిరి. ఆయూరిరాజు వారిబాధలు తొలఁగించుటకు తనకుఁ జేతనైనంతపని చేసి చక్రవర్తికి విధేయుఁడై యుండెను. హుమాయూనుని క్రొత్తభార్యయగు హామిడా నిండుచూలాలై యాయెడారులలో మగవారికంటె నెక్కుడుధైర్యముఁ గలిగి యద్భుతశక్తితోఁ బయనము చేసి దారుణకష్టములం గడిచి యమరకోటఁ జేరెను. అక్కడ వారున్నకాలముననే 1542 వ సం॥ ము అక్టోబరు నెలలో నక్బరు పుట్టెను. అతఁడు చక్రవర్తిచూడామణి యనియు రాజన్యచూడామణియనియు భరతఖండమును బాలించినదొరలలో నగ్రగణ్యుఁ డనియు పేరువడసెను. తనభార్యలను బిడ్డలను ప్రాణప్రదాత యగునమరకోటరాజు సంరక్షణములో నుంచి హుమాయూను బయన మారంభించెను. ఇటు కొంతకాలము తిరిగి తిరిగి యతఁడు పారశీకదేశము జేరి యారాజు ననుగ్రహమున తనపిత్రార్జితమగు కాబూలు గాంధార దేశములను జయించెను. అది మొదలతఁడు కొంచెము నిలువఁద్రొక్కుకొని క్రమక్రమముగా బలపడఁజొచ్చెను. వానిసోదరులలోఁ గొందఱు మృతినొందిరి. కొందఱు రాజ్యభ్రష్టులై దేశముపాలైరి.

ఇక్కడ ఢిల్లిలో షర్ఖాను హుమాయూనుం బాఱఁదోలి గద్దె యెక్కి ధర్మాత్ముఁడై దేశమును జక్కగా పాలించి చివరకు యుద

ములతో మృతినొందెను. వానివంశస్థులు నీతిదూరులు బలహీనులు నగుటచే రాజ్యము వారికిఁ దక్కదయ్యె. అయుప్రయోజకులు దేశము నంతయుఁ బాడుచేసి యరాజకమగునట్లు గావించి ప్రజల కవాతు లగుటంజేసి యాయుద నెఱిఁగి హుమాయూను ముందుగా పాంచాలము జయించి తరువాత శత్రువుల నోడించి ఢిల్లీని పట్టుకొని మరల చక్రవర్తి యయ్యెను. అతఁడు మరల సింహాసన మెక్కినపిదపఁ జిర కాలము రాజ్యమేలలేదు. గద్దెయెక్కిన యారునెలలకే యతఁడు తన మేఁడమీఁది స్ఫటికపురాళ్ళమీఁదనుండి జారి మెట్లమీఁదనుండి దొర్లి క్రింద పడి తత్కారణమున కొన్నిదినములలో మృతుఁడయ్యెను.

అతని యనంతరమున రాజ్యమును వహించిన యతఁడు తొల్లి యమరకోటలో నుదయించిన బాలుఁడే తండ్రి పోవునప్పటి కతఁడు పదుమూడేండ్ల ప్రాయమువాఁడు. అక్బరు పాంచాలమును ఢిల్లీని మఱి యు దండ్రిపాలనముక్రిందనున్న కాబూలుగాంధారములను జేకొనియెను చిత్తూరును బాలించుట కుదయసింగెంత చిన్నవయస్సునో నారంభిం చెనో యక్బరు ఢిల్లీ నేలుట కంత చిన్నతనమున నారంభించెను. కాని వీ రిరువురు వేరువేరు స్వభావములవారు.

ఉదయసింగు రమారమి ముప్పదిసంవత్సరములు రాజ్యపాల నము చేసి యున్నను వానియేలుబడిలో మంచిపని యని చెప్పఁదగిన దొకటియు జరుగలేదు. శూరశిఖామణులలో నగ్రగణ్యుఁడని చెప్పఁ దగిన రాజుకడుపున బుట్టియు నుదయసింగు సింగముకడుపున బుట్టిన మేఁకపిల్ల వలె సమయము వచ్చినప్పుడు పిఱికియై మూర్ఖుఁడై నగు బాట్ల నొందుచువచ్చెను. వేయిమాట లేల? బప్పరావులవంశస్థుల యొద్దఁ గానఁబడవలసిన శుభచిహ్నములు రాజలక్షణములు వాని యొద్ద కానబడకపోవుటచే వెనుక పున్న యనుదానిచేఁ బెంపఁబడిన మావారురాజపుత్రుఁ డతఁడు గాఁడనియు నెవరో యొకదొంగపిల్ల వానిం దెచ్చి యతఁడే రాజపుత్రుఁడని భ్రమపెట్టి రనియుఁ గొందఱు దలంచిరి.

అది యటుండ నిచ్చట హుమాయూనునకు నమ్మినచెలి కాఁడును మంత్రియు నైనబేరాంఖా ననునతఁడక్బరుయొక్క చిన్న తనమందు నాలుసంవత్సరములు చక్కఁగా పరిపాలించి పిదపనక్బరున కప్పగించెను. అక్బరు చక్రవర్తియై తాను బాలుఁడైనను దృఢ మనస్కుఁడై తనమాటయందు ప్రజలకు మంత్రికి గౌరవమునిలుచు నట్లు నడచుకొనజొచ్చెను. అతఁడు రాజ్యముబూనిన కొద్దిదినములకే రాజపుత్రులమీఁద దండయాత్ర చేసెను. వానితండ్రి సింహాసన భ్రష్టుడై దేశాంతరములపాలై పోయినప్పుడు రాజపుత్రప్రభువులు చేసినయనాదరణము ద్రోహముఁ బలుమారు తల్లి యగు హమిడా దేవివలన విని యుండుటచేతనో లేక తల్లి పడినబాము లన్నియు గర్భములో నున్నపుడు వానిమనస్సుమీఁద ముద్రితము లయ్యెనో లేక శూరులను జయించి కీర్తి వెందగోరుటచేతనో యతఁడు రాజస్థానము మీఁదికే వెడలెను.

ఆమహాశూరుఁడు తొలుదొల్త మారువారు దేశము మీఁదికిఁ జని మాల్ దేవుని నోడించెను. అంబరు సంస్థానప్రభువు చక్రవర్తికి జడిసి కప్పముగట్టి తనకూఁతును వానికిచ్చి వివాహముచేయుటచే నక్బరు వానిం గరుణించెను. తురకరాజునకుఁ దనకూఁతునిచ్చి పెండ్లి చేసి యుత్తమక్షత్రియవంశమును పవిత్రముచేసిన రాజపుత్రులలో మొట్టమొదటివాఁ డితఁడే. తక్కిన రాజపుత్రప్రభులందఱు తెలివిఁ దెచ్చుకొని జాగ్రత్తపడి చక్రవర్తికి లోఁబడి కప్పముఁ గట్టిరి. అక్బ రును వారిమతముజోలికిఁ బోక లోఁబడినపిదప వారినందఱ సన్మానిం చెను. హిందువులు తమ పుణ్యక్షేత్రములకు యాత్రనిమిత్తముపోవు నపుడు తురకచక్రవర్తులు వారియొద్ద నొకపన్ను గ్రహించుచువచ్చిరి. అదిగాక తురకలు కానందుకు హిందువు లేడాదికి తలకొకరూపాయ వంతున పన్నియ్యవలసివచ్చెను. హిందువులమీఁద నన్యాయముగఁ గట్టఁబడిన యీరెండుపన్నుల నక్బరు చక్రవర్తి తీసివేసెను. ఇట్లు

నేక రాజపుత్రులు ఢిల్లీశ్వరునకు లోఁబడినను సంధికిరాని మూర్ఖుఁ డొకఁ డుండెను. అతఁడు చిత్తూరురాజా యగునుదయసింగు.

ఆయన గర్వముచేతఁ బౌరుషముచేత నక్బరునకు లోఁబడక పోలేదు. సోమరితనముచేత మూర్ఖతచేత నతఁడు చక్రవర్తి దర్శనముచేసి సంధి కోరఁడయ్యె. ఉదయసింగు బాల్యము నతిక్రమించి యౌవనమును బ్రాపించి తన సంస్థానముల నానలకుఁబంపి యొకయుంపుడుకత్తెను జేరఁదీసి దానివలలోఁజిక్కి రాజ్యవ్యాపారాదివిముఖుఁడై దానితోడిదే బ్రతుకని యొడలుమఱచి యుండెను. అక్బరు మాళవదేశమును జయించి దాని రాజగు రాజబహదూరును బారఁదోల నుదయసింగు వానికి శరణ మిచ్చి యట్టిపనివలన గలుగు నష్టము నాలోచింపకయే వానిం దనకడ నుంచుకొనెను. అందుచే నక్బరు కుచ్చితుఁడై పగఁదీర్చుకొనుటకు మీవారుపై దండువిడిసెను. ఢిల్లీచక్రవర్తి యంటివాఁడు మహాసేనాసమేతుఁడై తనపై కెత్తివచ్చుచున్నాఁడని వినియు నుదయసింగు విననివాఁడువలె నేప్రయత్నములు చేయక మొద్దువలె నూరకుండెను.

ఉదయసింగు స్త్రీకన్న నధముఁడై యింటఁగూర్చుండుటంజేసి వానియుంపుడుకత్తె నగరమునకు రాఁదలఁచిన దుస్థితిఁజూచి రోసముఁదెచ్చుకొని పనిఁజేయఁబూనెను. సిగ్గులేనిదియు వంచకురాలునైనను నాపడఁతి రాజస్థానమునఁ బుట్టినదగుటచే దేశాభిమానముం గలిగి పౌరుషవంతుఁడగు పురుషుఁడట్లు పనిచేయఁజొచ్చెను. వెనుకటి చిత్తూరిముట్టడిలో రాణి జవాహిరీభాయి చేసినట్లే యీమెయుఁ గవచము ధరించి పురుషవేషమువేసికొని సేనలం దోడ్కొని మొగలాయి శిబిరముం బ్రవేశించి యొకమా రక్బరుచక్రవర్తి యున్నస్థలమునకే సాహసించి పోయెనఁట. ఇట్లీమె పనిచేయుచుండ దైవవశమున నక్బరుచక్రవర్తి పనులతొందరచేఁ జిత్తూరు విడిచి సేనాసమేతుఁడై మఱియొకచోటికిఁ బోవలసివచ్చెను. చక్రవర్తి చిత్తూరు

విడిచిపోవుటకుఁ దన యుంపుడుకత్తెయే కారణమనియు నామె తనకుఁ జేసినమహోపకారమువలననే తనరాజ్యము తనకుఁ దక్కినదనియు నుదయసింగు చెప్పి సంతోషించెను. రాణాకు దనయుంపుడుకత్తెమీఁద నున్నంతమాత్రపుగౌరవమైనఁ దనమీఁద లేదనియుఁ దాము కష్టపడి ప్రాణములకాశపడక పోరాడుటయెల్ల నిరర్థకముజేసి నెప్పనంతయుఁ తుద కతఁడు తనవలపుకత్తియకే యిచ్చెననియు రాజబంధువులు కోపోద్దీపితులై యా వలపులాడినిఁ జంపించిరి. అప్రయోజకుఁడగు రాణా దనరాజ్యమును నిలిపిన యాపడఁతి ప్రాణరక్షణముఁ జేయం బ్రయత్నింపలేదు సరిగదా, దానిం జంపినవారిని శిక్షింపనైన లేదు. ఈపర్యాయ మక్బరు రాణాయొక్కభోగభార్యవలనఁ బరాజితుఁ డయ్యెనని మహమ్మదీయచరిత్రకారు లెవ్వరు వ్రాయరైరి. చరిత్రకారులు వ్రాసినదేమనఁగా 1567 వ సంవత్సరమున నక్బరుచక్రవర్తి రాజస్థానమును దండెత్తి చిత్తూరుకోటను బట్టుకొనుటకు నాలుగువేల సేనతో వచ్చెనని ఈసంవత్సరమునఁ జక్రవర్తి కోటను ముట్టడించి పట్టుకొనుటచే నదిమాత్రమే వారు వ్రాసి వెనుకటిపరాజయమును వారు వ్రాయరైరి. అక్బరు మంచిఫిరంగులతోడను సాధనసామగ్రులతోడను వచ్చియున్నను జిత్తూరుకోటలో భోజనసామగ్రులు జలము సమృద్ధిగా నుండుటచే దుర్గసంరక్షకులు మొగలాయిసేనం జూచి వీరా! మనల జయించువారని పరిహసించిరి. అక్బరు సైనికులును మొట్టమొదట కోట దుస్సాధ్యమని యాస వదలుకొనిరి. కోటగోడఁ దూర్పున నుత్తరమున నల్లరాతితోఁ గట్టఁబడుటచే నానైపులగోడలకు ఫిరంగులవలన నేమియు భయము లేదని వార లనుకొనిరి. అట్టికోట ప్రపంచమం దెచ్చట లేదని విదేశీయు లనేకులు వ్రాసిరి. బురుజులు మిక్కిలి దృఢముగా నుండెను. తుపాకిమందు కొట్లకొలఁది యుండెను. అక్బరు కోటకు దూరముగా నొకకొండమీఁద బసచేసి తనసైన్యము నకు రాత్రులు వెలుతురు కలుగునట్లు తనయున్న పర్వతముయొక్క

శిఖరముమీఁద పెట్టమంట వేయించుచువచ్చెను. ఆమంటలు చిత్తూరు కోట కావలివాండ్రకుఁ బ్రతిరాత్రము స్పష్టముగఁ గనఁబడుచు వచ్చెను. ఉదయసింగుమహారాజు ప్రాణముల కానపడక చిత్తూరు గౌరవము నిలుపుటకై రేలుఁబవళ్ళు పోరాడుచున్న వీరయోధులకుఁ బ్రోత్సాహముఁ గలుగఁజేయుటకు మూఁడు దుర్గరక్షణ మనుష్యులపాలు చేసి, తాను కోటవిడిచి హారావళీపర్వతములకుం బారిపోయెను. అయినను మీవారుదేశముపై నభిమానముఁగల తక్కిన రాజపుత్రులు తత్సహాయార్థము రాకపోలేదు. బదనూరుప్రభు వగు జయమల్లుఁడును చందావతువంశస్థుఁడై 'ఖేల్వా' సంస్థానప్రభు వైన పుట్టాయను పదునాఱేండ్ల బాలుఁడును వచ్చి తోడుసూపిరి. వారిలో నప్పుడు పుట్ట తక్కినరాజపుత్రులకన్నఁ జిన్నయయ్యు, చందావంశస్థుఁ డగుటచే తాను రాణాకు ముఖ్యుఁడనియు రాణా లేనపుడు కోట సంరక్షించు భారము తన దనియు దాను మొనఁగాఁడై సేనల నడుపుదు ననియుఁ జెప్పి కయ్యమునకు మొదట సిద్ధమయ్యెను. దేవలనగరాధిపతి తన పితృపితామహుల జన్మస్థాన మగుచిత్తూరుపై మహాభిమానముఁ గలిగి యావిపత్సమయమున దానికిం దోడ్పడుటకుఁ దనకొడుకు నంపెను.

అక్బరుచక్రవర్తి యాకోటఁ బట్టుకొనుట కెన్నిప్రయత్నములు చేయువలయునో యన్నియుఁ జేసి హిందూదేశ మంతటనుండి నేర్పు గలపనివాండ్ర ననేకులఁ బిలిపించెను. కోటబురుజులమీఁదనుండి రాజపుత్రులు నిప్పులవర్షము గురియించుచున్నను వెరువక మొగలాయీ సేన లంతకంతకు దరికిఁ బోవసాగెను. గెలిచినచో చాలబహుమానము లిత్తునని చక్రవర్తి యాశపెట్టుటచేఁ బనివాండ్రుం సైనికులు నొడలు దాఁచుకొనక యెవరు చేయవలసినపని వారు చేయఁబూనిరి. సొరంగములు త్రవ్వువారు సొరంగములు త్రవ్విరి. అందులో మందులు కూరువారు మందులు కూరిరి. మొగలాయిసైనికులు దినమునకు

నూరుగురు చొప్పున చచ్చిరి. చావనివారు చచ్చినవారికళేబరములను దమకు దెబ్బలు తగులకుండ నడ్డముపెట్టుకొనుచు బనిచేసిరేగాని జంకి వెనుకంజ నిడరైరి. కోట సంరక్షించుచున్న రాజపుత్రులు తమదుర వస్థ నప్పుడు దెలిసికొని భయపడఁజొచ్చిరి. రాణా యదివఱకే తమ్ము విడిచిపోయి తనదారి తాను జూచుకొనుటచే వారు నిరుత్సాహులై ధైర్యలక్ష్మియే తమ్ము విడిచినట్లు కళవళ పడఁజొచ్చిరి. కోటదెస చూడ రాజుతోఁగూడ రాజ్యలక్ష్మి యాతావువిడిచి పోయినట్లు పాడు వారు చుండెను.

అందుచే రాజపుత్రులేమియుం దోఁచక తడబడుచుండ నింతలో తుపాకిమందు కూరిన యొకనేలసొరంగ మంటుకొని చుట్టు ప్రక్కలప్రదేశ మంతయు నాశనము చేసెను. ఒకప్రక్క కోటగోడ గుభాలునఁ గూలెను. దానితో ముట్టడించుతురకలు, ముట్టడింపఁబడు రాజపుత్రులు వందలకొలఁది జచ్చిరి. తరువాత నుభయ సేనలు కలియం బడి సందడికయ్యముఁ జేసెను. అంతలో మరియొక నేలసొరంగ మంటు కొన, తురకలు రాజపుత్రులు మేనులు దెగి తుత్తునియలై మృతి నొందిరి. బ్రహ్మాండము వగులునట్లు మహాధ్వనితో నాసొరంగము లంటుకొనుటచే కోటగోడలు కూలిపోయెను. ఆప్రాంతమందా కాశ మంతయు దుమ్ముతోను పొగతోను నిండి యుండుటంజేసి మనుష్యుల కూఁపిరి సలుపదయ్యె. ఆకసమున కెగిరిన మనుష్యావయవశకలములు మట్టిముద్దలు రాతిముక్కలు వర్షము కురిసినట్లు క్రింద రాలఁజొచ్చెను. దుర్గసంరక్షణము చేయవచ్చిన వీరులలో వృద్ధులు కొందఱు ముందుగా వీరస్వర్గము నలంకరించుటచే సైన్యాధిపత్యము బాలుఁడగు 'పుట్ట' మీఁదఁ బడెను. ఆబాలుని తల్లి చిత్తూరునగరమునందె యానమయ మున నుండుటచేఁ దనకుమారుఁ డదివఱకుఁ గొన్నిదినములక్రిందట నూతనముగా వివాహమాడిన బాలికపైఁ గలయనురాగాతిశయముచే జావునకు వెఱచి వెనుకఁదీసి యప్రతిష్ఠ తెచ్చునేమొ యని భంగ

బెట్టుకొనెను. కాని యావీరమాతకడుపునఁ బుట్టినబాలకుఁడు కులమున కప్రతిష్ఠ రానీయలేదు. చిత్తూరుకోటలో దలనెరసిన వృద్ధులు, మీసములు రాని బాలురు, మహాయుద్ధములలో గాయములు దిని బ్రతికినశూరులు, నంతఃపురము విడిచి యెఱుఁగని పుష్పకోమల లగు స్త్రీలు, సేవకులు మొదలగు నందఱు గెలువవలయు చావవలయు నను మాటమీఁద నిలువఁబడి యుండిరి. ఈయుద్ధములోనె నూతనముగ భర్తను గోల్పోయిన యాబాలుని తల్లియు, వానిం గోరి వరించిన క్రొత్తపెండ్లికూఁతురును కవచములఁ దొడుగుకొని, బల్లెములు బూని యుద్ధసన్నద్ధులై మీవాఱు రాజపుత్రులతో గలిసి పోరుసలిపి వీరస్వర్గమును జూరగొనిరి. ఆఁడువాండ్రే యంత సాహస మొనర్చినపుడు మగవాండ్రు వెనుకదీయక సమరోన్ముఖులైరి. చిత్తూరుముట్టడికథ యన్నిటికంటె నెక్కువ దుఃఖకర మయినదియు నతిసాహసవంత మయినదియు నని చెప్పవచ్చును. అక్బరు తాను వసియించు కొండచివఱనుండి చూచుచు నడుమనడుమ మంటవెలుతురులోఁ గోటమీఁద నెవరైన మనుష్యులు నిలిచినట్లు గనఁబడినపుడు తనతుపాకితో వారిం గొట్టుచుండును. ఆదినమున సాయంకాలము నమాజువేళ నక్బరుచక్రవర్తి మున్ను వేఁట కరణ్యమునకుఁ బోవునప్పుడు పట్టపుటేనుఁగు నెక్కి పెద్దపులిరాఁకకై యెదురు చూచినట్లు పర్వతశిఖరమునుండి మెలకువతో నెవరినిమిత్తమో కనిపెట్టి యుండెను.

అప్పుడు దుర్గసంరక్షణము చేయుచున్న జయమల్లుఁడను రాజపుత్రవీరుఁడు తనబంట్లకు గొంతయుపదేశముచేయవలసి బురుజుమీఁదికి వచ్చెను. కొండమీఁదనుండి జాగరూకతతోఁ జూచుచున్నయక్బరునకు వానియాకృతి చాయామాత్రముగఁ గనఁబడియె. కనఁబడినతోడనే చక్రవర్తి సంగ్రమను తనతుపాకిని బట్టుకొని గురిజూచి కొట్టెను. వెంటనే జయమల్లుఁడు ప్రాణములు విడిచి నేలఁబడియెను.

అతఁడు వచ్చుటయుఁ గోటలోపల సైనికులు జయమునం దాశ వదలుకొని కడపటి కృత్యమునుఁ జేయఁబూనిరి. ఆఁడువాండ్రు బారులం కట్టి జోహారు సేయుటకు సిద్ధమైరి. మగవారు రక్తాంబరధారులై తాంబూలములు నములుచు నూరేగింపు మహోత్సవమునకు జనునట్లు యుద్ధమునకుఁ జనిరి. పర్వతశిఖరమునందున్న యక్బరునకుఁ గోటలో పొగలు మంటలు గనఁబడి కమురుకంపు గొట్ట నారంభించెను. మొగలాయి సైనికులు తత్కారణము లెఱింగి రక్షణము బొత్తిగా లేకయున్న యుత్తరపువైపుననుండి లోపలఁ బ్రవేశించిరి. కాని యప్పటికినిఁ జిత్తూరుకోట పగతురచేఁ జిక్కలేదు. ఏలయన నిర్భయముగా నగ్నికుండములఁబడి మృతినొంది వీరపత్నుల యొక్కయు వీరమాతలయొక్కయు గన్యలయొక్కయు భర్తలు పుత్త్రులు తండ్రులు రక్తవస్త్రములు గట్టి కోటలోఁ బ్రవేశింపఁబోవు మొగలాయిసైనికుల హుమ్మని దలపడిరి. ఆ యుభయవీరులు పోరు సల్పినతావునఁ బ్రత్యంగుళము రక్తముతోఁ దడిసి యఱుఁగు జారుచుండెను. తురకసైనికులు చిత్తూరునగరమునందలి యిరుకుసందులును వంకరవీధులను జొచ్చి యడుగడుగునకు నొక్కొక్క రాజపుత్త్రవీరుని వధియించుచుఁ గ్రమక్రమంబునఁ జొరుచుకొని లోలోపలకుఁ బోయిరి. ఆదుర్దినమున నెనిమిదివేలమంది రాజపుత్త్రీకులు మృతులై రణరంగము నలంకరించిరి. మృతినొందిన యాఁడువాండ్ర బలగములో దొమ్మండుగురు పట్టపుదేవులు నైదుగురు రాజపుత్త్రికలు నుండిరి. ఆనాఁటితో చిత్తూరు యొక్క భాగ్యము కడముట్టెను. అది మొద లానగరము మీవారు రాజ్యమున కెన్నఁడు మరల రాజధానిగ నుండలేదు.

అట్లు చిత్తూరునగరమును నిర్వీరముగఁ జేసి యక్బరుచక్రవర్తి **1567** వ సంవత్సరము మెయినెలలో నొకదినమున కోటలోఁ బ్రవేశించెను. మీవారు రాణా తరువాత నెన్నఁడు నాభయంకర ప్రదేశమునకు వచ్చి కాపుర ముండలేదు. మరల మీవారుదేశస్థులు

పగతుర బారి బడకుండ దానిని సంరక్షింపలేదు. రాజస్థానకథావళిం జదివి మీవారు రాజ్యము యొక్కయుఁ జిత్తూరునగరముయొక్కయు మహావైభవమును దెలిసికొన్నవారందఱుఁ జిత్తూరుయొక్కయీనాఁటి యవస్థం జూచినపక్షమున మున్ను సకలైశ్వర్య సంపన్నమై బహుజన సంకులమైన యానగర మంతపాడుగ నుండుటకును రాజ్యలక్ష్మి కిట్లు వైధవ్యము గలుగుటకును గారణమేమని తలంపకపోరు. తలంచి విచారింపకపోరు. ఉదయసింగు హిరావళీపర్వతములోనికిఁ బారిపోయి మరల నెన్నఁడు జిత్తూరురాక యాపర్వతములసమీపమున నే యుదయపుర మను పేర నొకపట్టణమును గట్టించి దానిని రాజధానినిఁ జేసికొని దేశమును పాలించుచు దనజీవితకాలశేషమును గడపెను. అందుచేతనే నేటికిని మీవారురాణా యుదయపుర మహారాణా యను పేరం బిలువఁ బడుచుండును. ఉదయసింగు తనజీవితకాలమంతయు మరలఁ జిత్తూరును బట్టుకొని విజయము నొందవలయు నని తలంచుచుండువాఁడు. అందుచేతఁ దనయుద్యమము నెరవేఱువఱకు గడ్డమును కత్తిరించుకొన నని యతఁడు ప్రతినఁ జేసెను. ఆప్రతిన నెరవేరకమునుపే యతఁడు లోకాంతరగతుఁడగుటం జేసి యాతని సంతతివారగు నుదయపుర మహారాణాలు నేటివఱకుఁ దమవంశకర్తవలెనే గడ్డములు కత్తిరించుకొనక యుందురు.

చిరకాలమునుండి మీవారు సంస్థానమునకు రాజధానియగు చిత్తూరునగరమును నామావశేషముగ నొనర్చి యక్బరుచక్రవర్తి చరిత్రము సంగ్రహముగా నిచ్చట దెలిపెదము. ఢిల్లీపాదుషాలలో నక్బరువంటి యోగ్యుఁడు గుణసంపన్నుఁడు మఱియొకఁడు లేఁడని చెప్పవచ్చును. తండ్రి రాజ్యభ్రష్టుఁడై సింధుదేశపు టెడారులలోఁ జరియించుకాలమున 1542 సం॥ రమున నమరకోట పట్టణమునం దతఁడు జన్మించె ననియు జనకుని మరణానంతరము 1556 వ సం॥ రమున బదునాలుగేండ్ల ప్రాయమువాఁడై యున్నపుడు సింహాసన

మెక్కెననియు నిదివఱకేఁ జెప్పియుంటిమి. ఇతఁడు గద్దె యెక్కిన తోడనే షర్షాయొక్కసంతతివారికి మంత్రియగు హేముఁడను హిందువుఁడు తనస్వామిపక్షమున నభిమానము గలిగి మహాసేనం గూర్చుకొని యక్బరుమీఁదికి యుద్ధమునకు వచ్చెను. అక్బరును వానిగుండెకాయయు సంరక్షకుఁడు నగు బేరాముఖానును గలిసి హేమునిమీఁదికిఁబోయి వాని నోడించి పట్టుకొనిరి. హేముని స్వహస్తముతోఁ జంపుమని బేరాముఖానుఁ డక్బరుతో జెప్పెను. అసహాయుఁడై చెరలోనున్న దీనునిఁజంపుట యనుచిత మని యతఁ డట్టిపని కొల్లఁడయ్యె. బేరాముఖానుఁడు హేముని స్వహస్తముతో నరికిచంపెను. బేరాముఖానుఁ డక్బరును పుత్రప్రేమతో నాదరించి యుక్తవయస్కుఁడైనపిదప రాజ్యము నప్పగించెను. అక్బరు రాజ్యభారమును వహించి హిందువు లొక కన్నుగ మహమ్మదీయులు రెండవకన్నుగ నెంచుకొని భరతఖండమును న్యాయముగఁ బాలించెను. ప్రజలంద ఱక్బరుని కేవలము ధర్మరాజని కొనియాడిరి. మహమ్మదీయు లని పక్షపాతము లేక హిందువులని క్రోధములేక యిద్దఱను సమానముగ నమ్మియిరువురకు గొప్పగొప్ప యుద్యోగములు భేదము లేకుండఁగ నిచ్చెను. సేనాధిపతులు దేశాధిపతులు వానిక్రింద హిందువు లనేకు లుండిరి. రాజపుత్రులకుఁ దనకు మైత్రి హెచ్చునట్లు వారిపిల్లలం దాను బెండ్లియాడిపట్టపుదేవులం జేసెను. ఈతని జ్యేష్ఠపుత్రుఁడును వానియనంతరమున రాజ్యమునకు వచ్చినయతఁడునగు జహంగీరుచక్రవర్తి యొక రాజపుత్రస్త్రీవలనఁ గలిగినకుమారుఁడే. రాజపుత్రవీరులును దమయెడలఁ జక్రవర్తి చూపు గౌరవమునుబట్టి తాముగూఁడ జక్రవర్తికి విధేయులై చుట్టములై నెచ్చెలులై యవసరమగునప్పుడు తమ ప్రాణములనైన నడ్డమువేసి వాని ప్రాణమును గాపాడుచు వచ్చిరి. అక్బరు మిక్కిలి పండితపక్షపాతి. ఆచక్రవర్తియాస్థానమున అరబ్బి పారసీభాషలు నేర్చినపండితులే గాక సంస్కృతమును దేశభాషను

నేర్చిన పలుపండితు లుండి యనేక బహుమానముల నందుచువచ్చిరి. అతనికి స్వమతమునందు గౌరవము దక్కినమతములందు నిరసనము లేదు. ఖురాను నేర్చిన మౌలవీలను క్రైస్తవమతబోధకులను బౌద్ధ పండితులను వేదాంతశాస్త్రజ్ఞులగు బ్రాహ్మణులను పారసీమతస్థులను దనకొలువునకు బిలిపించి వారిచే వాదములు చేయించి సర్వమతముల సారములం గ్రహించుచుండువాఁడు. వానిని హిందువులు వేదాంతి యనియు క్రైస్తవులు క్రైస్తవుఁ డనియు మహమ్మదీయులు మహ మ్మదీయుఁడనియు జెప్పుచుందురు. ఉపనిషత్తులయెడ నక్బరునకుఁ గడుప్రేమయని చరిత్రకారులు చెప్పుదురు. ఆ మన వితంతు వివాహములు హిందువులలోఁ జేయింపవలయునని కొంతప్రయత్నము చేసెను. ఘోరదురాచారమగు సహగమనమును దన దేశమునఁ జాల వఱకు మానుపించెను.

ప్రజలకు భారముగానున్న పన్ను లనేకములు దొలగించెను. రాజాటోడర్ మాల్ అను హిందువునకుఁ గొప్పయుద్యోగమిచ్చి దేశ మునందున్న యీనాం జిరాయితీ భూములను వాని చేత జాగ్రత్తగా గొలిపించి పంటనుబట్టి యాభూములకు పన్నులుగట్టించెను. పండిన పంటలో నాలుగవవంతు చక్రవర్తి పన్నుక్రింద గ్రహించుచుండును. అక్బరుచక్రవర్తి విద్యావంతుఁడు మహావీరుఁడు లోకవ్యవహారములు చక్కఁగఁ దెలిసినవాఁడు. ఈతనివంటి చక్రవర్తి నేటివఱకు హిం దూదేశమునకు మరల రా లేదని జనులు చెప్పుకొందురు. ఆయన రమారమి యేఁబదిసంవత్సరములు భరతఖండమును బాలించి సకల జనస్థవనీయుఁడై క్రీస్తుశకము 1605 సంవత్సరమున లోకాంతరగతుఁ డయ్యెను.

హల్దిగట్టు యుద్ధము

——:(0):——

అక్బరుచక్రవర్తి చిత్తూరును నాశనముచేసి పోవునప్పుడు దేశమునందంతట దారిద్ర్యమును మనుష్యుల హృదయములయందు నిరుత్సాహమును నెలకొలిపి పోయెను. మీవారుయొక్క గొప్పతనమంతయుఁ గథావశేష మయ్యెను. పుణ్యభూములు పుష్పవనములు కోటలు కోవెలలు సంపూర్ణముగ నాశనము నొందెను. దేవతాచరిత్రములను రాజపుత్రవీరుల దిగ్విజయములను దెలుపుటకు దేవాలయపుగోడలమీదను మేడలమీఁదను వ్రాయఁబడిన చిత్తరుపులు రూపుమాసెను. విజ్ఞానమును దెల్పు వింతవస్తువులను తీసికొనిపోవుటకు వీలైనంతవఱకు శక్తివంచనలేక మహమ్మదీయు లెత్తుకొని పోయిరి. దిగ్గజములను జెవుడు వఱుపఁజాలు రణభేరులు మ్రోగెడుకాలము పోయినది. నగరరక్షణము చేయుమని ప్రార్థించి నగరదేవత కఖండదీపారాధనము జరుగు మేలుదినములు గతించినవి. వేయేల? రాణావారి మందిరద్వారములే యక్బరు కట్టింపఁదలఁచిన క్రొత్తపట్టణమునందలి మందిరము నిమిత్తము తీసికొని పోఁబడెను. దేశమునంతను దుడిచివేయుచున్న యుద్ధతరంగ మంతతో నిలిచిపోయెను.

రతంభారుకోట వెనుక బహదూరుషాచేతఁజిక్కెనని చదువరు లెఱుఁగుదురు. తరువాత దాని నా మహమ్మదీయ ప్రభువద్ద నుంచి బూందీసంస్థాన ప్రభువగు హర యనునతఁడును జోహాణావంశస్థుఁడగు మఱియొకఁడును మఱలఁ బట్టుకొనిరి. ఆకోట యీకాలమున బూందీప్రభువగు సూర్జనుఁ డనునతని యధీనమున నుండెను. అతఁడు మీవారురాణాకు లోఁబడి యరిగాఁపై యాకోట నేలుచుండెను. ఈసూర్జనుఁడు వెనుక చిత్తూరిముట్టడిలో 'బహాదూరుషాతో యుద్ధముచేసి మృతినొందిన యర్జునరావు కుమారుఁడు. అక్బరుచక్రి

వర్తి యీకోటను కొంతకాలము ముట్టడించి పట్టుకొనలేకపోయెను. దానికిఁ దోడుగ నతఁడు కార్యాంతరములమీఁద మఱియొకచోటికి బోవలసివచ్చినందున నీముట్టడి నాపదలంచు చూడెను. అంతలో నక్బరునకు నమ్మినబంట్లును రాజస్థానమునకు ద్రోహులు నగు నిరువురు రాజపుత్రులు మోసము చేసి యీకోటను జక్రవర్తి కప్పగించిరి. అంబరు దేశ ప్రభువగు భగవానుదాసుఁడును వాని యన్నకొడుకగు మానసింగు ననువారే యీమహానుభావులు. ఈయిద్దఱు ద్రోహము చేయనిపక్షమున రంతంబరుకోట శత్రుదుర్గమమై నిరపాయస్థితి నుండి యుండునుగదా!

సూర్జనుఁడు గలిసి మాటలాడినపక్షమునఁ జక్రవర్తికిఁ జాల లాభము గలుగు నని నమ్మి మానసింగు దర్శనము చేసి మాటలాడ వలయు నని యున్నది గనుక కొంతకాలమువఱకు యుద్ధము మాన వలసిన దని సూర్జనునకు వర్తమాన మంపెను. సూర్జనుఁ డందుకు సమ్మతించినందున మానసింగు తాను చక్రవర్తి రాయబారి నని పేరుపెట్టుకొని కొంతపరివారముతోఁ గోటలోనికి బోయి యాతనిచేత సబహుమానముగ గౌరవింపఁబడెను. మానసింగు సూర్జనుఁడు నొండొరులతో సంభాషించుచుండ హఠాత్తుగ సూర్జనుని మేనమామ కూర్చున్నచోటునుండి లేచి రాజా మానసింగుయొక్క వెనుక నిలిచియున్న చోపుదారువంకఁ జూడఁదొడంగెను. అటు కొంతసేపుచూచి యతఁడు సోపుదారు చేతిలోనుండి వెండికఱ్ఱను వినయమునఁ దీసికొని సూర్జనుఁడు సాధారణముగాఁ గూర్చుండుస్థలమున నాచోపుదారుంగూర్చుండఁబెట్టెను. అపు డందఱు తెల్లబోయి చూడఁదొడఁగిరి. నిగనిగలాడునట్టి యాకాటుకకన్నులును మేని చామనచాయను ముక్కుమీఁద నెడమప్రక్క నున్న పుట్టుమచ్చను జూచి యతఁడు తప్పక యక్బరుచక్రవర్తి యని మున్ను వాని నెఱింగినవారు కొందఱు నిశ్చయించిరికాని గ్రహించినవారు సందేహించి చెప్పక యూరకొనిరి.

గ్రహింపనివారు వెఱవెలబారి చూచుచుండిరి. ఇంటికివచ్చిన యతిథికి హాని చేయుట రాజపుత్రధర్మవిరుద్ధము. హాని చేయక యుండవలయునన్న దుర్భేద్యమై పోతుటేఁగ కైనఁ జొరరాక సింహగుహయని చెప్పఁదగిన యాకోటలోనికిఁ దనకుఁ దానై చక్రవర్తి వచ్చి లోటుపాటులనెల్ల గ్రహించెగదా! చక్రవర్తి మాట యటుండ తమకంత మహాద్రోహము జేసినమానసింగు నేమి చేయవలయునని యక్కడనున్న రాజపుత్రులకందఱకు సందేహములు దోఁచెను

రాజపుత్రులిట్లు కళవళ మందుచుండ నక్బరు నదరుబెదరు లేక నిర్భయముగఁ గూర్చుండి కొంత సేపటికి గంభీరమగుస్వరముతో 'సూర్జనా! ఇప్పుడు కర్తవ్యమే' మని యడిగెను. సూర్జనుఁడు తెల్లఁబోయి యుప్పలుకుల కేయుత్తర మిచ్చుటకుఁ దోఁచక యుండ మానసింగు ధైర్యము తెచ్చుకొని 'కర్తవ్య మేమున్నది? రంతంబొరుకోట దేవరవారికి సమర్పించి సూర్జనుఁడు మీవాఁడై గౌరవ మందుటయే' యని పలికెను. చేయున దేమియు లేక కోట యక్బరున కప్పగించి తొలఁగెను. ఈవిధముగ బంధుద్రోహముచేత రంతంబరుకోట మొగలాయీలపాలైన దని రాజస్థాన చరిత్రకారులు వ్రాసిరి. అట్టి యవస్థలో నెంతటి మానవంతుఁడైన నట్లే చేయవలసి యుండును గదా? రాజస్థానమునందలి సంస్థానములు తమలోతమ కైకమత్యము లేక దేనిమేలు నదియే చూచుకొనుచు బనిచేయుటయే గాని యావద్దేశముయొక్క మేలును జూడక పోవుటచే స్వనామమును గ్రమక్రమముగఁ దెచ్చుకొనఁజొచ్చెను. దేశమునందు గల శూరశిఖామణుల నెల్ల రావించి దేశాభిమానము గలిగించి యుద్ధములు చేయింపఁ గల సమర్థుఁడు రాణాసంగుఁడు గతించుటయు సూర్యవంశపు రాజుల గద్దె యెక్కుట కనర్హుఁడగు నుదయసింగు రాజగుటయు నాశనమునకు ముఖ్యకారణములు. అక్బరు చూపిన సాహసమును మనోధైర్యమును 'రంతంబగు' కోటలో నున్నవారి కత్యద్భుత

మును గలిగించెను. విశేషించి యతఁడు ధీరోదాత్తుఁడగు పగతుఁ-
డనియు నీచశత్రువుఁడు కాఁడనియు వారికిదోఁచెను. మఱియు నతఁడు
రాజపుత్రస్త్రీని వివాహముజేసికొని యామెను తన మతములో
గలియుమని బలవంతపెట్టక యామె యిచ్చవచ్చిన దేవతల నారాధిం
చుకొనవచ్చునని సెలవిచ్చుటంజేసి యాచక్రవర్తి మహోదారుఁడని
యారాజపుత్రులు గ్రహించిరి. బూందీసంస్థాన ప్రభువు లదివఱకు
మీవారునిమిత్తము పోరి చాల నష్టపడిరి. అందుచే నక్బరు వారియభి
మానమునకు లోపముగలుగకుండునట్లు సంధిఁజేయఁదలంప 'సూర్జ
నుఁడు' సంతోషముతో నంగీకరించెను. ఆసంధినిబంధన లివి. సూర్జన
రావు తన యేఁబదిరెండుజిల్లాల నెప్పటియట్లు పాలించుకొనవచ్చును.
అవసర మగునపుడు ఢిల్లీపాదుషాకుఁ గొంతసేన నతఁడు పంపవలెను.
బూందీరాజులు మొగలాయీలకు నెప్పుడు తలపన్ను నీయనక్కఱ
లేదు. చక్రవర్తి బూందీప్రభువులను సింధునది దాఁటి యావలకు
యుద్ధములకుఁ బంపఁగూడదు. బూందీరాజకన్యను మొగలాయీలు
పెండ్లియాడఁ దలంపఁగూడదు. బూందీవారి భేరీలు ఢిల్లీకోటగోడల
నడుమ వాయింపవచ్చును. ఆరాజులు ఢిల్లీచక్రవర్తి దర్బారు బ్రవే
శించునపుడు తమయాయుధములనెల్ల ధరించి యుండవచ్చును. చక్ర
వర్తికిఁ దక్కినరాజులంబలె నేల సాగిలంబడి మ్రొక్కనక్కఱ లేదు.
షరతు లింతయనుకూలముగ నున్నపుడు సూర్జనుఁడు వాని కంగీక
రించుట యొకవింత కాదు. కాని యతఁడు సమ్మతించిన మాత్రమున
పోరణఁగలేదు. ఏలయన తొల్లి బహదూరుషా యాకోటం బట్టుకొన్న
పుడు వానివద్దనుండి 'శాంతహారుఁ' డనునొక రాజపుత్రవీరుఁడు దానిని
వదలించి సూర్జనరావున కప్పగించి మీవారు రాణాలకు లోఁబడి దాని
నేలుకొమ్మని చెప్పెను. అందుచే నతఁ డిప్పుడు జరిగిన స్వామిద్రోహ
మును సహింపక సూర్జనుఁడు చేసికొన్నసంధి కొడంబడక చక్రవర్తి
నెదిరింప నిశ్చయించుకొనెను. కాని యతనివద్దనున్నసైన్య మతిస్వల్ప

ముగ నుండెను. అయిన నేమి ! చేఁజేతుల కోటను పగతుని కప్పగించి సుఖించుటకంటె నిష్కళంక చరిత్రుఁడై దేశమునిమిత్తము గౌరవముగ బ్రాణముల విడుచుటయే యుత్తమమని యతఁడు నిశ్చయించుకొనెను. అట్లు కృతనిశ్చయుఁడై హారవంశజుఁడగు రాజపుత్రుఁ డెవ్వఁడు ప్రాణములు కంఠమునం దుండఁగా రంతంభోరుకోటవిడిచి పోవఁగూడ దని యొట్టుపెట్టి యది యొక స్తంభముమీఁద వ్రాయించి యనంతరము రక్తాంబరధారుఁడై, దేశాచారప్రకారము తాంబూలము వేసి తన పరిజనులతోఁ గూడి చక్రవర్తి సేనల నెదిర్చి ప్రాణములువిడిచెను. అది మొదలు నేఁటివఱకు హారవంశజుఁడగు రజపుత్రుఁ డాకోటదరిం బోవునపుడు సిగ్గునం దలవంచుకొని పోవుచుండును.

అనంతర మక్బరు చిత్తూరుం దోఁచుకొని యాద్రోఁపుడుధనముతో ఢిల్లీ ప్రవేశించెను. అతఁడు మహమ్మదీయుఁడైనను హిందువులలోఁ బరాక్రమవంతుఁడగుశత్రువుఁ డుండినపక్షమున వాని నతఁడు తగునట్లు గౌరవించుచు వచ్చెను. ఈచిత్తూరు దండయాత్ర ముగిసినది మొదలు, అక్బరు చక్రవర్తి రాజపుత్రులకు గొప్పయుద్యోగము లియ నారంభించెను. ఆతనిప్రధానమంత్రులలోఁ గొందఱు సేనాధిపతులలో గొందఱు రాజపుత్రు లుండిరి. చక్రవర్తి మీవారు విడిచిపోయినపిదప నుదయసింగు తానదివఱకు దాఁగియున్న యడవులలోనుండియుఁ గొండలలోనుండియు వెలువడివచ్చి తనగౌరవహీనమయినజీవితమును నిచ్చట నచ్చట కొంతకాలము గడపి వసియించుటకుఁ బట్టణమైన లేకపోవుటచే నొకనగరమును నిర్మింపఁ దలంచి ముందుగా నొకసరస్సు గల్పించి యాసరోవరతీరమున నుదయపుర మనుపేర రాజధానింగట్టి యందుఁ బ్రవేశించె. ఆసరోవర మిప్పటికి నుదయసాగర మనుపేరం బరగుచున్నది. అది యేమిదోసమోకాని మీవారు రాజధానిలో శూరశిఖామణులనేకులుండగ వారిలో నెవరిపేరంబరగక పౌరుషహీనుఁడగునొక యపాత్రునిపేర నేఁటికిఁ బఱగుచున్నది. ఉదయసింగుమహారాజునకు

నిరువదియైదుగురు కుమారులు గలరు. బహుపుత్రులకు జనకుఁడై యుండుటఁ దప్ప యుదయసింగునివద్ద లోకులు సంతసింపదగిన యోగ్యత మఱి యేదియు లేదు. అతని ప్రియపుత్రుఁడు జగ్మల్ అను నతఁడు. తన యనంతరమున వానినే రాజుఁ జేయవలె నతఁడు నిశ్చయించుకొని సింహాసనమునకు న్యాయముగ రాఁదగినవాడును బ్రథమ భార్యకుమారుఁ డగు ప్రతాపుని రాజ్యహీనుం జేసెను. కొడుకుల యెడల నుదయసింగు మిక్కిలి కఠినుం డని చెప్పవచ్చును. వేఱొక మారు సూర్యుఁడను మఱియొక కుమారుని జంపింపఁ దలంప బంధువు లందఱు బతిమాలి యాపి యాకుఱ్ఱవాని దేశముమండి యవ్వల కంపిరి.

సూర్యుఁడు పుట్టఁగానే వానిజాతకమును వ్రాయు మని తండ్రి జ్యోతిష్కులం బిలుపింప వారు మీనమేషములు లెక్కపెట్టి గ్రహచారములఁ జూచి నోరు చప్పరించి “ఈబాలుఁడు స్వదేశమునకు శత్రుఁ డగుటయేగాక స్వకులమునుఁగూడ నిర్మూలముఁ జేయు” నని చెప్పిరి. అప్పలుకులు విని తండ్రి భయపడి యది మొదలు వానిని గడుజాగరూకతతోఁ జూచుచుండెను. సూర్యుఁ డైదేండ్ల ప్రాయము గల బాలుఁ డైనప్పు డొకనాఁడు తండ్రివద్ద నాఁడుకొనుచుండఁగా లోహకారుఁ డొకఁడు పదునైనఁగత్తిని దెచ్చి రాణా కిచ్చెను. అది వాడి గలదో లేదో చూచుట కుదయసింగు దానితో దూదిబుంగ నఱికి యది పదునైనదే యని సంతసించి యక్కడ పెట్టెను. వెంటనే సూర్యుఁ డాఖడ్గమునుఁ బట్టుకొని “కత్తులు మనుష్యులను నఱుకుటకు గాని దూది నఱుకుటకుఁగా” దని పలుకుచు నొక్కవేటున నెముక గనఁబడునట్లు తనచేయి నఱుకుకొనెను. ఆచేతినుండి గ్రొన్నెత్తురు జొట జొటగారి నేలఁబఱచిన రత్నకంబళమును దడిపి చూపఱకన్నులకు వెరపు గొలుపుచున్నను బాలుఁడుమాత్రము బెదరక నొప్పి యని యేడ్వక మెప్పటియట్లు నిశ్చలుఁడై నిలిచెను. కడుపిఱికియగు నుదయ

సింగు కుమారుని మహాసాహసమునుఁ జూచి సహింపలేక యాయోధు బాలునియందంత వైపరీత్యము గనఁబడుట దేశమున కరిష్ట మని భావించి తత్క్షణమే యాబాలుని వధియింపుఁడని తలారుల కప్పగించెను. తలవరు లాకుఱ్ఱని వధియించుటకుఁ గొనిపోవుచుండ మార్గమధ్యమున చందావతుకులస్థుఁడగు రాజపుత్రుఁడగపడి యావృత్తాంతము విని తెలివి యుట్టిపడుచున్న యాబాలుని మొగముఁ జూచి విడువలేక కనికరము పెంపున వానిం జంపనీయక వెంటఁబెట్టుకొని రాణావద్దకు వచ్చి బాలుని బ్రతికింపు మని ప్రార్థించి "నాకు సంతానము లేదు నేను వీనిం బెంచుకొనియెద. వీఁడు నాకులదీపకుఁడై యుండుఁగాక !" యని పలుక దగ్గరచుట్టమును మిక్కిలి ప్రబలుఁడు నగు చందావతువంశస్థునిమాట కెదురాడలేక యుదయసింగు తల యూచి యూరకొనియె. చందావతుఁడును బాలుని తనరాజధాని యగు సాలుంబ్రమానగరమునకు గొంపోయి నేల నడువనీయక కడు గారాబమునం బెనుచుచుండె.

చిత్తూరు విడిచివచ్చిన నాలుగుసంవత్సరముల కుదయసింగు శరీరస్థితి చెడినందునఁ దనమరణ మాసన్న మగుచున్న దని యెఱిఁగి లోకాంతరప్రయాణమునకు పలయుప్రయత్నము చేయసాగెను; అది వసంతకాల మగుటచే మీవాడుసంస్థానమునఁ గల సామంతరాజు లందఱు రాణాతోఁ గలిసి యడవివంది వేఁటకుఁ బోవునట్టి సమయము. ఈవేఁటకుఁ బోవునప్పుడు రాణా సామంతప్రభువుల కాకుపచ్చని బట్టలు కొన్ని బహుమానముగ నిచ్చి వారిని వెంటఁబెట్టుకొని వేఁట నలుపు వాడుక గలదు. ఆవాడుకంబట్టి ప్రభువులందఱు నుదయసింగు మంచముచుట్టుఁ జేరిరి. ఉదయసింగు చావకమునుపు నోటమాట యున్నపుడె తనయనంతరమున జగ్మల్ రాణా కావలయునని చెప్పెను. అతనిమననులో నేమున్నదో కాని యపుడైన జ్యేష్ఠపుత్రుఁడగుప్రతాపునిమాట యెత్తనేలేదు. అనంతరము కొన్నిగాళ్ళ కుదయసింగు

మృతినొందెను. ఆదేశాచారప్రకారము పీనుఁగును పురోహితుని యింట బొఱవైచి దహనాదికర్మములు జరుపుమని చెప్పి రాజబంధువులు కుమారుని పట్టాభిషేకమునిమిత్తము మందిరము నలంకరింపఁ జొచ్చిరి.

ఉదయసింగు జగ్మల్లును రాజ్యార్హుఁడుగఁ జేసినప్పుడు సోనిగుఱ్ఱసంస్థానప్రభు వొక్కఁడుండెను. ఉదయసింగుని పట్టపుదేవి యాతనికిఁ జెల్లెలగుటంజేసి యాంప్రభువు ప్రతాపునికి మేనమామ. అందుచేఁ దన మేనల్లుఁడు సింహాసనభ్రష్టుఁడుగఁ జేయబడుటకు సహింపనోపక యావీరుఁడు చావునున్న చందావతువంశస్థుఁ జూచి మీరు దగ్గఱనుండియే యిట్టియక్రమము జరుగుచుండ నుపేక్షింతురా ? యని యడిగెను. చందావతుఁడా పలుకులు విని మఱియొక మాటమీఁద బెట్టి యిట్లనియె. "చావునకు సిద్ధముగనున్నయతఁడు పాలిమ్మని యడుగుచుండఁగ మనము వద్దననేల ? మృతినొందుచున్న వానిమాట కడ్డము చెప్పనేల ? వానికోరిక యాలాగే చేయుఁడమని తరువాత మనయిష్టము వచ్చినట్లు చేసికొనఁగూడదా' యని యామాటల యభిప్రాయము అల్లుపలికి తనపలుకుల యర్థము విస్పష్టమగునట్లు ప్రభువుకు వెండియు నిట్లనియె. "అయ్యా ? నేను నీమేనల్లుని పక్షమువాఁడనే తప్పక నేను ప్రతాపునకే సహాయము చేయుదును."

ఇట్లు వాగ్దానములు జరిగినను జగ్మల్లునకు పట్టాభిషేకము చేయుటకే ప్రయత్నములు జరుగుచుండెను. సామంతరాజులందఱు నుదయసింగు కోరిక చొప్పున జగ్మల్లును రాణాగాఁ జేయుటకు వచ్చి కూర్చుండిరి. ప్రతాపుఁడు సోదరుని రాజ్యమునం దుండుట తనకు సేమముకాదని తలఁచి యేదేశాంతరములకైనఁ బోవనిశ్చయించి గుఱ్ఱములకు జీనువేసి పయనముగమ్మని సేవకుల కాజ్ఞాపించెను. జగ్మల్లు పట్టాభిషేకమహోత్సవమునకై లేచి గద్దె యెక్కఁబోయెను. పట్టాభిషేకమప్పుడు చందావతులవృద్ధు రాణాకు నడుమునకుం గత్తి

కట్టవలసిన యాచారము గలదు. ఆయాచారము నడపుటకు జగ్మల్లున కొక్కప్రక్క చందావతువంశస్థుఁడును రెండవప్రక్క వాని చేయిపట్టుకొని తారువంశస్థుఁ డగు వేరొకవీరుఁడు నుండిరి. అపుడు చందావతుఁడు గద్దెయెక్కఁబోవుచున్న జగ్మల్లుయొక్క హస్తముఁ బట్టుకొని "దేవా మీరు పొరఁబడుచున్నారు. ఈపీఠము మీ రెక్కవలసినదిగాదు. ఇది మీసోదరుఁ డగు ప్రతాపుఁ డధిష్ఠింపవలసినది." అని నిర్భయముగఁ జెప్పెను. జగ్మల్లు వానిపలుకులు సరకుసేయక యతనిచేయి విదల్చుకొని యాగడముచేయఁ దలంచెను; కాని చందావతుఁడు వానిని సందిట నిఱికించి యొకచోటఁగూలవైచి ప్రతాపునిం దోడితెచ్చి గద్దెయెక్కించి వాని మొలకుఁ గత్తికట్టి సాగిలఁబడి మున్మూఱు వానిచరణములకు మ్రొక్కిమీవారు రాణా ప్రతాపసింగేయని మేఘగంభీరభాషణములతో నొక్కిచెప్పి చప్పట్లు కొట్టెను.

అంతకుమున్ను రాజ్యభ్రష్టుఁడై దేశములపాలై పోవలసిన యవస్థలోనుండి యాకస్మికముగ మండలాధిపతియై సింహాసన మెక్కఁగలిగినందులకు గర్వించి విజృంభింపక ప్రతాపుఁడు నిశ్చలమనస్కుఁడై శాంతముతో నుండెను. పట్టాభిషేకమహోత్సవము ముగిసినతోడనే ప్రతాపుఁడు సామంతప్రభువులం బిలిచి యది వసంతకాలమనియు నడవిపందిని వేఁటాడి గౌరికి సమర్పించి ముందుసంవత్సరము తన యదృష్ట మెట్లుండునో తెలిసికొనవలయుననియుఁ జెప్పి గుఱ్ఱమెక్కి వారిం దోడ్కొని వేటకుఁ బయలువెడలెను. రాజస్థానమునందంతట గౌరి యిప్పటికి ననేకనామములతోఁ బూజింపఁబడుచున్నది. ఇట్లు వెడలి వా రడవిపందిని జంపి దానిని దేవి కర్పించి యామెను సంతుష్టిపఱచి మఱుచటియేఁడు తమకు జయకరముగ నుండునని తెలిసికొని సంతసించిరి. అది మొదలు రాణాప్రతాపసింగు పలుమా ఱీవిధముగఁ బలుకుచు వచ్చె. "రాణాసంగునకు నాకును

నడుమ నాతండ్రి యుదయసింగు లేకుండ నేనే సంగునికుమారుఁడ నైనపక్షమున గొడ్డుమాంసము తినుతురకవాఁడు వచ్చి యీ దేశమున నడుగు పెట్టఁగలఁడా. రాజపుత్రులను లోఁబఱచుకొనఁగలఁడా."

మీవారు రాజ్యమునకు స్వాతంత్ర్యము దేవలయు నని ప్రతాపునకు గోరికయున్నది; కాని యది నెఱవేఱుట యసాధ్యము. ఏల యనఁ బ్రతాపసింగునకు ఢిల్లీచక్రవర్తి సైన్యములే కాక స్వబంధుజనములలోఁ గూడ శత్రువు లుండిరి. మార్వారు, బూంది, బికనీరు, అంబరు మొదలగు సంస్థానముల యధిపతులు చక్రవర్తికి దాసులై యుండిరి. అందు బూందిసంస్థానప్రభువు దక్కఁ దక్కినవారు దాసులగుటతోఁ దనివినొందక తమ యాఁడుపడుచులఁ దురకకిచ్చి పెండ్లి గూడ చేసిరి. వారిమాట యేల? ప్రతాపుని సోదరులలో నొకఁ డగు సాగరుఁ డనువాఁడు తన యన్నను విడిచి యక్బరుచక్రవర్తి శరణంబు సొచ్చి యాతనిచేత నేలుటకు గ్రామంబులం బడసి మాన్యుఁడై యుండెను. అతఁడును బిడ్డలును సాగరవతు లను పేరఁ జక్రవర్తికొలువులో బ్రతిష్ఠితులై యుండిరి. మీవారుదేశము నిరంతర యుద్ధములచేత ధనశూన్య మగుటయేగాక ఆయుధశూన్యమై వీరశూన్యమై యడవియైయుండెను. ఆయవస్థలో మహావీరుఁ డగు ప్రతాపుఁ డొక్కఁడు చక్రవర్తితోఁ బగసాధించెనుగాని మఱియొకఁడైనపక్షమున సందుదొరకినదే చాలునని చప్పచప్పనఁ చక్రవర్తితో సంధిచేసికొని యాతని మన్ననలకుం బాత్రుఁడై సుఖముగ నుండి యుండును.

మీవారుదేశములోఁ బుట్టిన రాచవాఁడు ఢిల్లీచక్రవర్తికి లొంగి సలాము చేయఁగూడ దనియు వానిని తాము గెలువలేకపోయినను తెఱిమి దోఁచుకొని బెదరగొట్టి సిలుగులం బెట్టవచ్చు ననియు వీలుదప్పివచ్చినప్పుడు గౌరవముగ రణముఖంబునఁ జచ్చి వీరస్వర్గము జూఱగొనవచ్చు ననియు నందుచే సంధి చేసికొనఁగూడ దనియు వాని

యభిప్రాయము. ఆయభిప్రాయముంబట్టి తురకలను స్వదేశమునుండి వెడలఁగొట్టి మీవారును తొల్లింటి గొప్పదశలోనికిం దెచ్చువఱకుఁ గడుపారఁ గూడు తిననని యుఁ గంటినిండ నిదురపోనని యు నతఁడు ప్రతిన జేసెను.

ఇట్లు సంకల్పించి యానాఁటియు మొదలు ప్రతాపుఁడు సంకల్ప సిద్ధి యగువఱకుఁ గొన్ని నియమముల నేర్పఱచుకొనియెను. సేన బయలు దేరునప్పుడు ముందు మ్రోయు రణదుందుభు లది మొదలు వెనుక వాయింపవలయును. శత్రువులను జయింపలేని పిఱికివాని రణదుందుభులు వెనుక నుండవలయునేగాని ముం దుండఁదగ వని యిట్లు చేసెను. 2. రాణావారు భోజనము చేయు వెండిబంగారుపళ్ళెములు పాత్రములు తీసివేయించి తనకును తనతోడిసామంతప్రభువులకును శత్రునాశనము సేయువఱకు భోజనార్థము విస్తళ్ళు చాలు నని యానతిచ్చెను. 3. ఆయన నిత్యము పవ్వళించు హంసతూలికాతల్పము లవ్వలఁ బాఱ వైచి తనగుఱ్ఱమును శత్రువులకోటలోఁ గట్టివేయువఱకుఁ దాను గడ్డి పాన్పుమీఁదనే పండుకొనునట్లు శపథము చేసెను. 4. చిత్తూరునగర మెప్పటియట్లు రాజస్థానమునకు దీపమై వెలయునంతవఱకు ప్రతాపుఁడు తాను తన సామంతులు గడ్డములు కత్తిరించుకొనఁగూడ దని శాసించె. ఆదినము మొదలు చిత్తూరు రాజధానిం జేసికొనువఱకు మఱల రాజధానిలో నుండఁగూడ దని యుదయపురమును విడిచి కమలమీరుకోటలోఁ/గాపురముండి యెందేని బోవలసివచ్చినప్పుడు గుడారములోనే వసించుచు వచ్చెను.

ఇట్లు సంకల్పించినతోడనే మున్ను తినతండ్రి మూర్ఖతవలన యన్యకుటుంబమునకు బోయిన తనతమ్ముని సూక్తుని రావించెను. ఆబాలుని పెంచుకొన్న తండ్రికి ముసలితనమున గొడుకు లనేకులు పుట్టినందున దత్తపుత్త్రుపై మోహము తగ్గెను. కావున సూక్తుఁడును పెలకపితను విడిచి వచ్చుటకు వగవక కసుసంతోషమున నన్నవద్దకు

వచ్చి యతని యనుగ్రహంబునకుఁ బాత్రుఁడైవానిం గొల్చుచుండెను. వచ్చినక్రొత్తలో నన్నదమ్ము లిద్దఱు మిక్కిలి సౌహార్దముతో నుండిరి; కానిదినములు గడచినకొలఁది స్థితి వెనుకటియట్లుండదయ్యెను. తమ్ముని కన్నపై ననూయ పొడమెను. రాజ్యమేలుటకు తనయన్నకంటెఁ దానే యెక్కువ సమర్థుఁడ నని సూర్యమల్లుఁ డెల్లప్పుడు తలఁచి యప్పుడప్పుడు దుర్వినయములు జూపుచుండ నొకనాడు వేటాడుతఱి నన్నదమ్ములకు మాటపట్టింపులు వచ్చెను. ఆమనస్పర్ధ యంతంతకుఁ బ్రబలవైరముగ బరిణమింప సూర్యుఁ డన్నతో నిట్లనియె. "మనమిరువురము గుఱ్ఱముల నెక్కి బల్లెముల చేఁబట్టుకొని ద్వంద్వయుద్ధము చేసి యెవఁడెక్కుడుబలవంతుఁడో నిర్ణయించుకొందము. పూర్వము తనతాత వ్యాఘ్రగిరియొద్ద జయముగొన్నట్లు తానును జయము గాంచవచ్చునను ధైర్యమునఁ బ్రతాపుఁ డాయుద్ధమునకు సమ్మతించెను. దేశాచారప్రకారము గౌరవము లన్నియుఁ దలఁచి వారుభయులు ముందు నీవు కొట్టుము ముందు నీవుకొట్టుమని యొకరినొకరు హెచ్చరించుకొని యుందారంభించుట కెవ్వరికిం జేతులు రాకపోవుటచే నొక్కసారిగ నిరువురు నొకరిపై నొకరు దుముకుటకు సిద్ధముగనుండ నంతలోఁ బురోహితుఁడు వారియిరువుర నడుమ నడ్డముగ నిలిచి యతిదారుణమై కులనిర్మూలకారణ మైనయాపోరుడుగుమని వేఁడెను.

అప్పటికా వీరుల క్రోధములు మేరమీఱినందున గురువు మాటమీఁదిగౌరవముచేతగాని బంధుత్వముచేతగాని వారు పోరు మానవొల్లక పొడుచుకొనుటకు బల్లెముల దూసిరి. ఏయుపాయము నైననీకుటుంబకలహమును నివారింపదలఁచి పురోహితుఁడు కర్తవ్యమేమియుం దోఁపమి యెట్టకేలకుఁ దనచేతిబల్లెముతోఁ దాను బొడుచుకొని యిరువురకు నడుమ నేలబడియె. ఆయమానుషకృత్యముజూచి రాజపుత్రు లిరువురు సంభ్రాంతులై గురుప్రాణరక్షణము చేయుటకు గుఱ్ఱములమీఁదనుండి క్రిందికి గుభాలున దుమికిరి, కాని గురువుగా

రంతకుమునుపే మేనుదొరఁగిరి. పవిత్రుఁడగు గురువుగారి శరీరరక్తము సోదరుల కిరువురకు పృథ్యగాఁబాఱుటచే నదిదాఁటి యొకరిపై నొకరు దుముకుటకు వారికి మనస్సొప్పదయ్యె. గురువుప్రోయినఁ బోయెఁగాని కలహముమాత్రము నివారితమయ్యెను. ప్రతాపుఁడు కొంతసేపటికిఁ దెలివి తెచ్చుకొని సోదరునింజూచి నీవు నా యెదుటనుండి దేశాంతరములకుం బొమ్ము ఇచట నిలువవలదని పలికెను. చిత్తమని కపటవినయముతో నమస్కరించి సూర్యుడు గుఱ్ఱమెక్కి వెంటనే ఢిల్లీకిఁ బోయెను. ఆనాటి పోరువలన రాణాప్రతాపునకు సోదరవియోగమును ఢిల్లీచక్రవర్తికి గొప్ప మిత్రలాభమును గలిగెను.

ఇట్లు కొందఱు ఆప్తబంధువులు కొందఱు రాజపుత్రులు విడిచినను ముఖ్యసామంతప్రభువు లనేకులు ప్రతాపునకుఁ దోడుపడిరి. జగ్మల్లును సింహాసన మెక్కింపఁదలఁచిన నాఁడెట్లుండెనో యట్లే చందావతుకులజులు నేటికిని రాణాపక్షము వహించియుండెను. జయమల్లుని కొడుకులును, పుట్టుకొడుకులు తండ్రిమార్గము ననుసరించి రాణాకు విధేయులైరి. అక్బరుచక్రవర్తి వారి కెంతెంత లంచముల నియ్యఁదలఁచుకొన్నను వారు తమ స్వామిభక్తిని దుచ్ఛధనమునకై విక్రయింపనొల్లరైరి.

శౌర్య మెంతయున్నను సేనాబలము తక్కువగుటచే రాజపుత్రులు తురకలను బ్రత్యక్షముగ నెదిరింపఁ జాలరైరి. అందుచే వెనుక రాణాహమీరు "అలాయుద్దీను" మీఁదఁ బ్రయోగించిన మాయోపాయములే రాజపుత్రులు మరలఁ బ్రయోగింపవలసివచ్చెను. అంతట రాణాప్రతాపసింగు కొండలలో వసియింపఁ బోవుచుండుటచే దేశమందలి జనులందఱు వానిని వెంబడింపవలయుననియు రానివారు కానివారేయనియు దేశమందంతట నతఁడు చాటించెను. ప్రజలు రాజాజ్ఞ శిరసావహించి నేలఁ దున్నక పొలముల పైరుసేయక తమ పశువులనెల్ల శత్రుదుర్గము లగుహారావళిపర్వతములలోని

కిందోలి తాము రాజువద్దకుఁ జనిరి. పట్టణములు పల్లెటూళ్లు నిర్జనములై భయంకరము లయ్యెను. మహారణ్యములు వసియించిన తావుల వనములనుండి వెలువడివచ్చి ఘాతుకమృగములు సంచరింపఁ జొచ్చె. బాటసారులు నడువకపోవుటచే మార్గములన్నియు ముండ్లతోనిండి బయనంబునకు నిరోధము గలిగించెను. ఢిల్లీచక్రవర్తి ప్రతాపుని మీఁద దండువిడిసియు వానిసైనికులకుఁ దినుటకన్నము గాని త్రావుటకు జలంబులుగాని లభింపవయ్యె. ఆ యిక్కట్టులకు. దొంగక మహారాణా ప్రతాపసింగు నడుమ నడుమ శత్రులమీఁద నకోటులో మునిఁగియో మఱియేమఁడవిలోనుండియో నాకస్మికముగ బయలువచ్చి సూరతు నగరమునుండి ఢిల్లీచక్రవర్తి నిమిత్తము విలువగల సరకులం గొని పోవు బిడారములను కొల్లఁగొనుచుండెను. మఱియొకమాఱు తన యాజ్ఞఁ జెల్లింపక బుద్ధిహీనుఁ డెవండైన కక్కుఱితిచే నేలనున్నట పశులమందలను మేపుట మొదలగు కృత్యములఁ జేయుచున్న వాఁడేమో పరీక్షించి చూచుటకు రాజస్థాన మధ్యభాగమునకువచ్చి శోధించుచుండెను. ఇట్లువిహరించుచుండ నొకనాఁడొక ఛోట మంద భాగ్యుఁ డొకఁడు రహస్యముగఁ దన మేఁకలమందను పచ్చికబీళ్ళ మేపుకొనుచుండెను, అది రాణా చూచి వానిం బిలిచి నాలుగుమాటలు వాని నడిగి సంగతి తెలిసికొని తత్క్షణమే వానికిమరణదండన విధించెను. ఆనిర్భాగ్యుని శవము దహనముచేయుటకైన దిక్కులేమిచేఁ గాకుల గ్రద్దలపాలయ్యెను.

అక్బరున కీకార్యములన్నియు నసహ్యములుగ నుండెను. అతఁ డీవిరోధమును మితిమీఱినట్లు చేయుటకిష్టపడఁడయ్యె. సహజముగ పరిశుద్ధమనస్కుఁ డగుటచే నక్బరు భరతఖండమునంతయుఁ దా నేక ఛత్రముగఁ బాలింపవలయు ననియు, దన చల్లనిపాలనముక్రిందట నన్ని తెగలవారు సుఖముగ బ్రతుకవలయుననియు సంకల్పించెను. అందుచేతనే యతఁడు రాజపుత్రుల నడవడికే తక్కిన తెగలవారి

కంటె నెక్కువ గౌరవించుచుండెను. అతని పట్టపుదేవి యగు జహాంగీరుతల్లి రాజపుత్రిక యగుచు. ప్రధానమంత్రులలో నొకఁడైనతోడరుమాలు రాజపుత్రుఁడు మఱియు నంబరుసంస్థానాధిపతి యగు భగవానుదాసుఁడును వానియన్నకొడుకగు మానసింగును సేనాపతులై చక్రవర్తిని గొల్చుచు నుండిరి. ప్రజలనిమిత్తము చట్టములు చేయునప్పు డక్బరుచక్రవర్తి యతిబాల్యవివాహము, యజ్ఞములలో జీవహింస, బలత్కారసహగమనము, మొదలగు దురాచారములు జరుఁగఁగూడదని నిషేధించి హిందువులకుఁ గొంచె మనిష్టమే గలిగించినను మొత్తముమీఁద సర్వమతసహనముఁ గలిగి యెవరి మతమువారిపూజలు తనకోటలో సయితము జేసికొనవచ్చు నని యొప్పుకొని గోవుల నితరజాతులవారుగూడ చంపఁగూడ దనికట్టుబాటుచేసి ధర్మోత్తరముగఁ బ్రజాపాలనము చేసెను. ఈసామ్యత వలన నక్బరునకు ననేకరాజపుత్రులు లోఁబడి కప్పముఁ గట్టుటకు సమ్మతించిరి; కాని చిత్తూరునగరమును నాశనము చేసి తానుగొంచెనలోనికిం బాఱఁద్రోలినను రాణాల కింకను బుద్ధిరాలేదని యక్బరు విచారింపఁజొచ్చెను. రాజపుత్రులయెడల చక్రవర్తి చూపుదయాగౌరవాదులంబట్టి స్వమతాభిమాన మెక్కువగల మహమ్మదీయుల కక్బరుపై కోపముగూడ గలిగెను. కాలక్రమమున రాణాయును జక్రవర్తికిని దొంగపోటుయుద్ధములు కడముట్టి ప్రబలయుద్ధములు జరుగ నారంభించెను. దానికి కారణము రాజపుత్రకవు లిట్లు చెప్పియున్నారు.

“అంబరురాజవంశస్థుఁ డగుమానసింగు చక్రవర్తిపంపున నేదేశమునకో పోయి యగతులఁ జక్కఁడంచి మరల ఢిల్లీకిఁ బోవుచు మార్గవశమున మీవారు దేశములోనుండి పోవలసివచ్చెను. ప్రతాపసింగు ధనహీనుఁడై దుర్బలుఁడై యుండినను ముప్పదివేలు రాజపుత్ర కుటుంబములకు నాయకుఁడై వెలయుచుండుటచే “మహారాణావారి దర్శనము నేను జేసికొనవలయునని యున్నది రావచ్చునా?,, యని

మానసింగు వినయముగ వర్తమాన మంపెను. అప్పుడు ప్రతాపుఁడు కమలమియరుకోటలో నున్నందున వాని నక్కడ కలిసికొన ననియు నుదయసాగర మనుసరస్సుతీరమున గలిసికొందు ననియు, వర్తమాన మంపెను. దానికి సమ్మతించి మానసింగు సపరివారముగ నటకుం జన, వాని నెదుర్కొనుటకుఁ బ్రతాపుని పెద్దకొడుకగు ఉమ్రి యనునతఁడు మీవారుప్రభువులను దోడుకొని యక్కడకు వచ్చెను. వచ్చి మానసింగును సమ్మానించి తలనొప్పిబాధచే రాణావారు స్వయముగ రాలేక తమ్ముఁ బంపిరని చెప్పి పిండివంటలు చేయించి విందారగింపుమని వానిం బ్రార్థించె.

ఉమ్రాకు నక్కడ నున్న తక్కిన రాజపుత్రులను బ్రతాపుఁడు స్వయముగ వచ్చి మానసింగునకు నెందుకు విందు సేయలేదో కారణము తెలియదు. అంబరురాజులు తురకలతో వియ్యమందుటచే ప్రతాపుఁడు వారిపంక్తిని దినఁడు. ఆసంగతి గ్రహించి మానసింగు «ప్రతాపుని తలనొప్పికారణము నే నెఱుఁగుదును. అతఁడే స్వయముగ వచ్చి నాకు విందు సేయవలయును కాని వానిస్థానమున వేఱొకరు పనికిరారు'' అని పలికెను. ఆపలుకులు విని ప్రతాపసింగు నిర్భయముగ నిట్లు ప్రత్యుత్తర మిచ్చెను. తనయింటి యాడుపడుచును దురకకిచ్చి పెండ్లిచేసి వానితోఁ గలిసి కూడుదిను నతనితో నేను భుజియింపఁ ల.'' జా

ఆపలుకులు విని క్రోధలజ్జాపరవశుఁడై మానసింగు విందారంపక గి దిగ్గున లేచి «దేవున కారగింపుచేసి తెచ్చినయన్నమే గాని మీ చేతియన్నము నేను దినను. మీమానములఁ గాపాడుటకే మీరాజ్యములు నిలుపుటకే మేము తురకలతో వియ్యమంది వారికూడు తినుచుండుట. సరేయిఁక మీఁద నీ వేమాత్రము పౌరుషశాలివో చూతము కాచుకొమ్ము'' అని పలికి తనపరిజనుల నందఱిని లెమ్మని పయనమును పోవుచుండ నింతలో ప్రతాపుఁ డీవలకు వచ్చి మానసింగును

జూచుచుండెను. ఒక్క శల్యమయి మనోవ్యథచే పాలిపోయి మాసిన బట్టలు గట్టుకొని సామాన్యునట్లుండియు రాజతేజముచే మెఱయు చున్న ప్రతాపసింగును జూచినతోడనే మానసింగున కెక్కడలేని కోపము రాఁగా నాపుకొనలేక ప్రతాపునితో «నేను నీపొగరణఁ గింపకపోదునేని నాపేరు మానసింగు గాదు సుమీ” యని పలికి మొట్టు పెట్టుకొని పోనొడంగెను. ప్రతాపుఁ డాపలుకులకుఁ గోపింపక మానసింగుతో యుద్ధము సేయుట నాకును సంతోషమయ్యె గౌరవముగఁ బలికెను; కాని ప్రతాపుని పరిజనులలో నొక్కఁడు కోపమాపుకొనలేక చప్పట్లు గొట్టి మానసింగును వెక్కిరించుచు మీయక్బరు నీమామను తీసికొనిరా! ఈసారి వానికి నీకునుగూడఁ దగినట్లు బుద్ధి చెప్పించెద నని బిగ్గరగఁ జెప్పి యిక్కడ వారియుటకు వీలులేని తిల్లు చక్రవర్తి యని వానిని దిట్టెను. మానసింగు సపరివారముగఁ బయనమయి పోయినవెనుక నతఁడు నతనిసైనికులు బసదిగినచోటఁ గూర్చున్నచోట నడిచినచోట పవిత్రమగుగంగాదిజలము తెప్పించి చల్లించి పుణ్యాహవాచనము చేయించి యంతతోఁ బోక వారి మైలగాలి తమపై సోకినందుకుఁ బ్రాయశ్చిత్తముగ దాము దమబందుగులును శిరస్స్నానము చేసి వెనుకటిబట్టలు విడిచి మంచిబట్టలు కట్టుకొని కమలమీరుకోటకుం జనిరి.

పరాభవము నొందిన మానసింగు వడివడిం బయనము చేసి ఢిల్లీకిఁ బోయి యక్బరును దర్శించి ప్రతాపుఁడు తనమొదలం జూపిన యగౌరవంబును జక్రవర్తి యధికారమునెడం జూపినతిరస్కారమును ప్రతాపుని పరిజనులు చక్రవర్తిని జేసిననిందలను మఱచిపోక యొకటికిఁ బది జేర్చి పూసగ్రుచ్చినట్లు విన్నవించెను. ఈకొండెములు విని యక్బరు మీవారుపై దండెత్తుటకు సేన సిద్ధము చేసెను. ప్రతాపునితో మానసింగు చెప్పినవిధమున నక్బరు స్వయముగ దండయాత్రకు రాలేదుగాని తనకుమారుఁ డగుసలీమును సేనాధిపతిగఁ జేసి మానసింగును వానికి ముఖ్యమంత్రిగ నొనర్చి దండయాత్ర నడపించెను.

ప్రతాపసింగు తన చిన్న సేనతో వెనుబడి చతురపుమైళ్ళ వైశాల్యము గల నుదయపురజిల్లాలో నొకయడవిలో నుండెను. మొగలాయిసేన నానాఁటికి రాణాను జుట్టి నలుదెసలం గ్రమ్ముకొనెను. ఆయడవి కొండలతో నిండి సమప్రదేశము లేక నిమ్నోన్నతముగ నుండుటచే నిలిచి యుద్ధము చేయుట కిద్దఱకు వీలు లేకయ్యె. ప్రతాపుఁడు దాఁగొనియున్న కొరడవికి సమీపమున హాల్దిఘాటనుబయలుండుటచే నది యుద్ధమునకుం దగినభూమి యని యిరువు రచ్చటఁ జేర నిశ్చయించి 1576 వ సంవత్సరము జూలై నెలలో జేరిరి.

ప్రతాపవంతుఁడగు ప్రతాపుఁడు చైటకమనుపేరుగల తన గుఱ్ఱము నెక్కి రాజలాంఛనముగు శ్వేతఛత్రమును సేవకులుపట్ట కవచము ధరియించి ఖడ్గపాణియై యుద్ధమున నిలిచినతోడనే ప్రాణములెంతో తీపియని చావునకుఁ వెఱచి మూలదాఁగొన్న పిఱికిసయితము తెగించి కత్తిఁబూని తనరాణాకుఁదోడుపడియెను. శత్రుసైన్యములఁ జూచినతోడనె మనోనిశ్చలముగు ప్రతాపునిమనస్సుఁగూడ నించుక జంకెను. దీనింబట్టి యక్బరుపంపిన గొప్పఫిరంగులు సాధనములు మహాయంత్రములు మొదలగువానిం జూచి రాణా జంకెనని మనము దలఁపరాదు. అన్నను జంపుటకు తమ్ముఁడును తమ్ముని దెగటార్చుటకన్నయు నొండొరులం జంపుకొనుటకుఁ జుట్టములు నచ్చటఁ జేరినందుకతఁడించుక వగచె. ఆమహాసైన్యములో ప్రతాపుని సోదరుఁ డగు సూక్తుఁ డొకమూలనుండెను. మఱియొక సోదరుఁ డగుసూగ్రుని కుమారుఁడు కొంతసేన కధిపతియై నిలిచెను. చక్రవర్తి పుత్రుఁడగు సలీము రాజపుత్రుల మూఁకుపడుచు నుండుకే గదా! ఈసేనాచక్రము నంతను ద్రిప్పుచున్న యంబరరాజపుత్రుఁడు మానసింగు ప్రతాపునకుఁ జుట్టమేకదా? అతనిం జూచినతోడనే ప్రతాపుఁడు రోషావేశపరవశుఁడై యుద్ధమేమయిన సరే వానిపై కసితీర్చుకొనవలయునని ప్రతిన చేసెను.

ప్రతాపుని పక్షమునన్న సైనికులందఱు నిరువది రెండువేల మంది. వారు మహాపౌరుషశాలురేగాని సకలసాధన సంపత్తిఁ గల ఢిల్లీసైన్యమున కీడగువారుగారు. వారిలో ననేకులు రాజపుత్రులు గడువిశ్వాసముఁగల భిల్లులు గలిసియుండిరి. ఆయడవిలోఁ గొండలు వనచరులుండిరి. వారిని యుద్ధమునకు రప్పింపవలయు ననుకొన్నఁ గ్రమమయిన యుద్ధమున నిలుచుట యెట్లో పోరుటయెట్లో వారెఱుంగరు. ఆకారణమున వారు రణమునకు రాఁకయే రాణాకు సాయముఁ జేయఁదలంచి కొండలెక్కి చెట్లచాటున నుండి వీలగునప్పు డొకటి రెండుబాణముల విడుచుచు శత్రువులు కొండలనడుమనుండి పోవు నప్పుడు వారిపయిన పెద్దపెద్దఱాళ్ళను దొర్లించుచు యథాశక్తిగ స్వామిభక్తిని జూపుచుండిరి. అంతట నుభయసేనలకు ఘోరయుద్ధ మారంభమాయెను.

కొండకనుమ నాక్రమించినచోఁ దమకు సేమమగునని తురకలు ప్రయత్నించిరి. రాజపుత్రులు వీరావేశముతోఁ గొండదారి తురకలపాలఁ బడకుండఁ గాచుకొనిరి. ఎక్కడ యుద్ధము సంకులమయ్యెనో యక్కడ భానుబింబ చిహ్నముగల ధ్వజముతోడను, వెల్లగుబ్బ గొడుగుతోడను తప్పక ప్రతాపుఁడు గానఁబడుచువచ్చెను. ఆతని ముఖ్యాభీష్టము మానసింగునుగలిసి వానినోడింపవలయునని. అందుచే నంతకంతకు ముందుకు చొరుచుకొనివచ్చి ప్రాణములపై నపేక్ష విడిచి యతఁడు పోరఁజొచ్చె. రణరంగమున నతఁడు కొంతదవ్వు పోవునప్పటికి వివిధాలంకారములచేత నలంకృతమయి బంగారపు టంబారీగల యొకపట్టపుటేనుఁగు వాని కగపడియెను. దాని చుట్టు వందలకొలఁది జనులు జేరుటచే నది చక్రవర్తిపుత్రుండగు సలీముని యేనుఁగని గ్రహించి ప్రతాపుఁడు విజృంభించెను. విజృంభించుటయు సలీముని యంగరక్షకులు రాజపుత్రులచే నిహతులై నేల నొఱఁగిరి. మావటివాఁడు కూర్చున్న చోటుననే క్రుంగిపోయె. అంబారీకి నలు

ప్రక్కలనున్న యినుపపలక మూలమున సలీము బ్రతుకఁ గలిగెను. గాని లేకున్నచో ప్రతాపుని బాణప్రహారములచేత చక్రవర్తి పుత్రుఁడు నాఁడే కడతేఱియుండును. అప్పుడు పోరు మిక్కిలి సందడి యయ్యెను. చక్రవర్తి కుమారుని రక్షించుటకు మొగలాయిసేన లన్నియు నచ్చటికివచ్చె. రసపుత్రవీరు లందఱుతమస్వామికి బాసటయై నిలిచిరి. ప్రతాపుఁడు మూఁడుబల్లెపు పోటులచేతను మూఁడు కత్తిదెబ్బలచేతను గాయములనుండి నెత్తురు సంతతధారగఁ గాఱు చున్నను లెక్కసేయక పోరుచుండ నొకతుపాకిగుండు కవచమును భేదించుకొని వానిశరీరమునఁ జొచ్చెను. ప్రతాపుని గుఱ్ఱము కైటక మామదగజమును డీకొన నింతలో నామదపుటేనుఁగు దెబ్బలచే నొడలునొచ్చి పిచ్చియెత్తినట్లు విజృంభించి వేఱొకయెడకుం బాఱి పోయెను అందుచే సలీము పులినోటి కండవలె దాఁటి యావలఁ బడియె.

మొగలాయిసైనికులు మిడుతల దండువలె రాజపుత్రులం జుట్టుముట్ట నారంభించిరి. ప్రతాపుఁడు మున్మారు పగతులచేఁ జుట్టు ముట్టఁబడియు మున్మారును వారిం దనశక్తికి బలియిచ్చి యప్రతి హతుఁడై నిలిచెను. రాజపుత్రులు క్రమక్రమంబుగ నశించుటయుఁ దురకసేన నెందఱుబంట్లు వచ్చిన నిసుకపాతరవలె తఱుఁగకుండు టయుఁ జాలవంశస్థుఁడగు నొక రాజపుత్రవీరుఁడు చూచి ప్రతాపుని యపాయస్థితినిఁ దప్పించుటకు సూర్యబింబధ్వజమును తనచేతం బట్టుకొని గబగబ పఱుగెత్తెను. తురకసైనికు లది చూచి ధ్వజ మెక్కడనుండునో రాణాయు నక్కడనే యుండుననుకొని జాలవంశ స్థుని వెంటఁబడిరి. ఇంతలోఁ గొందఱు రాజపుత్రులు ప్రతాపుని గుఱ్ఱపుకళ్ళెమును బట్టుకొని వాని కిష్టములేకున్నను రణరంగముమండి వాని నవ్వలకుఁ దీసికొనిపోయిరి.

ఆరాజసింహుఁ డావలకుఁ జనినపిదప వెనుక చిత్తూరు ముట్టడి లోఁ జెక్కు చెదరక బ్రతికిన తువారువంశస్థుఁడును వానికుమారుఁ డును రాజప్రాణ సంరక్షణార్థము ధ్వజముపట్టుకొనిపోయిన జాలవంశస్థు డును ఉక్కుతునుకలవంటి మఱియేన్నూరు రాజపుత్త్రవీరులును హోరా హోరిగాఁ దురకలతో యుద్ధముచేసి మృతినొంది వీరశయన మలంక రించిరి. నాఁడు యుద్ధమునకు వచ్చిన యిరువదిరెండువేల రాజపుత్త్రు లలో నెనిమిదివేలుమాత్త్రము గాయములతో బలాక్షతులైరి. అప్పుడు శూరశిఖామణియైన ప్రతాపుఁడు వెంటనొక్క బంటుయినను లేక యొంటరిగ గుఱ్ఱము నెక్కిఁ దనకు శరణమీయగలతావు లవియే యని కొండలలోనికిఁ బోవుచుండెను. రాజపుత్త్రసైనికులు శత్త్రువులు తమ రాణామీఁదికిఁ బోకుండ వారినాపి పోరుచు చేతనయినంత సాయము చేసిరి. తనకుమారుఁడగు సుమూ్రి తాను మృతినొందినచో స్వదేశ మును గాపాడఁ దురకల నెదిరింపలేఁ డని రాజ్యలక్ష్మినిమిత్తము ప్రతాపుఁడు కొంతకాలము బ్రతుక నిశ్చయించుకొనియుఁ దనతోడి వీరులు గౌరవముగ రణరంగమునఁ బ్రాణములవిడిచివీరస్వర్గమును గొల్లఁ గొనుచున్నందుకును దాను పిఱికివాఁడై యేకాకియై ప్రాణ ములు గాఁచుకొనుటకు బ్రతికివచ్చినందుకు నతఁడు తద్దయు విచారిం చుచుఁ గైటకము నెక్కి మెల్ల మెల్లగ రాళ్ళనడుమ బయనము సేయు చుండ నంతలో వాని వెనుక గుఱ్ఱపుడెక్కల చప్పుడయ్యె. అప్పుడేమి యని యతఁడు తిరిగి చూచునప్పటికి నిద్దఱు తురకలు వానిం బట్టు కొనుటకు వెంట దగిలివచ్చుచుండిరి. వారికంటెదూరముగ నింకొకఁడు వచ్చుచుండెను. గుఱ్ఱముకంటె ప్రతాపుఁడును ప్రతాపునికంటె గుఱ్ఱ మును నలసియుండిరి. నోరుచుట్టుపై రోకలిపోటువిధమున వారి దారి కడ్డుగ కడువేగమునఁ బాఱు నొక కొండయే అడ్డమువచ్చెను. ప్రతా పుఁడు కైటకమును కొంచెము తరటచేయ నది యెక్కడలేని యోపికఁ దెచ్చుకొని నొక్క యెగురెగిరి యేఱు దాఁటి యావలంబడెను. తరుము

కొనివచ్చిన తురకలిద్దరు ఱాళ్ళమీఁద జారిపడితిమా చావవలసివచ్చు ననియు ప్రతాపునివంటి యసహాయశూరుని మీఁదికి తమరిద్దఱు చన గూడదనియు దమవారు మఱికొందఱు వచ్చువఱకు నిలుచుట మంచి దనియుఁ దలంచి యేఱుదాఁటరైరి.

ప్రతాపుఁడు పలుగాయములతో నెట్టుకొని కొంతదూరము పోయి నడచుటకు గుఱ్ఱమునకు దానిపైఁ గూరుచుండుటకుఁ దనకు బొత్తిగ నోపిక లేకపోవుటచే నేమిసేయఁదగు నని యోచించుచుండ నంతలో వెనుకనుండి కడువేగముగ దఱుముకొనివచ్చు నొకశత్రువుఁ డు కనఁబడెను. వాని బాఱినుండి తప్పించుకొని పోవుటకు వీలు లేదని తెలిసి పోరాడి గౌరవముగ మృతినొందవలయునని నిశ్చయించి ప్రతాపుఁ డెదురుతిరిగి నిలిచెను. నిలిచినతోడనే „ఓ మహావీరుఁడా! యుద్ధ మునుండి పాఱిపోవు వీరుని మన సెట్లుండునో యిప్పుడు చెప్పగలవా!" యనుమాటలు వానికి వినఁబడియె. ఆమాట లెవరివో యని యతఁడు చూచునప్పటికిఁ దన మరణముగోరి శత్రుపక్షములోఁ గలిసిన తన సోదరుఁడు సూక్తుఁడే యతఁడని గ్రహించి యాపలుకుల కుత్తరమి య్యక ప్రతాపుఁడు పోరనకు సిద్ధముకాఁగా కైటకము నిలువలేక నేలఁబడి మృతినొందెను. అప్పుడు చేయున దేమియు లేక ప్రతా పుఁడు నిశ్చేష్టుఁడై నిలువ „నీవు భయపడనక్కఱ లేదు నేను నీకు హాని సేయుటకు వచ్చినవాఁడను గాను. నీప్రాణములు పుచ్చుకొనుటకు వచ్చిన తురకలిద్దఱు నది కావలనే యున్నార"ని చెప్పి సమీపమునకు బోవ నన్నదమ్ము లిరువురులో నడగియున్న చిరక్రోధానలము చల్లఁ బడ నట్లు వైరము మఱచి యొండొరులం గౌఁగిలించుకొని కన్నీరువిడి చిరి. అట్లు కొంతడొక వగచినపిదప సూక్తుఁ డన్నతో నిట్లనియె. „అనేక మహావీరులచే నిరంతరము కొలువఁబడు శూరశిఖామణులగు మీరు గాయములచే బడలి కొండలంబట్టి పోవుచుండుటఁజూచి సహిం పలేక యేకగర్భజనితున కింతకంటె సాయముచేయువలసిన సమయ

ముండదని నేను పరుగుపరుగున వచ్చి మిమ్ము తెలుము మన్న తురకల నిద్దఱను, నేనే పోడిచి చంపితిని. ఇదిగో నాగుఱ్ఱము దీనినెక్కి మీ ప్రాణముల దక్కించుకొనుండు. నేను ప్రస్తుతము సలీమువద్దకుం బోయి కొలందికాలమున మీపాదసేవ చేయుటకు వచ్చెద” అని పలికి సూర్యుఁడన్నకు తనగుఱ్ఱమిచ్చి తనదారిం జనియె. చిరకాలము తన కుఁగలవిశ్వాసముతోఁ బనిజేసిన కైటకను దనవైపుఁ జూచుచు నప్పుడే ప్రాణములు విడుచుటచే బ్రతాపుఁడు దానికాపత్సమయ మున దగునుపచారములు చేయలేనైతినని కన్నీరువిడిచి క్రొత్తగుఱ్ఱ మునెక్కి మరలఁ బయనమయ్యెను.

సూర్యుఁడును సోదరునివద్ద సెలవుపుచ్చుకొని పాదచారియై మొగలాయిశిబిరముం బ్రవేశించెను. అంతయాలస్యముగ నొంటిగఁ గాలినడకను వచ్చుటకు గారణ మేమని సలీము వానినడుగ సూర్యుఁ డొకపెద్దకథ కల్పించి యిట్లని చెప్పెను. “అయ్యా! దేవరవారియె డద్రోహియగు ప్రతాపుఁడు రణరంగము విడిచి పలాయితుఁ డగు చుండ నాదురాత్ముని బట్టుకొని దేవర పాదపద్మములయొద్దఁ బడవే యవలయునని నేనును ముల్తాను కొరసాను ప్రభువులగు నిద్దఱు తుర కలును బయలుదేఱితిమి. ఆప్రతాపహతకుఁడు మీతురకబంట్ల నిరు వురఁ గడతేర్చి నాగుఱ్ఱము నపహరించి నన్నుఁగూడఁ జంపనుంకిం చెను; కాని యేలినవారిపాదములు మరలఁ జూడనోచుకొనుటచే నెట్టటో గండముగడపి నేను బయలుఁబడితిని.” అనపుడు నాపలుకుల యందొక్క యత్తరమైనను సలీము నమ్మఁడయ్యె. నమ్మకపోయినను మహాక్రూరస్వభావుఁ డగు నతఁ డెందుచేతనో సూర్యుని వెంటనే చం పింపక వానితో “జరిగిన నిజమును నీవొప్పుకొంటివేని నీకభయ మిచ్చెద నున్న దున్నట్లు పలుకు” మని నిర్బంధించెను. అట్టి సమయ మున నిజ మొప్పుకొనుటయే మంచిదని వానికి సూర్యుఁ డిట్లనియె. “మీవారు రాజ్యభారము మాప్రతాపుని భుజములపై నిలిచియున్నది.

అతని దురవస్థఁజూచి నామనసు కరఁగిపోవ నేను నాసోదరునిం గాపాడుకొంటి" నని యావద్వృత్తాంతము జెప్పెను. అది విని సలీము వానింజంపింపక తనసేన విడిచిపొమ్మని యానతిచ్చెను. సూర్తుఁడు బయలుదేఱి వచ్చుచు నొకచిన్నసేనం గూర్చుకొని మధ్యమార్గమున మొగలాయిల యాధీనములోనున్న భిల్సురారను పట్టణమును బట్టుకొని యాకస్మికముగ నొకనాఁడు ప్రతాపునియొద్దకు వచ్చి నమస్కరించి నిలిచెను. అతఁడు విస్మయమునంది తమ్ముని రాకకు గారణమడుగ సూర్తుఁ డంతయు జెప్పి "నేను మీసేవకుఁడనైతిని. మీదర్శనమునకు వట్టిచేతులతో రాక భిల్సరాపట్టణము పట్టుకొని వచ్చితిని. అది కానుకగ గ్రహించి మీవారు నన్ను మన్నింపఁదగు" నని ప్రార్థించుటయుఁ బ్రతాపుఁడు కృపామయుఁడై భిల్సరారాజ్యమునుసూర్తునకిచ్చి తనకు లోఁబడి పాలింపుమని యానతిచ్చె. అదిమొదలు సూర్తునిసంతతివారు సూర్తావతులను పేరం బరగి రాణాకు విధేయులై యుండిరి. సూర్తునిపేరు గాక యీయుద్ధమున మనము జ్ఞాపకముంచుకొనఁదగిన మఱియొకవీరుని పేరుఁ గలదు. ధ్వజమును మఱియొకచోటికిఁ గొనిపోయి రాణాప్రాణములను గాచి మృతినొందిన జాలవంశస్థుఁడే యీ రెండవవీరుఁడు. అతఁడు చూపిన స్వామిభక్తికి మెచ్చి ప్రతాపుఁడు వాని సంతతివారికి రాజబిరుదమును నగారా నౌబతుల నిచ్చి చాల గౌరవించెను. ఆవంశస్థుఁడు రాణా బయలుదేఱునప్పుడు వానికిఁ గుడిప్రక్కను బోవునట్టి గౌరవముఁ గలిగి యుండె. ఈవిధముగ హాల్దిగట్టుయుద్ధము ముగిసెను.

రాణా ప్రతాపసింగు.

——:(o):——

హాల్దిఘాటుయుద్ధమునందు రాణా ప్రతాపసింగు సంపూర్ణము గనోడింపఁబడినాఁడను నమ్మకము చేతను, యుద్ధయాత్రలు చేయుట కనర్హమైన వర్షకాలము వెంటనే ప్రాపించుటచేతను జహాంగీరు చక్రవర్తి తాను గెలిచిన గెలుపు సఫలమగునట్లు రాజపుత్రుల నడుగంట ద్రొక్కక విడిచి తన సేనలను ఢిల్లీనగరమునకుఁ దీసికొనిపోయెను. అందుచేత స్వేచ్ఛగా నూపిరి విడుచుకొనుటకు నలుదెసలకుం జెదిరి పోయిన తనమూకల మరలఁ జేర్చికొనుటకుఁ బ్రతాపునకు వీలుదొరకెను. మరుచటిసంవత్సరము దండయాత్రలు సేయుట కనుకూలమగు వసంతకాలమున జహాంగీరు తన విజయమును సంపూర్ణము సేయుటకు మరల రాజస్థానముపై దండువిడిసెను. అప్పుడు ప్రతాపుఁడు రణరంగమున మొగలాయిసేనలం దాఁకి దారుణయుద్ధము చేసెను. కాని దైవయోగమున రాజపుత్రులు పూర్ణముగఁ బరాజయమునొందిరి. అందుచేత మున్ను పృథివిరాజు కోటలోనుండి శత్రువులఁ దృణప్రాయముగఁ జూడఁగలిగెనో యా కమల్మీరుకోటకుఁ బోయిన, తాను సురక్షితముగ నుండవచ్చునని ప్రతాపసింగు సపరివారముగ నక్కడికిం జనియె.

ఎచ్చటికిఁబోయిన నాపదలు వెంట వచ్చునన్నట్లు ప్రతాపునకు నక్కడఁగూడ దన కపాయము సేయనెంచిన మహాద్రోహి యొకఁడుండెను. వెనుక పృథివిరాజునకు విసముపెట్టిన దేవరకోటరాజువంశస్థులలలో నొకఁడు ప్రతాపునిపక్షమున నున్నట్లై యుండి కోటలోని సైనికులు త్రావు నీటిలో విసము గలిపించెను. అది కారణముగ ప్రతాపునినిమిత్తము రాజపుత్రమహావీరులు ప్రాణములు విడువ వలసి వచ్చెను. ఆవీరులు చాటుచాటున దమ రాణాను గోట దాఁటించి

యాపలకుఁ బంపి సోనిగుఱ్ఱసంస్థాన ప్రభువును నాయకునిఁ జేసికొని మొగలాయి సేనల నెదిరించి తుట్టతుదవఱకు దుర్గమునుఁ గాపాడి ఖడ్గహస్తులై యొక్కఁడు లేకుండ వీరమరణము నొందిరి. ఆజనముతో పాటు ప్రతాపునిపరాక్రమములు పాటలుగ పద్యములుగఁ జేసి పాడుచు వానిసైనికులకు మహోత్సాహమును గలిగించుచు వచ్చినయాస్థానకవి కూడ మృతినొందెను.

అనంతర మొకదానివెంట నొకటిగ కోట లన్నియు మొగలాయీల సేనాధిపతి యగుమానసింగు చేఁజిక్కెను. రాజు దాఁటిపోయె నని గ్రహించి మొగలాయీసేనలు ప్రతిపర్వతిమార్గమునరికట్టి నలుదెసల జుట్టుముట్టి వానికి విశ్రాంతి నొసఁగక తఱుముజొచ్చిరి. వేయేల! ప్రతాపుని రాజధాని యగునుదయపురమే పగతురయధీనమయ్యెను. అందుచే పులులు వసించుపొదలు, సింగములుండుగుహలు నుదయపురమహారాజుగారికి విడిదు లయ్యెను. అడవిమృగములతో గలసి మెలసి చాలకాల ముండుటచేఁ బ్రతాపమహారాజు వనమృగంబులవలెనె దాగి యుండుటయు, పొంచుండుటయు, నదను వెదకి తన పగతురమీఁద దుముకుటయు మొదలగులక్షణముల నేర్చికొనెను. పలుసారులు తాము ప్రతాపుని జుట్టుముట్టి పట్టుకొనఁగలిగితి మని మొగలాయిసేనలు సంతసించుచు నుండఁగనే వారియాసలు భంగమగునట్లు ప్రతాపుఁడు తనసేనతో నింకొకమూల శత్రుసేనలఁ దఱుముచుఁ గానఁబడుచువచ్చె. ఒకప్పుడు రాణా చాలదూరమున నున్నాడని విని తురుష్కసైన్యము నిర్భయముగఁ బోవుచుండ నాకస్మికముగ నేమూలనుండియో ఇదె రాణా వచ్చెవచ్చె నని కేక వినఁబడుటయు వినఁబడినతోడనె ప్రతిపొదనుండి ప్రతిమూలనుండి వీరులచేతులనుండి బాణవర్షములు గురియుటయుఁ దఱుచుగ సంభవించుచు వచ్చెను. ఈవిధముగ వారిం దప్పుదారులఁ బెట్టుచు నొకమాఱు ప్రతాపుఁడు మొగల్ సేనలలో నొకపెద్దభాగమునే పట్టుకొని నిశ్శేష

ముగ సంహరించెను. వనవాసు లగుభిల్లులు విధేయులై మిత్రులై వానికిఁ గన్నులట్లు చెవులట్లు నుపచరించిరి. ఒకానొకప్పు డతఁడు పలాయితుఁ డగుటకు వీలు లేనపుడు దైవమే వానికి సాయముఁ జేయుచు వచ్చె. అది యెట్లన నయ్యడవులం దాకస్మికముగఁ గాఱు మబ్బులు పొడమ, జడివానలు దిమ్మరించి మొత్తుచుండును. అందుచే వాగులు నేఱులు కొండకాలువలు నిండి మార్గ మరికట్టుటయెగాక దేశమంతయు జలమయమై యుండును. చక్రవర్తిసైన్యము లాకారణమునఁ బ్రతాపుని విడువవలసి వచ్చుచుండును.

ప్రతాపుఁ డెక్కడనున్న నక్కడనే యతనికొలు వుండును. రాజ్యపరిపాలనము చేయుచున్నపుడు, భ్రష్టుఁడై తిరుగుచున్నపుడు, గృహమునం దున్నపుడు, కారాగృహమం దున్నపుడుకూడ ప్రతాపుఁడు రాచరికమె చేసెను. సింహాసనముమీఁద నున్నపు డెంత గౌరవమొ నిరాధారముగఁ జెట్టుక్రింద కూర్చున్నపుడు వానియెడ వాని యనుచరుల కంతె గౌరవ ముండెను. చెట్లనుండి గోసినపండ్లు, బీడుగడ్డితోఁ జేసినరొట్టె తప్ప వారికి వేరాహార మేదియు లేదు. రాణా తన కొలఁదియాహారములోనుండి యొకభాగమును దీసి దయతో నే సేనాధిపతికైన నిచ్చెనేని తొల్లి యుదయపురమున మహైశ్వర్యసంపన్నులైననాఁడు దయచే నిచ్చినబహుమానముల కెంత సంతసించుచువచ్చెనో యిప్పుడు నతఁ డంతియ సంతస మొందుచుండెను. కడుపునిండఁ గూడు లేక కట్ట సరియైనగుడ్డ లేక తల దాచుకొనుటకుఁ దాపు లేక యరచేత ప్రాణము లుంచుకొని యొకయడవినుండి యొక యడవికిఁ దిరుగునా శూరశిఖామణులవద్దఁ గనఁబడు పరస్పరప్రేమము గౌరవము వేఱొండుతావునఁ గనఁబడుట యరిది. అతని యనుచరు లీకష్టములఁ బడుటకంటె ఢిల్లీచక్రవర్తికి లోఁబడితి మని యొక్క మాట నోట నుచ్చరించినఁ జాలు. వెంటనే వారికి కేలుట కూళ్ళు, గడుపుటకు సేసలు, వహించుటకు బిరుదులు, కావలసినన్ని వచ్చి పడి

యుండును; కాని యైశ్వర్యము రాని రాకపోని యన్న ముండనీ లేక పోనీ వా రామాటమాత్ర మనరు. రాణా వారియెడ దయగా నున్నన్ని నాళ్లు వారు వానియెడఁ గృతజ్ఞులై యుందురు ఈకష్టములకు నపాయములకుఁ దోడుగఁ బ్రతాపుని యాలుబిడ్డలు వానివద్దనే వనములలో నుండిరి. బంగరుతొట్లలో నూఁగవలసిన యామహారాజు చిన్ని పాపలు చెట్లకొమ్మలకు వ్రేలఁగట్టిన గుడ్డయుయ్యెలలో నూఁగవలసి వచ్చె. ఒకప్పుడు మగవాఁడు యుద్ధములకుఁ బోయినసమయమునను నాడువాండ్రు పగతురకు జంకి పొదలలోఁ దాఁగొన్నసమయమునను జిన్నబిడ్డలను బుట్టలు దీసికొని పోవుచు బుట్టలలోఁ బెట్టి చెట్లకొన కొమ్మలకుఁ గట్టవలసివచ్చెను. ప్రతాపుఁడు గతించిన రెండువందల యేఁబదియేండ్ల తరువాత ననఁగా నేఁడుసయితము వనవాసులు ప్రతాపమహారాజు కునికిపట్లగుచెట్లను రాచబిడ్డ లుయ్యెలలూఁగిన కొమ్మలను జూపుదురు. శత్రుభీతిచేతఁ బలుమాఱు లాఁడువాండ్రు మగవాండ్రుఁ బరుగులెత్తవలసి వచ్చుటచే నొకమాఱు ప్రతాపుఁడు తనబిడ్డలను దనతో తీసికొనిపోవుటకు వీలు లేకపోయెను. అప్పుడు భిల్లులు కొందఱు కనికరముఁ బూని యాశిశువులను గంపలలోఁ బెట్టి తీసికొనిపోయి తగరపుగనులలో దాఁచి శత్రువులు దాఁటిపోవునంతకు పాలుపోసి పెంచి మరల తలిదండ్రుల కప్పఁజెప్పిరి.

వీరిగతి యిట్లుండ నక్బరునకు లోఁబడినరాజపుత్రులు సమస్త సంపదలు గలిగి సుఖపడుచుండిరి. చక్రవర్తిని శరణుజొచ్చిన రాజపుత్రులలో ముఖ్యులిరువురు గలరు. బికనీరుసంస్థానప్రభువు యొక్క నిరువురుకొడుకులు రాయసింగు పృథివిరాజు ననువారు. అక్బరు చక్రవర్తి యయ్యిరువురు రాచకొమరులను గడుగౌరవమున నాదరించి యందు రాయసింగు కూఁతునుఁ దనకుమారుఁ డగుజహాంగీరున కిచ్చి పెండ్లిచేసెను. పృథివిరాజు మహావీరుఁ డగుటయేగాక మంచికవి యు నగుటచే రాజపుత్రులలో నెల్ల నతఁ డగ్రగణ్యుఁ డని యక్బరు వానిని

తద్దయు సమ్మానించె. మానవతియు సౌందర్యవతియు ప్రతాపసోదరుఁడగుసూక్తసి పుత్త్రికయు నగునొకయువతి నాపృథివిరాజు వివాహమయ్యెను.

అక్బరుచక్రవర్తి తన వినోదమునిమిత్తము, తన్నుఁ గొలుచువారి వినోదమునిమిత్తము, ప్రతిమాసము తన యంతిపురమున నొక సంత జరుపవలయు నని యానతిచ్చె. చక్రవర్తి యాదరణమున జరుగుటంజేసి యాసంతకు విదేశములనుండియు స్వదేశమునుండియు వర్తకులభార్యలు వచ్చి విలువసరకుల నమ్మఁజూపుచు వచ్చిరి. చక్రవర్తిభార్యలు కొమార్తెలు వారి చెలికత్తెలు దాసీజనములు మంత్రులు సేనాపతులు మొదలగువారి భార్యలునచ్చి యాసంతలో దుకాణములు పెట్టి తాము స్వయముగఁ గుట్టి సిద్ధముచేసిన పట్టువస్త్రులు మొదలగువాని నమ్మవలయును. అమ్మకయున్న వర్తకుల భార్యల వద్దనుండి కొననైనఁ గొనవలయును. చక్రవర్తి యంతఃపురస్త్రీలు దుకాణములు పెట్టి యమ్మునటచే విలువలేనిసరకులసయితము మితిమీఱిన వెల వచ్చుచుండెను. ఆసంతకు స్త్రీలేగాని పురుషులు రాఁగూడదు. చక్రవర్తి యప్పుడప్పుడు స్త్రీవలె మాఱువేసము వేసికొని యాసంతయొక్కవైభవమును జూచుచుండును. ఆసంగతులు వెల్లడియైనప్పుడు రాజపుత్త్రులు కోపించి చక్రవర్తి దురుద్దేశముతోడనే యాపని చేసెనని నమ్మిరికాని యక్బరు వివిధదేశములనుండి వచ్చిన వింతవింతసరకుల వెలలు నాణెములు స్వయముగఁ దెలిసికొనుటకు వాణిజ్యము నభివృద్ధిచేయుటకు నట్లు చేసెనేకాని చెడ్డతలంపున నాతావునకుఁ బోవలేదని మహమ్మదీయచరిత్రకారులు వ్రాసిరి. ఎట్లయినను రాజపుత్త్రుల కీవిషయమున గట్టియనుమాన ముండుటచేత వెనుక నక్బరునకు లోఁబడి రంతంబరుకోట నప్పగించిన బూందీసంస్థానప్రభువు తన యాఁడువాండ్రను సంతకు రమ్మని బలవంతపెట్టఁగూడదని యొడంబడికలో స్పష్టముగ వ్రాయించెను.

ఈవింతసంతలో నొకమాఱు అక్బరు తన వియ్యపురా లగు రాయసింగుభార్యను జూచెను. ఆచూపు మిక్కిలి యనర్థకమును దెచ్చెను. ఆరాజు దృష్టితగిలిన కొలఁదికాలముననే రాయసింగుభార్య యమూల్యము లగుమణులను వెలలేని బంగారునగలను చక్రవర్తి వద్దనుండి తెచ్చుకొని కలుసుచుండె. మహాకవియగు పృథివిరాజు తన యన్నకుజరిగిన యీదారుణపరాభవము వర్ణించుచు కొన్నిపద్యములు వ్రాసి వాని యనసకు చాల దుఃఖించెను. ఇది యెఱింగియు బృథివి రాజుభార్య సంతజరిగినపుడెల్ల నంతఃపురమునకుఁబోక తప్పదయ్యెను. అట్లు పోవునపు డొకసారి యామె చక్రవర్తిదృష్టిపథమునం బడి యెను. పడినతోడనే యతఁ డామె జగన్మోహనాకారమును జూచి మోహపరవశుఁ డయ్యెను

ఆమె సంతలో తనకుఁ గావలసిన సరకులనెల్లఁ గొని చీఁకటి పడినవెనుకఁ దనమందిరమున కరుఁగదలఁచి నిర్జనములగు గదులు దాఁటి పలుచిక్కుదారులం బడి చనుచుండ గొంతద వ్వరుగునప్పటికి యెట్టయెదుట నొకమనుష్యుఁడు దారికడ్డముగ నిలిచెను. ఆమనుష్యుని చూడఁగనే యతఁ డెవ్వఁడో, యేలవచ్చెనో యామె తత్క్షణమె గ్రహించెను. చక్రవర్తి మానభంగము చేయఁదలఁచి యెదుట నిలిచినపుడు రాత్రి చేతనాయుధమైన లేక నొంటికత్తెయగు నాపడి యేమిచేయఁ గలదు ? బప్పరావులవంశపు మొలకయగు నీమానవతి తన తోడికో డలువంటిది కాదుగనుక వెంటనే ధైర్యముఁ దెచ్చుకొని యసహాయు రాలగు తనకుఁ దోడుపడి మరణముకంటె దారుణమగు నీపరాభవ మును దప్పించు మని తన యిష్టదేవతను వేఁడుకొనెను. ఆదేవియు భక్తు రాలిమొఱ నాలకించి పులివాహనమెక్కి వచ్చి ప్రత్యక్షమై యొకఖడ్గ మును రాజపుత్రికకిచ్చి యంతర్హిత మయ్యెనఁట. ఆకత్తి చేఁబూని యావీరపత్ని డేఁగపగిది చివాలున చక్రవర్తిపై దుమికి యతఁడు మరల నామెను గొట్టఁ బ్రయత్నింపకమునుపే ఖడ్గము వాని కంఠ

ముపై మోపి మరల దయఁదలచి యతనితో నిట్లనియె. ‘‘నీవు బ్రతుకఁదలఁతువేని యిఁకముం దెన్నఁడు రాజపుత్రస్త్రీకి మానభంగము చేయనని ప్రమాణము సేయుము.’’ ఆపలుకులు విని యక్బరు చక్రవర్తి యట్లే ప్రమాణముచేసి గండము తప్పించుకొని చల్లఁగ నావలకుఁబోయెను. రాజపుత్రికయు మానరక్షణముఁ జేసికొనఁగలిగెనని సంతసించి గృహమునకుఁ బోయెను.

అనంతర మొకనాఁడు చక్రవర్తి పృథివిరాజును పిలువనంపి యొకయుత్తరమును జేతికిచ్చి చదువు మనియె. ఆయుత్తరము ప్రతాపమహారాజు తనపై ననుగ్రహము చూపవలసిన దని చక్రవర్తిని వేడుకొనుచు వ్రాసెను. పృథివిరాజు కాలవశమున ఢిల్లీచక్రవర్తికి లోఁబడవలసివచ్చినను వానిమనసునఁ బ్రతాపునిపై నతిగౌరవ ముండెను. చక్రవర్తి కొలువులోనున్న మహాకవులు మహాశూరులు సైతము సంపదలను సౌఖ్యములను రోసి యాకులలముల దినుచు వనముల వసియించుచు వీరధర్మము నడపుచు నామహాశూరునియందే గౌరవము గలిగియుండిరి. చక్రవర్తులిచ్చు నైశ్వర్యము మాన్యములు మన్ననలు నశించునుగాని కీర్తి నశించదుగదా. రాజపుత్రరక్తముగల పృథివిరాజు దృష్టికి, తురక చక్రవర్తి కెప్పఁడు తలవంచి సలాముచేయని ప్రతాపుఁడు దేవుఁడువలెఁ గనఁబడుటఁ జేసి ప్రతాపుఁడు లోఁబడెనా ప్రపంచమంతయు గావలసినదే యని యతఁడు నమ్మచు వచ్చెను. పృథివిరాజాయుత్తరముఁ జదివి క్రిందఁబెట్టుచుండ ‘‘నీయభిప్రాయమేమి? అతఁడు లోఁబడునా’’ యని చక్రవర్తి యడిగెను. పృథివిరాజు కోపవిషాదములు మొగమునఁ దేటపడ ‘‘అతనిని నే నెఱుంగుదును. అతఁడు దీనిని వ్రాసినట్లు నమ్మను. శత్రువు లెవ్వరో వాని పేరు పెట్టి యిట్లువ్రాసియుందురు. ఈరాజ్యమంతయు ధారవోసిన నతఁడు లోఁబడువాఁడు కాఁడు. అయిన నతఁడు లోఁబడఁదలఁచుకొనునేమో వానికి వ్రాసి కనుఁగొనియెద.’’ నని ప్రత్యుత్తర మిచ్చెను.

నిజస్థితి యేమన నొకనాఁడు ప్రతాపుఁడు మహాకష్టములలో నుండి నిరుత్సాహుఁడై యాజాబుచక్రవర్తికి వ్రాసెను. ఆయేటి కాయేఁడు గడచుచున్న దన్నమాటయేగాని యతనికష్టము మాత్రము గడువక యంతకంత కెక్కువ కాసాగెను. అతని నమ్ముకొనిన యను చరులు కష్టములచేతనో గాయములచేతనో క్రమ క్రమముగ సంత రించిరి శత్రువులుమాత్రము వినుగులేక వారిని బాధించుచునే యుండిరి. వేటకాండ్రపగిది పగవాండ్రు వెనువెంట నంటితరుము చుండుటంజేసి యొకనాఁడు వారైదుసారు లన్నము వండుకొనియైదు సారులు దినుటకు వీలు లేక విడిచి ప్రాణభీతిం బఱచిరి. ఒకసారి ప్రతాపుం డడవిలో నొకచెట్టుక్రిందఁగూరుచుండి చిన్నకూఁతు రేడుపు వానికివినఁబడె. తల్లియాపిల్లకుఁ దినుమని యొకరొట్టె యిచ్చెను. ఆబిడ్డ సగముదిని యాఁకలి పూర్ణముగ దీరకున్నను రాత్రికుండదను భయమునతక్కినసగమును దాఁచుకొనెను. అంతట నొక మానుపిల్లి చెట్టుమీఁదనుండి దిగివచ్చి యాసగమురొట్టె నెత్తుకొనిపోవ బాలిక వెక్కివెక్కి యేడ్చెను. అదివఱకెన్నికష్టములకైనఁగరుగని ప్రతాపుని మన సాచిన్నబిడ్డయేడ్పులతోఁ గరఁగినీరై పోయెను. "నామట్టుకు నేను సకలసౌఖ్యములను రాజ్యవైభవమును విడిచి యీయడవుఁ బడి నట్లే యెంతకాలమైనను గష్టములఁ బడఁగలను; కాని దారపుత్రా దులను నానిమిత్తము సుఖములను జుట్టములను బాసి వచ్చినమిత్రు లను బాధపెట్టి చంపుటన్యాయము కాదు. వారందఱింతవఱకుఁ నభి మానము నిమిత్తము పడవలసినన్నికష్టములను బడినవారు. పరువుగల వీరులంద రింతకుమున్నె చక్రవర్తికిలోఁబడియుండ నే నిప్పుడు లోఁబ డుట తప్పుగా"దని తనలో తానువిచారించి ప్రతాపుఁడు తాను లోఁబడుదు నని చక్రవర్తి కాయుత్తరమును వ్రాసి పంపెను.

ఎట్టకేలకు ఢిల్లీనుండి యుత్తరము పట్టుకొని యొకదూత వచ్చెను. కాని ప్రతాపుఁడు సకుటుంబుగ ఢిల్లీకివచ్చి చక్రవర్తి

సింహాసనమున కెదుట మ్రొక్కవలయు నని యాయుత్తరమందు లేదు. ఆజాబు పృథివిరాజే వ్రాసెను. అతఁడు మంచికవి యగుటచే దనవిచారము విస్మయము రసవంతము లగుపద్యములుగ వ్రాసి యీలేఖలోఁ బంపెను. అందుల సంగతు లిట్లున్నవి. "హిందువుల కష్టసుఖములకు హిందువులే తోడుపడవలయును. అయినను రాణా యిప్పుడు వారిని విడుచుచున్నాఁడు. ప్రతాపుడు లోఁబడనేని యక్బరు రాజపుత్రులనందఱ హీనముగఁజూచు. ఈవఱకే మనలోఁ మగవారు శౌర్యధనమును ఆడువారు మానధనమును గోల్పోయిరి. అక్బరు మనజాతివారిని వెలకుఁగొను వర్తకుఁడై యుదయపురాధీశునిఁ దక్కఁ దక్కినవారిని క్రయమునకుం దీసికొనియె. నిజమయిన రాజపుత్రుఁడు గౌరవము నమ్ముకొనునా? అయిన నెందఱీవఱకు విక్రయించిరో మీరెఱుంగుదురు. ఉదయపురముఁ గూడ నిపుడీబజారునకు వచ్చునా? ప్రతాపుడు తన సర్వధనముఁ గోల్పోయినను మానధనమునుమాత్రము నిలుపుకొనియె నని మేము తలంచుచున్నాము. ఆశ లడఁగంటుటచేత రాజపుత్రులీవిధమున నొకనికిఁ జేమొగ్గిరి. అట్టియవమానముపాలఁ బడకుండ హమీరుని వంశస్థుఁ డొక్కఁడే యిప్పటికి మానము దక్కించుకొని యున్నాడు. ప్రతాపున కెక్కడనుండి సహాయము వచ్చుచున్నదని లోకులందఱు విస్మయమందుచున్నారు. వానియభిమానము వానిఖడ్గము వానికి సహాయము లగుచున్నవి. వానిధైర్యముఁ జూచుకొనియే యతఁ డింతకాలము రాజపుత్రులపేరు నిలువఁబెట్టె. వీరపురుషులను క్రయమునకుఁ గొను నీవర్తకుఁ డెప్పటికైనఁ గడతేరకపోఁడు. మనుష్యుఁ డెల్లకాలము జీవించునా? అప్పుడు మనరాజపుత్రులందఱు నిస్సారము లగుతమ హృదయక్షేత్రముల మీఁద దేశాభిమానబీజములనుజల్లుమని యుదయపురాధీశ్వరునివద్దకు వత్తురు. ఆయభిమానము నిలుపవలసినదనియు మునుపటికన్న మెఱయునట్లుఁ జేయుమనియు రాజపుత్రులందఱు వేడుచున్నారు."

ఈయుత్తరముఁ జదువుకొన్న పిదపఁ బ్రతాపుఁడు చక్రవర్తితో సంధిచేసికొను తలంపు మానుకొనెను. తనస్వజన మంతయుఁ దన మీఁదనే యాసలు పెట్టుకొని యున్నవారు గావున వారియాస లను గంటఁ జేయఁగూడదని యేమైనఁగాని నేను లోఁబడనని యతఁడు నిశ్చయించుకొనెను. ప్రస్తుతస్థితినిబట్టి చిత్తూరు మరలఁ బట్టుకొను టకు వీలులేదని గ్రహించి యతఁడు మేవారురాజ్యమును విడిచి తురకలబాధ లేని మఱియే దేశాంతరములకైనఁ బోయి తన్ను నమ్ముకొన్నబంట్లతోఁ గలసి క్రొత్తరాజ్యమును స్థాపించి యచ్చట సుఖింపఁ దలఁచుకొనియెను.

మొగలాయీలకు మూలపురుషుఁడును రాజపుత్రులకు మహా శత్రువు నగు బేబరు తన పిత్రార్జిత మగుసమర్కందు విడిచి కాబూలు రాజ్యము స్థాపించి యటనుండి మరల పగతురచేఁ దరుమఁబడి ఢిల్లీ రాజధానిం జేసికొని తనవంటివారికి మార్గదర్శి యయ్యెనని జ్ఞప్తికిఁ దెచ్చుకొని ప్రతాపుఁడు తనతలంపు నెరవేర్పఁ దలఁచెను. రాణా సింధునదీపరిసరభూములకుఁ బోయి కాఁపురముండుననియు వానితో నెవ్వరెవ్వరు పోయి వాని సుఖదుఃఖముల ననుభవింపఁ దలఁచిరో వా రందఱు బయలుదేఱవలయుననియు మేవారెల్ల మాఱ్ఱోఁగఁజొచ్చెను. అప్పు డనేకులు రాణా ననుసరింపఁ దలఁచిరి. వారినందఱిం దీసికొని ప్రతాపసింగు కొండలు దిగి యడవులు దాఁటి సింధుదేశపు టెడారి మొగకు వచ్చెను. అక్కడ విడిసియుండ 'భామసా' యను నతనివద్ద నుండి యొకరాయబారి రాణాకడకు వచ్చెను. భామసాయు వాని పూర్వులు పలుతరములవారు మేవారురాజులవద్ద మంత్రులై యుండి యింతింత యనరానిధనమును గణించిరి. అప్పుడు భామసావద్ద నిరు వదియైదువేల సైనికులకు పండ్రెండు సంవత్సరములవఱకు నెంతధనము కావలయునో యంతధన మింట మూలుగుచుండెను. ఆవచ్చిన రాయ బారి ప్రతాపుని దర్శనము చేసి భామసా కావలసినధన మంతయు

నీయఁదలఁచుకొన్నాఁడనియు పాఱిపోవక మీవారు దేశముయొక్క ప్రతిష్ఠను నిలువఁబెట్టుటకు మఱియొకమాఱు యుద్ధప్రయత్నముఁ జేయఁదగు ననియుఁ బ్రార్థించెను.

ప్రతాపుఁడు దేశమును విడిచిపోయెనని విని చక్రవర్తిసైనికులు సంతసించి యతఁడు సింధుదేశపు ఎడారిలో నెక్కడనో త్రాఁగ నీరులేక పడఁగొట్టి చచ్చియుండు నని నమ్మి కోటలలోను పట్టణములలోను మిక్కిలి యశ్రద్ధగా నుండిరి. అటులుండ నాకస్మికముగఁ బ్రతాపుఁడు వచ్చి పడెపడె నని యడవులఁ గొండల గొప్పవాఁడుక పుట్టెను. పుట్టినతోడనే ప్రతాపుని సైన్యము నడచినదారి యంతయు పీనుఁగుపెంటలై యతఁడు వచ్చిన యానవాలుఁ జూపెను.

మీవారుదేశమునఁ జక్రవర్తికి స్వాధీన మయినభాగమంతయుఁ బ్రతాపుఁడు నాశనము చేసెను. ఇది ప్రారంభించిన సంవత్సరములోపుననే యజమీరు చిత్తూరును దక్క తక్కిన మీవారుదేశము రాణాస్వాధీన మయ్యెను. ఇట్లయినపిదపఁ గొంతశాంతి నొంది ప్రతాపుఁడు తన ప్రాఁతపగతుఁడగు మానసింగుమీఁదఁగల యక్కసుఁ దీర్చుకొనఁదలఁచి యాతని రాజ్యమందలి ముఖ్యవర్తకస్థానముం గొల్లగొని యపారమగు ద్రోపుడుధనమును మీవారునకుఁ దరలించుకొని పోయెను.

పరాభవము నొందిన మానసింగునకుఁ దప్పఁ దక్కినరాజపుత్రుల కందఱకు రాణామీఁద మహాభిమాన ముండుటచే నక్బరు నాతని నేమియుం జేయఁజాలఁ డయ్యె. దానికిం దోడుగాఁ గొన్నిజిల్లాలు చక్రవర్తి యధికారమును నిరసించెను. అదిగాక యక్బరునకు వార్ధకావస్థ వచ్చెను. ఆసమయంబున గృహకలహములు గూడ నెక్కువయ్యెను. అతని కొడుకులలో నిద్దఱు తెగత్రాగి యొడలు తెలియక చచ్చిరి. జ్యేష్ఠకుమారుఁ డగు సలీము (జహంగీరు) తండ్రిని ధిక్కరించి గృహము విడిచిపోవుటయేగాక తండ్రికిఁ బ్రాణ

మిత్రుఁడు, మహాపండితుఁడు, సజ్జనుఁడు నగు నబులుఫేజలనువానిని నిష్కారణముగఁ జంపించెను. ఈగృహచ్ఛిద్రములచే మనోవైకల్య మునంది యక్బరు రాజస్థాన వ్యవహారములను మునుపటియట్ల శ్రద్ధగా జూచుట మానెను.

అయిన నక్బరుచక్రవర్తియె ప్రతాపునికన్న నెక్కుడుకాలము బ్రతికెను. ప్రతాపుఁడు బహుకష్టములఁ బడిచీమునెత్తురు శత్రువులకు ధారవోయుటచే నకాలమునందె ముసలివాఁడై త్వరగ మృతినొందెను. ఎంత శ్రమపడినను ప్రతాపుఁడు చిత్తూరును బట్టుకొనఁ జాలఁడయ్యెను. తనకొడుకగు నమరసింహుఁ డయోగ్యుఁడగుటచే ముందు ముం దానగరును బట్టుకొను నాశయు విడచెను. చిత్తూరు పట్టుకొనక తనరాజధానిం బ్రవేశింపఁగూడదని యతఁడు ప్రతిన జేసినందున నుదయపురసరోవరము చెంతఁ దా నిర్మించుకొన్న గుడిసెలోనే యామరణాంతము వసించెను.

అడవులలో గాయలు పండ్లు తిని పగతురతో యుద్ధములు చేసినంతకాలము ప్రతాపుఁ డేయాయాసము నెఱుఁగఁడుగాని కష్టములు గడపి యిల్లుచేరినపిదప వాని దేహము క్రమక్రమమున దుర్బలమై రోగభూయిష్ట మయ్యెను. వ్యాధి యంతకంత కెక్కువ కాఁగా రాణాకు మరణసమయ మాసన్న మయినదని బంధుమిత్రు లందఱు చుట్టుం జేరిరి. అతఁడు మరణవేదనఁ బడుచు నోటిలో నేదియో గొణుగుకొనుచుండ నది చందావతువంశస్థుఁడు విని దగ్గఱకుఁ బోయి "నీప్రాణము సుఖముగా పోకపోవుటకు నీ కున్నవిచార మేమి" యని యడిగెను. ప్రతాపుఁ డానీరసములోనే కొంచెమోపికఁ దెచ్చుకొని మెల్లన నిట్లనియె. "నాయనా! మీరు కంఠములో ప్రాణము లుండగా మనరాజ్యమును తురకవానికి లోఁబఱచ మని నాచేతిలో చేయి వేసి ప్రమాణము చేయువఱకును నాప్రాణము పోదు. ఆమాట శ్రవణానందముగా విని పోవలెనని యున్నది.'' అని చెప్పి తనకొడుకును

గూర్చి వెండియు నిట్లనియె. "ఉమ్రా నావలె నీచిన్నగుడిసెలోఁ గాపురము సేయనొల్లఁడు. ఈపర్ణశాలలు పీకి యిచ్చోట వాఁడు పెద్ద పెద్దభవనములు కట్టును. అటుపిమ్మట నతిసుకుమారుఁడై కూర్చున్న చోటనుండి లేవలేకపోవును. మననెత్తురు ధారవోసి మనము సంపాదించిన యీ మేవారుదేశమును వాఁడు సుఖముమరఁగి నిష్కారణముగ గోల్పోవును."

మరణమునకు సిద్ధముగ నున్న యామహారాజుమాటలు విని రాజబంధువులై కర్తవ్యముగ నిట్లనిరి. "చిత్తూరు మరలఁ బట్టుకొనువఱకు, మేవారునకు సంపూర్ణస్వాతంత్ర్యమువచ్చువఱకుయీఁగుడిసె గుడిసెపాళముననే యుండనుగాని యచట మేడలు గిడలు కట్టము. మేము మీగద్దెయానగాఁ బ్రమాణముఁ జేయుదుము. ఉమ్రాకూడ మీయానఁ దప్పకుండునటుల నడిపించెదము."

ఈమాటలు వెడలినతోడనే రాణా వెనుకకుపడిపోయి ప్రాణములు విడిచెను. ప్రతాపసింగు రమారమి యిరువదియాఱు సంవత్సరములు మేవారురాణా యయి యుండెను. కాని యాకాలమున స్వల్పభాగమే రాజ్యపాలన మందును విశేషభాగము కష్టములఁ బడి యుద్ధములు చేయుటయందును జరుపఁబడెను.

షోడశరాజకుమార చరిత్ర.

:(o):

తనకుమారుని విషయమై రాణాప్రతాపుఁ డనుకొన్నదంతయు నిశ్చయమయ్యెను. ప్రతాపునిశరీరము దహనమయినతోడనే వాని పుత్రులు మంత్రులు సామంతులు వానిచెప్పినమాటలు మరచిరి. పెద్దకొడుకగు నుమ్రా సింహాసన మెక్కెను. కాని యతఁడు బాల్యము

నుండియుఁ గసుపునిండఁ గూడు, కంటినిండ నిదురయు లేక కష్టపడుచు నడవులఁ జరియించుటచే రాజ్యప్రాప్తి యయిన పిదప నింటిపట్టుననుండి సుఖపడదలఁచి భోగపరాయణుఁడై వీరకర్మముల మరచెను. అది యునుగాక నిరంతరము రణకేళిఁ బురికొల్పు తండ్రి లేకపోవుటచేఁ జక్రవర్తియగు నంతవానితోఁ దనవంటియల్పుఁడు వైరముఁ గొనుట యనుచిత మని యుమ్రాకయ్యమును మానుకొనెను.

ప్రతాపుని మరణానంతరముఁ ఉమ్రా మున్ను తండ్రినిర్మించుకొన్న కుటీరము తీసివైచి స్ఫటికపురాళ్ళతో నొకదివ్యమందిరము గట్టించి యందు హంసతూలికాతల్పంబులం బొరలుచు వేశ్యాంగనల యాటపాటలం జొక్కుచు నిలువుటద్దంబులలోఁ దనముద్దియల చెలువంబులు గనుంగొని మురియుచు విషయాసక్తుఁడయి లోకంబు మరచి కొంతకాలంబు పుచ్చె. అటులుండ నట ఢిల్లీపురమున 1605 వ సంవత్సరమున నక్బరుచక్రవర్తి మృతినొందెను. అనంతరము వాని కొడుకులలో హతశేషుఁ డగు సలీము జహంగీరను బిరుదముతో సింహాసన మెక్కెను. జహంగీరన జగమంతయుఁ గెల్చినవాఁడని యర్థము. అతఁ డక్బరునకు రాజపుత్రస్త్రీవలన కలిగినకొడుకగుటచే హిందువుల యెడఁ గొంతయభిమానము గలదు; కానియతఁడు పట్టిత్రాగుబోతు. హిందువులమీఁద నెంతయభిమానమున్నను తనయధికారము నిరాకరించు రాజపుత్రుల బంటుతనము సహింపనివాఁడగుటచే జహంగీరు తండ్రిపోయిన కొన్నినాళ్ళకే యొకసేనఁగూర్చి యుమ్రామీఁదికిఁ బంపెను.

మొగలాయిసేనలను జూచినతోడనే రాజపుత్రులకుఁ గోపాగ్ని మరలఁ గొంచెము ప్రజ్వరిల్లెను. ఆమహావీరులందఱు క్రొత్తగానభ్యాసము చేసికొన్న భోగములను విడిచిపెట్టి వీరరసశోభితులయి పగతుర జంపుటయో తాము దెగటారుటయో కావలయునని నిశ్చయించుకొని గుఱ్ఱములనెక్కి మహారాణా యగు నుమ్రాకడకుఁ జని తమకు సేనాధ

పత్యముఁ జేయుమని వాని నడిగిరి. ఆశూరులు వచ్చునప్పటి కుమార్ర మేనొత్తని మెత్తనిపాన్పులఁ బవ్వళించి వారివిన్నపములఁ జిత్తగించి వారి కిట్లనియె. "నేను నూఁగుమీసముల వయసునాఁడే మహాయుద్ధములఁ జేసి విసిగియుంటి చక్రవర్తితోఁ బోరుట మన నాశముకొఱకుట. కావున యిపుడయిన బుద్ధిగలిగి వైరము మానుకొనుట యుచితము."

అప్పలుకులు చెవులఁబడుటయు రాజపుత్రవీరులు తెల్లపోయి యొండొరుల మొగంబులు చూచుకొని లోలోపల గొణుగుకొను చుండ, నపుడు చందావతువంశజుఁడగు శలుంబ్రా కర్తవ్యము యోచించి యూరకొనినఁ గార్యము చెడునని యొకసాహసము చేసెను. రాణాయున్న మేడమీఁద విలువగల రత్నకంబళములు పరువఁబడి యుండెను. ఆకంబళముపై పరీక్షచేసి యాబట్టలు కదలకుండ కొనల నిత్తడిగుండ్లొత్తిపెట్టి యుంచిరి. శలుంబ్రా యాయిత్తడిగుండ్లలో నొకటి తీసికొని రాణా కెదురుగానున్న పెద్దనిలువుటద్దమువయి విసరెను. తోడనే యాదర్పణము వేయితునుకలయి పడియె. పిమ్మట శలుంబ్రా సాటిరాజపుత్రులఁజూచి వీరులారా! గుఱ్ఱము లెక్కుఁడెక్కుఁడని పురికొల్పి రాణాచేయిపట్టుకొని పాన్పునుండి బలవంతముగ లేవఁదీసి యతని యిష్టములేకయే "గుఱ్ఱమెక్కు మెక్కుమని" బరబర లాగికొని పోవఁజొచ్చెను. శలుంబ్రాయొక్క మొండితనమునకు మహారాణా కడు కినుకఁబూని 'వీఁడు రాజద్రోహి రాజద్రోహి' యని యరచుచు వానిచేతినుండి వదలించుకొనుటకు గిజగిజ తన్నుకొనఁజొచ్చెను. కాని సాటిసామంతు లందఱు శలుంబ్రాపక్షము బూనుటచే వానిరోదన మరణ్యరోదనము కాఁగా నతఁడు కోపము పట్టజాలక రోషమున వావిడిచి యేడ్వసాగెను. అతం డేమిచేసినను లెక్కసేయక శలుంబ్రా రాణాను గుఱ్ఱముమీఁదఁ గూలవేసి నడిపించుకొని పోవఁజొచ్చె

అట్లు కొంతదూరము చనినపిదప నుమార్ర కోప మణచుకొని

యేడుపుమాని యందఱిమొదలఁ బ్రసన్నుఁడయి వారివందనము లందుకొని శలుంబ్రాను బిలిచి "నీవు మంచిపని చేసితివి. నీమోటతనము చేతనే నాకిప్పుడు బుద్ధివచ్చినది. లేనిచో నవప్రతిష్ఠ పాలయిపోవుదును గదా ? ఇదె చూడు నాదెబ్బ మీపూర్వపురాణా చేసినంతపని చేసెన" నని వీరాలాపము లాడుచు సంగరమునకు సైనికులఁ దోడ్కొనిపోయె.

అవ్విధంబున నమ్రాపౌరుషోక్తులు పల్కుటచేత రాజపుత్ర సైనికుల కుత్సాహము పొంగిపొరలెను. ఆయుత్సాహముతో రణమునకుఁ జని వారు తురకసేనల నవలీలగా నోడించిరి. ఓడిపోవుటచే మఱింతపౌరుషము తెచ్చుకొని యెట్లయిన రాజపుత్రుల నోడింపవలెనని చక్రవర్తి యమ్రామీఁదికి రెండేండ్ల తరువాత మఱియొక సేన నంపెను. ఈసేనయు వెనుకటిసేనగతినే పొందవలసి వచ్చెను. అందుచే జహంగీరు రోసముఁజెంది మోసముచేత రాజపుత్రుల జయింపవలెనని యెంచి చిత్తూరుపురమన్న రాజపుత్రులకు మిక్కిలి ప్రేమయనియు దానినిమిత్త మెందఱెందఱో ప్రాణములను విడిచిరనియు నెఱిఁగినవాఁడు దానికి వానిని రాణానుజేసి యేలుకొమ్మనియె. ఈసూగ్రుఁడు ప్రతాపుని తమ్ముఁడు. ఈతఁ డన్నతోఁ గలహించి దేశద్రోహియయి ఢిల్లీచక్రవర్తిని గొలువఁబోయిన నాఁటనుండి యునచ్చటనే యుండెను.

సూగ్రాపాడుపడిన చిత్తూరులో రాజ్యనుచేయుట వల్ల కాటిలో రాజ్యము చేయుటగా భావించెను. పాడుపడిన దేవాలయములలోను, దిబ్బలయిన మేడలలోను వానికంటికి దయ్యములు భూతములు దేవతలు నప్పుడప్పుడు కనఁబడుచున్నట్లు దోఁచెను. తురక బంట్లు సాయముతోఁ దనపూర్వుల పట్టణము నేలుటకు వచ్చిన యావీరునకు వీరరసము జారి వెనుకటిసంగతులు జ్ఞప్తికివచ్చి భయము క్రమ్మజొచ్చెను ఎంతకాలమతఁ డక్కడ వేచియున్నను తనవెంటవచ్చిన తురకబంట్లుఁ దానును దప్ప దేశస్థులు బంధువులు నెవ్వరు నచ్చటికి రారయిరి.

అట్లుండఁగా నొకనాఁడు పురదేవత వానికిఁ గనఁబడి వాని నచ్చోటు విడిచిపొమ్మని యాజ్ఞాపించెను. అందుచే నతఁడు కడు వెఱచియచ్చట నుండఁజాలక నగరమును స్వాధీనము చేసికొనవలసినదని యుత్రమాకు వర్తమానమంపి వాని భటులకుఁ గోట నప్పగించి యాతఁడు ఢిల్లీకిఁ బోయెను. చక్రవర్తి వానిపై నలిగి యేల వచ్చితివని యడుగ నతఁడామాటకుత్తరముచెప్పక యొరలోనుండి కత్తి యూడఁబెరికిపొడుచుకొని చచ్చెను. చేసిన రాజద్రోహమునకు నాత్మహత్యకు వానిని హిందువులు తురకలు నేకగ్రీవముగ నిందించిరి.

చిత్తూరు దొరకుటచే రాజపుత్రుల కుత్సాహము మఱింత హెచ్చెను. పాడుపడి యుండుటచేఁ జిత్తూరు రాజపుత్రుల కంత ప్రయోజనకారి కానందున నుమ్రా వెంటనే దానిని మెప్పటియట్లడవి మృగములకు విడిచిపెట్టి యప్పటికిని మొగలాయీల స్వాధీనములో నుండి ప్రధానములగు దుర్గములఁ గొన్నిటిని బట్టుకొనఁదలంచెను.

అట్లు యుద్ధసన్నాహము సేయుచుండ వానికి బహునాళ్లుకు రాజకుమారులు వచ్చి తోడ్పడిరి. ఆకుమారుల చరిత్ర యీక్రింద సంగ్రహముగా వ్రాయుచున్నాము. కఱదుగదా ప్రతాపసింగునకు సూక్తుఁడను సోదరుఁడొకఁడు. అతఁడును దేశద్రోహియై తురకలలోఁ గలిసి యన్నతో యుద్ధము చేసి హల్దిఘాటు యుద్ధములోఁ బ్రతాపుఁడు పారిపోవుచుండ వానిఁ దరుముకొనిపోయి మెట్టకేలకు సోదరుని ప్రాణములు కాపాడెను. అతఁడు తనకడపటిదినముల చక్రవర్తిని విడిచి భీసురాకోటలో గడపెను. చనిపోవునప్పటి కతనికిఁ బదునేడుగురు కుమారు లుండిరి. అతఁడు మృతినొందినతోడనె పెద్దకొడుకు భాంజీ యనువతఁడు తమ్ములను వంచింపఁ దలఁచి వారిం జూచి „నేను కోటఁ గాచుచు నిక్కడ నుండెదను. మీరుపోయి నాయనగారి కుత్తరక్రియలు సేయుఁ" డని చెప్పెను. అన్నమాటలు నమ్మి వారందఱు నరలుగ జని తండ్రి కగ్నిసంస్కారము నుత్తర

క్రియలును చేసి మైల వెళ్ళినవెనుక మరలఁ గోటకరుగ భాంజీవారిని లోపలికి రానీయక కోటతలుపులు వేయించి యందఱను బోషించుటకుఁ దనకు శక్తి చాలదుగావున వేరొకతావునకుంబోయి యెవరి పొట్టవారు పోసికొండని యానతిచ్చెను.

షోడశరాజకుమారులు సోదరునాజ్ఞ శిరసావహించి తమ యాయుధములను తమగుఱ్ఱములం దమ కిచ్చినచోఁ దొలఁగిపోదుమని చెప్పిరి. భాంజీ సరే యని వాని నీయ వారందఱు విదేశములకు బయలుదేరి తమలో నొకఁడగు యచలుని సేనాపతిగఁ జేసికొని మహాబలశాలియగు బలుఁడను వానిని రెండవసేనాపతిగఁ నియమించుకొని చనిరి.

ఆసోదరు లట్లుబయలుదేరి మీవారునకు దక్షిణమున రహాతూరువంశస్థుల పాలనములో నున్న మేవాసుగ్రామమునకుఁ బోవ నమకట్టిరిగాని పయనము తునముట్టకమునుపే యచలునిభార్య ప్రసవవేదన పడ నారంభింప వారందఱు మసుగుతావు వెదుకనారంభించిరి. అత్తరి వర్షము విరామములేక దిమ్మరించెను. ఎంత వెదకినను వారికి గోష్పదమంత చోటయిన నాయాపత్సమయమునందు దొరకకపోవుటచే నెట్టకేలకు వారొక పాడుదేవాలయమును గనిపెట్టి కొంచెము బాగుచేసి యామెను దానియందుఁ బ్రవేశపెట్టిరి.

ఆజడివానకు నానినాని యాగుడి రాతిమూల మొకటి జారి యామెపైఁ బడుటకు సిద్ధముగనుండ దైవవశమున బలుఁడు దానినిఁ జూచి వెంటనే యుత్తావున కరిగి తనతల బోటుపెట్టి రాయి పడకుండఁ జేసెను. ఇంతలో నచలుఁడు మొదలగుసోదరు లాస్థితిఁ జూచి చేరువ చెట్టు నరికి దాని దెబ్బ బోటుపెట్టి భీమబలుం డగుబలు నీవలకు లాగిరి.

ఆరాత్రి యచలునిభార్య యాపాడుగుడిలో నొకకుమారుని గనియెను. ఏదో భాగ్యముగల్గునని పుట్టుశాశతో వారు పొవ్వము

డుటచే నపుడు గల్గిన యాబిడ్డకు వారాశుఁ డని పేరుపెట్టిరి. అనంతర మాసోదరులు యీడూరుగ్రామమునకుం జన నాపురాధీశుఁడు వారి నాదరించి తగినబసలు మాన్యములు నిచ్చెను. అక్కడ వారు సుఖముగ కాలక్షేపము సేయుచుండ నొకనాఁడు మీవారుదేశపుమంత్రి యాదారిం బోవుచు భార్యాసమేతుఁడయి యీయూరుబయిటిగుడారములో విడిసెను. అప్పుడు పెద్దగాలివాన సంభవింప దానిచే గుడారము లెగిరిపోవసాగెను. మంత్రియు భార్యయు నిలువనీడలేక యిబ్బంది పడుచుండ బలుఁడు నచలుఁడు వారిదుస్థితి విని తొల్లి తాము నట్టి దురవస్థనే బడియుంటి మనుమాట జ్ఞప్తికిఁ దెచ్చుకొని వారిం దమ యింటికిఁ బిలుచుకొనివచ్చి యుపచారముచేసి యాదరించిరి.

ఆమంత్రియు వారియాదరణంబునకు మహానందభరితుఁడయి వారినందఱఁ దనతో నుదయపురమునకు రమ్మనియు వచ్చినచో రాణా వద్దఁ దగినయుద్యోగముల నిప్పింతుననియు వారియన్న యగుభాంజీ మరియొకలా గనుకొనకుండ తాను సర్దిచెప్పుదు ననియు నొక్కి చెప్పెను. కాని యచలుఁడు వానిమాటల కీయకొనక పిలువనిపేరంటముగ పోయినచో లోకువ యగునని స్వగౌరవము కాపాడుకొనఁ దలఁచి మాజ్ఞాతి యగురాణా వర్తమాన మంపినచో వత్తుమనియు లేనిచో నచ్చటనే యుందు మనియుఁ జెప్పెను.

మీవారురాణా ఢిల్లీచక్రవర్తిపై కప్పుడు పోవ యత్నించుచుండ మంత్రి సూక్తునికొడుకులఁ గైకొని యాపదునాల్గురి నచ్చటికి రావించెను. అంతకుమున్నె సూక్తవంశమునం దగ్రగణ్యుఁ డగు భాంజీ రాణాకుఁ దోడునూపుట కచ్చటికి వచ్చియుండెను. అతఁ డందఱికన్నఁ బెద్దవాఁడైనను వానిమాట సరకుసేయక నెల్లవారును వానితమ్ములయందే యనురక్తులయిరి. మహాసాహసుఁ డగుబలుఁడు శూరులగుతనసోదరులు కడువిధేయులయి పనులు సేయుటచే రాణాకు వారియందే యనుగ్రహ ముండెను. అందు ముఖ్యముగ బలుఁడు

రాజానుగ్రహపాత్రుఁడు. రాత్రులు మంచు గురిసెనా వెంటనే బలుఁడు చెట్లు నరికి రాణాకొఱకు నెగళ్లు వేయును. సేనలు తురకలతో దలపడెనా పగతురం బాఱఁదోలుటలో మొదటివాఁడయి యాబలుఁడే యొడలెఱుంగక యుద్ధము సేయును. అట్లొడలు దాఁచుకొనక పని సేయు నా షోడశరాజకుమారులమీఁద నింతింత యనరాని యనుగ్రహము గల్గి సంతోషపరవశుఁడయి రాణా యొకనాఁడు తన సేన లిఁక ముందు యుద్ధమునకుఁ బోవునపుడెల్ల యీసూక్తవతులే సేనలను నడపవలసినదని శాసించెను. ఇది రాజపుత్రులకు రాణా చేసెడిగౌరవములలో మిక్కిలి గొప్పది. చిరకాలమునుండి యీగౌరవము చందావతువంశస్థులకుఁ జెల్లుచుండెను. వెనుక చండుఁడు చిత్తూరునుండి పగతురఁ బాఱఁదోలుటచే రాణా యావంశస్థుల కాగౌరవము జూపెను. ఉమ్రీ సూక్తవతుల కీగౌరవ మిచ్చునపుడు తనమాట చెప్పుకొనుటకు చందావతువంశజుఁ డగు సలుంబ్రా యచ్చట లేకపోయెను. తక్కినవారు రాణాకు జంకి యెదు రాడజాల రయిరి.

మఱునాఁడు తురకలతో యుద్ధము తెలియుటచే నా రాత్రి కొంచెము నిద్రబోవలయు నని సలుంబ్రా తనగుడారమున నుండెను. కాని యతనికి నిద్రపట్టకుండ వానిబిరుదుల కీర్తనము సేయు భట్టువాఁడు పలుమా రట్టిటు తిరుగుచు వానిబిరుదనామములు గట్టిగ కేకలు వేయుచుఁ జదువ నారంభించెను.

ఆకేకలు వినివిని సలుంబ్రా విసిగి “ఓరీ! యేలరా యిట్లరచెదవు. నన్ను నిద్రపోనిమ్ము. శత్రువులు దాపున లేరుగదా యిప్పుడు మనబిరుదులు చదువ నవసర మేమున్న” దని మందలించెను. ఆపలుకులు విని యాబట్టువాఁడు “స్వామీ! మీబిరుదులు నేను కైవారము సేయుట కిదియే కడపటిసారి. ఇఁకముందు ప్రాయశః మీబిరుదులుచ్చరింప నవసర ముండదు. సేనను నడపించు నధికారముతోపాటు మీబిరుదులును రేపు సూక్తవతులకే యీయఁబడు” నని యుత్తరము చెప్పెను.

అప్పలుకులు విని సలుంబ్రా దిగ్గునలేచి పరుగుపరుగున రాణా యొద్దకుఁ బోయి తరతరంబులనుండి తనకుటుంబమునకు జరుగుచున్న యాగౌరవమును తీసివేసి యింకొకరి యధీనము చేయుట తగదని గట్టిగ వాదించెను. సూక్తవతులును వెనుదీయక రాణాయొద్దకుఁ బోయి "మీరు సేనల నడుపునధికారము మాకిచ్చితి మని మీ నోటితో మీరే సెలవిచ్చి యున్నారు. చందుఁ డెన్నఁడో యేమో చేసెనని మా కిప్పు డిచ్చినవరము మరల పుచ్చుకొనుట న్యాయము కాదు. ఎవరడ్డము వచ్చినను సేన నడుపకమాన" మని ప్రతిఘటించి నిల్చిరి.

అప్పుడు పొడమినయీర్ష్యచేత సూక్తవతులు చందావతులు మహాగ్రోషపరవశు లయి యొకరినొకరు నరుకుకొనుటకుఁ గత్తుల దూసిరి. కాని యుమ్రా వారి నడ్డగించి "మీ కీపోరాట మెందుకు? మీవివాదము నేను దీర్చెదను. ఇప్పుడు మొగలాయీల యధీనములో నున్న యంతల్లాకోటలో మీయిరువురలో నెవరు ముందుగాఁ బ్రవేశింతురో వారే నాసేన నడపించు గౌరవమునకుఁ బాత్రులగుదు" రని యానతిచ్చెను.

అంతల్లాకోట యప్పటికిని మొగలాయీల యధీనములో నుం డెను. ఇది దుర్గమములయినకోటలలో నొకటి. ఇది యుదయ పురమునకు పదునెనిమిది మైళ్ళదూరమున చిత్తూరునకుఁ బోవు దారిలో నున్నది. ఆకోటయడుగున నొక చిన్ననది పారుచుండును. ఆకోటలో నొక చిన్నకోట కలదు. అందులోనే దుర్గరక్షకుఁడు వసించుచుండు. రాణా యానతిచ్చొప్పున సూక్తవతులు చందా వతులు మరునాఁ డుదయమున నంతల్లాకోటకు బయలుదేరిరి. కాని సూక్తవతులు పదునాలుగురు చందావతులు రాకమున్నె దుర్గముఁ జేరి తాము పెందలకడ వచ్చినందుకు చందావతులు రానందుకు సంతసించి గోడలెక్క బ్రయత్నించిరి; కాని పయనపుగడబిడలో

నిచ్చెనలు తెచ్చుకొనుట మఱచినందున వారు కోటగోడ లెక్కఁజాలరైరి. అందుచే సూక్తవతులు సింహద్వారము భేదించి కోటలోఁ బ్రవేశింపవలసియుండెను. ఈపనికయి అనేకాయుధములు పుచ్చుకొని వారు తలుపుగోడలఁ గొంతవఱకు శిథిలపఱచిరి. తలుపులు కొంత వఱకు వదులయినవని గ్రహించి యచలుఁడు తన మదపుటేనుఁగుచేఁ ద్రోయించి తలుపులు విడఁగొట్టవలయు నని తలంచి యేనుఁగుం బురికొల్పుమని మావటివాని కాజ్ఞాపించెను. ఇంతలో నక్కడ కోటకావలివాండ్రు వచ్చి కోటగోడలపయి నిలిచి సూక్తవతులతో ఘోర యుద్ధ మారంభించిరి. మావటీడు యజమానుని యాజ్ఞఁబూని కవాట భేదనము సేయుమని యేనుఁగుం బురికొల్పి ముందుకుఁ ద్రోసెనుగాని యది తలుపులవఱకుఁ జని యటనుండి కదలదయ్యె. మావటీని బెదరింపులు బతిమాలుటలు వాడిగలయంకుశపుపోటులు వ్యర్థములై మదగజము నొక్కగజమయిన కదపఁజాలదయ్యె. తలుపులకు ఇనుప బొంగరములట్లు మొనలుదేరిన వాడిబొగడలు వందలకొలఁది యుండెను. ఆబొగడలు గ్రుచ్చుకొనినచో దట్టమయిన తన కుంభస్థలము గూడఁ జగిలి నెత్తురు వరదలుపాఱు ననుభయమున తలుపులం ద్రోయక మదపుటేనుఁగు మొద్దువలె నిలిచెను. అటులుండ నంతలో నగరము యొక్క రెండవప్రక్క నొకకలకలము వినఁబడెను, చందావతులు వచ్చి నిచ్చెనలువేసికొని కోటగోడల కెగఁబ్రాకి తమవంశబిరుదులం జదువుకొనుచు సింహనాదములఁ జేయనారంభించిరి. ఆకలకలము సహింపక కార్యము దప్పిపోవుచున్నదని భయపడి యచలుఁడు మదగజమునుండి గుభాలున నేల కురికి విసవిసఁబోయి తనయేనుఁగునకుఁ దలుపులకు నడుమ నిలిచి మావటీని బిలిచి "యోరీ! యీసారి తలుపులు పగులఁద్రోయుట కేనుఁగు బురికొల్పుము. ఏనుఁగు కుంభస్థలమునకు నామెత్తని శరీరము తగులునుగాని మేకులు గుచ్చుకొనవు. నీవు సందేహించితివా చచ్చితివని నమ్ము" మని యాజ్ఞాపించెను.

స్వామియానతి యలంఘ్యమగుటచే మావటీఁడు విధిలేక యేనుఁగు నంకుశముతోఁ బొడిచి కవాటభేదమునకుఁ బురికొల్పెను. కొల్పుటయు నమ్మదగజంబు ఘీంకరించి యుంకించి కుంభస్థలముతో దలుపులను ద్రోయుటయు తలుపులు పెళపెళ పగిలి విడిపోయెను. శూరశిఖామణియగు నచలుఁడు ఇనుపబొగడల పోటులచేత మేనెల్ల జల్లెడవలెఁ జిల్లులువడ నెత్తురులు గ్రక్కుకొని క్షణములో శవమయి నేలం బడియె. కవాటంబులు విడిపోవుటయు మదగజంబులవెంట బలుఁడు మొదలగు సూక్తవతులు యచలుని శవమువీఁదనుండి నడిచి కోటలోఁ బ్రవేశించిరి. అట చందావతులు వచ్చినవిధము వినుఁడు. ముందుగా వారు తెల్లవారుజామున నే బయలుదేరి దైవవశమున దారితప్పి యొకపల్లెలోఁ బ్రవేశించి తెన్నుగానక సిలుగులంబడి పడి సూక్తవతులు ముందుగాఁ గోటఁ జేరిరి కాఁబోలునని వగచుచుఁ జేయునదిలేక యెట్టకేల కొకగొల్లవానిఁ గలిసికొని వానిసాయమున దారి నెఱిఁగి కోటం జేరిరి, నలువ్రబా నిచ్చెనలుకూడఁ దెప్పించి గోడలకు వేయించి తనసైనికులు తాను బురుజులపయి కెగఁ బ్రాక మొదలు పెట్టిరి. అప్పుడు గుగఁరక్షకులు తత్తరపడి కొండ త్రామూలకుం జేరుకొని చందావతుల నిచ్చెనల పడద్రోసి తుపాకులతోఁ బెక్కండ్ర గొట్టి చంపి విజృంభించిరి. అట్లు చచ్చినవారిలో మొదటివాఁడే నలుంబ్రా. చందావతుల యీదురవస్థకుఁ దోడు సూక్తవతుల జయధ్వనులు చెవులకు శూలములట్లు దాకెను.

నాఁడక్కడకు వచ్చిన చందావతులలో నొక చండశాసనుఁడుండెను. అతఁడు దేవఘురుకోటకధిపతి. వేఁటలలో నడవిమృగములను యుద్ధములలో మనుష్యులను నిర్భయముగా నతఁడు చంపినట్లు ఎవరును చంపఁజాలరఁట. ఆజగజెట్టి నలుంబ్రా మృతినొందినతోడనే నిర్విణ్ణుఁడు గాక రౌద్రమూర్తియయి యాశవమును తన శాలువలోఁ జుట్టి భుజముపైఁబెట్టుకొని గోడపయి కెక్కఁజొచ్చెను. అత్తరి

దుర్గరక్షకులు వాని గత్తులతో నరుకను, బల్లెములతో గ్రుమ్మను తుపాకులతో, గాల్పను బొల్పడిరిగాని యాజోదు చెక్కుచెదరక యుక్కుతునకలాగున బురుజుపై కెక్కెను. ఎక్కి యటనుండి గంభీర స్వరముతోఁ "రాణాసేనను నడుపుటకు చందావతులే యర్హులు. మేమే కోటముందు జొచ్చితి" మనిపలికి శవముఁ జేతపట్టుకొని విసరి కోటగోడల నడుమ పారవై చెను.

అనంతరము చందావతులు మిగులలకంఠం బోలె కోటపై కెక్కి తమ యేలిక చచ్చినం బ్రతికనవాసిని యనుసరింతు మను మాట రూఢి చేసిరి. అంతలో సూక్తవతులు కులగౌరవమునిమిత్తము తమనాయకుఁడగు యచలుని బలియిచ్చి కవాటంబు భేదించి లోనం జొచ్చిరి. కోట యెవరు ముందుజొచ్చిన నెవరు వెనుకజొచ్చిన యా మాట యటులుండనిచ్చి యారెండు తెగలవారు సామాన్యశత్రువు లగు తురకలఁ దరిమికొరిమి కొట్టిరి. అంకు చే రాజపుత్రులకుఁ గన్నుల పండువుగ మీవారురాజుల విజయధ్వజము అంతల్లాకోట బురుజుపై నిల్చెను.

కోట స్వాధీనము చేసికొని రాజపుత్రులు లోపలిమందిరం బులకుం జన వారి కొక చిత్రము కనఁబడెను. ఆమందిరమున నొక గదిలో నిద్దఱు గొప్పతురకలు నిర్విచారముగ చదరంగ మాడుచుం డిరి. ఒకవిధమయిన కలకలము వారి చెవులం బడియెనుగాని పగతురు వచ్చి యంతల్లాకోటను బట్టుకొనుట యసాధ్యమని వారు సరకు సేయరయిరి. ఆట మంచి రక్తియగు పట్టునకు వచ్చినప్పుడు రాజ పుత్రులు యమదూతల వలె యాయుధపాణులయి వచ్చి నిల్చి వారిం జంపఁబోయిరి. అప్పు డాకరకుతురక లిరువురు రాజపుత్రులం గనుం గొని "ఆగుఁడు. ఆగుఁడు. ఆట మిక్కిలి రక్తిగా నున్నది. ఈయాట ముగియువఱకు మమ్ముఁ జంపఁవల" దని బ్రతిమాలుకొనిరి. రాజ

పుత్రులు వారిపట్టుదల కాశ్చర్యముఁనొంది సరేయని యాయుధపాణు లయి యచ్చటనే నిల్చి యాట ముగిసినవెనుక తురకల నరికిరి.

కోటస్వాధీన మయినదని వారు రాణాకు వర్తమాన మంప నతఁడు తత్క్షణమె యచ్చోటికిఁ బోయెను. పోయి చూచునప్పటికిఁ గోటలోపలను వెలుపలను, గుమ్మముకడ, బురుజులమీఁదను తన నమ్మినబంట్లు పీనుంగలయి పడియుండిరి. సలుంబ్రాయొక్క శవము పగతురమధ్యమున గానఁబడియె. అచలుఁడు నలుగురుతమ్ములనడుమ వీరశయన మలంకరించె. అందులో బలుఁడు మాత్రము రాణా వచ్చునప్పటికి కొనయూపిరితో నుండియెట్టటో సలాముచేసి "దానద్వయమునష్టచతుష్టము" మ్మని పల్కి ప్రాణమువదలెను, తనకతమున నిష్కారణముగా నంతటి మహాబలిశాలి మృతినొందవలసివచ్చెనని రాణా తద్దయు విచారించెను.

ఆదినము మొదలు సూక్తవతులు యుద్ధరంగమున "దానద్వయము నష్టచతుష్టము" మ్మని కేకలు వేయుచు వచ్చిరి. బలుఁ డవసానసమయమునఁ బల్కిన యానిష్ఠురంపుఁబల్కులే యాతెగవారి కండఱకు జయనాదమయ్యెను. చందావతుఁడే ముందుగాఁ గోటఁ బ్రవేశించుటచే రాజసేన నడుపు నధికారము వానికే చెందెను

ఉమాత్రిచేసిన తెలివితక్కువవలన మహావీరులు మహాసాహసులు పలువురు నిష్కారణముగ నిధనమొందిరి. బలుఁ డన్నమాటలకర్థ మదియే. దానద్వయ మనగా నొకవిషయముననే రెండుదానములు చేయుట. నష్టచతుష్టయ మనఁగా నాలుగురెట్లు నష్టమని యర్థము. నాఁడు మొదలారెండుతెగలకు మితిమీరిన మనస్పర్థ పొడమెను. అందుచే రాజస్థానమునకుఁ దురకలవలనఁ గలిగిన యాపదకంటె వీరి మనస్పర్థలవలన నెక్కుడాపద సంభవించెను.

ఢిల్లీకిని, మీవారునకును సంధి.

—— :(o):——

ఒకసారి కార్యనిర్వాహము సేయవలెనని పూనుకొనెనా రాణా యమ్రా చేయవలసినంతపని చేసి యాతండిక్కిం దగినవాఁడుకే యని ప్రఖ్యాతిఁ బడయజాలునుగదా! అతఁడు ఢిల్లీచక్రవర్తిసైన్యములతో నొకసారిగాదు, రెండుసారులుగాదు పదునేడుసారులు పోరాడెను. పోరాడినపుడెల్లఁ దానె జయమునందుచు వచ్చెను. చక్రవర్తియగు జహాంగీరు, ఉమ్రామీఁదికిఁదనమూఁడవకొడుకగు పార్వేజును బంపెను. కాని యతఁడు ప్రతిపర్యాయము పరాజయమును నొందుటచే వానిని తిరిగి ఢిల్లీకిఁ బిలిపించెను.

ఎన్నిసారు లోడిపోయినను ఢిల్లీచక్రవర్తిసైన్యము లినుకపాతరలవలె తఱుగక మరల రాణామీఁదికి వచ్చుచుండెను. రాజపుత్రసేన లన్నో యుదయసింగు పరిపాలన మొదలు నిమిషమయినను నూపిరిపుచ్చుటకుఁ దెఱపిలేక యెల్లకాలము కలహామే కార్యముగాఁ గ్రమక్రమముగ క్షీణించుచుండెను. అందుచేత యుద్ధము సరిగా జరుగుటకు వీలు లేదయ్యె. ఏలయన నోడిపోయినసేన యోడిపోవుచుండఁగాఁ జక్రవర్తిపక్షమున వచ్చుచు క్రొత్తసేన వచ్చుచుండెను. రాజపుత్రుల పన కడముట్టెను. 1613 వ సంవత్సరమున జహాంగీరు చక్రవర్తి మహాసేనాసమేతుఁడయి మీవారుపై బోవఁదలఁచి యజమీరువద్ద విడిసి ముందుమార్గము సరిగా నుంచుటకుఁ దనరెండవ కుమారుఁ డగు షాజహానును బంపెను. అదివిని యుమ్రా మీవారునకు వినాశకాలము సమీపించిన దని నిశ్చయించుకొనెను. చక్రవర్తి నెదిరించుటకు రమ్మని రాజపుత్రులను బిలువనంప ననేకు లదివఱకే స్వదేశరక్షణమునిమిత్తము ప్రాణములు గోల్పోవుటచే హతశేషు లగువీరులు కొలఁదిమందమాత్రమే రాణాయొద్దకు వచ్చిరి.

ఈస్వల్పసైన్యముతోడనే రాణా యమరాగ్రి కొంతకాలము చక్రవర్తిసేనల నెదిరించి శౌర్యము చూపెను. కాని యెట్టకేలకుఁ దురకలబారికి నిలువలేక రాణా లోఁబడవలసి వచ్చె. ఈరాణాయెట్లు లోఁబడెనో యావృత్తాంతము జహాంగీరు స్వహస్తముతో వ్రాసిన చర్య (Diary.) నుబట్టి తెలిసికొనవచ్చును. అం దిట్లున్నది. ‹‹నేను సింహాసన మెక్కిన 9 వ సంవత్సరప్రారంభమున (అనఁగా 1614 సంవత్సరమున) నాకుమారుఁడు ‹‹జగద్గర్వ'' మనుబిరుదుగల రాణా పట్టపుటేనుఁగును భద్రజాతిగజముల మఱి పదునేడింటిని బట్టుకొని యొక మంచిదినమున నాకుం గానుకగాఁ బంపె. నేను మహానందభరితుఁడనై మఱునాఁడు జగద్గర్వము పై నెక్కి యూరేగి లెక్కలేనిసొమ్ము పంచిపెట్టితిని.''

చక్రవర్తిసైన్యములు తనదేశమును నిరంతరము నాశనము చేయుటయుఁ దనకు కుడిభుజములవలె పనిసేయు రాజపుత్రవీరులు రణభూమిం బ్రేల్చుటయు నన్నుహాపీరుల దారపుత్రాదులు తురకలచేఁ జిక్కి బంధింపఁబడుటయు, విశేషించి తనప్రాణపద మగుపట్టపుటేనుఁగు పరులపా లగుటయుఁ జూచి విహ్వలుఁడై రాణా యమరాగ్రి తొల్లింటిగర్వమెల్ల డిలుపడి వినయముతోఁ జక్రవర్తికుమారున కిట్లు రాయబార మంపెను. ‹‹మీరు నన్ను క్షమియించి చక్రవర్తి యనుగ్రహమునకుఁ బాత్రుఁడుగఁ జేయుదురేని నేను మీకు లోఁబడుదును. తక్కిన రాజకుమారులట్లే నాకుమారుఁడును జక్రవర్తిసేవం జేయఁగలవాఁడు.''

రాణా పంపినయీసందేశము విని జహాంగీరు మేరమీరినసంతోషము నొంది తన దినచర్యలో నీక్రిందివిధమున వ్రాసికొనెను ‹‹ఈగొప్పకార్యము నాపరిపాలనములోనే జరిగినందుకు నేను పొందిన యానంద మింతింత కాదు. అతిప్రాచీను లగునారాజపుత్రులను వారిరాజ్యమునుండి తరిమివేయవలదని నాకుమారున కాజ్ఞాపించితిని.

ఈనాటివఱకు రాణా యమ్రాసియు, వాని పితృపితామహప్రపితా
మహులు తమసైన్యములు మిక్కిలి శౌర్యవంతము లనియుఁ దమ
దేశము పర్వతమయ మగుటచే శత్రుదుర్భేద్య మనియు నమ్మి
యెవ్వరిని లక్ష్యముసేయక హిందూస్థానచక్రవర్తి నెన్నఁడుఁ జూడఁ
బోక, యితరుల నెన్నఁడుఁ దమ దేశములో నడుగుపెట్టనీయక గర్వ
భూయిష్ఠు లయి యుండిరి. అట్టిగర్వోన్నతులు నాయదృష్టవశమున
నాకాలములోనే లోఁబడుటచేత స్వాతంత్ర్యమును దాటిపోఁగూడ దని
నిశ్చయించి నాకుమారుని ప్రేరణంబున రాణాను క్షమియించి యతనిని
జాగరూకతతో రక్షింతునని స్నేహపత్రిక నొకదానిని వ్రాయించి
నాహస్తము మంచిగంధమున నలఁది యాచేతిముద్ర కాగితముమీఁద
వేసి రాణాయొద్ద కంపితిని. అట్లుపంపుటయేగాక సుప్రసిద్ధుఁ డగు
నీరాజపుత్రుని వానినునను వచ్చిన తెఱఁగున సగౌరవముగా నాదరింపు
మని నాకుమారు నియమించితిని."

అదివఱకే గుండెలు చెదరిపోయి యున్న రాణా యీలోఁబడుట
వలన మఱింత దుఃఖపడకుండునట్లు చక్రవర్తి వానియెడ దయాళుఁ
డయి యుండెను. జహంగీరు సహజముగ మంచిగడ యునల వేగుకలిగి
యప్పుడప్పుడు మద్యపానము త్రాగుటచేత మిక్కిలి క్రూరుఁడై యుండెనను
కొన్నివేళల జాలిగుండె గలిగి చేఁజిక్కినశత్రువులను నత్యంతగౌరవ
ముతోఁ జూచుచుండును. అందుచేత మేవాడరాణా లెవరు స్వయ
ముగ చక్రవర్తినిఁ గొలుచుటకు ఢిల్లీకి బోనక్కఱలేదనియు నేరాణా
యయిన నూతనముగ మేవాడుసింహాసన మెక్కినప్పుడు చక్రవర్తి
దాని యాధిపత్యమును స్థిరపఱచుచుఁ బంపుడు ఘనమానా రాణా
కోటలోనుండి వెలుపలకు వచ్చి పుచ్చుకొనవలసిన దనియు చక్రవర్తి
సైన్యమునకు రాణా వేయిగుఱ్ఱపుదండుఁ బంపవలసిన దనియు జహంగీరు
నకు నమ్రాసికు నొడంబడికలు జరిగెను. ఇదియే నమ్రాసికోరక.
సంధి యయినపిదప నమ్రాసి చక్రవర్తి దర్శనమునకుఁ బోవలసి

యున్నను వార్ధకముచేత నిల్లు కదలి రాలే నని వర్తమాన మంప జహంగీరు వానిని క్షమించెను.—

చక్రవర్తినిం జూచుట తప్పించుకొన్నను రాణా వానికుమారుని దర్శనము చేయక తప్పదయ్యె. అందుచేత నుమ్రా షాజహానుదర్శనమునకుం బోయి వానిమోకాలిమీఁదఁ జేయివేసి తన్ను క్షమింపు మని ప్రార్థించెను. షాజహాను వానిని మన్ననతోఁ గౌరవించి వానిపరివారమునకు గుఱ్ఱములు విలువగల నగలు బహుమానములిచ్చి పంపెను.

షాజహానుతల్లి రాజపుత్రస్త్రీ యగుటచే నతనిశరీరమునగూడ రాజపుత్రత్వమే ప్రవహింపుచున్నందునగాఁబోలు కడుదీనుఁడై ముఖవిలాసము డీలుపడియున్న రాజపుత్రప్రభువును జాల బహూకరించెను. ఉమ్రా షాజహానున కెన్ని మన్ననలు చేసినను కొట్టకొనకు ఢిల్లీనుండి చక్రవర్తి ఫర్మానా వచ్చినప్పుడు కోటవెలుపలకు వచ్చి దానిని పుచ్చుకొన్నం జాలు నొక్కతురకబంటైన మీవారుదేశమున నుండకుండఁ జేసెదనని షాజహా నెన్నివిధముల వర్తమాన మంపినను వినక రాణా షాజహానునియందుగల సుగుణములబట్టి యతనిదర్శనముమాత్రము చేసి వెళ్ళిపోయెను.

ఇదియైన కొన్నినాళ్ళకే రాణాకుమారుఁడు కరుణుఁడు చక్రవర్తి కొలువుసేయుట కజిమీరునకుఁ బోవలసివచ్చెను. అప్పుడు కరుణునిసభలోఁ దనసింహాసనమునకు కుడివైపునదగుపీఠముమీఁదఁ గూర్చుండబెట్టవలయునని జహంగీరునకు షాజహాను వ్రాసెను. ఆరాజకుమారుఁడు మిక్కిలి మొగమోటము గలిగి యెవరితోఁ గలిసి మెలసి మాటాడక సిగ్గుపడినట్లు సభలోఁ గూర్చుండుచు వచ్చినాఁడని జహంగీరు తన దినచర్యగ్రంథములోఁ బలుమారు వ్రాసెను. అందఱికంటె నెక్కువ నల్లమందుమద్దతు పీల్చుచు సాయంకాలమునందు హాలిర్డు అనియెడు నింగ్లీషువాని నొకనిగూడి నోటిలో నన్నపుముద్దయైన పెట్టుకొనుటకయిన నోపిక లేనట్లు చెడత్రాఁగి యొడలు తెలి

యుకుండ దొర్లుచుండ నాపోకులమారి చక్రవర్తి గుణములఁ జూచుట చేతనో మఱియొందుచేతనో తెలియదుగాని యాబాలుఁడు చక్రవర్తి యెంతయూదరించినను దిగులుజెందినవానివలెనే సభలో నుండుచు వచ్చెను. షాజహాను వానిని కొంచెము సంతోషపెట్టుటకు ప్రతిదినము వాని కొక క్రొత్తబహుమాన మిచ్చుచు, అప్పుడప్పుడు నూర్జహాను కొలువునకుఁ దీసికొని పోవుచుండెను. చక్రవర్తిని తన వలలో వేసికొని యతఁడు తనగీచినగీఁటు దాఁటకుండఁ జేసికొని మగని మనస్సునే గాక హిందూస్థానమునంతయు నేల గలిపిన యానెరజాణ నూర్జహాను యారాజపుత్రకుమారునకు పంచియేనుఁగ యొకటి గుఱ్ఱమొకటి కత్తియొకటి బహుమాన మిచ్చెను. అంతియేగాక రత్నాలు చెక్కిన కత్తులు మేలిమి యుంగరములు పారసీకతురగములు ముత్యాల హారములు రత్నకంబళములు సుగంధద్రవ్యములు బంగారుపాత్రలు మొదలగు పారితోషికముల షాజహానుఁ డాక్రొత్త సామంతరాజకుమారునకు విసుగులేక యర్పించెను. అట్లు రాజపుత్రుఁడు బడసిన బహుమానములఁగూర్చి తనగ్రంథమున నిట్లు వ్రాసెను.

"ఆ రాజకుమారుఁడు నాసభకు వచ్చినది మొదలు తిరిగి వెళ్లువఱకు నాకుమారుఁడు షాజహానుఁ డిచ్చిన మైదేనుఁగులు నూటపది గుఱ్ఱములుగాక నేను స్వయముగా నిచ్చినరత్నములు బంగారునగలు గజతురంగములు మొదలగు బహుమానముల విలువ పదిలక్షల రూపాయలు." ఈయల్పబహుమానములఁ జేకొని కరుణుఁడు రాణాయుమ్రాయు "మీవారు రాజ్యపు పన్నుముందర పదిలక్షలరూపాయలననెంత. మనము పొరపాటుపడి నిష్కారణముగ దేశస్వాతంత్ర్యము తురకల కమ్ముకొంటి" మని తద్దయు విచారించి లోలోపల కుళ్ళుచుండిరి. జహంగీరు సభలోఁ గరుణుఁడుగూడ ముఖవికాసము తక్కియుండుటకుఁ గారణ మిదియే. సంగభూపాలుని కాలమునుండియు దురకలబారిపడి స్వమిత మెట్టిదో యెఱుంగని మీవారురాజ్యము నేఁడు

మొదలు దండయాత్రలు కలహములు లేక నేమముగ నుండు నని సంతోషింపవలసినపని లేదయ్యె. ఏలయన నది మొదలు మీవారు ప్రభువులు ఢిల్లీచక్రవర్తికి లోఁబడినవారయి స్వాతంత్ర్యము గోలుపోవుటచేత రాణాకు రాజకుటుంబమునకుఁ గాలక్రమమున ఢిల్లీనుండి వచ్చుబహుమానములు దుఃఖకరములుగ నుండెను. యుద్ధము మానుకొని చక్రవర్తిని గొలుచువారికి యుద్ధపుగుఱ్ఱమును మహాయుధము లెందుకు? జహంగీరు రాణాయొక్కయు వానికుమారునియొక్కయు బ్రతిరూపములను స్ఫటికశిలలతోఁ జేయించి తన యుద్యానవనమునఁ బెట్టించుకొనియె. అవి చూచినవారందఱు చిత్తూరు రాజవంశమున కంతకన్న నవమానకరమగు పని లేదని భావించిరి. అది యటుండ రాణాయొక్క మనుమఁడగు జగత్సింగు సయితము ఢిల్లీలోనే యుండి చక్రవర్తి యిచ్చుబహుమానముల నుబ్బి వారినే మెచ్చుచుండెను. జహంగీ రొకసారి కొన్నిబంగారుబొమ్మలఁ జేయించి రాణావద్దకు వానిమనుమునిచేతనే పంపెను. రాణా యాబొమ్మలఁ జూచి తనయొక్కయు తనకుమారునియొక్కయు బొమ్మలే చక్రవర్తియుద్యానవనములలో దాస్యము చేయునట్లుండి హృదయము నెప్పుడు గాల్చుచుండ నీ బంగారుబొమ్మలను మాకేమి యానంద మీయఁగలవని విచారించెను. విచారించుటయేగాదు. ఈమహాపరాభవము నతఁడు సహింపఁజాలఁడయ్యె. తొల్లి ప్రతాపరాశియగు ప్రతాపసింగు జీవించియున్న కాలమున వానిచేతిక్రిందనుండి మహమ్మదీయులతోఁ బోరిపోరి నతని పరోక్షమునఁ దాను గద్దెయెక్కి సేనలం బురికొల్పి నడిపించి యప్రతిహతపరాక్రములగు ఢిల్లీచక్రవర్తుల ననేకపర్యాయముల రణరంగంబునఁ బరాజయము నొందించి పావనచరిత్రయగురాజ్యలక్ష్మిని గోహంతకులపాలు గాకుండఁ జేసి పితృపితామహుల ప్రతిష్ఠ నిలిపిన తాను నేఁటికాలమున నిట్లధోగతిపా లయినందులకుఁ దద్దయు సిగ్గుపడి యుమ్రా యీవిధముగఁ జేసెను.

తనకుమారుఁడగు కరుణుఁడు చక్రవర్తిసేవ చేసి ఢిల్లీనుండి వచ్చినపిదప నొకనాఁడు మంత్రిసామంతుల నందఱఁ బిలువనంపి కొలువుదీర్చి రాణా వారి నందఱఁ జూచి "నావని యయినది. ఇంక రాజ్యమెంతకాల మేలినను ఢిల్లీచక్రవర్తికి దాసుఁడనయి యేల వలయును. అస్వాభిమానము జంపుకొని యేలుట నాకిష్టములేదు." అని పలికి కుమారునిఁ బిలిచి "నాయనా! కులప్రతిష్ఠలు నీవ నిలుపఁదగిన వాఁడవు. రాజ్యమునందు నిన్నుఁ బ్రతిష్ఠించెద" నని వాని మొగమున స్వయముగఁ దనహస్తముతో టీకావేసి పట్టాభిషిక్తునిఁ జేసి యప్పుడ సభ విడిచి కోటవదలి కొంతదవ్వున నున్న సరోవరము ప్రాంతకుఁబోయి యక్కడ ము న్నుదయసింగు గట్టించిన మందిరమునఁ బ్రవేశించి దలుపులు మూసికొనియె. ఆదినము మొదలా మహారాజేన్ద్రుఁడు మరల ప్రజలకంటఁబడలేదు. అయిల్లు విడిచి యీవలకు రాలేదు. అటు పిమ్మట నైదేండ్ల కతఁడు మృతినొందఁ దహనమునిమిత్తము కొని పోవుచున్నప్పుడు వాని మృతకళేబరముమాత్రము ప్రజలు చూచిరి.

అదిమొదలు మేవారురాజ్యమునకుఁ గొత్తశకముప్రారంభ మయ్యెను అంతమునం దారాజ్యము ఢిల్లీతో సంబధములేకతనకు న్నంతవఱకు తృప్తినొంది ప్రజాసౌఖ్యకరముగా నుండెను. కాని యీసంధి యైనపిదప నదిగూడ చక్రవర్తిగారి రాజ్యతంత్రపు సుడి గుండములలోఁ బడక తప్పదయ్యెను. అదృష్టవశమున ఢిల్లీ మేవారు లకు నూతనముగా సంధి జరిగినప్పుడు మేవారు మంచిరాజులచేతిలో బడినందున దానిగౌరవము దక్కెను. కరుణునికంటె నెక్కుడు ప్రతాప వంతులు విశేష ప్రజ్ఞావంతులు నగు రాజపుత్రు లనేకులు చక్రవర్తి సభలోఁ బెక్కుసారులు పరాభవము నొందినట్లు చాలకథ లున్నవి గాని కరుణునివిషయమున నట్లు లేదు. అతఁడు మేవారును పాలిం చిన యెనిమిదియేండ్లలో దేశమునుజక్కనిస్థితిలోనికిఁ దెచ్చిపాడిపం టలతోఁ దులతూఁగునట్లు జేయుటయేగాక కొమ్ముమేనుఁగులవంటి

రారాజులకయిన మానములు దక్కని ఢిల్లీశ్వరుని దర్బారులో నొక్క నాఁడయిన నవమానమందక యేపనిఁ జేసిన బుద్ధికుశలతఁ జూపి చేయుచు ఢిల్లీకి లోఁబడి యేవెలితి లేకుండ నేలెను.

జహాంగీరునకు మీవారురాణాలమీఁద నెందుచేతనో యత్యంతాభిమానము గలిగెను. రాణాకుమారునిఁ జక్రవర్తి తనప్రక్కన పీఠము వేయించి కూర్చుండఁ బెట్టుకొనును. ఈరాణాబంధువులను తక్కినరాజుల బంధువులకంటె నెక్కుడుగ గౌరవించును. జహాంగీరు పుత్రుఁడగు షాజహానునకును రాణాతమ్ముఁడగు భీమునకును గాఢముగా మైత్రి యయ్యెను. ఈభీముఁడు రాణాచక్రవర్తికిఁ గానుకగా బంపు సేనకధిపతియయి దర్బారులోనే యుండువాఁడు. అందుచేత షాజహాను దానియందలి స్నేహంబు పెంపున తండ్రితోఁ జెప్పి భీమునకు రాజబిరుదమిప్పించి యంతతోఁబోక లోడాయను చిన్న జిల్లాకువానిని రాజుగఁ జేయించి బహువిధముల గౌరవించెను. జహాంగీరు కొడుకు ప్రేరణంబున భీమున కనేకోపకారములఁ జేసిన కొన్నినాళ్ళకె యేలమేలు చేసితినని విచారింపఁజొచ్చెను.

జహాంగీరునకు నలుగురుకొడుకులు. అందు జేష్ఠుఁడు ఖుస్రూయనువాఁడు తండ్రి నెదిరించి పట్టువడి బాధింపబడి తుదకు చెరసాలలోనే మృతినొందెను. రెండవవాఁడు షాజహాను. ఇతనిమీఁద జహాంగీరు ప్రియురాలగు నూర్జహానున కనిష్టము. అది కారణముగ జక్రవర్తికి వానిపై నంతయిష్టములేదు. అందుచేత నాతాఁగుబోతు చక్రవర్తి, షాజహానునిఁ దోసివైచి తనమూఁడవకుమారుఁడును, త్రాఁగుబోతుతనమునఁ దనకుజ్జియగువాఁడునగు పార్వీజును దనయనంతరమున జక్రవర్తి యగునట్లు నియమించెను. నూర్జహాను జహాంగీరుని నాల్గవ కుమారుఁడగు షార్యారునకు సింహాసన మిప్పింపఁబ్రయత్నించుచుండెను. స్థితిగతు లిట్లుండుటచూచి షాజహాను తానురాజ్యమును స్వాధీనము జేసికొను నుపాయము వెదకుచుఁ బ్రియమిత్రుఁ

డగు భీమునితోడను, వానిచుట్టము చెలికాఁడు సూక్తావతువంశస్థుఁడు నగు మానసింగుతోడను గట్టియాలోచన చేయసాగెను. ఆకుట్రలనడి యెఱింగి చక్రవర్తి యామిత్రుల నొకచోఁ గలసి యుండనిచ్చినచోఁ బ్రమాదము వాటిల్లునని భీముని గుజరాతీదేశమునకుఁ బాలకునిఁ జేయుమిషతో నక్కడకుఁ బొమ్మని యాజ్ఞాపించెను. ఈయుద్యోగము తనకక్కర లేదని నిర్భయముగఁ జెప్పి యక్కడకుఁ బోనని రాజపుత్రసాహస మంతయు మూర్తీభవించిన ట్లతఁడు ప్రత్యుత్తర మిచ్చెను. అంతవఱకు వచ్చినతరువాత నూరకున్నచోఁ దనప్రాణము మీఁదికి వచ్చునని భయపడి షాజహాను తండ్రితోఁ బ్రత్యక్షవైరము బూనెను. అత్తఱి భీముఁడు మానసింగు మొదలగు సూక్తావతులు, చక్రవర్తి సర్వసేనాధిపతి యగు మహబతుఖానుఁడును షాజహానుతోఁ జేరిరి. ఈనడుమ నతిక్రూరుఁడని పేరు వహించి జనవిరోధి యయి యున్న పర్వీజు నెవరో చంపివేసిరి

జహంగీరు మహాసేనాసమేతుఁడయి తనపై ధ్వజమెత్తిన కొడుకును దండించుటకు బయలుదేరెను. షాజహాను నెంతో యంతఃకరణశుద్ధియు దయాస్వభావము గలవాఁ డగుటచే రాజపుత్రులు వానిపై నభిమానము గలిగి తత్పక్షముఁ జేరఁ జొచ్చిరి. షాజహాను తల్లి మార్వారు దేశపు రాజసింగుయొక్క కూఁతురు. ఈకుటుంబకలహమునందు వృద్ధుఁ డగు గజసింగు తన యల్లునిపక్షము వచ్చునా మనుమని పక్షము వచ్చునా యని లోకులు సందియము పడి దాని పరియవసానము బ్రతీక్షించుచుండిరి.

ఎట్లయిన లోకానుభవముగల గజసింగు దూరమాలోచించి న రహతూరుబలముతోఁ గూడి చక్రవర్తిపక్షమునకే వచ్చెను. అప్పుడు జహంగీరు మితిమీరిన యానందము నొంది సామంతరాజమండలము నెదుట మామగారిచేయిపట్టుకొని ముద్దుపెట్టుకొని వానిని గౌరవించెను. అప్పుడు కొడుకును దండింపఁ గాశీపట్టణమువద్ద యుద్ధ

సన్నద్ధులయి గలసిరి. ఉభయసైన్యము లొండొరులఁ దాకుటకె సిద్ధ ములయినపుడు చక్రవర్తి యెవరి దురాలోచనమో విని మహావీరుఁడు ను త్తమకులస్థుఁడు నగుతనమామగారికి సైన్యాధిపత్య మీయక యంబరదేశపురాజు గజసింగునకంటె తక్కువవాఁడు నగు జయసింగున కిచ్చెను. అభిమానధనులగు రహతూరువంశస్థులు తమరాజునకు సైన్యాధిపత్యము లేనిచో గత్తియే ముట్టమనిరి. గజసింగును నిర్భయముగ దనవారియభిప్రాయముఁ జక్రవర్తితోఁ జెప్పి తనసేనం దీసికొని దూరముగఁ బోయెను. అట్టిసమయమున భీముఁడు గజసింగు తనతోఁ గలియునేమో యని యాసపడి వానికిఁ బౌరుషముగలుగున ట్లీవిధముగ వర్తమానమంపెను. "రహతూరువంశస్థు లూరకున్నా రేమి? కలసిన మాతోఁగలియుండు లేనిచోఁ గత్తిదూసి యుద్ధముసేయుఁడు." సందేశమున కనుగొనినట్లే ప్రత్యుత్తరము వచ్చెను. సంధిగ్ధమనస్కుఁడగు నాముసలిరాజు భీమునిపలుకులకు రోసముంజెంది చక్రవర్తిపక్షముఁ జేరి రహతూరులం బురికొల్ప వారు విజృంభించి యుద్ధభూమిఁ బీనుఁగు పెంటలు జేసి యాదినమున షాజహాను నోడించిరి. భీముఁడు రణరంగముననఁబడి చచ్చెను. మానసింగు గాయపడుటచే రహతూరులు వాని నెక్కడికో మోసికొనిపోయిరి. మహబ్బత్ఖానుఁడు షాజహాను ప్రాణభీతిచే రణరంగము విడిచి యుదయపురమునకుఁ బారిపోయిరి.

రాణా కరుణుఁడు తమ్ముఁడగు భీమునిచేత సమరసంబంధము మానిపింపలేకపోయినను సహజముగఁ జాల బుద్ధిశాలియగుటచే మొదటినుండియుఁ దానుమాత్ర మీకలహమున జోక్యముఁ గలుగఁజేసికొనఁడయ్యె. అతనిసంకల్పము చక్రవర్తికిఁ గృతజ్ఞుఁడై యుండుటయే. అట్లు కృతనిశ్చయుఁ డయినను జక్రవర్తి కొడుకంతటివాఁడు దీనుండయి తనదేశమునఁ దల దాఁచుకొనవచ్చినప్పుడు వేమభంగి నుపేక్షించుటు పాడిగాదని కరుణుఁడు వానినిఁ గరుణించి సగౌరవముగ నాదరించెను. ఉదయపుర సమీపమున నున్నసరస్సులో నొకలంకమీఁద

రాణా మనోహరమగు మందిరము నొకదానిని కట్టించి మహమ్మదీయులకు రాజపుత్రులకు సంబంధ మేమియు లేకుండునట్లు షాజహానుని వానిసేనాపతి నరను విడియించెను. కరుణుఁడామందిరమున షాజహానున కేసౌఖ్యమునకు వెలితి లేకుండున ట్లేర్పాటును చేసెను. అతని కొక్కటను మేకపను నాటించెను. లోపల స్ఫటికశిలతోఁ జక్రవర్తి పుత్రున కొకసింహాసనము జెక్కించెను. వేయేల? ఆ హజారమున కెదుట నమాజుసేయుటకు మసీదుకూడ కట్టించెను.

ప్రాణమిత్రుఁడగు భీమరాజు నేలఁగూలుటయు వాని చెలికాఁడగుమానసింగు మిత్రవియోగముచేత జీవితాశ విడిచెనని వినుటయు షాజహాను మనోహరమందిరంబునుండి సుఖ మనుభవించుచున్నను వానిమనస్సుమాత్రము స్థిమితము గలిగియుండదయ్యె. మానసింగునకు భీమునకుఁగల స్నేహము లోకాతీతమయినది. భీముఁడు మృతినొందినచో మానసింగు బ్రతుకనని ప్రతినపట్టెను. అందుచేత మానసింగు సేవకులు భీముఁడు మృతినొందినవార్త వానితోఁ జెప్పక నాఁటిప్రతిదినము పళ్లెములతో ననేకభక్ష్యములు తెచ్చి యవి భీముఁడే పంపినాఁడని తెలియఁజేయుచు గొంతకాలము గడిపిరి. దురదృష్టవశమున నెట్లో భీముని మరణవార్త యొకనాఁడు మానసింగుని చెవులంబడియె. పడుటయు మానసింగు దుస్సహమగు మిత్రవియోగమునకుఁ దాళఁజాలక దేహమాపాదమస్తకము నిండియున్న యెనుబదిగాయములమీఁద పట్టీలు నూడఁబెఱికి తాను చావకమానన నని నేలంబడుకొని ప్రాణముల విడిచెను.

అనంతరము షాజహాను తన కునకపురమే నెలవుగాఁ జేసికొని దేశద్రిమ్మరియై కొంతకాల మిందు కొంతకాల మందు తిరుగుచువచ్చెను. ఎంతతిరిగినను లాభములేమిచే షాజహాను స్వలాభముఁ జూచుకొని తండ్రితో సంధిచేసికొనుటయే యుత్తమమని యెంచి తాను లోఁబడితినని రాయబారమంపి విశేషించి తండ్రికిఁ జాలనమ్మిన పుత్రు

టకుఁ దన యిరువురకుమారులఁ దారా యూరంగజేబులను వారిని తఁ
డ్రివద్దకు జామీనులుగఁ బంపెను. మహాబత్ఖానుఁడు పేరు తురక పేరు
పెట్టుకొన్నను కులమున రాజపుత్రుఁడే. అట్లగుటచే నతఁడు షాజహా
నుని విధమునఁ జక్రవర్తికి లోఁబడక స్వాధికారుఁడై సాహసమే లెస్స
యని నిశ్చయించి సూక్తవతులు మొదలగు కొందఱు రాజపుత్రుల
సహాయముగఁ బడసి యేరాజపుత్రుఁడు నెన్నఁడు కలలోనయినఁ
జేయఁదలఁపని యొక మహాసాహసమును గావించెను. కుమారుఁడు
లోఁబడినపిదప మహాబత్ఖాను తొక్కులు తెగిన పక్షివిధముగ నొంటరిగాఁ
డయి యున్నవాఁడని గ్రహించి జహాంగీరు వానిపయి ధనాపహరణ
ము జనపీడనము నను రెండు నేరములు మోపి తనయెదుటికి వచ్చి యా
నేరముల కుత్తరము చెప్పుమని వాని కాజ్ఞాపించెను. ఏకారణనిమిత్తము
చక్రవర్తి తన్ను రమ్మనియెనో యాసంగతి పూర్తిగ నెఱిఁగినవాఁ
డుగావున వెళ్ళుట కిష్టములేక ఇదిగో అదిగో యని కొన్నినాళ్లు జర
పెను. సత్వరముగ రాకతప్పదని చక్రవర్తి పట్టుపట్టెను. అటుమీఁద
నొకనాఁడు మహాబత్ఖానుఁ డైదువేల రాజపుత్రపరివారముతో
వచ్చి శిబిరము జేరినాఁడని చక్రవర్తికిఁ దెలిసెను. ఆసమయమున
జహాంగీరు కాశ్మీరాంతరముమీఁద కాబూలునగరమునకుఁ బోవుచు
సింధునది కుపనదియగు జీలముకు దాఁటఁ బ్రయత్నించెను. సేనయం
తయు ముందు నదిదాటి యావలియొడ్డు జేరెను. చక్రవర్తి నూర్జ
హానును వారిపరివారములుమాత్ర మీవలియొడ్డున గుడారములోనుండి
సందడి తగ్గినతోడనే యేరు దాటఁ దలపోయుచుండిరి. అప్పుడె తెల్ల
వారుచుండెను. నూర్జహాను తక్కినయంతఃపురాంగనలతోఁ గలసి
యొకగుడారమున నుండెను. చక్రవర్తి రాత్రి తాగిన సారాయముల
యొక్క నిషాయింకను దిగనందున నొడలు మరచి యుండెను

అంతలో మనుష్యులయడుగుల యలుకుడు చేతులలోని యా
యుధములచప్పుడులు వానిచెవులకు వినంబడ చక్రవర్తి యులికిపడి

దిగ్గున లేచి చూచెను. చూచునప్పటికిఁ దనగుడార మంతయు యము దూతలవంటి రాజపుత్రసైనికులతోఁ నిండి యుండెను. అయిన నతఁడు జంకక ధైర్యము చిక్కబట్టి ఖడ్గముపైఁ జేయివైచి పయికిఁ దీయుచుండ మహావీరుఁ డగుమహబత్ఖానుని మొగము వాని కగపడెను. ఆఖానును జూచుటకుఁగాని వాని పేరు వినుటకుఁగాని యతనికి లేశమిష్టము లేనందున యతని ముఖదర్శనము చక్రవర్తి క్రోధమును బెంచెను. అయిన నతఁ డప్పటి తన యవస్థను జ్ఞప్తికిఁ దెచ్చుకొని తొందరపడినఁ గార్యము పాకము తప్పునని మహబత్ఖానునిఁ జూచి "ఓరాజద్రోహీ! ఇది యేమి? అని యడిగెను. ఆపలుకులు విని మహబత్ఖాను చక్రవర్తి కాళ్ళపైఁ బడి యనేకవిధముల దీనాలాపములం బలుకుచు నిట్లనియె. "నాశత్రువులు దేవరవారితో నామీఁద నేరములు చెప్పి నాకు మీకెడబాటు చేసిరి. అందుచేత నేగదా నేను కొన్నినాళ్ళక్రిందటనే మీ శిబిరముఁ బ్రవేశించినను మీరు నా మొగము జూడరయిరి నాతోఁ బలుకరైరి. ఎట్లయిన దేవరవారిదర్శనముఁ బడయుటకై యిట్లు చేసితినిగాని ద్రోహముచేయుటకుఁ గాదు." అని మొఱవెట్టుకొనెను. అతనిపలుకులు చక్రవర్తి క్రోధాగ్నికి వ్యర్థాహుతులయ్యెను. అయినను సమయము గాకపోవుటచే జహంగీరు కోపము దిగమ్రింగి పయికి మంచి మాటలే చెప్పుచు నదను దొరికినప్పుడు మహబత్ఖానుని కొంపఁ దీయవలయు నని నిశ్చయించుకొని యతఁ డేమన్న నదియే సరి యనసాగెను. అప్పుడు మహబత్ఖాను చక్రవర్తితో "దేవా! మీరు పట్టపుటేనుఁగుపై నెక్కి సామంతరాజులకు సైనికులకు దర్శన మీయవలసిన సమయము వచ్చినది. మీ రగపడకున్న వారందఱు కళవళపడుదురుగదా! కావున నేనుఁగు నెక్కుఁ"డని మనవిచేసెను. చక్రవర్తి సరే యని తనదుస్తులు తొడుగుకొనుటకు ప్రక్కగుడారములోనికి వెళ్ళివత్తునని చెప్పెను. అక్కడికి వెళ్ళినా చక్రవర్తి యొకఁ దనకు దక్కక నూర్జహాను చేతిలోఁ జిక్కిపోవు ననియుఁ దనపన్నినపన్నుగడ లన్నియు నిష్ఫ

లములయి పోవునని యూ శంకించి మహబత్ఖానుడు దేవరవారు దుస్తు
లిక్కడనే తొడుగుకొనవచ్చునని చెప్పెను.

జహాంగీరు వానిమాట కడ్డము చెప్పక యక్కడనే దుస్తులు వేసికొని బయలుదేరుటకు గుఱ్ఱ మెక్కెను. అప్పుడు మహబత్ఖానుఁ డడ్డము వచ్చి "స్వామీ! గుఱ్ఱమెక్కుటకంటె నేను గెక్కుట మంచిది. ఏనుఁగెక్కినచో నందఱకు మీరగపడుదురు. అది నిరపాయము కావున దాని నెక్కుఁడగు" నని పలికెను. అప్పుడు జహాంగీరు తన యేనుఁగు పయి నెక్కఁదలఁప రాజపుత్రులు వాని మావటివానిం జంపిరి. అప్పుడు మహబత్ఖాను చక్రవర్తిఁ దన యేనుఁగుపై నెక్కించి యిరుప్రక్కల ఖడ్గపాణు లగు నిరువురు రాజపుత్రులను గావలి పెట్టి తన శిబిరమునకుఁ దీసికొని పోయెను.

ఆశిబిరము చుట్టు మెఱికలవంటి రాజపుత్రులను మహబత్ఖాను కావలివేసి జీలము నదిమీఁద నున్నపడవలవంతెన నూర్జహాను పాల్పడకుండఁ గాపాడుటకు మఱి రెండు వేల రాజపుత్రులను నియమించెను. మహబత్ఖాను తన్ను ఖయిదీగాఁ బట్టుకొనియెనని తెలిసికొనినను చక్రవర్తి కాలము దప్పివచ్చినప్పు డేమి చేయఁగలమని యూరకుండి 'నా సారాబుడ్డి, కావలసినప్పుడు సారా యందిచ్చు సేవకుని నా కిచ్చినారుగదా తక్కిన ప్రపంచ మేమయిన నాకేమి' యని సరిపెట్టుకొని యక్కడనే హాయిగ నుండెను.

చక్రవర్తిపక్షమున నున్నజనములో ధైర్యము సాహసముగలది నూర్జహా నొక్కతియె చక్రవర్తికి జరిగిన భంగపాటు వినినతోడనే నూర్జహాను పిరికిపడక నిరుపేదవాని వేషము వేసికొని చిన్నసవారి నెక్కి యాడంబర మేమియు లేకుండ నావలియొడ్డుఁ జేరుటకు బయలుదేరెను. చక్రవర్తి శిబిరము వెంట వచ్చిన పేదరాలెవ్వతియో పోవుచున్న దనుకొని వంతెన గాచురాజపుత్రు లామెను నిర్భయముగ బోవనిచ్చిరి. అట్లు నిరపాయముగ నావలియొడ్డు జేరి సేనాపతులను సామంతులను

రావించి వారి పాలుమాలినతనమునకు మూర్ఖతకు గట్టిగఁ జీవాట్లు
పెట్టి చక్రవర్తిని విడిపింపకున్నచో నందఱిప్రాణములఁ దీయింతునని
బెదరించెను.

పరాక్రమవంతుఁ డగునొకతురకజోదు రోసముఁ దెచ్చుకొని
చక్రవర్తిని విడిపించుట కారాత్రి యత్నించెనుకాని వానియత్నము
నెరవేరదయ్యె. మరునాఁడుదయమున నూర్జహాను స్వయముగ నేనుఁగు
నెక్కి కత్తియు విల్లు నమ్ములు చేఁబూని తనసేనలం బురికొల్పికొని
మహాబత్ఖానునిఁ దాకుటకు రాఁబోవుచుండెను. అప్పుడు రాజపుత్రులు
పడవలవంతెనఁ గాల్చి వారిని రాకుండఁజేయ వారు పాటిరేవులం దిగి
రాఁజొచ్చిరి. రాజపుత్రులు వారిపై శరవర్షంబులు గురియించియు
తుపాకిగుండ్లఁ బ్రయోగించియు నూర్జహాను సేనలనురుమాడి నీటనున్న
వారిని నీటను మెరకనున్న వారిని మెరకను జంపిరి. కొందఱు ప్రవాహ
వేగమున కొట్టుకొనిపోయిరి. అన్నిగండములను గడపి దరిజేరినవారిని
కత్తులతో నరికి చంపిరి. మహాబత్ఖానుఁడు వాని రాజపుత్రసైనికులు
విజయము సంపూర్ణముగ నందిరి, కాని యాతనిజయము చిరకాలము
నిలువదయ్యె. ఏలయన నూర్జహాను పౌరుషంబు లగుచేతలు చేయలేక
పరాభవము నొంది యాగడుసుపోకడలం బోయి కార్యము సాధించు
కొనియె. ఆమె నిర్భయముగ మహాబత్ఖానుశిబిరముఁ బ్రవేశించి నా
భర్తతోపాటు నన్నుఁగూడ ఖయిదీగాఁ జేయుమని యాతనింగోరెను.
మహబత్ఖాను మిక్కిలి యుబ్బిపోయి సరే యని యూరకుండెను. అది
సందు చేసికొని యామె సేనాధిపతులమనస్సులు విరువ నారంభించెను.
అదివఱకే ఖానుయొక్క యనుచరులలోఁ గొంద ఱతనిగర్వమును
జూచి వానిని ద్వేషించుచుండిరి. కొందఱు వాని రాజపుత్రపక్షపాత
మును జూచి కడుపుమంట గలిగి యుండిరి. అందుచేత నూర్జహాను
పన్నుగడ లవలీలగ వారిమతములఁ ద్రిప్పెను. కొన్నిదినము లామె
ఖానుశిబిరములోనుండి యెట్టకేలకు చక్రవర్తినిఁ జెరనుండి విడిపించి
స్వతంత్రునిఁ జేసెను. అప్పుడు ఖానుఁడు రాజపుత్రసైనికులు భగ్న
మనోరథులై తమయవివేకమునకుఁ జింతించుచుఁ దొలఁగి పోయిరి

ఈనడుమ మీవారురాణా పరలోకగతుఁ డయ్యెను. కరుణుని కుమారుఁ డగుజగత్సింగు తండ్రి పరోక్షమున రాజ్యప్రతిష్ఠితుండై యెప్పటియట్ల షాజహానుతో నెయ్యముఁ బాటించుచుండె. జగత్సింగు రాజయినపిదప షాజహానుఁడు కొన్నిదినము లుదయపురమున వసియించి యుండెను. అతఁ డక్కడ నుండఁగనే జహంగీరుచక్రవర్తి కాశ్మీర దేశమునందు దగ్గుబాధచేతఁ గాలధర్మము నొందెనని వర్తమానము తెలిసెను. షాజహానుఁడు సరోవరమధ్యమున నున్న మేడలో నున్నపుడె రాణా మొదలగు సామంతరాజులు తమ క్రొత్తచక్రవర్తి దర్శనము ముందుగఁ జేసి కానుకలు సమర్పించిరి. షాజహానుఁడు సింహాసన మెక్కుటకు ఢిల్లీకిఁ బయనమయి పోవునపుడు మీవారు రాణాకు వెనుక వానివద్దనుండి తీసికొనిన యయిదుజిల్లాలను మరల వాని కిచ్చి వెలలేనికెంపొకటి బహుమాన మిచ్చి యావసర మయిన పక్షమునఁ జిత్తూరుకోట బాగుచేసికొని యుపయోగించుకొమ్మని సెలవిచ్చి యుదయపురము వెడలెను.

జగదీశ్వరుఁ డగుఢిల్లీశ్వరునిపుత్రుఁ డుదయపురమున నుండినట్లు రెండుమూఁడనవాళ్ళిప్పటికిఁ గలవు. షాజహానుని డాలొకటి, కుసుంబావర్ణము గల వానితలపాగ యొకటి. ఈతలపాగ షాజహానుఁడు తనతలమీఁదనుండి తీసి రాజపుత్రులిచ్చిన శిరోవేష్ట మొకటి సరియించెను. మొదట చుట్టినప్పు డెన్నిమడత లున్నవో యన్నిమడతల నిప్పటికిఁ గలిగి చుట్టినది చుట్టినట్లున్నది. జగత్సింగు బుద్ధిశాలి యయి యిరువదియాఱు సంవత్సరములు రాజ్యముచేసి చక్రవర్తి యనుగ్రహమునకుఁ బాత్రుఁడయి కాలము గడపె. షాజహాను తక్కిన సంస్థానములకంటె మీవారు నెక్కుడుదయతో నాదరించుటచే నారాజ్యము పాడిపంటలు గలిగి వర్ధిల్లెను.

మొదటిభాగము సమాప్తము.